www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 5-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 247 | వరంగల్

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: చవితి మ. 12.50 తదుపరి పంచమి; నక్షత్రం: ఉత్తరాషాఢ సా. 5.26 తదుపరి శ్రవణం; వర్జ్యం: రా.9.24-11.00; దుర్ముహూర్తం: ఉ.10.15-10.59, మ.2.39-3.24; అమృతఘడియలు: ఉ.10.59-12.35; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.35; సూర్యాస్తమయం: 5.36

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem |Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

9 నుంచి అసెంబ్లీ శీతాకాల సమావేశాలు



పంచాయతీరాజ్ చట్టానికి సవరణ చేస్తూ బిల్లు..

ముగ్గురు సంతానం ఉన్నా స్థానిక ఎన్నికల్లో పోటీకి చాన్స్

వీఏవో, వీఆర్‌వో తరహాలో కొత్త పోస్టు.. నియామకాలు

రెవెన్యూ చట్టంలో మార్పులు చేస్తూ మరో బిల్లు

ఇవి కాకుండా మరో ఐదు ఆర్డినెన్స్‌లు

రైతు భరోసా విధివిధానాలపై చర్చ

12

పదేళ్లలో మీరు చేయనిది..
పది నెలల్లోనే..

ప్రజా ప్రభుత్వంలో చేసి చూపించాం

ఏడాదిలో 55 వేల ఉద్యోగాలిచ్చాం

గుజరాత్‌లో మీరు ఇచ్చారా?

మా ఉద్యోగులను తీసుకువస్తా.. చూపించండి

కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్

ఒక్క రోజులోనే అద్భుతాలు సృష్టిస్తామా కేసీఆర్?

పెళ్లి చేయగానే పిల్లలు పుడతారా?

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

పెద్దపల్లి 'యువ వికాసం'లో సీఎం

9వేల మందికి ఉద్యోగ నియామక పత్రాల అందజేత

రూ.1024 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెద్దపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏర్పడ్డాక గత ప్రభుత్వం పదేళ్లలో చేయనిది.. తాము ప్రజా ప్రభుత్వంలో పది నెలల్లో చేసి చూపించామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఏడాదిలోనే నిరుద్యోగ యువతకు 55 వేల ఉద్యోగాలు ఇచ్చామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా, 11 ఏళ్లు ప్రధానిగా ఉన్న నరేంద్రమోదీ ఇన్ని ఉద్యోగాలు ఇచ్చారా? అని ప్రశ్నించారు. గుజరాత్‌లో ఇలా ఇచ్చినట్లు నిరూపిస్తామంటే తెలంగాణ ఉద్యోగులను అక్కడికి తీసుకువస్తానని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు సవాల్ విసిరారు. వారు కూడా వస్తానంటే విమాన చార్జీలూ చెల్లిస్తానన్నారు. తమ ప్రభుత్వంలా రైతులకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశారా? అని, చేస్తే లెక్కలు తీయాలని అన్నారు. బుధవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన యువ వికాసం బహిరంగ సభకు సీఎం హాజరయ్యారు. పెద్దపల్లిలో ఆర్టీసీ బస్ డిపో, రూ.1024.90 కోట్లతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు వేదిక మీద నుంచే శంకుస్థాపన చేశారు. 9వేల మంది గ్రూప్-4, అసిస్టెంట్ సివిల్ సర్జన్లు, సింగరేణి ఉద్యోగులకు

మిగతా 13వ పేజీలో...



పెద్దపల్లిలో నిర్వహించిన యువ వికాసం బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



రోశయ్య లాంటి సహచరుడుంటే.. సీఎంగా
ఎవరైనా రాణించవచ్చు

- సీఎంగా ఎవరున్నా నం.2 ఆయనే.. హైదరాబాద్‌లో రోశయ్య విగ్రహం పెడతాం 13
- ఆర్యవైశ్యులే తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్లు.. రాజకీయాల్లో సముచిత స్థానం కల్పిస్తాం
- వ్యాపారాలకు అనుమతుల్లో ఇబ్బంది రానివ్వం.. రోశయ్య వర్ధంతి సభలో రేవంత్‌రెడ్డి
- విజయభాస్కరరెడ్డి బొటానికల్ గార్డెన్‌లో ఎకో టూరిజం పార్కును ప్రారంభించిన సీఎం



మహబూబాబాద్‌లో భూమికి పగుళ్లు



భూకంపం వల్ల హనుమకొండ ఇందిరానగర్‌లో కూలిన ఓ ఇంటి రెయిలింగ్

వణికించిన
భూకంపం

రాష్ట్రంలో 5.3 తీవ్రతతో కంపించిన భూమి

ఉదయం 7.27కు ప్రకంపనలు

3 నుంచి 7 సెకన్ల వరకు ప్రభావం

మేడారంలో 40 కి.మీ. లోతులో కేంద్రం

హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, వరంగల్, కరీంనగర్, నల్లగొండ జిల్లాలపై ప్రభావం

ఏపీలోనూ పలు ప్రాంతాల్లో ప్రకంపనలు

భయంతో ఇళ్ల నుంచి ప్రజల పరుగులు

నేను కూడా ఆందోళనతో బయటకొచ్చా: ములుగు కలెక్టర్ దివాకర

వారంపాటు తదనంతర ప్రకంపనలు!

డేంజర్ జోన్‌లో భద్రాద్రి.. హైదరాబాద్ సేఫ్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల భూమి కంపించింది. దాదాపు 30 ఏళ్ల తర్వాత 5 కంటే ఎక్కువ తీవ్రతతో భూకంపం సంభవించింది. బుధవారం ఉదయం 7.27 గంటల సమయంలో ములుగులోని మేడారం కేంద్రంగా 3-7 సెకన్ల పాటు కొనసాగిన ప్రకంపనలతో కొన్ని చోట్ల ఇళ్ల గోడలు, నేల బీటలువారాయి. జనం భయంతో ఇళ్లు, అపార్ట్‌మెంట్ల నుంచి బయటకు పరుగులు తీశారు. వాహనాలపై వెళ్తున్నవారు ఏం జరుగుతోందో తెలియక కంగారుపడ్డారు. ఉదయం వాహ్యాళికి వెళ్లినవారు ఉలిక్కిపడ్డారు. మేడారం వద్ద

మిగతా 14వ పేజీలో...



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

రేపటి నుంచి..

నేడు సీఎం చేతులమీదుగా యాప్ ఆవిష్కరణ

ఈ ఆర్థిక సంవత్సరం నియోజకవర్గానికి 3500-4000 ఇళ్ల నిర్మాణం

కుటుంబంలోని మహిళ పేరు మీద మంజూరు

కనీసం 400 చదరపు అడుగుల్లో నిర్మించాలనే నిబంధన.. ఆపై ఎంతైనా: మంత్రి పొంగులేటి

హైదరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు రంగం సిద్ధమైంది. ఈ నెల 6 (శుక్రవారం) నుంచి పథకంలో లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ పథకంలో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండేలా, అవినీతికి, రాజకీయ ప్రమేయానికి ఆస్కారం లేకుండా అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు వీలుగా మొబైల్‌యాప్‌ను రూపొందించామని బుధవారం ఓ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. అర్హులైన పేదలకే ఇళ్లను

మిగతా 12వ పేజీలో...

గూగుల్ మరో అడుగు



హైదరాబాద్‌లో సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ నెలకొల్పేందుకు సిద్ధం

గూగుల్‌తో ఒప్పందం చేసుకున్న రాష్ట్రసర్కారు

ఐటీ ఇన్నోవేషన్ హబ్‌గా హైదరాబాద్: రేవంత్

సీఎంను ఆయన నివాసంలో కలిసిన గూగుల్ ప్రతినిధులు

హైదరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే మొట్టమొదటి గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్‌ను హైదరాబాద్‌లో నెలకొల్పేందుకు ఆ సంస్థ సిద్ధమైంది. ఈమేరకు గూగుల్‌తో బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకొంది. గూగుల్ ప్రధాన సమాచార అధికారి రాయల్ హన్సెన్ ఆధ్వర్యంలోని బృందం.. సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబుతో సీఎం నివాసంలో బుధవారం ఉదయం భేటీ అయి.. ఇక్కడ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపింది. ఈ విషయాన్ని వెల్లడించిన సీఎం రేవంత్ రెడ్డి.. అమెరికా బయట అతిపెద్ద కార్యాలయాన్ని కూడా ఇక్కడ ఏర్పాటు చేయడానికి గూగుల్ ముందుకొచ్చిందని చెప్పారు. హైదరాబాద్ ప్రపంచంలోనే మేటి ఐటీ, ఇన్నోవేషన్ హబ్‌గా అందరి దృష్టినీ ఆకర్షిస్తోందనడానికి ఈ ఒప్పందమే నిదర్శనమని హర్షం వ్యక్తం చేశారు. గూగుల్ సేఫ్టీ సెంటర్ ఏర్పాటు ద్వారా వేల సంఖ్యలో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఇక.. డిజిటల్ నైపుణ్యాల అభివృద్ధిలో తెలంగాణ ముందంజలో ఉందని గూగుల్ ఉన్నతాధికారి రాయల్ హన్సెన్ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా

మిగతా 12వ పేజీలో...

ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్‌జెండర్లు

పైలట్ ప్రాజెక్టుగా మొదటి బ్యాచ్

గోషామహల్ పోలీస్ గ్రౌండ్‌లో ఎంపిక ప్రక్రియ

44 మంది ఎంపిక.. నేటి నుంచి శిక్షణ 13

13

చిన్న కాళేశ్వరానికి
కేంద్రం సాయం

పీఎం కృషి సించాయీ యోజన కింద రూ.233 కోట్లు మంజూరుకు అంగీకారం



ఫడణవీస్‌ను అభినందిస్తున్న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

ఫడణవీసే సీఎం!

మహారాష్ట్ర బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఎన్నిక

ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానం.. నేడు ప్రమాణం

ముఖ్యమంత్రి పదవి సాంకేతిక ఏర్పాటు మాత్రమే

శిందే, పవార్‌లతో కలిసి పని చేస్తా: ఫడణవీస్

తనతోపాటు ఇద్దరు డిప్యూటీ సీఎంలు ప్రమాణం చేస్తారని వెల్లడి

2

సంధ్య థియేటర్ వద్ద భారీ ఎత్తున గుమిగూడిన అభిమానులు



'పుష్ప 2' ప్రీమియర్ షో.. తొక్కిసలాటలో 13

మహిళ మృతి

ఆమె కుమారుడి పరిస్థితి విషమం.. ఆస్పత్రిలో చికిత్స

సంధ్య థియేటర్ వద్దకు వచ్చిన హీరో అల్లు అర్జున్

చూసేందుకు ఎగబడ్డ అభిమానులు

లాఠీచార్జ్.. తోపులాటతో విషాదం!



తొక్కిసలాటలో మరణించిన రేవతి



సుఖ్‌బీర్ లక్ష్యంగా కాల్పులు జరుపుతున్న వ్యక్తిని అడ్డుకుంటున్న అకాలీదళ్ నేతలు

సుఖ్‌బీర్‌పై హత్యాయత్నం

మాజీ ఉగ్రవాది తుపాకీ కాల్పులు

పంజాబ్ మాజీ డిప్యూటీ సీఎంకు త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

స్వర్ణ దేవాలయం వద్ద ఘటన

సిక్కు పెద్దలు విధించిన శిక్ష అనుభవిస్తున్న టైంలో కాల్పులు

సీఎం రాజీనామాకు విపక్షాల పట్టు

పంజాబ్‌పై కుట్ర: సీఎం మాన్

అమృత్‌సర్, డిసెంబరు 4: సిక్కు మత పెద్దలు విధించిన 'కాపలాదారు' శిక్షను అనుభవిస్తున్న పంజాబ్ మాజీ ఉప ముఖ్యమంత్రి, శిరోమణి అకాలీదళ్ నేత సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై హత్యాయత్నం జరిగింది. మాజీ ఉగ్రవాది ఒకరు అత్యంత సమీపం నుంచి సుఖ్‌బీర్‌ను తుపాకీతో కాల్చి చంపేందుకు ప్రయత్నించారు. అయితే, బాదల్ అనుచరులు సహా సాధారణ దుస్తుల్లో ఉన్న పోలీసులు అతనిని అడ్డుకుని పక్కకు తోసేయడంతో సుఖ్‌బీర్ ప్రాణాలతో బయటపడ్డారు. బుధవారం ఉదయం 9.30 గంటల సమయంలో జరిగిన ఈ ఘటన దేశవ్యాప్తంగా

మిగతా 2వ పేజీలో...

తెలంగాణ రైజింగ్ కాదు
ఎనుముల బ్రదర్స్ రైజింగ్

3

ఏడాదిగా ఏమీ చేయని సన్నాసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డీ.. ఇలాగే చరిత్రలో నిలిచిపోతావ్

అప్పులపై తప్పుదోవ పట్టిస్తున్నావ్: కేటీఆర్

కుటుంబ బంధాల్లో స్మార్ట్‌ఫోన్ల చిచ్చు

- ఫోన్ల వల్ల వ్యక్తిగత సంబంధాల్లో ప్రతికూల ప్రభావాలు..అయినా ఫోన్లను వదల్లేని దుస్థితి
- మొబైల్ కంపెనీ 'వివో' చేయించిన అధ్యయనంలో వెల్లడి



న్యూఢిల్లీ, డిసెంబరు 4: అన్నం తినేటప్పుడు.. బండి మీద వెళ్లేటప్పుడు.. శుభాకార్యాలకు హాజరైనప్పుడు.. ఆఖరికి ఎవరైనా చనిపోతే చూడడానికి వెళ్లినప్పుడు కూడా.. అరచేత ఫోన్ ఉండాల్సిందే! ఆ ఫోన్ చూడాల్సిందే!! బండి మీద వెళ్లేటప్పుడైతే.. కర్ణాభరణాల్లాగా చెవిలో ఇయర్‌ఫోన్స్ పెట్టుకుని పాటలో, యూట్యూబ్ ఆడియోలో వినడం! మాటలు రాని పసిపిల్లలు సైతం.. అన్నం తినాలంటే వారి చేతిలో స్మార్ట్‌ఫోన్ అనే లంచం పడాల్సిందే!! ఇలా స్మార్ట్ ఫోన్లకు పూర్తిగా బానిసలైపోవడంతో.. తల్లిదండ్రులు, పిల్లల మధ్య బంధాలపై తీవ్ర దుష్ప్రభావం పడుతోందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఫోన్లే తమ మధ్య సంబంధాల్లో ప్రతికూల మార్పులకు కారణమవుతున్న విషయాన్ని అటు తల్లిదండ్రులు (66 శాతం మంది), ఇటు పిల్లలు (56 శాతం మంది) గుర్తిస్తున్నా.. ఎవ్వరూ ఫోన్ వినియోగాన్ని నియంత్రించుకోవడానికి ఇష్టపడట్లేదని తేలింది. చైనీస్ మొబైల్ కంపెనీ వివో.. 'సైబర్ మీడియా రిసెర్చ్' అనే సంస్థతో 'వివో స్విచాఫ్ 2024' పేరిట ఈ అధ్యయనం చేయించింది. తల్లిదండ్రులు రోజుకు సగటున 5 గంటలపాటు.. పిల్లలు నాలుగు గంటలసేపు స్మార్ట్ ఫోన్లలో సామాజిక మాధ్యమాల వినియోగానికి, వినోద వీడియోల వీక్షణకు అంకితమవుతున్నట్టు అందులో వెల్లడైంది. ఇలా ఎక్కువసేపు స్మార్ట్‌ఫోన్లను వినియోగించడం వల్ల వ్యక్తిగత సంబంధాలు దెబ్బతింటున్నాయని అధ్యయన నివేదికలో పేర్కొన్నారు. ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, అహ్మదాబాద్, పుణె నగరాల్లో 1543 మందితో నిర్వహించిన ఈ అధ్యయన నివేదిక ప్రకారం..

- ఫోన్ల అధిక వినియోగం తమ మధ్య ఘర్షణలకు కారణమవుతోందని ఈ సర్వేలో పాల్గొన్నవారిలో 73% తల్లిదండ్రులు, 69 శాతం మంది పిల్లలు అంగీకరించారు.
- ఫోన్ లేకుండా బతకలేమని 76% మంది తల్లిదండ్రులు, 71 శాతం మంది పిల్లలు స్పష్టం చేశారు.
- ఫోన్‌లో అత్యధిక సమయం సోషల్ మీడియా పోస్టులు, వినోదాన్ని కలిగించే కార్యకలాపాలకే వెచ్చిస్తున్నామని.. స్మార్ట్‌ఫోన్లకు తాము బానిసలయ్యామని.. 64 శాతం మంది పిల్లలు చెప్పారు.
- తమ స్నేహితులు గనక సోషల్ మీడియా యాప్స్‌లో లేకపోతే.. వాటిని తాము ఉపయోగించబోమని మూడింట రెండొంతుల మంది పిల్లలు చెప్పారు. 90% మందికి పైగా పిల్లలు అసలు ఈ సోషల్ మీడియా యాప్స్ లేకపోతే బాగుండని అభిప్రాయపడ్డారు.

లోకం తీరు





ఏఐ రాగాల రోబో వయొలినిస్ట్!

'అందుగలదిందు లేదని సందేహము వలదు.. కృత్రిమ మేధ ఎందెందు వెదకి చూచిన అందందే కలదు' ..అనడానికి అక్షరాలా నిదర్శనమీ రోబోటిక్ వయొలినిస్ట్! ఈ చిత్రంలో చేతిలో వయొలిన్‌తో కనిపిస్తున్న వ్యక్తి.. రాఘవసింహన్ శంకర్‌నారాయణన్. ఆయన పక్కన కనిపిస్తున్నది.. ఏఐ సాయంతో సంప్రదాయ కర్ణాటక సంగీతాన్ని అద్భుతంగా పలికించే రోబోటిక్ వయొలినిస్ట్. దాని పేరు హతానీ. తమిళనాడుకు చెందిన రాఘవ సింహన్ నాలుగో ఏట నుంచే చదువుతోపాటు వయొలిన్ వాయించడంలోనూ శిక్షణ పొందారు. చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆయన.. వాయులీన విద్వాంసుడిగానూ పేరొందారు. 200కు పైగా మ్యూజిక్ ఆల్బమ్‌లకు వయొలిన్ సహకారం అందించారు. ప్రపంచవ్యాప్తంగా 2000కు పైగా కచేరీలు ఇచ్చారు! అమెరికాలోని జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (జార్జియా టెక్)లో మెషీన్ లెర్నింగ్ అండ్ రోబోటిక్స్‌లో పీహెచ్‌డీ చేసిన రాఘవ సింహన్.. అక్కడే ఆరేళ్లపాటు శ్రమించి ఈ రోబోటిక్ వయొలినిస్ట్‌ను, సింథసైజర్‌ను అభివృద్ధి చేశారు. "టెక్నాలజీ, సంగీతం, రోబోటిక్స్.. ఈ మూడింటినీ మేళవించాలని నేను ఎప్పుడూ అనుకుంటాను. ఎందుకంటే.. కదిలే కంప్యూటర్లు, యంత్రాలంటే నాకు చాలా ఇష్టం" అని చెప్పారాయన. సంగీత రంగంలో ఏఐ వినియోగం ఇప్పటికే ఉన్నా.. అది పాశ్చాత్య సంగీతానికే పరిమితమవుతోందని, సంప్రదాయ సంగీతంతో ఏఐ అనుసంధానం గురించి ఎలాంటి పరిశోధనలూ జరగట్లేదని.. అందుకే తాను ఆ అంశంపై దృష్టి సారించానని వివరించారు.

ఫడణవీసే సీఎం!

మహారాష్ట్ర బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవ ఎన్నిక

- నేడు ప్రమాణ స్వీకారం
- ముగ్గురం కలిసి పని చేస్తాం: ఫడణవీస్

ముంబై, డిసెంబరు 4: అందరూ ఊహించినట్లుగానే దేవేంద్ర ఫడణవీస్ మహారాష్ట్ర బీజేపీ శాసనసభాపక్ష నేతగా బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటూ గవర్నర్ నుంచి ఆయనకు పిలుపు వచ్చింది. ఏక్‌నాథ్‌షిండే, అజిత్‌పవార్‌తో కలిసి ఫడణవీస్ గవర్నర్‌ను కలిశారు. అనంతరం, ముగ్గురు నేతలు మీడియాతో మాట్లాడారు. గురువారం సాయంత్రం ముంబైలోని ఆజాద్ మైదాన్‌లో తనతో పాటు ఇద్దరు డిప్యూటీ సీఎంలు ప్రమాణం చేస్తారని ఫడణవీస్ తెలిపారు. మంత్రులు ఎంతమంది ప్రమాణం చేస్తారన్నదానిపై ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. 'ముఖ్యమంత్రి పదవి అనేది ఒక సాంకేతిక ఏర్పాటు మాత్రమే. మేం ముగ్గురం కలిసి కట్టుగా పని చేస్తాం. మా బాధ్యత మరింత పెరిగింది. ప్రజల అంచనాలను అందుకోవటానికి కష్టపడతాం' అని స్పష్టం చేశారు. ఒక సాధారణ పార్టీ కార్యకర్తగా పని చేసిన తనకు మూడుసార్లు సీఎంగా అవకాశం ఇచ్చిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఫడణవీస్ పేర్కొన్నారు. 'ఏక్ హై తో సేఫ్ హై.. మోదీ హై తో ముంకిన్ హై' (కలిసి ఉంటేనే సురక్షితంగా ఉంటాం.. మోదీతో ఏదైనా సాధ్యమే) అని చెప్పారు. షిండేను మంగళవారం కలిశానని, ప్రభుత్వంలో చేరాల్సిందిగా ఆహ్వానించానని ఫడణవీస్ వెల్లడించారు. దీనిపై మీ స్పందన ఏమిటని షిండేను విలేకర్లు ప్రశ్నించగా.. సాయంత్రం వరకు వేచి చూడండి అంటూ ఆయన బదులివ్వటం గమనార్హం. షిండే అలా చెబుతుండగానే.. పక్కనే ఉన్న అజిత్ పవార్ జోక్యం చేసుకుంటూ.. ఆయన కూడా డిప్యూటీ సీఎంగా ప్రమాణం చేస్తారని చెప్పారు. దీంతో అక్కడున్న అందరూ గొల్లుమని నవ్వారు. అజిత్ మాటకు షిండే ప్రతిస్పందిస్తూ.. 'దాదాకు (అజిత్ పవార్‌కు) ఉదయమేగాక సాయంత్రం కూడా ప్రమాణం చేసిన అనుభవం ఉంది' అని వ్యాఖ్యానించటంతో మరోసారి నవ్వులు విరిశాయి. 2019లో ఎన్సీపీ చీలికవర్గంతో బీజేపీ ప్రభుత్వంలో కలిసిన అజిత్ పవార్.. వేకువజామునే డిప్యూటీ సీఎంగా ప్రమాణం చేశారు. షిండే ఆ సంగతినే పరోక్షంగా ప్రస్తావించారు. తన రెండున్నరేళ్ల పాలనతో సంతృప్తిగా ఉన్నానని, ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన భారీ గెలుపుతో తమ బాధ్యత మరింత పెరిగిందని, ఒక బృందంగా కలిసి పని చేస్తామని షిండే పేర్కొన్నారు. రెండున్నరేళ్ల క్రితం సీఎంగా తన పేరును ఫడణవీస్ ప్రతిపాదించారని, ఈసారి ఆయన పేరును తాము ప్రతిపాదించామన్నారు. కాగా, డిప్యూటీ సీఎం పదవిని చేపట్టటానికి ఏక్‌నాథ్ షిండే అంగీకరించినట్లుగా సంబంధితవర్గాలు బుధవారం రాత్రి వెల్లడించాయి. అంతకు ముందు, ముంబైలోని విధాన్ భవన్‌లో బీజేపీ శాసనసభాపక్ష సమావేశం జరిగింది. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ కేంద్ర పరిశీలకులుగా హాజరయ్యారు. ఫడణవీస్‌ను శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీఎంగా ఫడణవీస్ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఆజాద్ మైదాన్‌లో జరపటానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు, బీజేపీ, ఎన్డీఏ పాలిత రాష్ట్రాల సీఎంలు హాజరుకానున్నట్లు సమాచారం.



ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని గవర్నర్ రాధాకృష్ణన్‌కు వినతి పత్రాన్ని సమర్పిస్తున్న అజిత్ పవార్, దేవేంద్ర ఫడణవీస్, ఏక్‌నాథ్ శిండే

'సరిత పుత్ర దేవేంద్ర ఫడణవీస్'

మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న ఫడణవీస్ తన తల్లి సరితా ఫడణవీస్‌కు ప్రత్యేక కానుక ఇచ్చారు. ఆయన పేరులో తన తల్లి సరిత పేరును జోడిస్తూ 'దేవేంద్ర సరిత గంగాధర్ రావు ఫడణవీస్'గా మార్చుకున్నారు. మహారాష్ట్రీయులు సాధారణంగా వారి పేర్లకు మధ్యలో తండ్రి పేరును జోడిస్తుంటారు. ఇప్పటి వరకు దేవేంద్ర ఫడణవీస్ పేరు మధ్యలో ఆయన తండ్రి గంగాధర్ రావు పేరు మాత్రమే ఉండేది. తాజాగా ఆయన తల్లి పేరును కూడా జోడించుకున్నారు. ప్రమాణ స్వీకారోత్సవ అధికారిక ఆహ్వాన పత్రికలోనూ 'దేవేంద్ర సరిత గంగాధర్ రావు ఫడణవీస్'గా ముద్రించారు. కాగా, తన కుమారుడి పట్ల ఎంతో గర్వంగా ఉందని సరితా ఫడణవీస్ అన్నారు. మోదీ కూడా తన కొడుకే సీఎం కావాలని కోరుకున్నారని చెప్పారు. శాతవాహన రాజు గౌతమి పుత్ర శాతకర్ణి తన పేరుకు ముందు తల్లి గౌతమి పేరును జోడించుకుని ఈ సంప్రదాయానికి నాంది పలికారు.



ముచ్చటగా మూడోసారి

ముంబై, డిసెంబరు 4: దేవేంద్ర ఫడణవీస్ ముచ్చటగా మూడోసారి మహారాష్ట్ర సీఎం పీఠాన్ని అధిరోహించేందుకు సిద్ధమయ్యారు. క్లిష్ట సమయాల్లో పరిణతితో వ్యవహరించడం, గొప్ప సహనంతో పాటు పార్టీ పెద్దల పట్ల విధేయత 54 ఏళ్ల ఫడణవీస్‌ను 'మహా'రాజకీయాల్లో కీలక నేతగా ఎదిగేలా చేశాయి. సామాజిక మాధ్యమాలను ప్రభావవంతంగా వాడటం ద్వారా తన వాణిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లగలిగారని రాజకీయ విశ్లేషకులు చెబుతారు. 1989లో ఫడణవీస్ ఏబీవీపీలో చేరారు. 22 ఏళ్లకే నాగపూర్‌లో కార్పొరేటర్ అయ్యారు. 1997లో 27 ఏళ్ల వయసులో నాగపూర్ మేయర్ పదవి చేపట్టారు. నాగపూర్ చరిత్రలో యంగెస్ట్ మేయర్ ఆయనే! 1999లో తొలిసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. ఆ తర్వాత ఆయన రాజకీయాల్లో వెనుతిరిగి చూడలేదు. నాగపూర్ సౌత్-వెస్ట్ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటిదాకా అంటే నాలుగు సార్లు 2009, 2014, 2019, 2014లో ఫడణవీసే గెలిచారు. 2014 అసెంబ్లీ ఎన్నికల ర్యాలీలో 'ఫడణవీస్‌ను నాగపూర్ దేశానికి ఇచ్చిన బహుమతి' అంటూ మోదీ అభివర్ణించారు. 2014-19 వరకు మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేశారు. మనోహర్ జోషీ తర్వాత బ్రాహ్మణ సామాజిక వర్గం నుంచి మహారాష్ట్ర ముఖ్యమంత్రి పదవి చేపట్టి రెండో వ్యక్తి ఫడణవీసే! 2019 నవంబరు 23న రెండోసారి సీఎంగా ప్రమాణం చేసినా మహారాష్ట్ర రాజకీయాల్లో నాటకీయ పరిణామాలు సంభవించడంతో మూడురోజులే ఆ పదవిలో కొనసాగారు. గత నవంబరు 23న అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ముగిసి.. మహాయుతి కూటమికి భారీ స్థాయిలో సీట్లు రావడంతో ఫడణవీస్ మూడోసారి సీఎంగా ప్రమాణం చేయబోతున్నారు.

అధికార పంపిణీ ఒప్పందం వాస్తవమే

- కానీ అధిష్ఠానాన్ని బ్లాక్‌మెయిల్ చేయను: డీకే శివకుమార్
- ఒప్పందాలు లేవన్న సిద్ధరామయ్య..కర్ణాటకలో కలకలం



బెంగళూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కర్ణాటక కాంగ్రెస్‌లో అధికార పంపిణీ ఒప్పందం బహిర్గతమైంది. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఓ ఇంటర్వ్యూలో పలు అంశాలను బయటపెట్టారు. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం అనంతరం సిద్దరామయ్య, డీకే శివకుమార్ మధ్య సీఎం కుర్చీ కోసం పోటీ ఏర్పడటం, సిద్దరామయ్యకు అవకాశం దక్కిన విషయం తెలిసిందే. ఆ సమయంలో అధికార పంపిణీ ఒప్పందం జరిగిన విషయం వాస్తవమేనని, ఆ వివరాలను బహిర్గతం చేయలేనని చెప్పారు. ఒప్పందంపై అధిష్ఠానం పెద్దలను బ్లాక్‌మెయిల్ చేయనని శివకుమార్ స్పష్టం చేశారు. గాంధీ కుటుంబానికి వీరవిధేయుడినని, అందులో మరో మాట లేదని తేల్చి చెప్పారు. ఇటీవల ఢిల్లీ పర్యటనలో ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూ ద్వారా పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. సిద్దరామయ్యకు, తనకు ఎటువంటి భిన్నాభిప్రాయాలు లేవన్నారు. అయితే, శివకుమార్ వ్యాఖ్యలను సిద్దరామయ్య తిప్పికొట్టారు. అధికార పంపిణీకి సంబంధించి ఎటువంటి ఒప్పందాలు జరగలేదని బుధవారం చెప్పారు. అధిష్ఠానం సూచనలకు కట్టుబడతానన్నారు.

మగవారికి నెలసరి వస్తే తెలిసేది

- మహిళా జడ్జిల తొలగింపుపై సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ, డిసెంబరు 4: ఓ మహిళా న్యాయమూర్తికి గర్భస్రావం అయిన పరిస్థితిని కనీసం పరిగణనలోకి తీసుకోకుండా మధ్యప్రదేశ్ హైకోర్టు ఆమెను విధుల నుంచి తొలగించడాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. మహిళా జడ్జి అనుభవించిన మానసిక క్షోభను సదరు కోర్టు విస్మరించిందని పేర్కొంది. ఆరోగ్య పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా పనితీరు ఆధారంగా తీర్పు ఇవ్వడాన్ని తప్పుపట్టింది. 2023 జూన్‌లో మధ్యప్రదేశ్ హైకోర్టు ఆరుగురు మహిళా న్యాయమూర్తులను విధుల నుంచి తొలగిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. కేసుల పరిష్కారంలో ఆశించిన స్థాయిలో వారి పని తీరు లేదని చర్యలకు పూనుకుంది. అనంతరం నలుగురిని తిరిగి విధుల్లోకి తీసుకుంది. ఇద్దర్ని మాత్రం నిరాకరించింది. ఈ వ్యవహారాన్ని సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టింది. బుధవారం వాదనల సందర్భంగా.. "సదరు మహిళా జడ్జికి గర్భవిచ్ఛిత్తి జరిగింది. అలాగే ఆమె సోదరుడు కాన్సర్‌తో మృతిచెందాడు. అయినా మధ్యప్రదేశ్ హైకోర్టు వినిపించుకోలేదు. పురుషులకూ నెలసరి వస్తే వారి బాధ తెలుస్తుంది" అని జస్టిస్ బీవీ నాగరత్న, ఎన్‌కే సింగ్‌తో కూడిన బెంచ్ ఆగ్రహం వ్యక్తం చేసింది.



కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ బుధవారం తన ఇంటి ఆవరణలోని గార్డెన్‌లో కూర్చొని పేపర్ చదువుతుండగా.. ఓ కోతి పరుగెత్తుకు వచ్చి ఆయన ఒళ్లో ఇలా కూర్చుంది. అరటి పండు అందించగా.. ఆకలితో ఉన్న ఆ కోతి దాన్ని తిని ఆయన ఒళ్లోనే కొద్ది సేపు నిద్రపోయింది. తర్వాత థరూరే దాన్ని నిద్ర లేపారు. ఈ విషయాన్ని థరూర్ 'ఎక్స్'లో వెల్లడించారు.



నౌకాదళ దినోత్సవం సందర్భంగా బుధవారం కొచ్చి తీరంలో నిర్వహించిన సైనిక విన్యాసాల్లోని దృశ్యం ఇది. పాకిస్థాన్‌పై 1971లో జరిగిన యుద్ధంలో భారత్ విజయానికి, ఈ యుద్ధంలో నౌకాదళం నిర్వహించిన ఆపరేషన్ ట్రైడెంట్‌ను స్మరించుకునేలా ప్రతీ ఏట డిసెంబరు 4ను నౌకాదళ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అత్యాధునిక నౌకలు, జలాంతర్గాములు, హెలికాప్టర్లతో సైనికులు విన్యాసాలను ప్రదర్శిస్తారు.



సంభాల్ వెళ్లకుండా.. నన్నెలా అడ్డుకుంటారు?

నా హక్కును మోదీ సర్కారు హరించింది: రాహుల్

లఖ్‌నవూ, డిసెంబరు 4: ప్రతిపక్ష నాయకుడిగా తన హక్కులను మోదీ సర్కారు కాలరాసిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆక్షేపించారు. మత ఉద్రిక్తతలు నెలకొన్న ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ జిల్లాకు వెళ్లేందుకు తన సోదరి ప్రియాంకతో కలిసి ఆయన చేసిన ప్రయత్నాన్ని పోలీసులు వమ్ముచేశారు. ఢిల్లీ - యూపీ సరిహద్దుల్లోని ఘజియాబాద్ వద్ద వారిని అడ్డుకుని వెనక్కి పంపించివేశారు. బుధవారం ఉదయం 11 గంటలకు రాహుల్ తన కాన్వాయ్‌తో ఘజియాబాద్ వరకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ పెద్దఎత్తున మోహరించిన పోలీసులు జాతీయ రహదారిని బారికేడ్‌లతో మూసివేశారు. రాహుల్ తన వాహనంలోంచి దిగి సీనియర్ పోలీసు అధికారులతో మాట్లాడినా.. ప్రయోజనం లేకపోయింది. దీంతో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. తన పర్యటనను పోలీసులు అడ్డుకోవడం తన రాజ్యాంగ హక్కులను హరించడమేనని రాహుల్ ఆక్షేపించారు. "సంభాల్‌కు వెళ్లకుండా పోలీసులు నన్ను అడ్డుకున్నారు. కార్యకర్తలు వెంట లేకుండా ఒక్కడినే అక్కడకు వెళ్లడానికి కూడా సిద్ధంగా ఉన్నానని చెప్పాను. అయినా, పోలీసులు అంగీకరించలేదు. ఒక విపక్ష నేతగా సంభాల్‌లో పర్యటించడం నా విధి.. రాజ్యాంగ హక్కు. ఆ హక్కును పోలీసులు హరించారు. నా పర్యటనను చూసి ఎందుకు బీజేపీ భయపడుతోంది" అని రాహుల్ విమర్శించారు.

సుఖ్‌బీర్‌పై హత్యాయత్నం

(మొదటి పేజీ తరువాయి)

సంచలనం రేపింది. అధికారంలో ఉన్న సమయంలో సుఖ్‌బీర్ చేసిన తప్పులకుగాను మత పెద్దలు ఆయనకు శిక్ష విధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం నుంచి ఆయన అమృత్‌సర్‌లోని ప్రఖ్యాత స్వర్ణదేవాలయం వద్ద వీల్ చైర్‌లో కూర్చుని కాపలాదారుగా శిక్షను అనుభవిస్తున్నారు. బుధవారం యథావిధిగా కాపలాదారుగా కూర్చున్న సుఖ్‌బీర్ వద్దకు ఓ వ్యక్తి నెమ్మదిగా నడుచుకుంటూ వచ్చే ప్రయత్నం చేశారు. అయితే.. ఆయనను దగ్గరకు రావద్దంటూ సుఖ్‌బీర్ అనుచరులు చెప్పారు. కానీ, అప్పటికే సమీపానికి చేరుకున్న ఆ వ్యక్తి ఒక్క ఉదుటన తన జేబులో నుంచి తుపాకీని బయటకు తీశారు. ఈ విషయాన్ని గమనించిన సాధారణ దుస్తుల్లోని పోలీసులు ఒక్క ఉదుటన ఆ వ్యక్తిని పక్కకు నెట్టేశారు. ఈ క్రమంలోనే ఆ వ్యక్తి తుపాకీని పేల్చారు. అయితే.. తుపాకీ గుండు బాదల్‌కు వెనుకగా దూసుకుపోయి.. స్వర్ణ దేవాలయం గోడను తాకింది. దీంతో సుఖ్‌బీర్‌కు ప్రాణాపాయం తప్పింది. ఆ వెంటనే మరింత మంది భద్రతా దళాలతోపాటు శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ టాస్క్ ఫోర్స్ సభ్యులు హుటాహుటిన అక్కడకు చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కాగా, కాల్పులకు తెగబడిన వ్యక్తిని నారాయణ్ సింగ్ చౌరాగా పోలీసులు గుర్తించారు. ఇతను మాజీ ఉగ్రవాది అని పేర్కొన్నారు. డేరా బాబా నానక్‌లో నివసించేవాడిగా తెలిపారు. ఈ ఘటనపై అమృత్‌సర్ పోలీసు కమిషనర్ గురుప్రీత్ సింగ్ భుల్లార్ మాట్లాడుతూ.. పోలీసులు అప్రమత్తంగా ఉన్న కారణంగా పెను ప్రమాదం తప్పిందన్నారు. పోలీసు అధికారి రాష్పాల్ సింగ్.. నారాయణ్ సింగ్ చౌరాను ముందుగానే గుర్తించారని తెలిపారు. చౌరా తన జేబులో నుంచి తుపాకీ తీస్తున్న విషయాన్ని గ్రహించిన అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ జస్బీర్ సింగ్.. ఒక్క ఉదుటన చౌరా రెండు చేతులను బలంగా పైకి మడిచి తుపాకీ గుండు గాలిలోకి ఎగిసేలా చేశారని తెలిపారు. నారాయణ్ సింగ్‌ను అరెస్టు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు చెప్పారు. స్వర్ణదేవాలయం భద్రతకు వచ్చిన ముప్పులేదన్నారు. అయితే, మతపరమైన విశ్వాసాల నేపథ్యంలో భక్తులను తనిఖీ చేసే అవకాశం లేదన్నారు. నారాయణ్ చౌరాపై 20కి పైగా కేసులు ఉన్నాయని చెప్పారు. 2004లో బురైల్ జైలు గోడలు బద్దలు కొట్టుకుని పరారైన ఉగ్రవాదులు..జగ్తార్ సింగ్ హవారా, పరంజిత్ సింగ్ భోరాలకు చౌరా సహాయం చేసిన విషయాన్ని డీసీపీ గుర్తు చేశారు. మరోవైపు.. సిక్కుల అది పెద్ద విచారణ సంఘం.. అకాల్ తఖ్త్ అధిపతి గియానీ రఘ్బీర్ సింగ్ మాట్లాడుతూ.. "ఇది సుఖ్‌బీర్‌పై జరిగిన ఘటన కాదు. స్వర్ణ దేవాలయం కాపలాదారుపై జరిగిన దాడి" అని వ్యాఖ్యానించారు.



అకాల్ తఖ్త్ విధించిన శిక్షలో భాగంగా గిన్నెలు తోముతున్న సుఖ్‌బీర్ బాదల్

పంజాబీలపై కుట్ర: సీఎం

మాజీ డిప్యూటీ సీఎంపై జరిగిన హత్యాయత్నం ఘటనపై సీఎం భగవంత్ మాన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ కేసును క్షుణంగా విచారించాలని అధికారులను ఆదేశించారు. సుఖ్‌బీర్ కాపాడిన పోలీసులను అభినందించారు. "పంజాబీలపై కుట్ర జరిగింది. పంజాబీల పరువు తీయాలని భావించిన వారిని మా పోలీసులు అడ్డుకున్నారు" అని ఆయన తెలిపారు. ఈ కుట్రకు పాల్పడిన వారు ఎంతటి వారైనా వదిలి పెట్టేదిలేదన్న ఆయన అధికారుల నుంచి తక్షణ నివేదిక కోరినట్టు చెప్పారు. మరోవైపు, కాల్పుల ఘటనను విపక్షాలు తీవ్రంగా ఖండించాయి. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని, పవిత్రమైన స్వర్ణ దేవాలయంలోనే కాల్పులు జరిగే స్థాయికి పరిస్థితి దిగజారిపోయిందని విమర్శించాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి మాన్ తనపదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి. శిరోమణి అకాలీదళ్ నేత, ప్రస్తుత సిక్కు మత పెద్దలు విధించిన శిక్షను అనుభవిస్తున్న దల్జిత్ సింగ్ చీమా సైతం సీఎం మాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. "పంజాబ్‌లో చోటు చేసుకున్న అతి పెద్ద సంఘటన ఇదే. రాష్ట్రాన్ని ఎటు తీసుకువెళ్తున్నారని సీఎం మాన్‌ను నిలదీస్తున్నా. ఇది వంద శాతం శాంతి భద్రతల వైఫల్యమే. మాన్ రాజీనామా చేసి తీరాలి" అని చీమా నిప్పులు చెరిగారు. తాజా ఘటనపై జ్యుడీషియల్ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయనడానికి ఈ ఘటనే ప్రత్యక్ష ఉదాహరణ అని కాంగ్రెస్ పీసీసీ చీఫ్ అమరిందర్ సింగ్ రాజా విమర్శించారు. కేంద్ర సహాయ మంత్రి రవనీత్ సింగ్ బిట్టు కాల్పుల ఘటనను ఖండించారు.

దక్షిణ కొరియాలో సైనిక పాలన.. ఉపసంహరణ

- ప్రతిపక్షాలు అభిశంసన పెట్టడంతో వెనక్కి తగ్గిన అధ్యక్షుడు
- స్టాక్ మార్కెట్‌లో షేర్లు భారీగా పతనం
- ఆచితూచి స్పందించిన ప్రపంచ దేశాలు



సియోల్, డిసెంబరు 4: దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ దేశంలో సైనిక పాలనను ప్రకటించి.. తీవ్ర ప్రతిఘటన ఎదురవడంతో ఆరు గంటల్లోనే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. ప్రతిపక్షాల ఆధిపత్యం కొనసాగుతున్న పార్లమెంటులో తన అజెండా అమలుకు అడ్డంకులు ఎదురవుతుండటంతో దేశంలో అత్యవసర పరిస్థితిని విధిస్తున్నట్టు మంగళవారం రాత్రి యూన్ ప్రకటించారు. రాత్రి 10.30 గంటలకు టీవీలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. ఆ వెంటనే సాయుధ సైనికులు పార్లమెంటు భవనంలోకి ప్రవేశించారు. హెలికాప్టర్లు పార్లమెంటు భవనంపై చక్కర్లు కొట్టాయి. ఈ నిర్ణయం దేశ ప్రజలతోపాటు అంతర్జాతీయ సమాజాన్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. కీలక మిత్రదేశం అమెరికాకు సైతం యూన్ ముందుగా ఈ విషయాన్ని తెలియజేయకపోవడం అమెరికా పాలకులనూ ఆశ్చర్యానికి గురిచేసింది. అధ్యక్షుడి నిర్ణయాన్ని ప్రతిపక్షాలతోపాటు, హక్కుల సంఘాలు, కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. సోషల్ మీడియాలోనూ విమర్శలు వెల్లువెత్తాయి. వేలాదిగా ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు. యూన్ రాజీనామా చేసే వరకు నిరవధిక సమ్మె చేస్తామని దేశంలోని అతిపెద్ద కార్మిక సంఘాలు హెచ్చరించాయి. పార్లమెంటులో సైనిక పాలనకు వ్యతిరేకంగా ఓటు వేసేందుకు ప్రతిపక్ష సభ్యులు భద్రతా సిబ్బందితోనూ ఘర్షణపడ్డారు. అధ్యక్షుడికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు బుధవారం అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. యూన్ తక్షణమే గద్దె దిగాలని ప్రతిపక్ష డెమోక్రటిక్ పార్టీ డిమాండ్ చేసింది. అభిశంసన తీర్మానంపై శుక్రవారం ఓటింగ్ జరిపే అవకాశం ఉందని డెమోక్రటిక్ పార్టీ తెలిపింది. తాజా పరిణామాల నేపథ్యంలో స్టాక్ మార్కెట్‌లో దక్షిణ కొరియాకు చెందిన కంపెనీల షేర్లు భారీగా పతనమయ్యాయి. తీవ్ర ప్రతిఘటన నేపథ్యంలో సైనిక పాలనను ఉపసంహరిస్తూ బుధవారం తెల్లవారుజామున 4.30 గంటలకు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. కాగా, 1980లో దక్షిణ కొరియా ప్రజాస్వామ్య దేశంగా అవతరించింది. ఆ దేశ నాలుగు దశాబ్దాల ప్రజాస్వామ్య చరిత్రలో సైనిక పాలన విధించడం ఇదే తొలిసారి. ఈ పరిణామాలపై తీవ్రంగా ఆందోళన చెందుతున్నామని అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ ప్రకటించింది.

పాలస్తీనా భూభాగం నుంచి ఇజ్రాయెల్ వైదొలగాలి

- యూఎన్‌లో తీర్మానం.. అనుకూలంగా భారత్ ఓటు

ఐక్యరాజ్య సమితి, డిసెంబరు 4: 1967 నుంచి తూర్పు జెరూసలెంతో సహా ఆక్రమించిన పాలస్తీనా భూభాగాల నుంచి ఇజ్రాయెల్ వైదొలగాలంటూ ఐక్యరాజ్యసమితి (యూఎన్) సర్వ ప్రతినిధుల సభలో మంగళవారం ప్రవేశపెట్టిన తీర్మానానికి అనుకూలంగా భారత్ ఓటు వేసింది. ఈ తీర్మానంపై ఓటింగ్ నిర్వహించగా.. భారత్‌తో సహా 157 దేశాలు అనుకూలంగా ఓటు వేశాయి. అయితే అమెరికా, ఇజ్రాయెల్, అర్జెంటీనా సహా ఎనిమిది దేశాలు తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేశాయి. పశ్చిమాసియాలో శాంతి నెలకొనాలని భారత్ తన ఓటు ద్వారా పునరుద్ఘాటించింది. ఇదిలా ఉండగా.. సిరియాకు చెందిన గోలన్ హైట్స్ నుంచి ఇజ్రాయెల్ వైదొలగాలన్న మరో తీర్మానానికి కూడా భారత్ మద్దతు పలికింది.

మారణహోమానికి సూత్రధారి యూనస్: షేక్ హసీనా

న్యూఢిల్లీ, డిసెంబరు 4: బంగ్లాదేశ్‌లో మైనార్టీలే లక్ష్యంగా జరిగిన మారణహోమానికి సూత్రధారి అక్కడి తాత్కాలిక ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తోన్న మహ్మద్ యూనస్ అని ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా అన్నారు. తన తండ్రి షేక్ ముజీబుర్ రెహ్మాన్‌ను హతమార్చినట్టే తనని, తన సహోదరిని కూడా అంతమొందించేందుకు కుట్ర జరిగిందని ఆమె ఆరోపించారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే తాను ఆగస్టులో బంగ్లాదేశ్‌ను వీడాల్సి వచ్చిందన్నారు. బంగ్లాదేశ్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని న్యూయార్క్ వేదికగా ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో వర్చువల్‌గా ప్రసంగించారు. దేశాన్ని వీడిన తర్వాత తొలిసారిగా ఆమె చేసిన ఈ ప్రసంగంలో మహ్మద్ యూనస్‌పై ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు.

చదువుల తల్లికి అండగా ఏబీఎన్- 'ఆంధ్రజ్యోతి'



ఖమ్మం యూనిట్ కార్యాలయంలో బుధవారం విద్యార్థిని శ్రీహర్షితతో మాట్లాడుతున్న ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ

ఎండీ రాధాకృష్ణను కలిసి కృతజ్ఞతలు తెలిపిన వైద్య విద్యార్థిని శ్రీహర్షిత

ఖమ్మంటౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్‌లో సీటు సాధించినా కళాశాల ఫీజులు చెల్లించలేని స్థితిలో ఉన్న ఓ నిరుపేద విద్యార్థినికి ఏబీఎన్- ఆంధ్రజ్యోతి' అండగా నిలిచింది. దాంతో సదరు విద్యార్థిని బుధవారం ఖమ్మం యూనిట్ కార్యాలయంలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణను కలిసి కృతజ్ఞతలు తెలిపింది. వైరా మునిసిపాలిటీ పరిధిలోని దిద్దుపుడి గ్రామానికి చెందిన పానెం శ్రీహర్షిత చిన్నతనంలోనే తల్లిని కోల్పోయింది. తాతయ్య- అమ్మమ్మ కొనకంచి జోజి- ప్రకాశమ్మల వద్ద పెరిగింది. కష్టపడి చదివి నీట్ ఫలితాల్లో జాతీయస్థాయిలో ర్యాంకు తెచ్చుకుని ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. అయితే చదువు కొనసాగించేందుకు ఫీజులు కట్టే ఆర్థిక స్తోమత లేక ఎంతో ఆవేదనకు లోనైంది. ఆమె వ్యధను ఏబీఎన్‌తో పాటు ఆంధ్రజ్యోతి ప్రచురించింది. దాంతో రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కుమారుడు తుమ్మల యుగంధర్, ఏపీ తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి చిన్ని సహా పలువురు దాతకు ఆమెకు సహాయం చేసేందుకు ముందుకు వచ్చారు. శ్రీహర్షితకు సాయం చేసేందుకు లయన్స్ క్లబ్ సభ్యులు కూడా స్పందించారు. దాంతో శ్రీహర్షిత ఖమ్మంలోని ప్రభుత్వ వైద్యకళాశాలలో చేరింది. బుధవారం ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ ఖమ్మం యూనిట్ కార్యాలయానికి రాగా, విషయం తెలుసుకున్న శ్రీహర్షిత, తన తాత జోజితో వచ్చి రాధాకృష్ణకు కృతజ్ఞతలు తెలిపి, శాలువాతో సత్కరించింది. తన చదువు కొనసాగేందుకు ఏబీఎన్- ఆంధ్రజ్యోతి అందించిన సహాయం ఎప్పటకీ మరువలేనని పేర్కొంది. ఈ సందర్భంగా వేమూరి రాధాకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థినికి 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి' ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపి, ఎంబీబీఎస్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలని శ్రీహర్షితను ఆశీర్వదించారు.

రైతులకు సాగునీరు అందించండి

» మంత్రి ఉత్తమ్‌కు హరీశ్‌రావు లేఖ

సిద్దిపేట టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులు యాసంగి సాగుకు సమాయత్తమైన నేపథ్యంలో వారికి అవసరమైన సా గునీటిని అందజేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సిద్దిపేట, మెదక్, యాదా ద్రి, జనగామ జిల్లాల రైతుల తరఫున నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి బుధవారం ఆయన ఓ లేఖ రాశారు. మల్లన్నసాగర్‌లో ప్రస్తుతం 19.03 టీఎంసీలు, కొండపోచమ్మసాగర్‌లో 9.5 టీఎంసీలు, రంగనాయక సాగర్‌లో 2.57 టీఎంసీలు, అన్నపూర్ణ 3.21లు నీరు అందుబాటులో ఉందని హరీశ్ లేఖలో పేర్కొన్నారు. మిడ్ మానేరులో 27టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, అక్కడి నుంచి మరింత నీటిని ఈ రిజర్వాయర్లకు ఎత్తిపోసి పూర్తిస్థాయిలో సాగునీటిని అందించాలని కోరారు. ప్రాజెక్టుల ద్వారా చెరువులు, కుంటలు చెక్‌డ్యామ్‌లతో భూగర్భ జలాలు పెరిగాయన్నారు. ఈ ఏడాది కూడా చెరువులకు, కుంటలకు, చెక్‌డ్యామ్‌లకు కాలువల ద్వారా నీటిని విడుదల చేసి పంటలకు నీరందించాలని హరీశ్‌రావు కోరారు. ఈ ఏడాది కూడా యథావిధిగా సాగు నీరు అందించడానికి నీటి ప్రణాళిక కమిటీని ఆదేశించాలని మంత్రిని కోరారు.

హైదరాబాద్‌లో ఈడీ సోదాలు

» సైబర్ నేరాల కేసుల్లో సీఏలు లక్ష్యంగా దర్యాప్తు

హైదరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) కేంద్రంగా జరిగిన సైబర్ నేరాల కేసు దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ప్రత్యేక బృందాలు హైదరాబాద్‌లో సోదాలు నిర్వహించాయి. యూఏఈకి చెందిన పీవైపీఎల్ అనే సంస్థ క్యూఆర్ కోడ్, ఫిషింగ్, పార్ట్ టైం ఉద్యోగాలు తదితర మోసాలతో భారత్‌లో పెద్దమొత్తంలో సైబర్ నేరాలకు పాల్పడింది. దీంతో మనీలాండరింగ్ కోణంలో కేసు నమోదు చేసిన ఈడీ అధికారులు విచారణ జరుపుతున్నారు. దర్యాప్తులో భాగంగా ఈ కేసుతో సంబంధం ఉన్న చార్టెడ్ అకౌంటెంట్లు(సీఏ) లక్ష్యంగా సోదాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా హైదరాబాద్‌తోపాటు ఢిల్లీ, గురుగ్రామ్, జోద్‌పూర్, పూణె, కోల్‌కతా తదితర ప్రాంతాల్లో ఈడీ బృందాలు వరుసగా మూడు రోజులపాటు సోదాలు చేపట్టాయి. ఈ సోదాల్లో రూ. 47 లక్షల నగదు, కీలక పత్రాలు ఇతర డిజిటల్ పరికరాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వేర్వేరు ఖాతాల్లో ఉన్న రూ. 1. 36 కోట్ల విలువైన క్రిప్టో కరెన్సీని ఫ్రీజ్ చేసినట్లు ఈడీ వర్గాలు వెల్లడించాయి.

తెలంగాణ రైజింగ్ కాదు ఎనుముల బ్రదర్స్ రైజింగ్

ఏడాదిగా ఏమీ చేయని సన్నాసి ముఖ్యమంత్రివి.. రేవంత్‌రెడ్డీ ఇలాగే చరిత్రలో నిలిచిపోతావ్

» అప్పులపై ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నావ్

» రూ.లక్ష కోట్ల అప్పులు తెచ్చి ఏం చేశారో చెప్పాలి

» కాళేశ్వరం లేకుండానే రికార్డు స్థాయిలో పంటలా?

» 2014కు ముందు రికార్డు స్థాయిలో పంటలేవి?

» ఏడాదిగా ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొంటున్నాం

» కేసీఆర్‌పై కోపంతో తెలంగాణ తల్లి రూపం మార్చొద్దు: కేటీఆర్



మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్

హైదరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): "నీ తప్పు కప్పిపుచ్చుకోవడానికి అప్పులంటూ తప్పుడు కూతలు కూస్తున్నావ్.. తెలంగాణ దివాళా తీసిందంటూ దివాళాకోరు మాటలు మాట్లాడుతున్నావ్. అప్పుల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నావ్. ప్రజలకు ఏమీ చేయకుండా ఏడాదికాలం గడిపిన సన్నాసి ముఖ్యమంత్రిగా నువ్వు చరిత్రలో నిలిచిపోతావ్" అని సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు చేశారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చేసిన అప్పులు రూ.4,26,499కోట్లు మాత్రమేనని అసెంబ్లీలో శ్వేతపత్రం ఇచ్చినా.. బడ్జెట్‌పై అవగాహన లేకుండా రేవంత్‌రెడ్డి రూ.7లక్షల కోట్ల అప్పు ఉందని చెప్పడం తగదన్నారు. పదవిపై మోజుతో ప్రభుత్వానికి ఉన్న అప్పుల లెక్కలు బహిర్గతం చేయడంలో ఉప ముఖ్యమంత్రి తప్పుదోవ పట్టిస్తున్నారన్న అనుమానం కలుగుతోందన్నారు. 11 నెలల్లో రేవంత్ సర్కార్ లక్ష కోట్లకు పైగా అప్పుచేసిందని.. గత 60 ఏళ్లలో రాష్ట్రం చేసిన అప్పుని ఏడాదిలోపే చేశారని పేర్కొన్నారు. ఒక్క ప్రాజెక్టు కట్టలేదని, హామీలు అమలు చేయలేదని, ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదని.. మరి లక్ష కోట్లు ఎక్కడికెళ్లాయని ప్రశ్నించారు. తీసుకున్న అప్పులపై సీఎం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రైజింగ్ అంటూ రేవంత్‌రెడ్డి కొత్త నాటకానికి తెరలేపారని.. అసలు రైజింగ్ ఈ రాష్ట్రం కాదని.. ఎనుముల బ్రదర్స్ రైజింగ్ అని అన్నారు. 11 నెలల్లోనే రాష్ట్రానికి రూ.వెయ్యి కోట్లు ఖర్చుపెట్టే స్థాయికి ఎదిగిన సీఎం సోదరుల ఆస్తులు భవిష్యత్తులో అదానీని దాటిపోయినా ఆశ్చర్యం లేదన్నారు. గురుకులాలు నిర్వహించలేని చేతగానితనానికి సీఎం సిగ్గుపడాలని, గురుకులాల సమస్యలు తెలుసుకునేందుకు వెళ్లే తమపార్టీ నేతలపై, తనపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఒక్క మంచిపని కూడా చేయకుండా విజయోత్సవాలు ఎందుకు చేస్తున్నారని నిలదీశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఎవరు చనిపోయిన అది ప్రభుత్వం చేసిన హత్యేనని పేర్కొన్నారు. కాళేశ్వరం లేకుండా రికార్డు స్థాయిలో పంటలు పండించామంటున్న కాంగ్రెస్ 2014కు ముందు ఎందుకు పంటలు పండించలేదని ప్రశ్నించారు. కొడంగల్‌కు అదానీ వస్తాడా? అల్లుడి పరిశ్రమ వస్తుందా? తెలియకుండానే భూసేకరణ ఎందుకు చేస్తున్నారో చెప్పాలన్నారు. రియల్ ఎస్టేట్ తప్ప ఏమీ తెలియని సీఎం రేవంత్‌రెడ్డి.. నియంతలా పాలనచేస్తూ.. ఉన్నసిటీని నాశనం చేస్తున్నారని, ఫోర్త్‌సిటీ ఏర్పడితే ఇప్పుడు నడుస్తున్న ఎస్ఆర్డీపీ నాశనమవుతుందన్నారు. వాటర్ వర్క్స్ పనులన్నీ ఇప్పటికే ఆగిపోయాయని చెప్పారు. హైదరాబాద్ నగరం ఈ స్థాయికి రావడానికి 400 ఏళ్లు పట్టిందని.. రేవంత్ అనాలోచిత చర్యలతో ప్రతిష్ఠను కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. కేవలం భూసేకరణ ద్వారానే ఒక నగరాన్ని నిర్మించ డం సాధ్యం కాదన్న విషయాన్ని గుర్తించాలన్నారు. రేవంత్‌రెడ్డి కుటుంబానికి 500 ఎకరాల కోసమే భూసేకరణ చేపట్టారని.. కొండారెడ్డిపల్లిలో, వెల్దండలో ఉన్న 400 ఎకరాల భూమిని ఫోర్త్‌సిటీకి ఇస్తారా? లేదా? చెప్పాలని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, కేసీఆర్‌కు గాయం, కవిత అరెస్ట్ సహా.. ఏడాదిగా అనేక ఆటుపోట్లు ఎదుర్కొంటున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని ప్రశ్నిస్తే కాంగ్రెస్ సర్కార్ పెడుతున్న అక్రమ కేసులను సైతం తట్టుకొని నిలబడ్డామన్నారు. కేసీఆర్ నాయకత్వంలో మరో నాలుగేళ్ల పోరాటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. 2లక్షల ఉద్యోగాల హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ బండారం త్వరలోనే బయటపెడతానని, ఇదే అంశంపై రాహుల్ గాంధీకి లేఖ రాస్తానని కేటీఆర్ వెల్లడించారు.

కేసీఆర్ దీక్షాదివస్ పేరిట పుస్తక ప్రదర్శన

మూర్తీభవించిన స్త్రీగా తెలంగాణ తల్లిని కేసీఆర్ రూపొందించారని.. ఆయనపై ఉన్న కోపంతో తెలంగాణ తల్లి రూపాన్ని మార్చొద్దని, అలా చేస్తే చరిత్ర క్షమించదని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్ర, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేసిన కృషిపై పలువురు రచయితలు రాసిన పుస్తకాలను కేసీఆర్ దీక్షాదివస్ పేరిట బుధవారం తెలంగాణ భవన్‌లో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఉద్యమ నేపథ్యంతో పుస్తకాలను తేవాలని, ఉన్న పుస్తకాలను సమీకరించాలన్న సాహితీవేత్తల ఆకాంక్ష మేరకు ఆ బాధ్యతను స్వయంగా తీసుకుంటానన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని.. నాడు ఇందిరాగాంధీ ప్రతిష్ఠించిన భరతమాత రూపాన్ని వాజ్‌పేయి అధికారంలోకి రాగానే మార్చలేదన్నారు. దేశంలో ఎన్నోచోట్ల అధికార మార్పిడి జరిగిందని, తెలుగు తల్లి విగ్రహ రూపం మారలేదని, కన్నడమాత విగ్రహం రూపు కూడా మారలేదని, కానీ.. సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్ మీద కోపంతో తెలంగాణ తల్లి రూపాన్ని మార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఈ ప్రయత్నాన్ని విరమించుకోవాలన్నారు. నాలుగేళ్ల తర్వాత రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టిన స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు.



తరగతి గదిలో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

సక్రమంగా రారు.. పాఠాలు సరిగ్గా చెప్పరు!

» బాసర ట్రిపుల్ ఐటీలో కొందరు అధ్యాపకుల తీరిది

» ఫ్యాకల్టీలో దాదాపు 90% మంది కాంట్రాక్టు, గెస్ట్ లెక్చరర్లే..

» ఆందోళనలో విద్యార్థులు.. అధికారులకు ఫిర్యాదులు

బాసర, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో కొందరు అధ్యాపకుల తీరుతో విద్యార్థులు తలలు పట్టుకుంటున్నారు. తరగతులకు సక్రమంగా రాకపోవడం.. హడావుడిగా సిలబస్ పూర్తి చేస్తుండటంతో.. పరీక్షల్లో తప్పుతున్న వారు కొందరైతే.. పాస్ మార్కులతో సరిపెట్టుకుంటున్న వారు మరికొందరు.. వర్సిటీ ఫ్యాకల్టీలో దాదాపు 90 శాతం ఉన్న కాంట్రాక్టు, గెస్ట్ లెక్చరర్లే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే కొందరు అధ్యాపకులపై విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. పాఠాలు బాగా చెప్పడం లేదంటూ యూనివర్సిటీ అధికారుల దృష్టికి తీసుకొస్తున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. కొందరు అధ్యాపకులైతే వారం రోజుల్లో చెప్పాల్సిన సిలబ్‌ను ఒకటి, రెండు రోజుల్లోనే పూర్తి చేస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. కొందరు అధ్యాపకులకు అసలు సబ్జెక్టు మీద అవగాహన ఉండడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఆరోపిస్తున్నారు.

రెగ్యులర్ అధ్యాపకులు 15 మందే..

టెన్త్‌లో రాష్ట్ర స్థాయిలో మంచి మార్కులు సాధించి.. సీటు తెచ్చుకున్న విద్యార్థులే ట్రిపుల్ ఐటీలో ఉన్నారు. అంత ప్రతిభ ఉన్నా పరీక్షల్లో ఫెయిల్ అవుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఒకప్పుడు ఎంతో పేరు ప్రతిష్ఠలు సంపాదించుకున్న విద్యాసంస్థలో ఇప్పుడు నాణ్యమైన విద్య కోసం వెతుక్కోవాల్సి వస్తోంది. వర్సిటీలోని 250 అధ్యాపక పోస్టులకు ప్రస్తుతమున్నది 160 మంది మాత్రమే.. అందులోనూ 15 మంది రెగ్యులర్ అధ్యాపకులు కాగా.. మిగిలిన వారంతా కాంట్రాక్టు, గెస్ట్ లెక్చరర్లే.. దీంతో ప్రతి సంవత్సరం కొందరు ఇతర అవకాశాలు చూసుకుని వెళ్లిపోతుంటారు. అదే సమయంలో కొత్త నియామకాలు జరగకపోవడం, ఖాళీల భర్తీ కాకపోవడంతో విద్యార్థుల చదువులపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇటీవలే ఇంటర్, డిగ్రీ కళాశాల లెక్చరర్లుగా ఎంపికై.. ఇక్కడ పనిచేసే 50 మంది వరకు సిబ్బంది వెళ్లిపోయారు. వెరసి.. గతంతో పోల్చితే వర్సిటీలో ఫెయిల్ అయ్యే విద్యార్థుల శాతం ఎక్కువగా ఉంటోంది. పీయూసీ, ఇంజనీరింగ్‌లో 20 నుంచి 35 శాతం వరకు విద్యార్థులు పరీక్షల్లో ఫెయిల్ అవుతున్నారు. మరోవైపు.. ఈ పరిస్థితులే విద్యార్థుల్లో మానసిక ఒత్తిడికి దారి తీస్తున్నాయి. టెన్త్ వరకు ఎంతో ప్రతిభ చూపిన వారు ఇక్కడ పరీక్షల్లో తప్పుతుండటం.. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రుల్లోనూ ఆందోళనకు కారణమవుతోంది.

అధ్యాపకులకు శిక్షణ ఇస్తాం..

విద్యా బోధనలో సమస్యలున్నాయి. విద్యార్థుల నుంచి కొన్ని అభ్యంతరాలు వస్తున్నాయి. అధ్యాపకులకు విద్యా బోధనలో మెలకువలు నేర్పించేలా శిక్షణ కార్యక్రమాన్ని త్వరలో ఏర్పాటు చేస్తాం. గ్రామీణ ప్రాంతం కాబట్టి ఫ్యాకల్టీని సమకూర్చుకోవడానికి ఇబ్బందులున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం వరకు ఎలాంటి లోపాలు లేకుండా చూస్తాం.

- ప్రొఫెసర్ గోవర్ధన్, ఆర్జీయూకేటీ వైస్ చాన్స్‌లర్

ఏసీబీకి చిక్కిన మార్కెటింగ్ ఏడీ

» 7 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత



పట్టుబడ్డ ఏడీ శ్రీనివాస్

నిర్మల్ / ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) రూ.7 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు బుధవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఓ జిన్నింగ్ మిల్లులో దడ్వాయిగా పని చేస్తున్న కుమ్మరి వెంకటేశ్ తన లైసెన్స్ రెన్యువల్ కోసం ఇటీవల ఏడీ శ్రీనివాస్‌ను సంప్రదించాడు. ఇందుకు రూ. 10 వేల లంచం ఇవ్వాలని వెంకటేశ్‌ను ఏడీ డిమాండ్ చేశారు. చివరకు ఇద్దరి మధ్య రూ.7 వేలకు ఒప్పందం కుదిరింది. అయితే లంచం ఇవ్వడం ఇష్టం లేని వెంకటేశ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ముందస్తు ప్రణాళికలో భాగంగా బుధవారం వెంకటేశ్ నుంచి ఏడీ శ్రీనివాస్ రూ.7 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ అధికారులు ఏకకాలంలో నిర్మల్‌తో పాటు ఆదిలాబాద్‌లోని ఏడీ శ్రీనివాస్ ఇంట్లో కూడా సోదాలు జరిపారు.

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కొడుకు రాహిల్‌కు ఎదురుదెబ్బ

» విచారణ ఎదుర్కోవాల్సిందేనని హైకోర్టు స్పష్టీకరణ

హైదరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కొడుకు మహమ్మద్ రాహిల్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ తన బీఎండబ్ల్యూ కారుతో ప్రజాభవన్ వద్ద బారికేడ్లను ఢీకొట్టిన కేసులో విచారణ ఎదుర్కోవాల్సిందేనని బుధవారం హైకోర్టు స్పష్టంచేసింది. బారికేడ్లను ఢీకొట్టిన వ్యవహారంలో పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసును.. ఆ తర్వాత దాఖలు చేసిన చార్జిషీట్‌ను కొట్టేయాలని పేర్కొంటూ రాహిల్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం.. సదరు పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. ఈ మేరకు నిందితుడి గుర్తింపును నిరూపించే క్రమంలో పోలీసులు దర్యాప్తులో భాగంగా చేపట్టే టెస్ట్ ఐడెంటిఫికేషన్ పరేడ్ (టీప్) పరీక్షకు హాజరుకావాల్సిందేనని.. విదేశాల్లో ఉన్నా రావాల్సిందేనని స్పష్టంచేసింది. దర్యాప్తునకు హాజరుకావడంతోపాటు క్రిమినల్ ప్రొసీడింగ్స్‌కు సహకరించాలని పేర్కొంది.

యూత్ కాంగ్రెస్ ఫలితాలు విడుదల

» ముందంజలో జక్కిడి శివచరణ్‌రెడ్డి



హైదరాబాద్, డిసెంబరు 4: తెలంగాణ యూత్ కాంగ్రెస్ ఎన్నికల ఫలితాలను అఖిల భారత యూత్ కాంగ్రెస్ బుధవారం ప్రకటించింది. ఈ ఎన్నికల్లో ముఖ్యంగా... జక్కిడి శివచరణ్‌రెడ్డి, బల్మూరి వెంకట్, మిట్టపల్లి వెంకటేశ్ ఈ ముగ్గురు మధ్యే తీవ్ర పోటీ నెలకొంది. ఫలితాల్లో శివచరణ్‌రెడ్డికి 3,68,581ఓట్లు రాగా, బల్మూరి వెంకట్‌కు 1,52,466ఓట్లు, అలాగే మిట్టపల్లి వెంకటేశ్‌కు 63,972ఓట్లు వచ్చాయి. పార్టీ నిబంధనల ప్రకారం ఈ ముగ్గురికి ఇంటర్వ్యూ నిర్వహించిన అనంతరం ఒకరిని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎంపిక చేస్తారు. అయితే తాను పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు బల్మూరి వెంకట్ కొద్దిరోజుల క్రితమే ప్రకటించారు. దీంతో శివచరణ్‌రెడ్డి ఎంపిక లాంఛనమే కానుంది.

యూపీ గ్యాంగ్‌స్టర్స్ చట్టం క్రూరంగా ఉన్నట్లనిపిస్తోంది

» ఆ చట్టాన్ని సమీక్షించాల్సిన అవసరం ఉంది: సుప్రీం

న్యూఢిల్లీ, డిసెంబరు 4: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో అమల్లో ఉన్న 'గ్యాంగ్‌స్టర్లు, సంఘ విద్రోహక చర్యల నివారణ చట్టం-1986' క్రూరంగా ఉన్నట్టు అనిపిస్తోందని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. దీన్ని సమీక్షించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఈ చట్టం కింద తనపై నమోదైన కేసులో విచారణను నిలిపివేయాలంటూ ఓ వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. అతని పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. గంగా నదిలో ఇసుకను తవ్వినందుకు గ్యాంగ్‌స్టర్ చట్టం కింద కేసు నమోదు చేశారని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీంతో, పిటిషనర్‌పై గ్యాంగ్‌స్టర్స్ చట్టం ప్రకారం ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ధర్మాసనం మధ్యంతర ఆదేశాలిచ్చింది. కాగా, ఈ చట్టం రాజ్యాంగబద్ధత పైన కూడా పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను నవంబరు 29నే సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. దీనిపై ఇప్పటికే యూపీ ప్రభుత్వం నుంచి స్పందనను కోరింది.

రాజకీయ దురుద్దేశం, కుట్రపూరితంగా నాపై కేసులు

» పంజాగుట్ట పీఎస్‌లో నమోదైన కేసు కొట్టేయండి

» హైకోర్టులో హరీశ్‌రావు క్వాష్ పిటిషన్

హైదరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో తనకు ఉన్న ఇమేజ్‌ను దెబ్బతీసే రాజకీయ దురుద్దేశం, కుట్రపూరితంగా తనపై కేసులు పెడుతున్నారని.. పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 1న తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు హైకోర్టులో బుధవారం క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. తనపై పోటీ చేసి ఓడిపోయిన చక్రధర్‌గౌడ్.. తప్పుడు, ఎలాంటి ఆధారాలులేకుండా చేస్తున్న ఆరోపణల ఆధారంగా కేసు నమోదు చేయడం చెల్లదని పేర్కొన్నారు. హరీశ్‌రావు తన ఫోన్ ట్యాపింగ్ చేయించారని, తాను చేపట్టే సామాజిక కార్యక్రమాలు చూసి ఓర్వలేక పలు క్రిమినల్ కేసుల్లో ఇరికించారని.. ఆయన ఆదేశాలమేరకు మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు తనను బెదిరించారంటూ చక్రధర్‌గౌడ్ చేసిన ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసును కొట్టేయడంతోపాటు తుది తీర్పు ఇచ్చేవరకు ఈ కేసులో పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టకుండా అరెస్ట్ సహా అన్ని ప్రొసీడింగ్స్‌పై స్టే ఇవ్వాలని హరీశ్‌రావు హైకోర్టును ఆశ్రయించారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో తనపై పోటీచేసి ఓడిపోయిన ఫిర్యాదుదారు (చక్రధర్‌గౌడ్) తన ఓటమిని జీర్ణించుకోలేక ఎలక్షన్ పిటిషన్ సహా పలు పిటిషన్‌లు దాఖలు చేశారని.. ఫోన్‌ట్యాపింగ్ చేశారంటూ హైకోర్టులో పిటిషన్ వేసి దానిని ఉపసంహరించుకున్నారని హరీశ్‌రావు తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఏడుసార్లు విజయం సాధించడమేకాకుండా అనేక శాఖలకు మంత్రిగా పనిచేశానని.. 2023లో జరిగిన ఎన్నికల్లో 20 మంది అభ్యర్థులు పోటీచేసినప్పటికీ 83 వేల మెజార్టీతో గెలుపొందినట్లు తెలిపారు. పోలీసులు ఎలాంటి విచక్షణ ప్రదర్శించకుండా, ప్రాథమిక విచారణ చేపట్టకుండా తప్పుడు ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేయడం చెల్లదని.. ఎఫ్ఐఆర్‌లో ఉన్న ఒక్క సెక్షన్ కూడా తనకు వర్తించదని పేర్కొన్నారు. ఫిర్యాదు మొత్తం వండి వార్చిన తప్పుడు కథనమని ఆరోపించారు. ఈ మేరకు తనపై నమోదైన కేసును కొట్టేయాలని కోరారు. ఈ పిటిషన్ త్వరలో హైకోర్టు సింగిల్ జడ్జి ఎదుట విచారణకు వచ్చే అవకాశం ఉంది.

హిందువులంతా ఏకమై ఉద్యమించాలి

» బంగ్లాలో హిందువులపై నరమేధాన్ని ఆపాలి

» స్వామి చిన్మయి కృష్ణదాస్‌ను విడుదల చేయాలి

» సంఘీభావ సభలో పలువురు వక్తల డిమాండ్



మాట్లాడుతున్న శ్రీ దేవనాథ జీయర్ స్వామి

కవాడిగూడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువుల రక్షణ కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులంతా పోరాటం చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌లో ఇస్లామిక్ మతోన్మాదశక్తులు మైనార్టీ ప్రజలైన హిందువులను లక్ష్యంగా చేసుకొని దాడులు చేయడం దారుణమన్నారు. దా డులను నిరోధించడంలో అక్కడి ప్రభు త్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాం డ్ చేస్తూ బుధవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో సంఘీభావ సభ నిర్వహించారు. ఈ సభకు ఉన్న హిందూ ఐక్యవేదిక నాయకులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి, ఆర్ఎస్ఎస్ నేతలు, వివిధ పీఠాల స్వామీజీలు హాజరై మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా చినజీయర్ స్వామి ఆశ్రమ ఉత్తరాధికారి దేవనాథ జీయర్ స్వామి మాట్లాడుతూ... హిందువులు, ఇతర మైనార్టీ వర్గాల రక్షణ కోసం బంగ్లా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, వెంటనే ఇస్కాన్ స్వామిజీ చిన్మయి కృష్ణదాస్‌ను బేషరతుగా విడుదల చేయాలని కోరారు. లేనిపక్షంలో ప్రపంచ వేదికలపై బంగ్లాదేశ్‌ను దోషిని నిలబెడతామని హెచ్చరించారు. ప్రపంచంలో భారత్ ఒక్కటే సెక్యులర్ దేశమన్నారు. హిందువుల సహనాన్ని చేతకాని తనంగా తీసుకొని దాడులు చేస్తామంటే ప్రతిదాడులు తప్పవన్నారు. ఆర్ఎస్ఎస్ జాతీయ కమిటీ సభ్యులు బాగయ్య మాట్లాడుతూ... బంగ్లాదేశ్ ఒకప్పుడు అఖండ భారత్‌లో భాగమేనని, అక్కడ హిందువులపై నరమేధం జరగడం దారుణమన్నారు. అంతర్జాతీయస్థాయిలో ఆ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి హిందువుల రక్షణ కోసం కృషి చేయాలని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.


కౌలు రైతు సమస్యల పరిష్కారం ఎప్పుడు?

» గత, ప్రస్తుత సర్కార్లకు తేడా లేదు: ప్రొఫెసర్ హరగోపాల్

» 6 గ్యారెంటీల్లో హామీ ఇచ్చారు.. అధికారంలోకి వచ్చి ఏడాదైంది

» కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నించాల్సి వస్తోంది: కే శ్రీనివాస్

» ఇందిరా పార్కు వద్ద కౌలురైతుల సమస్యలపై ప్రజాదర్బార్ నిర్వహణ



మాట్లాడుతున్న ప్రొ. హరగోపాల్

కవాడిగూడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన విధంగా రైతులతో పాటు కౌలు రైతులకు అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. బుధవారం సంయుక్త కిసాన్ మోర్చా, వ్యవసాయ కార్మిక, కైలురైతు సంఘాల ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ నిర్వహించారు ఈ సందర్భంగా కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రతినిధులు అడిగి తెలుసుకున్నారు. ఈ ధర్నాలో మహిళా రైతుల హక్కుల జాతీయ వేదిక కన్వీనర్ రుక్మిణి, ప్రొఫెసర్ జి హరగోపాల్, ఆంధ్రజ్యోతి మాజీ ఎడిటర్ కె శ్రీనివాస్, వివిధ సంఘాల నేతలు పశ్య పద్మ, టి సాగర్, సామాజిక కార్యకర్త వి రుక్మిణి రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన కౌలు రైతులు తమ సమస్యలను జ్యూరీ సభ్యులకు వివరించారు. గతంఒ బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి తేడా లేకుండా పోయిందని ప్రొఫెసర్ హరగోపాల్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్నప్పటికీ కౌలు రైతుల సమస్యలను పరిష్కరించకపోవడం సరికాదన్నారు. కౌలు రైతులను గుర్తించడానికి 2011లో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ అధీకృత సాగుదారుల చట్టాన్ని అమలు చేయాలని మహిళా కిసాన్ అధికార మంచ్ జాతీయ నాయకులు డాక్టర్ రుక్మిణి రావు అన్నారు. 22 లక్షల మంది కౌలు రైతులు తెలంగాణాలో ఉన్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని, రాహుల్ గాంధీ కూడా కౌలు రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని సీనియర్ సంపాదకులు కే శ్రీనివాస్ అన్నారు. ఆరు గ్యారెంటీల్లో కౌలు రైతులను కూడా చేర్చినప్పటికీ వారి సమస్యలను పరిష్కరించకపోవడంతో ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నించాల్సి వస్తుందని అన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కాల్పులు - ప్రశ్నలు

స్వర్ణదేవాలయ ప్రాంగణంలో పంజాబ్ మాజీ ఉపముఖ్యమంత్రి సుఖ్‌బీర్‌సింగ్ బాదల్ పైన జరిగిన హత్యాయత్నం దేశాన్ని నివ్వెరపరిచింది. ఘటనతో పాటు ఆ దారుణానికి ఒడిగట్టిన వ్యక్తి పుట్టుపూర్వోత్తరాలు కూడా నిర్ఘాంతపరుస్తున్నాయి. 2007–17 మధ్యకాలంలో శిరోమణీ అకాలీదళ్ నేతలు చేసిన పాపాలకు సిక్కుల అత్యున్నత మతపీఠం అకాల్‌తఖ్త్ సాహెబ్ శిక్షలు విధించిన సంగతి తెలిసిందే. అప్పట్లో అధికారాలు వెలగబెట్టినవారంతా ఇప్పుడు శిక్షలో భాగంగా స్వర్ణదేవాలయ ప్రాంగణంలో గిన్నెలు తోమడం, కంచాలు కడగడం, మూత్రశాలలు శుభ్రపరచడం వంటి సేవలు అందించి పాపప్రక్షాళన చేసుకుంటున్నారు. మతద్రోహానికీ, దుష్ప్రవర్తనకు పాల్పడిన దోషి (తంఖయ)గా ఆగస్టులోనే ఆకాల్‌తఖ్త్ ముద్రను పొంది, ఇప్పుడు శిక్షలు ఖరారైన సుఖ్‌బీర్‌సైతం ఇదేవిధమైన సేవలు అందించాల్సి ఉండగా, వార్ధక్యం, వైకల్యం దృష్ట్యా ఆయనకు కొన్ని మినహాయింపులు దక్కాయి. నేను పాపిని, క్షమించండి అన్న బోర్డు ఒకటి మెడలో వేసుకొని, కట్టుకట్టిన కాలుని చాపుకొని, సేవాదార్‌గా స్వర్ణదేవాలయం ముందు వీల్‌చైర్లో వాలుగా కూచున్న ఈ అరుపదుల వృద్ధుడిని చూసి ఎంతమంది పంజాబీలు జాలిపడ్డారో తెలియదుకానీ, ఈ హత్యాయత్నం ఘటన మాత్రం ఆయనకూ, ఆయన పార్టీకీ రాజకీయంగా మేలుచేస్తుందని విశ్లేషకుల నమ్మకం.

పంజాబ్‌మీద దాదాపు నాలుగుదశాబ్దాలు సంపూర్ణ ఆధిపత్యం చెలాయించిన బాదల్ కుటుంబాన్ని మీడియా ఒకదశలో ఫస్ట్‌ఫ్యామిలీ ఆఫ్ పంజాబ్ అని ప్రస్తావించిన విషయం, పంజాబ్‌ను ఖలిస్తాన్ ఉద్యమం ఊపేస్తున్న కాలంలో ప్రకాశ్‌సింగ్ బాదల్ విశేష భూమిక తెలియనివేమీ కావు. పార్టీని, రాష్ట్రాన్ని కుమారుడికి తదనంతరం అందించేందుకు సీనియర్ బాదల్ చాలామంది సీనియర్లను తెలివిగా బయటకు నెట్టేశారు. కెప్టెన్ అమరీందర్‌సింగ్ కాంగ్రెస్‌లో చేరి ఆ తరువాత బదులు తీర్చుకున్నారు కూడా. బీజేపీతో పొత్తుపెట్టుకొని, 2007, 2012 ఎన్నికలను వరుసగా నెగ్గుకొచ్చి, కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ కీలకపదవులు అందుకున్న పార్టీ ఆ తరువాత క్రమంగా తన ప్రాభవాన్ని కోల్పోయింది. కుటుంబం మీద వచ్చిన అవినీతి ఆరోపణలు, వ్యవసాయ సంక్షోభాలు, యువతను ముంచేసిన మాదకద్రవ్యాల వినియోగం ఇత్యాదివి ఆ పార్టీని, కుటుంబాన్ని ప్రజలకు దూరం చేశాయి. మరీముఖ్యంగా, ఇప్పుడు వీరంతా శిక్షలు అనుభవిస్తున్న మతవిద్రోహం ఘటనలన్నీ ఒక్కటొక్కటిగా మెడకు చుట్టుకున్నాయి. 2012లో సుఖ్‌బీర్ నేతృత్వంలో రెండోసారి కూడా అధికారంలోకి రాగలిగిన శిరోమణీ అకాలీదళ్ మరుసటి ఎన్నికల్లో కాంగ్రెస్ దెబ్బకు కుప్పకూలిపోయింది. పార్టీ బలహీనంగా ఉన్న ఆ తరుణంలో, మూడువ్యవసాయ చట్టాలు తెచ్చి బీజేపీ తన మిత్రపక్షంమీద మరింతగా కోలుకోలేనంత దెబ్బకొట్టింది. కాంగ్రెస్‌నుంచి అధికారం కొత్తగా ఎన్నికలక్షేత్రంలోకి ప్రవేశించిన ఆమ్ ఆద్మీ పార్టీ చేతుల్లోకి వెళ్ళిపోవడంతో సుఖ్‌బీర్ సింగ్ పార్టీ గతనెలలో జరిగిన ఉపఎన్నికల్లో నాలుగు అసెంబ్లీ స్థానాల్లోనూ అభ్యర్థులను నిలబెట్టలేనిస్థితికి జారుకుంది. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో సుఖ్‌బీర్ భార్య తప్ప మరెవ్వరూ ఆ పార్టీనుంచి గెలవలేదు. ఈ నేపథ్యంలోనే, జూలైలో అసమ్మతివర్గం సుఖ్‌బీర్ పాపాల చిట్టాను అకాల్‌తఖ్త్‌కు అందించి, పార్టీ ప్రక్షాళనకు ఆదేశించాల్సిందిగా కోరినట్టు వార్తలు వచ్చాయి. శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ (ఎస్జీపీసీ)లో అకాలీదళ్ ఆధిపత్యం ఉన్నందున, బాదల్‌కు వ్యతిరేకంగా వ్యవహరించడానికి అకాల్‌తఖ్త్ వెనకడుగువేస్తున్నదన్న విమర్శ ఎప్పటినుంచో ఉన్నది. ఇప్పుడు సుఖ్‌బీర్ సహా మరికొందరికి శిక్షలు వేయడం, పార్టీని ప్రక్షాళించమంటూ కొన్ని చర్యలు నిర్దేశించడం పార్టీకే కాక, ఆయనకు కూడా మేలు చేస్తుందని విశ్లేషకుల అభిప్రాయం. పంజాబ్, పంజాబీలు, పంజాబియత్ కోసం నిలబడిన పార్టీగా అకాలీదళ్‌ను పునరుద్ధరించుకోవడానికి సుఖ్‌బీర్‌కు ఇది అవకాశం ఇస్తుందని, ఎంతచీలినా, ఎందరు పోయినా ఆయన స్థాయి వారెవ్వరూ లేరని అంటారు. అకాల్‌తఖ్త్‌ముందు శిరస్సు వంచి, అన్ని తప్పులనూ అంగీకరించి, వేసిన శిక్షలన్నీ అనుభవించి, గురుద్వారా ద్వారాలముందు కావలికాస్తున్న ఆ దృశ్యం ప్రజల ఆగ్రహాన్ని ఉపశమింపచేయవచ్చు. బబ్బర్‌ఖల్సాకు చెందిన ఒక మాజీ మిలిటెంట్ ఏకంగా ఆయనపై హత్యాయత్నానికి ఒడిగట్టడం దీనికి అదనంగా పనిచేయవచ్చు. రాష్ట్ర ప్రజలు పార్టీని తిరిగి ఆదరిస్తారా లేదా అన్నది అటుంచితే, సుఖ్‌బీర్ నాయకత్వాన్ని పార్టీలో ఎందరు కోరుతున్నారో ముందుగానే సంస్థాగత ఎన్నికల్లో తేలిపోతుంది.

రాజ్యాంగ విలువలకు పట్టంగట్టిన తీర్పు!



దేశంలో 75వ రాజ్యాంగ దినోత్సవ సందర్భాన భారత రాజ్యాంగ పీఠికలో సోషలిజం (సామ్యవాదం), సెక్యులరిజం (లౌకికవాదం) అంతర్భాగమని పునరుద్ఘాటిస్తూ సుప్రీంకోర్టు కీలక మైలురాయి లాంటి తీర్పు వెలువరించింది. రాజ్యాంగ పీఠికలో ఈ సూత్రాలు ఉండటాన్ని సవాల్ చేస్తూ డాక్టర్ బల్‌రాం సింగ్‌తో పాటు ఇతరులు దాఖలు చేసిన పిటిషన్లను దేశ సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం కొట్టివేయడం విశేషం. ఈ పిటిషన్‌దారుల్లో బీజేపీ సీనియర్ నేత సుబ్రమణ్యన్‌స్వామి కూడా ఒకరు కావడం గమనార్హం. సుప్రీంకోర్టు వెలువరించిన ఈ తీర్పు రాజ్యాంగ మౌలిక సూత్రాలు, విలువలను తెలియజేస్తున్నది. అంతేకాదు, భారతదేశపు ప్రజాస్వామ్య, భిన్నత్వంలో ఏకత్వం, సమ్మిళితత్వాన్ని రూపొందించడంలో వాటి ప్రాధాన్యాన్ని ఈ తీర్పు నొక్కిచెప్తున్నది.

42వ రాజ్యాంగ సవరణ ద్వారా భారత రాజ్యాంగ పీఠికలో సామ్యవాదం, లౌకికవాదం అనే సూత్రాలను చేర్చారు. ఇది భారత రాజ్యాంగ చరిత్రలో చరిత్రాత్మక ఘటన. మన దేశం రాజకీయ, ఆర్థిక సవాళ్లు ఎదుర్కొంటున్న సమయంలో ప్రవేశపెట్టిన ఈ సూత్రాలు దేశానికి స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచి కట్టుబడి ఉన్న ఆదర్శాలకు, నిబద్ధతలకు ప్రతీకలు. ఈ సూత్రాలు రాజ్యాంగ పీఠికలో చేర్పులు మాత్రమే కాదు, భారతీయ నైతిక విలువలు, రాజకీయపరమైన చర్చల్లో లోతుగా పాతుకుపోయిన విలువలకు అధికారిక ఆమోద ముద్ర అని ఘంటాపథంగా చెప్పవచ్చు.

ఆర్టికల్ 368 ప్రకారం రాజ్యాంగ పీఠికతో సహ రాజ్యాంగాన్ని సవరించే హక్కు నిస్సందేహంగా పార్లమెంట్‌కు ఉన్నదని సుప్రీంకోర్టు ఈ కేసు విచారణ సందర్భంగా పేర్కొన్నది. అయితే, ఈ సూత్రాలు రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని ఉల్లంఘించాయని లేదా అసలు ఉద్దేశాన్ని అవి వక్రీకరించాయనే వాదనను ఉన్నత న్యాయస్థానం కొట్టిపారేసింది. అంతేకాదు, ఆర్టికల్స్ 14, 15, 16, 25-30 సమానత్వం, వివక్ష లేకపోవడాన్ని, మత స్వేచ్ఛను కల్పిస్తున్నట్టే లౌకికవాదం అనేది అన్ని మతాలను సమానంగా గౌరవిస్తుందని న్యాయస్థానం నొక్కిచెప్పింది. అలాగే దేశంలో ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల పెట్టుబడులను అనుమతించడం ద్వారా మిశ్రమ ఆర్థిక నమూనాతో సామాజిక, ఆర్థిక న్యాయం పట్ల దేశం నిబద్ధతను సామ్యవాదం ప్రతిబింబిస్తుంది. ఎమర్జెన్సీ సమయంలో తీసుకొచ్చిన 42వ రాజ్యాంగ సవరణ చట్టబద్ధతపై తలెత్తుతున్న ఆందోళనలను కూడా సుప్రీంకోర్టు కొట్టిపారేసింది. ఆ తర్వాత 44వ రాజ్యాంగ సవరణ సందర్భంగా పార్లమెంట్‌లో జరిగిన చర్చలో ఈ సూత్రాలను పునరుద్ఘాటించినట్టు న్యాయస్థానం గుర్తుచేసింది. సామ్యవాదం, లౌకికవాదం అనే సూత్రాలు భారత రాజ్యాంగ నైతిక విలువల్లో లోతుగా పాతుకుపోయాయనీ, అవి భారత రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంలో అంతర్భాగమని కోర్టు చెప్పింది. 'మనమంతా భారతీయ ప్రజలం' అనే ఆకాంక్షలను ప్రతిబింబించేలా పీఠికను సజీవ సాక్ష్యంగా న్యాయవ్యవస్థ గుర్తించిందని చెప్పడానికి ఈ తీర్పు తార్కాణం.

లౌకికవాదం, సామ్యవాద సూత్రాలను పలుచన చేసే ప్రయత్నాలు ఆమోదయోగ్యం కావంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు శక్తిమంతమైన సందేశాన్ని ఇస్తున్నది. ఈ సూత్రాలు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారతదేశ ప్రయాణాన్ని రూపొందించాయి. సామాజిక సంక్షేమం, మత సామరస్యానికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా అవి సమగ్రతను, పురోగతిని ప్రోత్సహించే ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించడంలో కీలకపాత్ర పోషించాయి. అందువల్ల ఈ తీర్పు చట్టపరమైన మైలురాయి మాత్రమే కాదు, రాజ్యాంగ విలువలకు భారతదేశ నిబద్ధతను కూడా తెలియజేస్తున్నది.



భారత రాజకీయ, ఆర్థిక, విధానపరమైన నిర్ణయాలు, చర్చల్లో సామ్యవాదం కీలకపాత్ర పోషిస్తున్నది. ఈ సూత్రాన్ని మన దేశం అవలంబించిన నాటి నుంచి సమకాలీన సంక్షేమ విధానాల అమలులో సామ్యవాదం మార్గనిర్దేశక శక్తిగా ఉన్నది. ముఖ్యంగా 1980లో బొంబాయి వేదికగా బీజేపీని స్థాపించినప్పుడు ఆ పార్టీ గాంధేయ సోషలిజాన్ని తమ వ్యవస్థాపక సూత్రాల్లో ఒకటిగా స్వీకరించింది. గాంధేయ సోషలిజం బీజేపీ సైద్ధాంతిక మూలస్తంభమని ఆ పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన అటల్ బిహారీ వాజపేయి విస్పష్టంగా ప్రకటించారు. సోషలిజం రాజకీయాలకతీతమని, భారత పాలనలో ఏకీకృత ఆదర్శంగా ఇది మిగిలిపోతుందని చెప్పడానికి ఇది నిదర్శనం. 1990వ దశకంలో ఆర్థిక సరళీకరణలు, సంస్కరణలు వచ్చినప్పటికీ, దేశంలోని అనేక రాజకీయ పార్టీలు సోషలిస్టు ఆదర్శాలకు కట్టుబడి ఉన్నాయి. సమాజ్‌వాదీ, ఆర్జేడీ, జేడీయూ, జేడీఎస్ వంటి ప్రాంతీయ అస్తిత్వ శక్తులు సోషలిజం పట్ల తమ నిబద్ధతను చాటుకున్నాయి. అంతేకాదు, సోషలిస్టు సూత్రాల ప్రకారం.. ఆయా పార్టీల నేతృత్వంలోని ప్రభుత్వాలు తమ సంక్షేమ విధానాలను రూపొందించి, అమలు చేశాయి కూడా.

టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ గతంలో నక్సలైట్లను దేశభక్తులుగా అభివర్ణించారు. సోషలిజం ప్రభావానికి ఇది ఒక చక్కని ఉదాహరణ. సంప్రదాయేతర నెరేటివ్‌లోనూ సోషలిజం సూక్ష్మ, విస్తృత ప్రభావానికి ఇది నిదర్శనం. ఈ సైద్ధాంతిక నిబద్ధత మన దేశంలో సంక్షేమ నమూనాకు కూడా విస్తరించింది. వనరులు, అవకాశాల సమాన పంపిణీకి ఇది ప్రాధాన్యమిస్తుంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఆహార భద్రత, పీఎం కిసాన్ యోజన, మహారాష్ట్రలో అమలవుతున్న లడ్కీ బహీన్ యోజన వంటి పథకాలు సోషలిజానికి ఆధునిక మేనిఫెస్టోలాంటివి. అసమానత్వాన్ని రూపుమాపేందుకు, సామాజిక న్యాయం చేసేందుకు సామ్యవాదమే పరిష్కార మార్గం.

ఎవరూ ఔనన్నా, కాదన్నా భిన్నత్వంలో ఏకత్వం, వైవిధ్యతలతో కూడిన భారతికి లౌకికవాద దేశమనే గుర్తింపు అనివార్యం. 2011 జనాభా లెక్కలే అందుకు నిదర్శనం. 2011 జనగణన ప్రకారం— దేశంలో 79.8 శాతం హిందువులు, 12 శాతం ముస్లింలు, 2.3 శాతం క్రైస్తవులు, 1.7 శాతం సిక్కులు, 0.7 శాతం బౌద్ధులు, 0.4 శాతం జైనులు, మిగిలిన శాతం ఇతరుల మతాలను ఆచరించేవారున్నారు. ఈ మతపరమైన బహుళత్వం 22 అధికారిక భాషలు, వందలాది మాండలికాలతో కలిపి దేశంలో సంపూర్ణంగా విస్తరించి ఉన్నది. ఇలాంటి వైవిధ్య సమాజంలో లౌకికవాదం అందరినీ ఏకం చేసే సూత్రంగా పనిచేస్తుంది. తమ విశ్వాసాన్ని స్వేచ్ఛగా ఆచరించే వ్యక్తుల హక్కులను కాపాడుతూ, దేశం అన్ని మతాలను గౌరవిస్తుందని ఇది తెలియజేస్తుంది. సామరస్యాన్ని, సమానత్వాన్ని పెంపొందించే ప్రత్యక్ష వాస్తవికతే లౌకికవాదం. విభిన్న పండుగలను కలిపి జరుపుకోవడం నుంచి పాలనలో వివిధ వర్గాల ప్రాతినిధ్యం వరకు లౌకికవాదం భారతదేశ నైతికతలో లోతుగా పాతుకుపోయింది. అయితే, మన దేశంలో లౌకికవాదం భవిష్యత్తులోనూ పరిఢవిల్లాలంటే అప్రమత్తత అవసరం. దేశంలో అక్కడక్కడ జరిగే మత విభేదాల ఘటనలు ఈ ఆదర్శ సూత్రాన్ని సవాలు చేస్తాయి. లౌకికవాదం మరింత కాలం మనుగడ సాగేందుకు పౌరసంస్థలు, రాజకీయ నాయకులు ప్రయత్నించాలి. సుప్రీంకోర్టు లౌకికవాదాన్ని పునరుద్ఘాటించడం, భిన్నత్వం మధ్య భారతదేశం ఏకత్వాన్ని కాపాడటంలో దాని పాత్రను గుర్తు చేస్తుంది.

సామ్యవాదం, లౌకికవాదం అనేవి కేవలం సాధారణ పదాలు కావని, అవి భారత రాజ్యాంగానికి ఆధారమైన ప్రాథమిక సూత్రాలని సుప్రీంకోర్టు తీర్పు తెలియజేస్తున్నది. బీజేపీ నాయకుడు సుబ్రమణ్యస్వామితో పాటు ఇతరులు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేస్తూ— ఈ విలువలు రాజ్యాంగ మౌలిక సూత్రాలైన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వానికి నకళ్ల వంటివని, అవి వాటితో సరిగ్గా సరిపోతాయని న్యాయస్థానం నొక్కి చెప్పింది. ఈ తీర్పు రాజ్యాంగ అనుకూలతను కూడా తెలియజేస్తున్నది. ఆర్టికల్ 368 ప్రకారం రాజ్యాంగాన్ని సవరించే అధికారం పార్లమెంటుకు ఉందని చెప్తూనే, 42వ రాజ్యాంగ సవరణను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టివేస్తూ, లౌకికవాదం, సామ్యవాద సూత్రాలను పలుచన చేసే ప్రయత్నాలు ఆమోదయోగ్యం కాదని న్యాయస్థానం కుండబద్దలు కొట్టి మరీ చెప్పింది. ఆర్థిక న్యాయం, సామాజిక సమానత్వం, మత సామరస్యాన్ని పెంపొందించేందుకు సామ్యవాదం, లౌకికవాదం అవసరమనే శక్తిమంతమైన సందేశాన్ని ఈ తీర్పు ఇస్తున్నది. ఈ సూత్రాలు గతానికి సంబంధించినవి మాత్రమే కావు.. శక్తివంతమైన, సమ్మిళిత ప్రజాస్వామ్యంలో కీలకమైన భాగాలు కూడా. ఈ సూత్రాలు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారతదేశ ప్రయాణాన్ని రూపొందించాయి. సామాజిక సంక్షేమం, మత సామరస్యానికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా అవి సమగ్రతను, పురోగతిని ప్రోత్సహించే ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించడంలో కీలకపాత్ర పోషించాయి. అందువల్ల ఈ తీర్పు చట్టపరమైన మైలురాయి మాత్రమే కాదు, రాజ్యాంగ విలువలకు భారతదేశ నిబద్ధతను కూడా తెలియజేస్తున్నది.

■ బోయినపల్లి వినోద్‌కుమార్
న్యాయవాది, పార్లమెంట్ మాజీ సభ్యులు

జర్నలిస్టులు ఏ విధంగా 'ఎలైట్'?

భారత రాజ్యాంగ దినోత్సవానికి ఒక్క రోజు ముందు, అంటే నవంబర్ 25వ తేదీన, దేశ సర్వోన్నత న్యాయ స్థానం వెలువరించిన తీర్పు దేశంలోని లక్షలాది మంది జర్నలిస్టులను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. ఆ తీర్పు ఉన్నత ఉద్యోగులు, భారీ జీతభత్యాలు తీసుకుని సెక్యూర్డ్ జీవితాన్ని గడిపే వారితో జర్నలిస్టులను కలిపి చూడటం ఆవేదనకు గురి చేసింది.

జర్నలిజం రంగంలో పనిచేసే వారికి బాధ్యతలు తప్ప హక్కులు లేవు. హక్కుల కంటే కూడా బాధ్యతలకే జర్నలిస్టులు సైతం ప్రాధాన్యతను ఇస్తారు. సామాజిక హక్కుల గురించి నిత్యం ప్రశ్నించే, పరితపించే జర్నలిస్టుల సంక్షేమం గురించిన పట్టింపు, సోయి ఆశించిన స్థాయిలో పాలకులకు ఉండటం లేదు. నిత్యం సంఘర్షణ, అనుదినం ప్రాణగండంగానే జర్నలిస్టులు విధి నిర్వహణ చేయాల్సి వస్తున్నది. జర్నలిస్టుల కుటుంబాల దిగజారుతున్న ఆర్థిక, జీవన స్థితిగతుల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. తెరపై మెరిసే కొందరు న్యూస్ ప్రజెంటర్ల లాగానే జర్నలిస్టులందరి జీతభత్యాలు ఉంటాయని కొందరు భ్రమించే అవకాశం లేకపోలేదు. కానీ అది నిజం కాదు. దీపం వెలుగుల కింద నలిగిపోయే, పోతున్నవారే అసంఖ్యాకంగా ఉన్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఈ ప్రస్తావన అనివార్యం అవుతున్నది.

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల విషయంలో దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పు తీవ్ర వేదనను, ఆందోళనను కలిగిస్తున్నది. సరిపడా సంపాదన లేకపోయినా తమనూ "ఎలైట్" (ఉన్నత వర్గం)గా గుర్తించడం ఏమిటనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగ భద్రత లేదు. పెన్షన్ సదుపాయం లేదు. ఆరోగ్య బీమా సదుపాయం లేదు. అస్సలు కొన్ని సందర్భాల్లో తాము పనిచేస్తున్న సంస్థలు మనుగడలో ఉంటాయో లేదో కూడా తెలియని స్థితి. ఇలాంటి వాతావరణంలో పనిచేస్తున్న వారిని ఉన్నతాధికారులతో సమానంగా ఎలా చూడగలరు? 2008లో ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉన్నతాధికారులైన కలెక్టర్లు, ఎస్పీలు, జడ్జిలు, జర్నలిస్టులకు వివిధ జీవోలను జారీ చేస్తూ వారికి భూములు కేటాయించింది. నాటి ప్రభుత్వ ధరల ప్రకారం ఆయా సొసైటీల వారు కొనుక్కున్నారు. దీనిపై కొందరు కోర్టుకు వెళ్లారు. అప్పటి నుండి ఆ కేసు అలా సాగుతూ వచ్చింది. హైకోర్టు నుంచి సుప్రీంకోర్టుకు వెళ్లింది. అది మొన్నటి వరకు అక్కడే ఉన్నది. జస్టిస్ చలమేశ్వర్ ఈ కేసు విషయంలో కొంత చొరవ తీసుకొని జర్నలిస్టులను ప్రత్యేక కోణంలో చూడాలని భావించి ఆ దిశగా కేసును ముందుకు తీసుకెళ్లారు. ఇటీవల చీఫ్ జస్టిస్‌గా పదవీ విరమణ చేసిన ఎన్వీ రమణ జర్నలిస్టులను అధికారులతో కలిపి చూడొద్దన్నారు. 90 శాతానికి పైగా జర్నలిస్టులకు రూ.50 వేలకు మించి జీతభత్యాలు ఉండే అవకాశం లేదు, కాబట్టి వారిని ఇతరులతో ముడిపెట్టడం న్యాయం కాదనే ఉద్దేశంతో ఆ కేసుతో ప్రమేయం లేకుండా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. ఇండ్లు కూడా కట్టుకోవచ్చన్నారు. జర్నలిస్టులు సంతోషించారు. అప్పటి తెలంగాణ ప్రభుత్వం, నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో ఇది సాధ్యమైందని జర్నలిస్టు సమాజం సైతం భావించింది. ప్రభుత్వం ఉచితంగా ఇవ్వలేదు, తాము డబ్బులు పెట్టి కొన్నాం కాబట్టి కోర్టు తమపై దయ తలిచిందని భావించారు. ఆనందోత్సాహాలు జరుపుకున్నారు. జేఎన్‌జే సొసైటీకి కేటాయించిన భూముల్లో నిజాంపేటలోని 32 ఎకరాలను రెవెన్యూ అధికారులు గతంలోనే స్వాధీనం కూడా చేశారు. పేట్ బషీరాబాద్‌లోని 25/1 సర్వే నంబర్‌లో గల 38 ఎకరాల స్థలాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రొసీడింగ్స్ రూపంలో సొసైటీకి స్వాధీన పరుస్తున్నట్లు చెప్పడం, రవీంద్రభారతిలో ఫంక్షన్ పెట్టి సీఎం రేవంత్‌రెడ్డి సదరు పత్రాలు ఇవ్వటంతో పుష్కర కాలానికి పైగా తమకు పట్టిన దరిద్రం పోయిందనీ త్వరలో తమ సొంత ఇంటి కల నెరవేరబోతుందనీ సొసైటీ సభ్యులంతా ఎంతో ఆనందానికి లోనయ్యారు. ఈ సొసైటీలో 50 మందికి పైగా సభ్యులు వివిధ కారణాల చేత గత 15 ఏళ్లలో మృత్యువాత పడగా వారి కుటుంబాలు తమ పెద్దదిక్కు పోయిన తరువాతైనా తమకు ఆ స్థలాలు దక్కాయని అనుకునేలోపే ఈ సుప్రీంకోర్టు తీర్పు ఇప్పుడు వారి తీరని దుఃఖానికి కారణమైంది. ఈ తీర్పు ద్వారా ఒక్క సొసైటీకి చెందిన జర్నలిస్టుల కుటుంబాలు మాత్రమే కాదు, భవిష్యత్తులో ఇతర సొసైటీల ద్వారా ఎలాగైనా తమకు ఇళ్ల స్థలాలు వస్తాయని గంపెడాశతో ఉన్న జర్నలిస్ట్ సమాజమంతా తీవ్ర కుంగుబాటుకు లోనయింది.



జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల విషయంలో దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పు తీవ్ర వేదనను, ఆందోళనను కలిగిస్తున్నది. సరిపడా సంపాదన లేకపోయినా తమనూ "ఎలైట్" (ఉన్నత వర్గం)గా గుర్తించడం ఏమిటనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగ భద్రత లేదు. పెన్షన్ సదుపాయం లేదు. ఆరోగ్య బీమా సదుపాయం లేదు. కొన్ని సందర్భాల్లో తాము పనిచేస్తున్న సంస్థలు మనుగడలో ఉంటాయో లేదో కూడా తెలియని స్థితి. ఇలాంటి వాతావరణంలో పనిచేస్తున్న వారిని ఉన్నతాధికారులతో సమానంగా ఎలా చూడగలరు?

ఎన్నో సంస్థలకు, సొసైటీలో అతి తక్కువ ధరలకు ప్రభుత్వం స్థలాలను కట్టబెట్టిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అలాంటిది సమాజ హితం కోరే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తే వచ్చే నష్టమేంటో ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలింది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్ట్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలు ఇప్పటికే ఏర్పడి ఇళ్ల స్థలాలు ఎప్పటికైనా వస్తాయని ఆశతో ఉన్నాయి. అలాంటి వారందరికీ ప్రభుత్వం ప్రత్యామ్నాయం ఆలోచించి న్యాయం చేయాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే జర్నలిస్టులకు పెన్షన్ సదుపాయం ఉండదు. ఇదో అసంఘటిత రంగం. ఈ రంగంలో పనిచేస్తున్న వారి జీవితాలకు ఏ గ్యారెంటీ లేదు. అలాంటి వారిని "ఎలైట్ పీపుల్"గా పరిగణించడమే మింగుడు పడని అంశం.

పైకి కన్పించే మెరుగులను చూసి జర్నలిస్టుల జీవితాలు బాగున్నాయని నిర్ధారించి ఇలాంటి అన్యాయం చేయటం పట్ల ఈ సమూహం తీవ్ర వేదనతో ఉన్నది. మన దేశంలో లక్షలాది మంది జర్నలిస్టులు పేదరికంలోనే జీవితం గడుపుతున్నారు. చాలా మంది జర్నలిస్టులు అనారోగ్యంతో కన్ను మూస్తున్నారు. తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నారు. మన రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పిస్తున్నది. కానీ జర్నలిస్టులకు ఆ జీవితం దొరకడం లేదు. ఇదో చేదు నిజం. జర్నలిస్టుల వాస్తవ స్థితిగతులు తెలిసిన వారిగా ప్రభుత్వాలే కల్పించుకొని ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించి ఈ విషయంలో ఆపన్న హస్తం అందించాలని, అందిస్తుందని వేయికళ్లతో ఈ జర్నలిస్టు సమాజం ఎదురుచూస్తోంది.

● అస్కాని మారుతీ సాగర్
ప్రధాన కార్యదర్శి, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్

జీవబలం కోల్పోతున్న పుడమితల్లి

సృష్టిలోని సమస్త జీవరాశి మనుగడకు కావాల్సిన ఆహారాన్ని, ఆవాసాన్ని అందించేది నేల తల్లి. జీవనధాతువుగా నిలవాల్సిన ఆ నేలతల్లే మానవుని స్వార్థపూరిత చర్యల వల్ల వెదజల్లబడుతున్న కాలుష్యం వల్ల తల్లడిల్లుతోంది. అభివృద్ధి పేరుతో మానవుడు చేపడుతున్న అనేక స్వార్థపూరిత చర్యల వల్ల పర్యావరణం గతంలో ఎన్నడూ లేనంత సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. వాతావరణంలోకి నిత్యం పెద్ద ఎత్తున విడుదలవుతున్న కలుషితాల వల్ల ఋతువులు గతి తప్పాయి. సహజవనరులు తమ సహజత్వాన్ని కోల్పోతున్నాయి. కోట్లాది ఎకరాల సాగు భూములు తమ సారాన్ని కోల్పోయి బీడు భూములుగా మారిపోతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పచ్చిక బయళ్లు ధ్వంసం కావటం వల్ల కూడా మేత లేక ఏటా లక్షలాది పశువులు మృత్యువాత పడుతున్నాయని, ఆ మూగ జీవాలను రక్షించుకోవాలంటే నేల క్షీణతను అరికట్టి, తిరిగి ఆ హరిత భూములను పునరుద్ధరించటం ఒకటే మార్గమని పర్యావరణవేత్తలు హితవు పలుకుతున్నారు. దానిలో భాగంగా ఈ సంవత్సరం ప్రపంచ నేల దినోత్సవాన్ని 'నేలల సంరక్షణ : మెజర్, మానిటర్ అండ్ మేనేజ్' అనే థీమ్‌తో జరుపుకోవాలని ప్రపంచ ఆరోగ్య, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఒ) ప్రపంచ దేశాలను కోరింది.



భూమిని పుడమితల్లిగా పూజించే భారత్ వంటి దేశాలలో కూడా నేల క్షీణత, ఎడారీకరణ అత్యంత వేగవంతంగా సాగుతున్నాయి. వాతావరణ మార్పులు, మానవ ప్రేరిత చర్యల వల్ల భారతదేశంలో 32 శాతం నేల క్షీణతకు గురవుతుండగా, 25 శాతం భూమి ఎడారిగా మారిపోతుందని భారత కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. భారతదేశంలో 2015 నుండి 2019 వరకూ అంటే నాలుగు సంవత్సరాల కాలంలో సుమారు 30.51 మిలియన్ హెక్టార్ల భూమి క్షీణతకు గురై బీడుబారిపోయిందని యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ టు కంబాట్ డిసర్టిఫికేషన్ (యుఎన్‌సిసిడి) అనే సంస్థ తన నివేదికలో అంచనా వేసింది. ఈ నివేదిక ప్రకారం 2019 నాటికే దేశ భూభాగంలో సుమారు 9.45శాతం భూమి క్షీణతకు గురయ్యింది. 2023లో యుఎన్‌సిసిడి విడుదల చేసిన తాజా నివేదికలో భారతదేశ జనాభాలో దాదాపు 18.39 శాతం మంది ప్రజలు భూక్షీణత, ఎడారీకరణ వల్ల అనేక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. అహ్మదాబాద్‌లోని ఇస్రో స్పేస్ అప్లికేషన్ సెంటర్ 2021లో విడుదల చేసిన డిసర్టిఫికేషన్ అండ్ ల్యాండ్ డిగ్రేడేషన్ అట్లాస్ ఆఫ్ ఇండియా ప్రకారం దేశంలో సుమారు 96.40 మిలియన్ హెక్టార్లు భూమి అంటే దేశ భౌగోళిక విస్తీర్ణంలో 29.32 శాతం భూమి క్షీణతకు గురయ్యిందని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా 9రాష్ట్రాలలో భూమి క్షీణత అధికంగా కనిపిస్తుందని, రాజస్థాన్, మహారాష్ట్ర, గుజరాత్, జమ్మూ అండ్ కాశ్మీర్, కర్ణాటక, జార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో 23.95 శాతం భూమి క్షీణతకు గురవుతుందని ఈ నివేదిక స్పష్టం చేసింది. జార్ఖండ్, రాజస్థాన్, ఢిల్లీ, గుజరాత్, గోవా వంటి రాష్ట్రాలలో విస్తీర్ణంలో 50శాతం కన్నా ఎక్కువ భూమి ఎడారీకరణకు గురవుతుంటే, కేరళ, అస్సాం, మిజోరం, హర్యానా, బీహార్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, అరుణాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో కేవలం 10 శాతం కన్నా తక్కువ విస్తీర్ణంలో భూములు ఎడారీకరణకు గురవుతున్నాయని ఈ నివేదిక తెలియచేసింది.

భారతదేశంలో ఎడారీకరణకు, నేల క్షీణతకు హరిత విప్లవం పేరుతో అనుసరించిన విధానాలు కూడా ఒక ప్రధాన కారణమే. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ దిగుబడి సాధించాలన్న లక్ష్యంతో ప్రారంభమైన హరిత విప్లవం నేడు నేలను నిర్జీవంగా మార్చే ప్రక్రియకు ప్రధాన కారణమవుతుంది. విచ్చలవిడిగా రసాయినిక ఎరువుల వినియోగం, యాంత్రిక వ్యవసాయీకరణ, ఏకరూపక వ్యవసాయ సంస్కృతి మన దేశానికి హరిత విప్లవం అందించిన విధానాలు. ఇవే ఇప్పుడు నేలతల్లి పాలిట శాపాలుగా మారుతున్నాయి. దేశవ్యాప్తంగా హరిత విప్లవ కాలంలో అనుసరించిన వ్యవసాయిక విధానాల వల్ల నేల నిర్మాణం పూర్తిగా మారిపోయింది. దీంతో పాటు అభివృద్ధి పేరుతో పెద్దయెత్తున సాగుతున్న అటవీ విధ్వంసం, అడ్డు అదుపూ లేకుండా సాగుతున్న పట్టణీకరణ వంటి అంశాలు పరిస్థితిని మరింత విషమం చేస్తున్నాయి. ఎనర్జీ అండ్ రిసోర్సెస్ ఇనిస్టిట్యూట్ (టెరీ) అంచనా ప్రకారం నేల క్షీణత వల్ల భారతదేశం ఏటా 48.8 బిలియన్ డాలర్ల మేరకు ఆర్థికంగా నష్టపోతుందని స్పష్టం చేసింది. భారతదేశం కూడా భూమి క్షీణతను తగ్గించడానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తుందని 2015లో పారిస్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి ఫ్రేమ్ వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లైమేట్ ఛేంజ్ కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ సదస్సులో ప్రకటించింది. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా 26 మిలియన్ హెక్టార్ల నేలని తిరిగి పునరుద్ధరించే లక్ష్యంతో కాప్ పార్టీస్ చేపట్టిన బాన్ ఛాలెంజ్‌లో భారతదేశం భాగస్వామిగా చేరింది. అయితే దేశంలో వేగంగా విస్తరిస్తున్న ఎడారీకరణ, భూక్షీణతను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఒక స్పష్టమైన విధానం ఇప్పటికీ లేకపోవటం విచారకరం.

○ కె. శశిధర్

కులగణనతో దేశానికి హాని ఏమిటి?

'ఈ విభజనలతో దేశం ఏమయ్యేట్టు?' శీర్షికన కె.అరవిందరావు 23 నవంబర్ 2024న రాసిన వ్యాసానికి ప్రతిస్పందన ఇది. అరవిందరావు పదవీ విరమణ తర్వాత దైవకార్యంలో భాగంగా సామాజిక పరిణామాల మీద వార్తా పత్రికల్లో స్పందిస్తూ ఉంటారు. ఈ వ్యాసంలో ఆయన దళిత బహుజన, మత మైనార్టీ వర్గాల్లో వస్తున్న చైతన్యం మీద తన అక్కసును వెళ్ళకక్కే ప్రయత్నం చేశారు. ఈ వర్గాల్లో వస్తున్న చైతన్యాన్ని ఇలానే సాగనిస్తే దేశ విభజన, హిందూమత విధ్వంసానికి దారితీస్తుందని హెచ్చరించారు.

అరవిందరావు ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలోను, దేశంలోను జరుగుతున్న కులగణనను, మత మైనార్టీల పట్ల పార్టీల, ప్రభుత్వాల సాఫ్ట్ కార్నర్‌ను వ్యతిరేకిస్తూ ఆ వ్యాసాన్ని వ్రాసారు. ఆయన అభిప్రాయాల ప్రకారం కులగణన సమాజంలో కులతత్వాన్ని ప్రేరేపిస్తుంది. కులగణనతో కులతత్వం వికృతరూపం తీసుకుంటుందని చెప్పారు. ఇది ఒక అగ్రకుల తత్వంతో కూడిన వాదన. భారతీయ సమాజం కుల పునాదుల మీద నిర్మించబడి ఉంది. ఇందులో కొత్తగా చెప్పేది ఏమిలేదు. కులగణన వల్లనో, కులం గురించి మాట్లాడటం వల్లనో కులతత్వం పెరగదు. నా కులానికి అన్యాయం జరిగిందనటం కులతత్వం ఎట్లా ఐతది? అసలు కులతత్వం అంటే ఏమిటి? క్రింది కులాలను అవమానించి, అణగదొక్కి, దోపిడీ చేసే అగ్రకుల మనస్తత్వాన్ని కులతత్వంగా చెప్పుకోవచ్చు. ఈ దేశంలో దోపిడీ కులసంబంధాల ద్వారానే జరుగుతున్నది. ఆర్థిక సంబంధాల ద్వారా కాదు అనే విషయాన్ని అర్థం చేసుకోవాలి.



భారత్‌ను ముస్లింలు 550 సంవత్సరాలు పాలించారు. అయినా ఈ దేశాన్ని ఇస్లామిక్ దేశంగా మార్చలేకపోయారు. ఇప్పుడు రోజువారి జీవితమే కష్టంగా గడుపుతున్న ఆ మైనార్టీ వర్గం ఎలా ఈ దేశాన్ని ఇస్లామిక్ రాజ్యంగా మార్చగలదు?

ఈ దేశ ప్రజాస్వామ్యం, ఆర్థిక అభివృద్ధి అగ్రకుల ఆధిపత్యం భూమికగా నిర్మించబడ్డాయి. ఈ రోజు దళిత బహుజన వర్గాలు అగ్రకుల ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తున్నాయి. దీన్నే అగ్రకులాలు కులతత్వంగా చిత్రిస్తున్నాయి. మరి అగ్రకులాలు కులాల వారి మ్యారేజీ బ్యూరోలు పెట్టుకోవటాన్ని, కులాలవారి జాబ్ మేళాలు నిర్వహించటాన్ని, చెప్పుకుంటూ పోతే ఇలా చాలానే ఉన్నాయి. మరి వీటిని ఏమనాలి? దీన్ని కులతత్వం అనరా? ఇది కదా దేశ ఐక్యతకు భంగం.

అరవిందరావు తన వ్యాసంలో కులం, హిందూ మతానికి సంబంధించి కొన్ని చారిత్రక, పురాణ విషయాల్ని ప్రస్తావించారు. అవి చాల అవగాహనరాహిత్యంగా ఉన్నాయి. మొదటిది— హిందూమతానికి కులంకు సంబంధం లేదనటం. హిందు శాస్త్రాల్లో కేవలం నాలుగు వర్ణాలే చెప్పబడ్డాయి, తరువాత వృత్తుల ఆధారంగా అనేక కులాలు పుట్టుకువచ్చాయి, యూరోపియన్ సమాజంలోను ఈ తరహా పరిణామాలు చూడవచ్చని చెప్పారు. ఈ వాదనను అగ్రకులాలు జాతీయ ఉద్యమ కాలం నుండి చెప్పుకుంటూ వస్తున్నాయి. వారికి అర్థం అయ్యి అర్థం కాని విషయం ఏమంటే వర్ణవ్యవస్థ అనేది ఒక భావజాలం (Ideology) ఈ భావజాలం కులవ్యవస్థ మొత్తానికి పునాది.

వాస్తవానికి వేదకాలంలో మూడు వర్ణాలే ఉండేవి. తరువాత ఈ వర్ణాలు కూడ కులాలుగా మారిపోయినాయి. యూరప్‌లో ఏర్పడిన వృత్తి ఆధారిత సమూహాలకు ఇండియా కులవ్యవస్థకు జమీన్ అస్మాన్‌కు ఉన్నంత ఫరక్ వుంది. అక్కడి వృత్తి సమూహాల మధ్య నిచ్చనమెట్ల వ్యవస్థ లేదు, వైషమ్యాలు లేవు, అవమానాల్లేవు, అన్నింటికీ మించి అంటరానితనం లేదు. మన కుల వ్యవస్థ ప్రత్యేక లక్షణం ఏమంటే అగ్రకులాలవారు దోపిడీదారులుగా గర్వపడుతారు. ఈ భావజాలం ఏ సమాజంలో లేదు. ఒక్క మన దేశంలోనే వుంది.

వైదిక మతస్థులు గొప్పగా చెప్పుకునే మరో విషయం ఏమంటే తమ మతం ఇతర మతాల్లా విదేశాల మీద దండెత్తలేదని, ఇతర మతస్థులను తమ మతంలోకి మార్చలేదని. ఇది వాస్తవమే. అయితే వైదిక మతం ఇతర దేశాలకు ఎందుకు విస్తరించలేదన్న ప్రశ్న ఎప్పుడైనా వేసుకున్నారా? ఈ దేశంలో పుట్టిన జైన, బౌద్ధ మతాలు ఇతర దేశాలకు ఎలా విస్తరించాయి? అంటే ఈ మతాలు సార్వజనీన మానవ విలువల మీద ఏర్పడ్డాయి కాబట్టి. వైదిక మతం సహజ ప్రకృతి ధర్మంకు వ్యతిరేకం. వైదిక మతానికి కులం మూలం. పరదేశీయులు ఈ మతంలోకి మారాలంటే (Convert) అతనికి కులం ఉండాలి. సప్తమునుల్లో ఎవరో ఒకరితో జన్మ వంశం / గోత్రం సంబంధం కలిగి ఉండాలి. ఈ కారణంగానే వైదిక మతం ఇతర దేశాలకు విస్తరించలేదు.

అరవిందరావు చేసే మరో ఆరోపణ ఏమంటే బ్రిటిష్ వారి వల్లనే ఈ దేశంలో ప్రజలు కులాలుగా, మతాలుగా, విడిపోయారని. అసలు విషయం ఏమంటే ఈ రోజు మాట్లాడుకుంటున్న హిందూ మతం బ్రిటిష్‌వారు చేపట్టిన జనగణన (Census) నుండి పుట్టింది. అరబిక్ రచయిత అల్ బైరుని మొదటగ 'హిందూ' పదాన్ని భౌగోళిక అర్థం స్ఫురించేట్లు వాడినారు. తరువాత కాలంలో ఈ దేశ భాష సంస్కృతులను పరంగా వాడుకలో వచ్చింది. బ్రిటిష్ పాలకులు జనాభా గణన చేసినపుడు ముస్లిం, క్రిస్టియనేతరులను హిందువులుగా గుర్తించటం జరిగింది. దానితో దేశంలోని అనేక స్థానిక మత ఆచారాలు, దేవుళ్ళు హిందూ మతం క్రిందికి తీసుకురావటం జరిగింది. 19వ శతాబ్ది వైదిక సాంస్కృతిక ఉద్యమం దానికి తోడైంది. అయితే వైదిక మతం భావజాలం హిందూమత భావజాలంగా చలామణీలోకి వచ్చింది.

వాస్తవానికి వైదికమతంకు ప్రాంతీయ దేవుళ్ళు, దేవతలకు ఎటువంటి సంబంధం లేదు. ఇక్కడి కొమురవెల్లి మల్లన్నకు, వీరభద్రుడికి, ఎల్లమ్మ, మైసమ్మలకు, గోండుల నాగోబాకు, లంబాడీల మెరామ్మకు, చెంచు మల్లయ్య (శ్రీశైలం)కు వైదిక మతంకు ఏ సంబంధం లేదు. వీరంతా దళిత బహుజనుల పక్షాన పోరాటం చేసి వీరమరణం చెందినవారు. ప్రజలు వారిని అనాదిగా పూజించుకుంటూ వస్తున్నారు.


ముస్లింల సాధికారత గురించి ప్రభుత్వాలు, పార్టీలు మాట్లాడటం పట్ల అరవిందరావు అసహనం ప్రకటించారు. ప్రధానంగా రెండు ఆరోపణలు చేశారు. ఒకటి ముస్లింల వల్లనే ఇండియా రెండుగా విడిపోయిందని; రెండవది ముస్లింల పట్లా ఉదారవాదం చూపిస్తే ఈ దేశం ఏదో ఒక రోజున ఇస్లామిక్ దేశంగా మారిపోతుందని. ఈ రెండు ఆరోపణలు అవగాహనారాహిత్యంతో చేసినవే. జాతీయ ఉద్యమంలో భాగంగా వచ్చిన హిందూ ఫాసిజమె దేశ విభజనకు కారణమని ఈ మధ్య కాలంలో వచ్చిన పరిశోధనలు వివరిస్తున్నాయి. హిందూ ఫాసిజం బెంగాల్ విభజనతో మొదలై 1920 నాటికి వికృత రూపం తీసుకుంది. ఈ పరిస్థితిలో ముస్లింలోని ఒక వర్గం హిందూ ఆధిపత్య ఇండియాలో మనుగడ సాగించలేమన్న భావానికి వచ్చింది. చివరి వరకు వారు ముస్లింలు అధిక సంఖ్యలో ఉన్న ప్రాంతాలకు ప్రత్యేక ప్రతిపత్తిని కోరుకున్నారు. కానీ, హిందూ నాయకులు ముస్లింలకు స్వయంప్రతిపత్తి ఇవ్వటం కంటే దేశ విభజనే మంచిదని భావించారు. మరి దేశ విభజనకు ఎవరు కారణం? హిందువులా? ముస్లింలా?

ముస్లింలను ఒక బూచిగ చూయించి, హిందువుల్లో ఒక భయాన్ని సృష్టించి వారిని ఓటు బ్యాంకుగా మార్చుకునే విధానాన్ని బీజేపీ, దాని మాతృసంస్థలు మొదటి నుండి చేస్తున్నాయి. వాస్తవంగా ముస్లింల భయం సృష్టితోనే హిందూయిజం నిర్మాణం జరుగుతుంది. అదే ప్రయత్నాన్ని అరవిందరావు తన వ్యాసంలో చేశారు. ఒక్క విషయం ఏమంటే ఈ దేశాన్ని ముస్లింలు 550 సంవత్సరాలు పాలించారు. అయినా ఈ దేశాన్ని ఇస్లామిక్ దేశంగా మార్చలేకపోయారు. ఇప్పుడు రోజువారి జీవితమే కష్టంగా గడుపుతున్న ఆ మైనార్టీ వర్గం ఎలా ఈ దేశాన్ని ఇస్లామిక్ దేశంగా మార్చగలదు? అసలు ముస్లింలు ఎవరు? ఈ దేశ దళిత, బహుజన బిడ్డలు కాదా? బైటినుండి వచ్చినవారు మహా అయితే ఓ 10శాతం ఉండవచ్చు. కాని 90శాతం ఇక్కడి బిడ్డలేకదా. మరి వారి సాధికారత గురించి పట్టించుకోవాల్సిన బాధ్యత అన్ని పార్టీలకు, ప్రభుత్వాలకు ఉండకూడదా!?

◆ -ప్రొ. భంగ్యా భూక్యా
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
గురువారం 5 డిసెంబరు 2024

భూకంపం భయం భయం



వాజేడు మండలం పేరూరు సీడబ్ల్యూసీ భవనంలో పగుళ్లు

మేడారం కేంద్రంగా వచ్చిందని తెలియడంతో మరింత ఆందోళన

ఇళ్లనుంచి బయటకొచ్చిన జనం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడు సెకన్ల పాటు కంపనాలు

వివరాలు 8లో

చలి దుప్పటి తొలిగిన సమయం.. ఎవరి పనుల్లోకి వారు వెళ్లేందుకు సిద్ధమవుతున్న వేళ.. హఠాత్తుగా ఏదో అలజడి. ఇళ్లలోని మంచాలు, వస్తువులు కదులుతున్నట్టు అనుభూతి. క్షణాల్లో ఏం జరుగుతుందో తెలియని అయోమయం. భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీసిన జనం. ఆ కాసేపటికే కుదురుకున్న పరిస్థితులతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఆ తర్వాత ములుగు జిల్లా మేడారం కేంద్రంగా భూ కంపం వచ్చిందని తెలుసుకుని మరింత భయభ్రాంతులకు గురయ్యారు. బుధవారం ఉదయం సరిగ్గా 7.27 గంటలకు చోటు చేసుకున్న ఈ ప్రకంపనలు మూడుసెకన్ల పాటు రావడం రిక్టర్‌స్కేల్‌పై 5.3గా నమోదవడం గురించి తెలుసుకుని అంతా ఆందోళన చెందారు. సీసీ కెమెరాల్లో నమోదైన పలు దృశ్యాలు.. ముఖ్యంగా మేడారంలోని సమ్మక్కసారలమ్మ గద్దెల ప్రాంగణం వణికిన తీరు టీవీ చానళ్లు, సోషల్‌మీడియాలో రావడం చర్చనీయాంశమైంది. ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా ఈ ప్రకంపనలు రావడంతో ప్రజలు ఆందోళన చెందారు. దీంతో అప్రమత్తమైన అధికారులు అవగాహన కల్పించి ప్రజలకు ధైర్యం చెప్పారు.

\- ఉమ్మడి వరంగల్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి



ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లిలో కూలిన ఓ రేకుల ఇంటి ప్రహరీ



భూపాలపల్లి జిల్లా కాటారం మండలకేంద్రంలో కొద్దిగా ఒరిగిన బాత్‌రూమ్



హనుమకొండ ఇందిరానగర్‌లో కూలిన భవనం పోర్టికో

కంపించిన మేడారం గద్దెలు
ఆందోళనకు గురైన భక్తులు, పూజారులు

మేడిగడ్డ అధికారులు అప్రమత్తం
బ్యారేజి లెవల్స్ పరిశీలన

రామప్పకు ముప్పు వాటిల్లలేదు
ఆర్కియాలజి డిప్యూటీ సూపరింటెండెంట్ దేశాయి
8

మేడారం మిస్టరీ!
ప్రకృతి వైపరీత్యాలకు కేంద్ర బిందువుగా అభయారణ్యం
కొండాయిపై జంపన్నవాగు ఉప్పెనతో 8మంది బలి
టోర్నడో బీభత్సంతో నేలకూలిన వనం
ఇప్పుడు భూకంపం పుట్టింది ఇక్కడే..
భక్తుల్లో వ్యక్తమవుతున్న ఆందోళన
8

బంగ్లాదేశ్‌లో హిందువులపై దమనకాండను ఆపాలి..

- హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి



ర్యాలీగా వస్తున్న హిందూ ధర్మ పరిరక్షణ సమితి తదితర సంస్థల ప్రతినిధులు

వడ్డెపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందూ ఆలయాలను ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు, ఇస్కాన్ స్వామి చిన్మయ కృష్ణదాస్ అరెస్టును నిరసిస్తూ హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో హనుమకొండలోని వేయిస్తంభాల దేవాలయం నుంచి పెట్రోల్ పంపు మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన సభలో జైపాల్‌రెడ్డి మాట్లాడారు. బంగ్లాదేశ్‌లోని హిందువులపై కొంతకాలంగా అక్కడి ప్రభుత్వం అనేకరకాలుగా దాడులను జరుపుతోందని అన్నారు. అక్రమంగా అక్కడి హిందువులను అరెస్టు చేసి చిత్రహింసలకు గురి చేస్తున్నారని అన్నారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేసే విధంగా భారత ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. గత నవంబరు 25న ఇస్కాన్ సంస్థకు చెందిన కృష్ణదాస్ ప్రభును ఢాకాలోని షాహ్జలాల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అరెస్టు చేయడం బంగ్లాదేశ్ ప్రభుత్వం హిందువులపై చేసిన కుట్ర అని దుయ్యబట్టారు. కృష్ణదాస్‌ను అరెస్టు చేసిన అధికారులు ఇతర హిందూ సంఘాల ప్రతినిధులను కూడా జైలుకు తరలించేందుకు చర్యలు తీసుకోవడం దుర్మార్గమని అన్నారు. బంగ్లాదేశ్‌లోని హిందూ ఆలయ భూములను కాపాడాలని, మెహర్‌పూర్‌లోని ఇస్కాన్ దేవాలయంపై దాడి చేసిన ముస్లిం మూకలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ సంస్థ, అయ్యప్ప సేవా సమితి, హనుమాన్ సేవా సమితి, మార్వాడీ సేవా సమితి, పతంజలి సంస్థ, వికాసతరంగిణి, ఇషా ఫౌండేషన్ బాధ్యులతోపాటు వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాతంగి రమేష్‌బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, బీజేపీ శ్రేణులు మార్తినేని ధర్మారావు, చొల్లేటి కృష్ణామాచారి, గంట రవికుమార్, బింగి శ్రీనివాస్, పాల్గొన్నారు.

సెంట్రల్ జైలు జాడేది?



- బీఆర్ఎస్ హయాంలో భూమి కేటాయింపు
- హనుమకొండలో కూల్చి ఏళ్లు గడుస్తున్నా మొదలు కాని పనులు
- ఇబ్బంది పడుతున్న ఖైదీల కుటుంబ సభ్యులు

మామునూరులో నిర్మాణం జరిగేనా..?

మామునూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే పేరుగాంచిన వరంగల్ సెంట్రల్ జైలు అడ్రస్ గల్లంతైంది. స్వాతంత్ర్యానికి పూర్వం నిజాం రాజుల కాలంలో నిర్మించిన ఈ సెంట్రల్ జైలులో ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు, తెలంగాణ పోరాట యోధులు, మావోయిస్టు అగ్రనేతలు శిక్ష అనుభవించారు. ఎంతో మంది ఖైదీలకు జీవిత పాఠాలు నేర్పించిన ఘనత ఈ జైలుకు ఉంది. అలాంటిది నేలమట్టం అయి ఏండ్లు గడుస్తున్నా కొత్త జైలు నిర్మాణం చేపట్టడం లేదు. గత ప్రభుత్వం వరంగల్ సెంట్రల్ జైలు కూల్చే ముందు మామునూరు ప్రాంతంలో గల పోలీస్ పోర్త్ బెటాలియన్‌లో నూతన జైలు నిర్మిస్తామని ప్రకటించింది. ఇందుకోసం 100 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి రూ.254 కోట్లు నిధులు విడుదల చేయాలని అనుమతులు సైతం జారీచేసింది.

138 ఏళ్ల చరిత్ర

నిజాం కాలంలో 1886వ సంవత్సరంలో నిర్మించిన వరంగల్ సెంట్రల్ జైలును కూల్చివేసి ఇప్పటివరకు కనీసం పునర్నిర్మాణం పనులు కూడా ప్రారంభించలేదు. భారతదేశానికి స్వాతంత్ర్యం రాక పూర్వం ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర రాజధాని అయిన హైదరాబాద్ అప్పట్లో రాష్ట్రంగా ఉండి నిజాం నవాబుల పరిపాలనలో ఉండేది. అదే హయాంలో వరంగల్ సెంట్రల్ జైలును, మామునూరులోని ఎయిర్‌పోర్టును నిర్మించారు. వరంగల్ సెంట్రల్ జైలులో ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు, విప్లవకారులు, ఉద్యమకారులు శిక్ష అనుభవించారు. అంతటి పేరుగాంచిన వరంగల్ సెంట్రల్ జైలు నామరూపాల్లేకుండా పోవడం బాధాకరమని తొలి తెలంగాణ ఉద్యమకారులు, మలిదశ ఉద్యమకారులు సైతం వాపోతున్నారు. అదే స్థలంలో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం చేపట్టడంపై హర్షం వ్యక్తంచేసినప్పటికీ ఇన్ని సంవత్సరాలైనా పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాకుండా సెంట్రల్ జైలు సిబ్బంది కూడా అనేక రకాలుగా ఇబ్బందిపడుతున్నారు.

ఖైదీల కుటుంబ సభ్యులకు కష్టాలు

వరంగల్ సెంట్రల్ జైలులో స్వాతంత్ర్య సమరయోధులు, ఉద్యమకారులు, విప్లవకారులు, రాజకీయనాయకులతో పాటు తెలిసో తెలియకో.. నేరాలు చేసిన పేద ప్రజలు సైతం శిక్షను అనుభవించారు. వారి కుటుంబసభ్యుల్లో ఎక్కువ శాతం నిరుపేదలే ఉంటారు. గతంలో ఖైదీల కుటుంబసభ్యులు కనీసం నెలకోసారి ములాఖత్ (కలుసుకోవడానికి)కు వచ్చేవారు. కానీ ప్రస్తుతం వారు ఎక్కడ ఉన్నారనే జాడ కూడా తెలియడం లేదు. ఒకవేళ వారి జాడ తెలిసినా దూరప్రాంతాల్లో ఉండడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. రిమాండ్ ఖైదీలు కూడా దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సెంట్రల్ జైలు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలతో పాటు ఖైదీల కుటుంబసభ్యులు కోరుతున్నారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుల ఎన్నిక

- హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా కేఆర్ దిలీప్
- వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా పరమేశ్




కేఆర్ దిలీప్, కార్ని పరమేశ్

హనుమకొండ సిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష ఎన్నిక ఫలితాలు వెల్లడయ్యాయి. మూడు నెలల కిందటే ఆన్‌లైన్ ఓటింగ్ విధానంలో ఎన్నిక జరిగింది. ఇప్పుడు ఆ ఫలితాలు వెల్లడయ్యాయి. అధ్యక్ష పదవి కోసం పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులు పోటీపడ్డారు. హనుమకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు కుమారుడు కేఆర్ దిలీప్ గెలుపొందగా, వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పరమేశ్ విజయం సాధించాడు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల రమాకాంత్‌రెడ్డి ప్యానెల్‌లోని వీరు ఇద్దరు అధ్యక్షులుగా గెలిచారు.

చకచకా సర్వే డేటా ఎంట్రీ
బల్దియా పరిధిలో విధుల్లో 500 మందికి పైగా ఆపరేటర్లు
6

నేడు వరంగల్ జిల్లాకు కేంద్ర బృందం

- పర్యటనకు ఏర్పాట్లు చేయాలి..
- అధికారులకు కలెక్టర్ సత్యశారద ఆదేశం



వరంగల్ కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): పోస్ట్ డిజాస్టర్ నీడ్స్ అసెస్మెంట్ (విపత్తు అనంతరం అవసరాల అంచనా)పై వరంగల్ జిల్లాను సందర్శించడానికి 30 మందితో కూడిన కేంద్ర బృందం గురువారం జిల్లాకు వస్తోందని కలెక్టర్ సత్యశారద తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. బృందం పర్యటనకు రూట్‌మ్యాప్, ఇతర కార్యచరణ ప్రణాళిక రూపొందించడంపై సూచనలు చేశారు. 30 మందిని ఆరు టీములుగా విభజించి ఒక్కో టీంకు ఒక్కో తహసీల్దార్, ఎంపీడీవోను, లైజన్ ఆఫీసర్స్‌గా నియమించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, డీఆర్‌డీవో కౌసల్యదేవి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, తహసిల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

విజయోత్సవాలపై కలెక్టర్ సమీక్ష

ప్రజాపాలన విజయోత్సవాలపై బుధవారం తన కార్యాలయంలో కలెక్టర్ సత్యశారద అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. గురువారం ఎంజీఎంలో ఇందిరామహిళా క్యాంటీన్‌ను మంత్రి కొండా సురేఖ ప్రారంభించనున్నందున తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా ఎంజీఎంలో ఓపీ కౌంటర్లను 4 నుంచి 6కు, ఫార్మసీ కౌంటర్లను 6 నుంచి 10కి పెంచుతున్నందున వాటితో పాటు దివ్యాంగులు, మహిళలకు ఓపీ సెంటర్లను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, డీఆర్‌డీవో కౌసల్యదేవి, జడ్పీ సీఈవో రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా 4వ రోజు పెద్దపెల్లి జిల్లాలో జరిగే యువవికాసం సదస్సులో పాల్గొనేందుకు వెళుతున్న బస్సులను బుధవారం కలెక్టర్ సత్యశారద ప్రాంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జిల్లా నుంచి గ్రూప్4లో ఎంపికైన 149మంది అభ్యర్థులు ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ఉద్యోగ నియామక పత్రాలను అందుకునేందుకు వెళుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌డీవో విజయలక్ష్మి, ఏవో శ్రీకాంత్ పాల్గొన్నారు.



పోలింగ్ రోజు కూడా తొలగించని ఫ్లెక్సీలు

జాతరలా రైల్వే గుర్తింపు ఎన్నికలు

- అడ్డగింతలు, గొడవల మధ్య పోలింగ్
- ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి నానా తిప్పలు
- రేపు, ఎల్లుండి కొనసాగనున్న ప్రక్రియ

కాజీపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'వన్ ఇండస్ట్రీ, వన్ యూనియన్'తో మూడు రోజుల పాటు జరిగే రైల్వే కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికలు మొదటి రోజు బుధవారం ప్రారంభమయ్యాయి. మొదటి రెండు రోజులు అన్ని డిపార్ట్‌మెంట్ల ఓటర్లకు పోలింగ్ నిర్వహించనున్నారు. చివరిరోజు 6వ తేదీ అందుబాటులోని లేని లోకోపైలెట్, గార్డులకు మాత్రమే ఓటింగ్ ఉంటుంది. బుధవారం జరిగిన పోలింగ్ రసవత్తరంగా సాగింది. అన్ని యూనియన్ల నాయకులు, ఓటర్లతో రైల్వే కాలనీలో ఓ జాతర వాతావరణం నెలకొంది. యూనియన్‌ల మధ్య ఓటర్లను అడ్డుకోవడం, చెదుముదురు గొడవల మధ్య ఓటింగ్ ప్రక్రియ సాగింది. ఉదయం 8గంటలకు ప్రారంభమై సాయంత్రం 6గంటల వరకు కొనసాగింది. పోలింగ్ సెంటర్‌లోపల ఉన్నవారిని ఓటింగ్‌కు అనుమతించిన ఎన్నికల అధికారులు.. సాయంత్రం 6 తర్వాత వచ్చే ఓటర్లకు అనుమతించలేదు. ఉదయం 8గంటల నుంచి ఓటర్లను ప్రసన్నం చేసేందుకు రైల్వే కార్మిక సంఘాల నాయకులు నానా తంటాలు పడాల్సి వచ్చింది. కొందరి ఓటర్లుకు బిర్యానీ ప్యాకెట్‌లు, మందు, నగదు పంపిణీ చేసినట్లు ఓ సంఘంపై మరో సంఘం ఆరోపణలు చేసుకున్నారు. అనారోగ్యంతో ఉన్న ఓటర్లను ఓటు వేసేందుకు ఓ కార్మిక సంఘం ప్రత్యేక వాహనాలు, బైక్‌ల ద్వారా తరలిస్తున్నారని మరో సంఘం నాయకులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు కల్పించుకుని గొడవ పెద్దది కాకుండా సద్దుమణిగేలా చేశారు.

కాజీపేటలో మొత్తం 3,474 ఓట్లు

కాజీపేటలో మొత్తం 3,474 ఓట్లు ఉండగా, ఐదు పోలింగ్ బూతులు ఏర్పాటు చేశారు. ఇంజనీరింగ్ స్కూల్ బూత్‌నెంబర్ 37లో 848 ఓట్లు ఉండగా, ఈ బూత్‌లో కేవలం రన్నింగ్ స్టాఫ్‌కు మాత్రమే ఏర్పాట్లు చేశారు. డీటీసీసీ 11, 12వ బూత్‌నంబర్‌లో 1,618 మందికి ఓట్లు, డీజిల్‌షెడ్ పోలింగ్ బూత్‌లో 428 ఓట్లు ఉన్నాయి. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను సికింద్రాబాద్‌కు తరలించి, ఈ నెల 12న లెక్కింపు చేపడతారు. లెక్కింపు అనంతరం గుర్తింపు సాధించిన కార్మిక సంఘాలు 2024 నుంచి 29 వరకు గుర్తింపు లభిస్తుంది..

రెండు యూనియన్ల మధ్యే పోటీ

రైల్వే కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో 30 నుంచి 35 శాతం ఓట్లు సాధిస్తే ఏ యూనియన్‌కైనా గుర్తింపు సంఘంగా గుర్తిస్తుంది. అయితే ఈ ఎన్నికల్లో రైల్వే మజ్దూర్ యూనియన్, రైల్వే ఎంప్లాయీస్ సంఘ్, దక్షిణ మధ్య రైల్వే కార్మిక్ సంఘ్, ఇండియన్ రైల్వే మజ్దూర్ యూనియన్ పోటీపడగా.. ప్రధానంగా దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్, ఎంప్లాయీస్ సంఘ్ మధ్యే తీవ్ర పోటీ ఉంది. ఇదిలా ఉండగా, నెలరోజుల నుంచి సాధారణ ఎన్నికలను తలపించాయి. సాధారణంగా 48 గంటల ముందు ఎన్నికల ప్రచార పోస్టర్లు, ఫ్లెక్సీలను తొలగిస్తారు. కానీ పోలింగ్ రోజున సైతం రైల్వేస్టేషన్ ఎదుట, రైల్వే కాలనీలలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తొలగించకుండా ఎన్నికలు నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి

అభివృద్ధి పనుల్లో పురోగతి అవసరం

బల్దియా ఇంజనీరింగ్ అధికారులతో మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 04 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో ప్రస్తుతం పలు పథకాల కింద కొనసాగుతున్న అభివృద్ధి పనులలో పురోగతి సాధించాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో బుధవారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. వివిధ కాలనీలు, డివిజన్‌లలో జరుగుతున్న పనులను ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతనే పనులకు అప్రూవల్ ఇవ్వాలని ఆదేశించారు. నాణ్యతలేని పనులకు విచ్చే బిల్లులను రద్దు చేయాలని అన్నారు. నిర్దేశిత సమయంలోగా పనులు పూర్తి చేసే విధంగా కాంట్రాక్టర్లను అప్రమత్తం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈలు మహేందర్, శ్రీనివాస్, సంతోష్‌బాబు, డీఈలు కార్తీక్‌రెడ్డి, కృష్ణమోహన్, రవికిరణ్, శివానంద్‌లతో పాటు ఏఈలు పాల్గొన్నారు.

అత్తకు రూ.4వేలు, కోడలుకు రూ.2500 ఏమైంది?

- బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్
- బీజేపీ నేతలు అరూరి రమేష్, కొండేటి శ్రీధర్
- వర్ధన్నపేటలో కాంగ్రెస్ యేడాది పాలనపై చార్జిషీటు



ఇల్లందలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, తదితరులు

వర్ధన్నపేట రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలకు ముందు అత్తకు రూ.4వేలు, కోడలుకు రూ.2500 ఇస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. మహిళలను మోసగించిందని బీజేపీ నేతలు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేష్, కొండేటి శ్రీధర్‌లు అన్నారు. బుధవారం మండలంలోని ఇల్లందలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కాంగ్రెస్ పార్టీ యేడాది పాలనపై చార్జిషీటు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచార సమయంలో మహిళలను రెచ్చగొట్టి, వారికి మాయమాటలు చెప్పారని అన్నారు. వృద్ధులకు పించన్ల పెంపు, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2,500, దివ్యాంగులకు రూ.6వేలు ఇస్తామని చెప్పి మోసం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. ఆరు గ్యారంటీల్లో డిసెంబరు 9 తర్వాత నిరుద్యోగ యువతకు భృతి, రైతులకు రైతు బంధు, రుణమాఫీ సరిగ్గా చేయలేదన్నారు. ప్రజాపాలన వస్తుందని చెప్పి దౌర్జన్య పాలన సాగుతోందన్నారు. బలవంతంగా రైతులను బెదిరించి సొంత నియోకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి భూములను గుంజుకోవాలని చూసి వారికి బేడీలు వేశారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని, రాష్ట్రంలో అశాంతి కొనసాగుతోందని, శాంతి భద్రతలు లేవన్నారు. ఆరోగ్యం, విద్య, గురుకుల వ్యవస్థ ఆగమైందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారంలో చెప్పిన మాటలు మరిచి, వారి ఆస్తులను పెంచుకోవడంలో మునిగిపోయారని తెలిపారు. వ్యక్తిగత దూషణలు చేస్తూ ఆయా పార్టీలపై దుష్ప్రచారం చేస్తూ, ముఖ్యమంత్రిగా వ్యవహరించడం లేదని ఆరోపించారు.

వర్ధన్నపేట నియోజకవర్గంలో పదేండ్ల పాటు కష్టపడి పనిచేశామని, నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికలు చేశామని అరూరి, కొండేటి పేర్కొన్నారు. ఆనాడు ఔటర్‌రింగు రోడ్డు వేస్తామని చెబితే.. కాంగ్రెస్ పార్టీ నానా హంగామా చేసిందని, ఇప్పుడు ఆకాశంపై వేస్తారా? అంటూ ప్రశ్నించారు. మామూనూరు ఎయిర్‌పోర్టు కోసం భూమికి భూమి అంటూ రైతులను ఒప్పిస్తే ఎన్నికల కోడ్‌తో ముందుకు పోలేదన్నారు. ఇప్పుడు ప్రభుత్వం ఆగమేఘాల మీద జీవో తెచ్చి రూ.200కోట్లు పైన విడుదల చే1979లో రాంపూర్‌లో కోచ్ ఫ్యాక్టరీ పెడతామని చెప్పి వేరే దిక్కుకు మార్చిన ఘనత కాంగ్రెస్‌దన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉండడంతో కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ వచ్చిందని, కానీ, తామే తెచ్చామని కాంగ్రెస్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో అయోధ్యపురం రైతులతో మాట్లాడి భూములు తీసుకుని కోచ్ ఫ్యాక్టరీకి సహకరించామని తెలిపారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులను నిధులు తీసుకుని వస్తే.. ప్రస్తుత ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కొబ్బరి కాయలు కొట్టి ఆనందం పొందుతున్నాడని అన్నారు. వర్ధన్నపేటను మునిసిపాలిటీగా మార్చి అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లామని వారు గుర్తు చేశారు. ఈ సమావేశంలో బన్న ప్రభాకర్, మల్లాడి తిరుపతిరెడ్డి, వన్నాల వెంకటరమణ, పట్టపురం ఏకాంతం గౌడ్, కుమారస్వామి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకయ్య తదితరులు

కేయూ సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ మహిళ చెస్ జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, డిసెంబరు 4, (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 4 నుంచి 7 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలోని గీతం యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ చెస్ మహిళ జట్టును 2024-25 ఏడాదికి గాను బుధవారం ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు. ఎంపికైన క్రీడాకారులలో బి.నవ్య, (కిట్స్ కళాశాల, హసన్‌పర్తి), బి.దేవిక, (ఎల్‌బీ కళాశాల, వరంగల్), కె.భార్గవి, (టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ కళాశాల, వరంగల్ పశ్చిమ, హనుమకొండ), ఎస్.స్నేహిత,(కిట్స్ కళాశాల, హసన్‌పర్తి), టి.మాధుర్య, (కేయూ ఇంజనీరింగ్ కళాశాల, కేయూక్యాంపస్), కె.శార్విక (టీజీటీడబ్ల్యూఆర్‌డీసీ గర్ల్స్ డిగ్రీ కళాశాల, ఖమ్మం)లున్నట్లు పేర్కొన్నారు. ఈ జట్టుకు కోచ్, మేనేజర్‌గా టీజీటీబ్ల్యూఆర్‌డీసీ గర్ల్స్ కళాశాల, ఖమ్మం ఫిజికల్ డైరెక్టర్ డి.శ్వేత వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్యలు అభినందించారు.

రైళ్లకు అదనంగా జనరల్ కోచ్‌లు

గిర్మాజీపేట, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): వరంగల్ మీదుగా వచ్చి వెళ్లే రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనంగా జనరల్ కోచ్‌లను దక్షిణమధ్య రైల్వే అందుబాటులోకి తెచ్చింది. గుంటూరు ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌తో పాటు కాకినాడ పోర్టు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ప్రస్తుత ఉన్న రెండు కోచ్‌లకు అదనంగా మరో రెండు జనరల్ కోచ్‌లను కలిపారు. ఈ రెండు రైళ్లలో ప్రస్తుతం ఉన్న 2 జనరల్ కోచ్‌లు సరిపోక ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అదనంగా మరో 2 జనరల్ కోచ్‌లను ఆయా ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ప్రవేశపెట్టారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ రెండు రైళ్లలో జనరల్ కోచ్‌ల సంఖ్య 4 కు చేరడంతో ప్రయాణీకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలి

వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా



మొక్కకు నాటి నీరు పోస్తున్న వరంగల్ సీపీ

రఘునాథపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌కు తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చే ఫిర్యాదుదారులతో సిబ్బంది మర్యాద పూర్వకంగా వ్యవహరించి పోలీసులపై నమ్మకాన్ని కలిగించాలని వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా రఘునాథపల్లి పోలీస్ స్టేషన్‌ను సీపీ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలతో పాటు పోలీస్ శాఖ మంజూరు చేసిన కిట్ ఆర్టికల్స్‌ను, రికార్డులను, పోలీసుల పనితీరును ఆయన పరిశీలించారు. పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టు, రౌడీ షీటర్ల వివరాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు, వాటికి సంబంధించిన దర్యాప్తు వివరాలను ఎస్ఐ నరేష్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జనగామ వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, ట్రైనీ ఐపీఎస్ మానాన్ భట్, స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ, ట్రైనీ ఎస్ఐ సోని, ఏఎస్ఐ కట్టమల్లు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో రాణించిన యువకుడికి సీపీ ప్రశంస

హనుమకొండ టౌన్: అంతర్జాతీయ కరాటే పోటీల్లో రాణించిన హెడ్‌కానిస్టేబుల్ ఆనందం కుమారుడు సాయి వంశీని బుధవారం సీపీ అంబర్ కిషోర్ ఝా అభినందించారు. గత నెల 7వ తేదీ నుంచి 10వరకు గోవాలో జరిగిన 24వ ఎఫ్ఎస్‌కెఎ వరల్డ్‌కప్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో సాయి వంశీ స్పారింగ్ విభాగంలో రజిత పతకం, కాటా విభాగంలో కాంస్య పతకాన్ని గెలుచుకొని తన సత్తాను చాటుకున్నాడు. ఈ సందర్భంగా సాయి వంశీని సీపీ సత్కరించిచారు.

చకచకా సర్వే డేటా ఎంట్రీ

బల్దియా పరిధిలో విధుల్లో 500మందికి పైగా ఆపరేటర్లు ● మరో రెండు రోజుల్లో ముగియనున్న ఆన్‌లైన్ ప్రక్రియ



మెప్మా కార్యాలయంలో డాటా ఎంట్రీ చేస్తున్న ఆపరేటర్లు

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కులగణన కుటుంబ సర్వే డాటా ఎంట్రీ వేగంగా జరుగుతోంది. గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో నిర్వహించిన సర్వే వివరాలను ఆపరేటర్లు కంప్యూటర్లలో నిక్షిప్తంచేస్తూ ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. బల్దియా పరిధిలోని హనుమకొండ, వరంగల్, కాజీపేట ప్రాంతాలతో పాటు విలీనగ్రామాల ప్రజల కుటుంబ వివరాలను డాటా ఎంట్రీ ఆపరేటర్లు కంప్యూటరైజ్ చేస్తున్నారు. ఈ పనులకుగాను నగరంలో ఉన్న బీటెక్, డిగ్రీతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన నిరుద్యోగ యువకులను ఎంపిక చేసి ఆన్‌లైన్ పనులు చేయిస్తున్నారు. దీంతో హనుమకొండ, వరంగల్ నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు యువకులతో కిక్కిరిశాయి. సర్వే చేసిన దరఖాస్తులను పర్యవేక్షణ అధికారులు వరుసక్రమంలో ఆపరేటర్లకు ఇచ్చి ఆన్‌లైన్ ప్రక్రియను సుగమం చేస్తున్నారు.

98 శాతం పనులు పూర్తి

సమగ్ర కులగణన కుటుంబ సర్వే డాటా ఎంటీ ప్రక్రియ ఇప్పటి వరకు వరంగల్ కాశిబుగ్గ డీసీ (డిప్యూటీ కమిషనర్) పరిధిలో ఇప్పటి వరకు 98 శాతం పని పూర్తయ్యింది. అదే విధంగా కాజీపేట డీసీ పరిధిలో కొంత సాంకేతిక లోపం ఏర్పడడంతో 80 శాతం వరకు ఆన్‌లైన్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఒక్కో దరఖాస్తును ఆన్‌లైన్ చేసేందుకు ఆపరేటర్లకు రూ.30 చెల్లిస్తున్నారు. సుమారు 500 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లు వరంగల్, హనుమకొండ కలెక్టర్ కార్యాలయాల నుంచి యూజర్, పాస్‌వర్డ్ పొంది డాటా ఎంట్రీ పనులు చేస్తున్నట్టు తెలిపారు. మెప్మా కార్యాలయం, బల్దియా ప్రధాన కార్యాలయం, ఏనుమాముల మార్కెట్, వాగ్దేవి కళాశాల, నక్కలగుట్ట వాటర్‌ట్యాంక్, సీడీసీ, ఎస్వీఎస్, ఎస్ఆర్ కళాశాలలో కుటుంబ సర్వే డాటా ఎంట్రీ పనులు కొనసాగుతున్నాయి. అయితే హనుమకొండ పరిధిలో 26 డివిజన్‌లు, వరంగల్ పరిధిలో 24 డివిజన్‌లు, వర్ధన్నపేట పరిధిలో 13 డివిజన్‌లు, పరకాల పరిధిలో 3 డివిజన్‌ల కుటుంబసభ్యుల వివరాలను కంప్యూటర్లలో పొందుపర్చారు. కాశిబుగ్గ డీసీ పరిధిలో ఒకలక్షకుపైగా దరఖాస్తులు, కాజీపేట డీసీ పరిధిలో 1.10లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు వెల్లడించారు. ఒకటి, రెండు రోజుల్లో డాటా ఎంట్రీ పనులు పూర్తి అవుతాయని ఎన్యుమరేటర్లు తెలిపారు. వరంగల్ కలెక్టర్ సత్యశారదాదేవి, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశాల మేరకు ఈ డాటా ఎంట్రీ కార్యక్రమం జరుగుతోందని అక్కడి అధికారులు తెలిపారు.

సౌకర్యాలు నిల్

పది రోజులుగా పనిచేస్తున్న డాటా ఎంట్రీ చేస్తున్న ఆపరేటర్లకు కనీస సౌకర్యాలు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 500 మంది ఆపరేటర్లలో సుమారు 300 మందికి పైగా మహిళలే ఉండడంవల్ల మంచి నీరు, మరుగుదొడ్లు, కొన్నిచోట్ల కూర్చోవడానికి కుర్చీలు కూడా లేకపోవడం వల్ల నేలపై కూర్చుని పనిచేస్తున్నామని తెలిపారు. ఇంకా ఒక్కొక్కరికి 10 దరఖాస్తులు మాత్రమే ఇవ్వడంతో ఒక గంటలో పని పూర్తి అవుతోందని, రోజంతా ఖాళీగా కూర్చోవాల్సి వస్తోందంటున్నారు.

98 శాతం పని పూర్తయ్యింది..

నిమ్మ కృష్ణారెడ్డి, కాశిబుగ్గ డిప్యూటీ కమిషనర్



పది రోజులుగా డాటా ఎంట్రీ ఆపరేటర్లతో సర్వే పత్రాలు ఆన్‌లైన్ చేయిస్తున్నాం. ఇప్పటివరకు 66 డివిజన్‌ల పరిధిలో 98శాతం పని పూర్తయ్యింది. ఇంకా మిగిలిన కొద్దిపాటి దరఖాస్తులను ఒకటి, రెండు రోజుల్లో పూర్తి చేస్తాం. ఎక్కడ పొరపాట్లు జరగకుండా ఒకటికి రెండుసార్లు పరిశీలించిన తర్వాతనే ఆన్‌లైన్ చేస్తున్నాం.

22న కొప్పూర్‌లో కోలాట ప్రదర్శన

గిన్నిస్ బుక్ రికార్డు కోసం ఏర్పాట్లు ● మంత్రి పొన్నంకు ఆహ్వానం



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వానం అందజేస్తున్న నిర్వాహకులు

భీమదేవరపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అధ్యాత్మిక రంగంలో బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు నమోదుకోసం జరిగే కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆలయ చైర్మన్ కాసం రమేష్‌గుప్తా, నిర్వాహకురాలు శ్వేతలు బుధవారం ఆహ్వానించారు. కొప్పూర్ పంచముఖ ఆంజనేయస్వామి ఆల యంలో ఈ నెల 22న అధ్యాత్మిక రంగంలో ప్రపంచ రికార్డు నమోదు కోసం హనుమాన్ చాలీసా మహా బృందం కోలాట ప్రదర్శన నిర్వహిస్తున్నారు. మహిళా మనులతో కోలాట ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నారు. పంచముఖ ఆంజనేయస్వామి అలయ చైర్మన్ కాసం రమేష్‌గుప్తా, తేజశ్రీ డ్యాన్స్ అకా డమి నిర్వాహకురాలు శ్వేత ఆధ్వర్యంలో మహాబృందం కోలాట ప్రదర్శన హనుమాన్ చాలీసా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆహ్వానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు కాసం రమేష్‌గుప్తా, శ్వేత, మాజీ ఎంపీపీ అశోక్‌ముఖర్జీ, మాజీ జడ్పీటీసీ గద్ద సమ్మయ్య, మాజీ ఎంపీటీసీ గద్ద సంపత్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన న్యాస్ పరీక్ష

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(నాస్) పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. బుధవారం నిర్వహించిన నాస్ పరీక్షలో వరంగల్ జిల్లాలో 105 పాఠశాలల్లో పరీక్ష నిర్వహించగా 2,373 మంది పరీక్ష రాసినట్లు డీఈవో ఎం.జ్ఞానేశ్వర్ తెలిపారు. హనుమకొండ జిల్లాలో 83 పాఠశాలల్లో నిర్వహించగా 2,322 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు డీఈవో డి. వాసంతి తెలిపారు. కాగా, కొన్ని పరీక్ష కేంద్రాల్లో ప్రశ్నాపత్రాలు తెలుగులో రావడంతో ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు పరీక్ష రాసేందుకు ఇబ్బందులకు గురయ్యారు. రెండు జిల్లాల్లో ఇదే పరిస్థితి నెలకొని ఉండగా తెలుగు ప్రశ్నా పత్రాలను ఇంగ్లీష్‌లోకి తర్జుమా చేయడంతో విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ విషయమై విద్యాశాఖాధికారులను వివరణ కోరగా గతంలోని యూడైస్ నుంచి ఎస్‌సీఈఆర్‌టీ విద్యార్థుల సమాచారం తీసుకోవడంతో ఇలా జరిగిందని, అయితే ఎస్‌సీఈఆర్టీ అధికారుల ఆదేశాల మేరకు ఎస్‌సీఈఆర్‌టీ పంపిణీ చేసిన ప్రశ్నా పత్రాలతోనే పరీక్షను నిర్వహించామని, అక్కడక్కడా ప్రశ్నాపత్రాలను తర్జుమా చేయించి విద్యార్థులు పరీక్షలు రాసేలా చర్యలు తీసుకున్నట్లు వారు పేర్కొన్నారు. పలు పరీక్ష కేంద్రాలను డీఈవోలు పరిశీలించారు.

గ్రానైట్ క్వారీల్లో జాయింట్ సర్వేకు సన్నద్ధం

ఐనవోలు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్ క్వారీల్లో అక్రమ తవ్వకాలపై నిగ్గు తేల్చేందుకు జాయింట్ సర్వేకు అధికారులు సన్నద్ధమయ్యారు. వనమాల కనపర్తి, కొండపర్తి గ్రామాల శివార్లలోని ప్రభుత్వ భూముల్లో కొనసాగుతున్న 11 క్వారీలలో జరుగుతున్న కోట్ల రూపాయల గ్రానైట్ అక్రమ తవ్వకాలపై 'ఆంధ్రజ్యోతి'లో వరుసగా కథనాలు ఇటీవల ప్రచురితమైనవి తెలిసిందే. తహసీల్దార్ విక్రమ్‌కుమార్, మైనింగ్ ఆర్ఐ చంద్రకళ, రెవెన్యూ గిర్దావర్ మల్లయ్యలు క్వారీలను సందర్శించి తనిఖీలు చేశారు. తనిఖీల్లో తవ్వకాలకు తీసుకున్న విస్తీర్ణం అనుమతి కంటే ఎక్కువ విస్తీర్ణంలో చేపట్టినట్లు గుర్తించారు. క్వారీల డ్యాకుమెంట్లను తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని గత నెల 25న గడువు విధించారు. అయితే డిసెంబరు 2 వరకు 8 మంది మాత్రమే డాక్యుమెంట్లను అందజేశారు. డ్యాకుమెంట్లను పరిశీలించిన అధికారులు రెవెన్యూ, మైనింగ్ శాఖల సర్వేయర్లతో జాయింట్‌గా ఈ నెల 5 నుంచి సర్వే చేయడానికి సిద్ధమయ్యారు. గ్రానైట్ వ్యాపారంలో పాతుకుపోయిన వ్యాపారులు ఖరీదైన బ్లాక్ గ్రానైట్ బ్లాక్‌లను వెలికితీస్తూ ప్రభుత్వ ఖజానాకు నామమాత్రంగా రాయల్టీ చెల్లిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు స్థానికుల నుంచి సంబంధింత శాఖల కార్యాలయాలకు ఫిర్యాదులు అందాయి. రాజకీయ ఒత్తిళ్లా లేదా ఏ కారణమో తెలియదుకానీ అక్రమ దందాపై మైనింగ్ శాఖ జిల్లా అధికారి ఏ రోజూ విచారణ చేసిన సందర్భాలు లేకపోవడం గమనార్హం.

తెలిసిన వారి పనేనా?

వీడని బ్యాంకు మేనేజర్ హత్య మిస్టరీ

పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్న పోలీసులు

మట్టెవాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో మంగళవారం జరిగిన బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ రాజమోహన్ హత్యపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది ప్రొఫెషనల్ కిల్లర్స్ చేసిన పనేనని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. సుపారీ తీసుకొని హత్య చేయించినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హత్య జరిగిన తీరును పరిశీలిస్తే గొలుసులు, తాళ్లతో కట్టేయడం, తలపైన, శరీరంపై గాయాలు ఉండడంతో కత్తులతో కిరాతకంగా పొడిచినట్లు తెలుస్తోంది. రాజమోహన్‌ను ఒక చోట చంపేసి అతడి కారులోనే తీసుకొచ్చి మరోచోట వదలి వెళ్లడం పరిశీలిస్తే.. ఇదిపథకం ప్రకారమే జరిగిన హత్యగా పోలీసులు భావిస్తున్నారు. ఆర్థిక లావాదేవీలు, భూవివాదాలు, వివాహేతర సంబంధం, దగ్గరి బంధువులతో కుటుంబ తగాదాలు వంటి పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే రాజమోహన్ అన్నదమ్ములను, మిత్రులను, బంధువులను, స్థానికులను పోలీసులు బుధవారం విచారించారు. ఆయనకు ఎవరితో విభేదాలున్నాయో ఆరా తీస్తున్నారు. రాజమోహన్ ఒంటరిగా ఉండడంతో తోడుగా ఉండేందుకు మరో వివాహం చేసుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

సీసీ ఫుటేజీల పరిశీలన

వరంగల్ ఏసీపీ, మట్టెవాడ, సుబేదారి సీఐలు బుధవారం సాయంత్రం హనుమకొండ శ్రీనగర్ కాలనీలోని రాజమోహన్ ఇంటి చుట్టుపక్కల వారిని విచారించారు. రాజమోహన్ ఇంటికి ఎవరెవరు వచ్చేవారు అని పక్కవాళ్లను అడిగి తెలుసుకున్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. సోమవారం రాత్రి తను ఇంటి నుంచి ఎన్ని గంటలకు బయలుదేరాడు.. ఆ సమయంలో అతడితో ఎవరైనా ఉన్నారా.. అని ఆరా తీశారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు రాజమోహన్ ఫోన్ కాల్ డాటా, వీడియో కాల్స్, వాట్సాప్ కాల్స్ ఫోన్ కాల్స్‌ను ఐటీ కోర్ బృందం పరిశీలిస్తోంది. గురువారం అమెరికా నుంచి రాజమోహన్ పెద్ద కుమార్తె శిరీష వరంగల్‌కు వస్తే మరిన్ని విషయాలు తెలుస్తాయని పోలీసులు భావిస్తున్నారు.

నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిది

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వేలాదికోట్ల రూపాయలు కమీషన్లు తీసుకొని బీఆర్ఎస్ నేతలు నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లను ఒక్క కూడా వాడకుండానే రాష్ట్రంలో రూ.1.53కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించి ఆల్‌టైమ్ రికార్డును కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. బుధవారం ఘన్‌పూర్ మండల కేంద్రంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందించి మాట్లాడారు. తనపై నమ్మకంతో ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు ఎమ్మెల్యేగా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఇప్పటికే రూ.745కోట్ల అభివృద్ధి పనులు నియోజకవర్గానికి తీసుకువచ్చానని పేర్కొన్నారు. వచ్చే మార్చి 31 వరకు నియోజవర్గానికి రూ.1000కోట్ల విలువైన అభివృద్ధి పనులు తీసుకువచ్చి తీరుతానని స్పష్టంచేశారు. ఘన్‌పూర్‌లో 45కోట్లతో 100 పడకల ఆస్పత్రి, 30కోట్లతో డిగ్రీ కళాశాల, దేవాదుల ఆర్ఎస్ కెనాల్ మరమ్మతులకు రూ.148 కోట్లు, యంగ్ ఇండియా పాఠశాలకు రూ.200కోట్లు, రెవెన్యూ డివిజన్ కాంప్లెక్స్‌కు రూ.26కోట్లు, తాటికొండ రోడ్డు అభివృద్ధికి రూ.15కోట్లు, రూ. 10కోట్లతో కమ్యూనిటీ భవనాలు మంజూరు ఇచ్చామన్నారు. అనేక ఏళ్లుగా కేంద్రమంత్రిగా పనిచేస్తున్న ఎంపీ కిషన్‌రెడ్డి తెలంగాణకు చేసింది ఏమీలేదన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కాంగ్రెస్ పాలనను చూసి ఓర్వలేకపోతున్నారని తెలిపారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా వానాకాలం (ఖరీఫ్)లో కాళేశ్వరం జలాల అవసరం లేకుండానే 66లక్షల 70వేల ఎకరాల్లో 1.53 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించి రికార్డు సృష్టించామన్నారు. ఏడాదిలో రాష్ట్రంలోని 25,35,964 మంది రైతులకు రూ.20,617 కోట్ల రుణాలను మాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఏడాది కాలంలో 55,143 ప్రభుత్వ ఉద్యోగాలు అందించిన ఘనత రేవంత్‌రెడ్డి ప్రభుత్వానిదని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్ పర్సన్ జూలుకుంట్ల లావణ్య రెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో విజయశ్రీ, నాయకులు బెలిదె వెంకన్న, నరేందర్ రెడ్డి, అంబటి కిషన్‌రాజ్, నాగరబోయిన శ్రీరాములు, బూర్ల శంకర్ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు దేవానాయక్‌కు అభినందనలు



క్రీడాకారుడు దేవానాయక్‌ను అభినందిస్తున్న దృశ్యం

హనుమకొండ సిటీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): హనుమకొండ విలియం కేరీ స్కూల్‌కు చెందిన హ్యాండ్ బాల్ క్రీడాకారుడు దేవానాయక్‌ను పాఠశాల నిర్వాహకులు అభినందించారు. 68వ జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా నుంచి దేవానాయక్ ఎంపికయ్యాడు. పోటీలు ఇటీవలే ఛత్తీస్‌గఢ్‌లో జరిగాయి. జాతీయస్థాయి పోటీల్లో ఉత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించినందుకు బుధవారం పాఠశాల ఇన్‌చార్జి విద్యాకర్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.దేవయ్య, ఫిజికల్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, సునిల్ తదితరులు దేవానాయక్‌ను అభినందించి సన్మానించారు.

నా భర్తను వెతికి పెట్టండి..

పోలీసులు పట్టించుకోవడం లేదంటూ ఆరోపణ

న్యాయం కావాలంటూ మీడియాను ఆశ్రయించిన మహిళ



తన పిల్లలతో బాధిత మహిళ దీపిక

వర్ధన్నపేట రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తన భర్తను వెతికి పెట్టాలంటూ కొన్ని రోజులుగా పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్న మహిళకు న్యాయం లభించడం లేదు. ఫిర్యాదు చేసి రోజులు గడుస్తున్నా కనీసం కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడానికి కూడా పోలీసులు ముందుకు రాకపోవడంతో బాధిత మహిళ మీడియాను ఆశ్రయించింది. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని అంబేద్కర్‌నగర్ గ్రామంలో ఈ ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత మహిళ, ఆమె కుటుంబసభ్యుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

అంబేద్కర్ నగర్ గ్రామానికి చెందిన గుర్రాల దీపికకు 2018లో చెన్నారావుపేట మండలంలోని బాపునగర్ గ్రామానికి బత్తుల శ్రావణ్ కుమార్‌కు వివాహమైంది. వీరికి కుమార్తె శ్రావిక, కుమారుడు సాత్విలు జన్మించారు. శ్రావణ్‌కుమార్ హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ తరుణంలో శ్రావణ్ కుమార్‌కు ఓ యువతితో పరిచయం ఏర్పడింది. దీంతో 6 నెలల కిందట ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఆ యువతిని తీసుకొని శ్రావణ్‌కుమార్ వెళ్లిపోయి సహజీవనం సాగించాడు. విషయం తెలుసుకున్న దీపిక కుటుంబసభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో వారిద్దరిని తీసుకువచ్చి పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ చేసి కాగితాలు రాసుకుని వెళ్లిపోయారు. మళ్లీ 3నెలల కిందట తిరిగి అదే యువతిని తీసుకుని శ్రావణ్ కుమార్ కనపడకుండా వెళ్లిపోయారు. వెళ్లే ముందు దీపికను తన తల్లిగారి ఇంటి (అంబేద్కర్ నగర్) వద్ద దింపేసి వెళ్లిపోయాడు. అప్పటినుంచి ఇప్పటి వరకు వారి ఆచూకీ తెలియరాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ రావడంతో తన భర్తను వెతికి పెట్టాలని మళ్లీ ఇటీవల వరంగల్ మహిళా పోలీసులను బాధితురాలు దీపిక ఆశ్రయించింది. దీంతో వారు వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టాలని సలహా ఇచ్చారు.

పోలీసులు అవమానిస్తున్నారు..: బాధితురాలు దీపిక

పదిహేను రోజుల కిందట నా భర్త శ్రావణ్ కుమార్‌ను వెతికి పెట్టాలని వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను. దీంతో వారు తర్వాత రావాలంటూ చెప్పగా, మళ్లీ నా తల్లిదండ్రులను, పిల్లలను తీసుకుని వెళ్లాను. దీంతో నా భర్త సోదరుడిని తీసుకువచ్చి మాట్లాడి పంపించారు. కానీ ఫలితం లేదు. పోలీసులను అడిగితే అధికారి దుర్భాషలాడుతూ అవమానించాడు. మా అత్తగారి కుటుంబంపై దాడి చేసి రమ్మని ఉచిత సలహాలు ఇస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయమని కోరితే తామేమీ చేయమని బదులిస్తున్నారు. వేరే చోటకి వెళ్లి కేసు పెట్టుకోవాలని దబాయిస్తున్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2410	2080
పల్లికాయ (సూక)	3900	4000
పల్లికాయ (పచ్చిది)	5100	3000
కందులు	-	-
పెసళ్లు	6089	5250
పత్తి	6950	5800
కొత్తపత్తి	-	-
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	12000	9000
తేజ ఏసీ	13000	12000
వండర్‌హాట్ ఏసీ	14100	11000
యూఎస్341ఏసీ	14000	11000
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	7000	3000

- వరంగల్ వ్యవసాయం

అటవీ శాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వణ్యప్రాణి సంరక్షణ దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది బైక్ ర్యాలీ తీశారు. సుబేదారిలోని అటవీ కార్యాలయం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ హంటర్‌రోడ్‌లోని జూపార్కు వరకు సాగింది. అనంతరం జూపార్కులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు శిరీష, బిక్షపతి మాట్లాడారు. ప్రతీ ఒక్కరు వణ్యప్రాణులను సంరక్షించడానికి ముందుండా లన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'కి తరలిన బీసీ సంఘాల నేతలు

కేయూ క్యాంపస్, డిసెంబరు 4,(ఆంధ్రజ్యోతి): బీసీల కులగణనతో పాటు దేశవ్యాప్తంగా బీసీల జనాభాను లెక్కించాలని డిమాండ్ చేస్తూ న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద డిసెంబరు 5, 6వ తేదీల్లో చేపట్టిన చల్లో ఢిల్లీ కార్యక్రమానికి వరంగల్ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ నేతృత్వంలో ఢిల్లీకి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో కేయూ బీసీ సంఘం ఇన్‌చార్జి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరెగం టి నాగరాజుగౌడ్, బొస్కె నాగరాజు, ముత్యాల శ్రీసాయిగౌడ్, శ్రీకాంత్, మహేందర్, మహేశ్, వినోద్, సాయి, వరణ్ పాల్గొన్నారు.

సైబర్ మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

కేయూ క్యాంపస్, డిసెంబరు 4, (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసగాళ్ల పట్ల వి ద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కేయూ పీఆర్‌వో వల్లాల పృథ్వీరాజ్ సూచించారు. బుధవారం కేయూ క్యాంపస్‌లోని బీఫార్మసీ, ఎంఫార్మసీ నూతన విద్యార్థులకు కళాశాల సెమినార్‌హాల్‌లో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నీరడి ప్రసాద్ అధ్యక్షతన సైబర్ క్రైంపై అవగాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. పాస్‌వర్డులు, పిన్ నెంబర్లు బయటి వ్యక్తులకు ఇవ్వొద్దని చెప్పారు. సైబర్ మోసానికి గురైన వెంటనే సహాయం కోసం 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్‌చేయాలని అన్నారు.

కేయూకు 8 మంది ఉద్యోగుల కేటాయింపు

కేయూ క్యాంపస్, డిసెంబరు 4, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీ స్ కమిషన్ ఇటీవల నిర్వహించిన గ్రూప్-4లో నియామకాల్లో వరంగల్ కాకతీయ యూనివర్సిటీకి 8 మంది ఉద్యోగులను కేటాయించారు. ఈ మేరకు బుధవారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి గ్రూప్-4 నూతన నియామకాల ఉత్తర్వులు అందచేయడంతో వర్సిటీకి 8 మంది ఉద్యోగు లను కేటాయించారు. వర్సిటీ నుంచి గ్రూప్-4 ఉద్యోగాల కోసం 10 ఖాళీలను గతంలో టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. అయితే సర్టిఫికేట్ల వెరిఫికేషన్‌లో 10 మందిలో 8 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మరో రెండు పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. అయితే సీఎం రేవంత్‌రెడ్డి నుంచి నూతనంగా ఉద్యోగాల అర్డర్లు అందుకున్న 8 మంది ఉద్యోగులు నేడో, రేపో వర్సిటీలో నూతనంగా గ్రూప్-4 ఉద్యోగులుగా జాయిన్ కానున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 25 మందికి జరిమానా

హనుమకొండ టౌన్, డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి) : డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 25 మందిని బుధవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రాజశేఖర్ రూ. 37,800 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపారు. హనుమకొండ పూరిగుట్టకు చెందిన గుగులోతు వీరన్నకు రెండు రోజులు కమ్యూనిటీ సర్వీసింగ్ శిక్ష విధించడం జరిగిందన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ మరో 13 మందికి రూ.7, 900 జరిమానా విధించారన్నారు.

'వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించాలి'

పోచమ్మ మైదాన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యేటా డిసెంబరు 9న అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని 2005లో ఐక్యరాజ్య సమితి ప్రకటించిందని, ఈ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని జ్వాల వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. అన్ని ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగులతో అవినీతికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించాలని, అవినీతికి వ్యతిరేకంగా పాఠశాలలు, కళాశాలల్లో వ్యాసర చన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని, అవినీతి కేసులపై ఫిర్యాదులకు రాష్ట్ర స్థాయిలో టోల్ ఫ్రీ నంబర్ ప్రకటించాలని లేఖలో పేర్కొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 20 మంది డీబార్

కేయూ క్యాంపస్, డిసెంబరు 4, (ఆంధ్రజ్యోతి): కేయూ పరిధిలో జరుగుతున్న డిగ్రీ రెగ్యులర్ 1, 3, 5 సెమిస్టర్ పరీక్షలలో బుధవారం మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన 20మందిని డిబార్ చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్ర ణాధికారి ఎం.తిరుమలదేవి బుధవారం తెలిపారు. డీబారైనవారిలో ఆదిలాబాద్‌లో 16 మంది, వరంగల్‌లో నలుగుగురు ఉన్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కరానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను టీఎస్‌జీఓస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ కోరారు. ఈ మేరకు సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని పంచాయతీ కార్యదర్శుల ఫోరం బాధ్యులు రాజేందర్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య స్పందిస్తూ జిల్లా పరిధిలోని సమస్యలు పరిష్కరిస్తానని, రాష్ట్రస్థాయి సమస్యలను ప్రభుత్వానికి పంపిస్తానన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో టీఎస్‌జీఓస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, కేంద్ర సంఘం నేతలు శ్యాంసుందర్, సారంగపాణి, కార్యదర్శుల ఫోరం బాధ్యులు ఉన్నారు.

పెద్దపల్లికి గ్రూపు-4కు ఎంపికైన అభ్యర్థులు

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ నిర్వ హించిన గ్రూపు-4 పరీక్షలో ఎంపికైన 208 మంది అభ్యర్థులు పెద్దపల్లిలో నిర్వహించే సీఎం రేవంత్ రెడ్డి సభకు బుధవారం తరలివెళ్లారు. వారికి హనుమకొండ కలెక్టరేట్ ఎదుట 5 బస్సులను ఏర్పాటు చేశారు. వెళ్లే బస్సులను అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి ప్రారంభించారు. సీఎం చేతుల మీదుగా వీరు నియామక పత్రాలు అందుకుంటారు.

అకృత్యాలపై అవగాహన కలిగి ఉండాలి

మడికొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో 'మై చాయిస్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో బుధవారం మహిళలు, బాలికలపై జరుగుతున్న అకృత్యాలు, లైంగిక వేధింపులపై అవగాహన సదస్సు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాలికలకు చిన్నతనం నుంచే బ్యాడ్ టచ్, గుడ్ టచ్ వంటి విషయాలను తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం స్కూల్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిం చారు. కార్యక్రమంలో ఏఎస్సై చంద్రమౌళి, స్కూల్ హెడ్‌మాస్టర్ సంధ్యా రాణి, ఫౌండేషన్ సీనియర్ కౌన్సిలర్ రత్నశ్రీ విజయ, సిబ్బంది, మెట్టు గుట్ట చైర్మన్ రఘు పైడిపాల, నాయకులు బైరి లింగమూర్తి, వస్కుల శంకర్, బిల్ల రవిందర్, గుర్రం జ్యోతి అమర్‌నాథ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలను కలిసిన పరమేష్



నాయకులను కలిసిన నేతలు

వరంగల్ సిటీ, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కె.పరమేష్, పట్టణ అధ్యక్షుడిగా ఎండి. సలీం ఎన్నిక య్యారు. ఆన్‌లైన్‌లో జరిగిన ఎన్నికల్లో వీరు వి జయం సాధించారు. ఈ సంద ర్భంగా వారు బుధవారం రాత్రి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా రేవంత్



కాజీపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా కాజీపేట మండలం కడిపికొండకు చెందిన కట్కూరి రేవంత్ ఎన్నికయ్యారు. బుధవారం రాత్రి రాష్ట్ర కమిటీ నూతనంగా ఎన్నికైన జిల్లా కవి ఏటీని ప్రకటించింది.



అనంతలక్ష్మి ఆయుర్వేద కళాశాలలో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ వస్కుల బాబు, ఫారెస్టు అధికారులు

ఆయుర్వేద కళాశాలలో హరితహారం

ఖిలావరంగల్, డిసెంబర్4 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా 18వ డివిజన్ లేబర్‌కాలనీలోని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో బుధవారం హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫారెస్టు రేంజ్ అఫీసర్ సందీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వస్కుల బాబు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనసూర్య, వైస్ ప్రిన్సిపాల్ కె. అశోక్‌కుమార్, ఫారెస్ట్ అధికారులు రమేష్, జగ్గయ్య, రామయ్య, రమేష్, చిర ంజీవి, శ్రీను, స్థానిక నాయకులు గబ్బెట సుధాకర్, పొగుల కిషోర్, కళాశాల అధ్యాపకులు, సిబ్బ ంది తదితరులు పాల్గొన్నారు .



వరంగల్ మధ్యకోట స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న కార్పొరేటర్ వెల్పుగొండ సువర్ణ-సురేష్, కాంగ్రెస్ నాయకులు, సిబ్బంది

కోటలో స్వచ్ఛభారత్..

వరంగల్ మధ్యకోటలో బుధవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా 37వ డివిజన్ కార్పొరేటర్ వెల్పుగొండ సువర్ణ-సురేష్ ఆధ్వర్యంలో మధ్యకోటలోని స్వయంభూదేవాలయం, శిల్పాల ఆవరణ, ఖుష్‌మహల్, ఏకశిల పిల్లలపార్కు ప్రాంతాలలో పరిసరాలు శుభ్రం చేశారు. ముందుగా అర్బన్ సెంటర్‌లో కార్మికులకు బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంగరబోయిన చందర్, బెడిద వీరన్న, అర్షం రాంబాబు, ప్రతాప్, క్రాంతి, రాజు సానిటరి ఇన్‌స్పెక్టర్ రవిరాజా, జవాన్‌లు షైదం హరినాథ్, రవి, రాజు, దశ రథ్, ప్రసాద్, ఏఎన్‌ఎంలు రాణి మదన్, వైద్య, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలేదీ?

బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్

మిల్స్‌కాలనీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీలను ఎప్పుడు అమలు చేస్తారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ప్రశ్నించారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో రంగశాయిపేట మహంకాళీ దేవాలయం నుంచి పోచమ్మమైదాన్ జంక్షన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ... ఏడాదిగా అరాచకపాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ విజయోత్స వాలను జరుపుకోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో అమలుకాని హామీలిచ్చి రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పేదలు, రైతులు, మహిళలు కాంగ్రెస్‌కు ఓటేసి మోసపో యారన్నారు. ఉన్న పథకాల అమలును కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. మోసపూరిత హామీలిచ్చిన కాంగ్రెస్‌కు ప్రజలు స్థానిక ఎన్నికల్లో గుణపాఠం నేర్పుతారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్‌సా, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, డాక్టర్ వన్నాల వెంకటరమణ,నాయకులు సముద్రాల పరమేశ్వర్, బైరి నాగరాజు, బాకం హరిశంకర్, కనుకుంట్ల రంజిత్, సిద్ధం నరేష్, రఘునారెడ్డి, కుమార్,



రంగశాయిపేట నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

దీన్‌దయాళ్, ఆనంద్, మార్టిన్ లూథర్, శిల్ప, రవీందర్, వాసుదేవ్, రామోజీ, మోహనచారి, అర్జున్, రంజిత్, కార్తిక్, అనిల్‌కుమార్, పరమేష్, అనిల్, నాగరాజు పాల్గొన్నారు.



హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు

కనీస వేతనాలు చెల్లించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్‌లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్, సీఐటీయూ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట ఆశావర్కర్లు ధర్నా చేశారు. ముందుగా సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా రాగుల రమేష్ మాట్లాడుతూ.. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ఆశావర్కర్‌లకు ఇన్సూరెన్స్ రూ.50లక్షలు చెల్లిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. అలాగే అంశాలకు ప్రతీ ఆదివారం, పండుగలకు సెలవులు ప్రకటించాలన్నారు. అనంతరం డీఆర్‌ఓకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ధర్నాలో ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు శ్వేత, యాకుబీ, కె. కల్పన, సంధ్య, రజిత, కవిత, రమ, శోభ, శ్రీవాణితో పాటు సుమారు 200 మంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్కులో పూడిక మట్టి వేయొద్దు

వడ్డెపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్ గోకుల్ నగర్‌లోని సర్వే నంబర్ 184లో గల ప్రభుత్వ పార్కు స్థలంలో పూడిక మట్టి వేయొద్దని హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం గోకుల్‌నగర్‌లో పార్కుకు కేటాయించిన స్థలంలో నాలాల పూడిక మట్టి, బండరాళ్లు వేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు నిరసన ప్రదర్శన, ధర్నా చేశారు. ఈ సందర్భంగా బంక సంపత్ యాదవ్ మాట్లాడుతూ.. 52వ డివిజన్‌లోని డ్రెయినేజీ నాలాలకు సంబంధించిన పనుల్లో తవ్విన మట్టిని, రాళ్లను అక్రమంగా 57వ డివిజన్‌లోని గోకుల్‌నగర్ పార్కు స్థలానికి మున్సిపల్ అధికారులు తరలిస్తున్నారని అన్నారు. పార్కుకు కేటాయించిన స్థలంలో గుట్టలుగా వ్యర్థాలను, నాలాలో తీసిన మట్టిని పోయడం ద్వారా దుర్వాసన వెదజల్లడంతో గోకుల్ నగర వాసులు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి నాలాలో తీసిన పూడిక మట్టిని ఇక్కడికి తరలిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ ధర్నాలో కాంగ్రెస్ శ్రేణులు మాశెట్టి విజేందర్, చింతల రఘు, కాలనీ వాసులు బొంగు రాజు యాదవ్, బి. పవన్‌కుమార్, సారయ్య, బంక చంద్రశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సంజీవ

వడ్డెపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో ఉపాధి కోల్పోయి నష్టపోయిన ఆటో డ్రైవర్లకు జీవన భృతి కింద నెలకు రూ.12వేలు ఇవ్వడంతో పాటు ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని మన తెలంగాణ ఆటోడ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, వరంగల్ ఉమ్మడి జిల్లా ఆటో సంఘాల జేఏసీ చైర్మన్ ఇసంపెల్లి సంజీవ, కో కన్వీనర్లు మందల శ్రీధర్‌రెడ్డి, మడికొండ బాబు , కలకోట్ల జయరాం డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 50 సంవత్సరాలు దాటిన ఆటో డ్రైవర్లకు నెలకు రూ.5వేల చొప్పున పెన్షన్, మృతి చెందిన ఆటో డ్రైవర్లకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతోపాటు ఆటోలకు థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. ప్రమాద బీమాను రూ.10లక్షలకు పెంచాలని, రూ.5లక్షల సాధారణ బీమా అందజేయాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 2019 నూతన వాహన చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తాము ఎదుర్కొంటున్న



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఇసంపెల్లి సంజీవ

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తెలంగాణ రాష్ట్ర ఆటోడ్రైవర్ల సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ నెల 7న నిర్వహించ తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త ఆటోల బంద్‌ను యూనియన్లకు అతీతంగా ఆటోడ్రైవర్లు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జేఏసీ నేతలు మామిడాల వెంకన్న, బొల్లం సంజీవ, పసునూరి బాబు, శంకర్ నాయక్, సాయిలు, భూపాల్, చీకటి కుమార్, గుండా రమేష్, పరశురాములు, నిరంజన్, రమేష్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అజీజ్‌ఖాన్

'సీఎం కప్'ను విజయవంతం చేయాలి

ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అజీజ్‌ఖాన్

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్‌ను విజయవంతం చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, హనుమకొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్ అన్నారు. బుధవారం హనుమకొండలోని జేఎన్‌ఎస్ స్టేడియంలో సీఎం కప్ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అజీజ్‌ఖాన్ మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలోని ఔత్సాహిక క్రీడాకారులను వెలుగులోకి తీసుకొచ్చేందుకు స్వయంగా క్రీడాకారుడైన సీఎం రేవంత్‌రెడ్డి ఈ పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ పోటీలను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో హనుమకొండ జిల్లా క్రీడాకారులు పాల్గొని రాణించి జిల్లాకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని కోరారు. జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి గుగులోత్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. సీఎం కప్ పోటీలను మూడు దశలుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెలక్షన్స్ ఈ నెల 7,8 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరి దస్రూ నాయక్, జిల్లా పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, వివిధ క్రీడా సంఘాల సభ్యులు, పీడీలు, పీఈటీలు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును కోరిన వాల్మీకి బోయలు

మడికొండ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును ఆయన నివాసంలో బుధవారం మడికొండకు చెందిన వాల్మీకి బోయలు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. 1956 సంవత్సరానికి ముందు వాల్మీకి బోయలు ఎస్టీలుగా ఉండేవారని అనంతరం రాజకీయ కారణాలతో బీసీ జాబితాలో చేర్చారన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని చేసిన అనేక ఉద్యమాల వల్ల 2023లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిందన్నారు. ఆ బిల్లును ఆమోదించడంలో కేంద్ర ప్రభుత్వం జాప్యం చేస్తోందనీ, బిల్లు ప్రస్తుత పరిస్థితిపై రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి కేంద్ర ప్రభుత్వం బిల్లు ఆమోదింపజేసే విధంగా చేయాలని ఈ మేరకు వినతి పత్రంలో ఎమ్మెల్యేను కోరినట్లు వారు తెలిపారు. అలాగే వాల్మీకి ఫెడరేషన్ ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వానికి సిఫారసు చేయాల్సిందని కోరామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వాల్మీకి బోయ పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నాగరాజుకు వినతి పత్రం అందజేస్తున్న వాల్మీకి బోయలు

ఎమ్మెల్యేను సన్మానించిన టీచర్స్‌కాలనీ వాసులు..

శంభునిపేట: రంగశాయిపేట రాంగోపాల్ పురం పరిధిలోని టీచర్స్‌కాలనీ వాసులు బుధవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును ఘనంగా సన్మానించారు. కాలనీ అభివృద్ధికి రూ. 40 లక్షలు మంజూరు చేసినందుకు కృతజ్ఞతగా ఎమ్మెల్యేతో పాటు మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సుభాష్‌రావు పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారి ఆదాయం రూ.79 లక్షలు

వరంగల్ కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్ర జ్యోతి): వరంగల్ నగరంలోని చారిత్రక భద్రకాళి అమ్మవారి హుండీల్లో కానుకలను బుధవారం లెక్కించారు. మొత్తంగా రూ.79,36,043 ఆదాయం సమకూరింది. ఇందులో రూ.326 యూఎస్ డాలర్లు, రూ.20 కెనడా డాలర్లు, రూ.10 అరబ్ దిరమ్స్, రూ.25 ఇంగ్లాండ్ ఫౌండ్స్, రూ.5 ఆస్ట్రేలియా డాలర్లు, రూ.10 సింగపూర్ డాలర్లతో పాటు మిశ్రమ బంగారం, వెండి లభించింది. నగదు లెక్కింపు తర్వాత డాలర్లతో పాటు వెండి, బంగారం వి శ్రమాన్ని హుండీలో వేసినట్లు ఈవో, సహా య కమిషనర్ శేషు భారతి తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ పరిశీలకులు డి. అనిల్‌కుమార్‌తో పాటు అర్చకులు భద్రకాళి శేషు, సూపరింటెండెంట్ అద్దంకి విజయ్ కుమార్, స్థానిక కార్పొరేటర్ దేవరకొండ సురేందర్, శ్రీలక్ష్మి వెంకటేశ్వర సేవా సమితికి చెందిన 130 మంది సభ్యులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో అనర్హులను తొలగించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 4 (ఆంధ్ర జ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలోని అనర్హులను తొలగించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోకల సోమశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం హనుమకొండలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో కలెక్టర్ పి. ప్రావీణ్యకు వినతి పత్రం అందజేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా కొంత మందిని ఓటర్ల జాబితాలో నమోదు చేశారని వారిని గుర్తించి జాబితా నుంచి తొలగించాలని సోమశేఖర్ కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సీహెచ్. రవీందర్‌రాజు, పెండెం రాజు, కార్యదర్శి సీఎస్ఆర్ మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన ట్రైయినీ ఐపీఎస్ అధికారి



మొక్క బహూకరిస్తున్న మన్నన్‌భట్

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 04 (ఆంధ్ర జ్యోతి): వరంగల్ పోలీసు కమిషనరేట్‌కు ట్రైయినీ ఐపీఎస్‌గా వచ్చిన మన్నన్‌భట్ బుధవారం బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను కలిశారు. క్యాంపు కార్యాలయంలో కలిసి పూలమొక్కను అందించారు. ఈ సందర్భంగా వరంగల్ నగర భౌగోళిక పరిధిపై కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు.

ఎగ్‌కార్ట్స్ పంపిణీ చేసిన ఎర్రబెల్లి ప్రదీప్‌రావు



వాహనాలను పంపిణీ చేస్తున్న ప్రదీప్‌రావు

వరంగల్‌సిటీ, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ ఎగ్ కార్పొరేషన్ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఓసిటీలో తన నివాసంలో బుధవారం సుమారు 50 మంది నిరుద్యోగ యువతకు కోడిగుడ్లను రవాణా చేసే వాహనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది నెక్ జాతీయ అధ్యక్షురాలు అనురాధ దేశాయ్ డ్రీమ్ ప్రాజెక్టు అని, ఈ స్కీమ్‌తో యువతకు ఉపాధి లభిస్తుందని అన్నారు.

ఆశాలకు రూ.18 వేల వేతనం చెల్లించాలి

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తలకు రూ.18 వేల వేతనం చెల్లించాలని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం బుధవారం వారు వరంగల్ కలెక్టరేట్ కార్యాలయంలో ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కాసు మాధవి మాట్లాడుతూ.. ఆశా వర్కర్లకు పని భద్రత కల్పిండంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లెప్రసీ, పల్స్‌పోలియో, టీబీ బకాయి పారితోషికాలు వెంటనే చెల్లించాలన్నారు.

దివ్యాంగ బాల బాలికలను కాపాడుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి రమేష్‌బాబు

కాళోజీ జంక్షన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగ బాల బాలికలను కంటికి రెప్పలా కాపాడుకోవాలని వరంగల్ జిల్లా జడ్జి జస్టిస్ రమేష్ బాబు అన్నారు. దివ్యాంగుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం హనుమకొండలోని స్పందన మనోవికాస కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దివ్యాంగులకు గుర్తింపు కార్డులు, పింఛన్ కార్డుల జారీ ప్రక్రియను సులభతరం చేయాలని కలెక్టర్‌కు సంబంధిత అధికారులకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ పక్షాన సిఫారస్ చేస్తారని అన్నారు. ఓర్పుతో విద్య నేర్పుతూ మానసిక వికలాంగులకు పరిపక్వత వచ్చే విధంగా కృషిచేస్తున్న సంస్థలను ఆయన అభినందించారు. డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్, హెల్త్ డిపార్ట్ మెంట్ సహకారంతో నిర్వహించిన వేడుకలకు అను రాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ అనితారెడ్డి అధ్యక్షత వహించారు. అనంతర విశిష్ట అతిథిగా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరి క్షమ దేశ్‌పాండే, వరంగల్ జిల్లా జడ్జి జస్టిస్ సాయికుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్ వో మదన్ కుమార్, అశోక్‌రెడ్డి, సుచరిత, వసుధ, హరిత, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం నూతన కమిటీ ఎన్నిక

కాశిబుగ్గ, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): కాశిబుగ్గ ముదిరాజ్ సంఘం నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బిల్ల శివశంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దేవేందర్, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా తిరుపతి, కోశాధికారిగా వేణుగోపాల్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అర్బన్ అధ్యక్షుడు బయ్య స్వామి మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి ఈ కమిటీ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, పవన్, పెద్ద రాజు, మేడి రాజు, సుధాకర్ పాల్గొన్నారు.

నిర్మాణ లోపంతో ఇల్లు కదిలిందేమోనని భయపడ్డా

మడూరి వెంకటేశ్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, బాలాజీనగర్, జనగామ



ఉదయం లేచి బెడ్ మీద కూర్చొని ఉండగా ఒక్కసారిగా భూమి కంపించింది. ఇంట్లో కిచెన్‌లోని వసువులు కదిలాయి. మాది కొత్తగా నిర్మించిన ఇల్లు కావడంతో నిర్మాణ లోపాలతో ఇలా జరిగిందేమోనని ఆందోళనకు గురయ్యా. బయటకు వచ్చి చూసే సరికి.. చుట్టుపక్క వారంతా బయటకొచ్చి తమ ఇళ్లు కూడా కంపించాయని చెప్పారు. దీంతో భూకంపం వచ్చిందని నిర్ధారణకు వచ్చాం. తర్వాత మా ఇంటి సీసీ కెమెరాలు పరిశీలించిన తర్వాత సరిగ్గా 7:27నిమిషాలకు ప్రకంపనలు వచ్చినట్టు రికార్డయ్యింది.

ప్రకంపనలకు గోడ కూలింది



ఆత్కూరి నేతాజీ, శంకరాజుపల్లి, ఏటూరునాగారం

ఉదయం ఒక్కసారిగా ఇల్లంతా ప్రకంపనలు వచ్చాయి. దాంతో భయపడ్డాం. క్షణంలోనే ప్రహరీ కూలిపోయింది. ఇల్లు కూడా కూలుతుందేమో అనుకున్నాం. ఇంట్లోని సామగ్రి కిందపడిపోయాయి.

భయాందోళనకు గురయ్యాం

కలకోట భాస్కరాచారి, కొత్తవాడ, వరంగల్



ఉదయం ఏడున్నర ప్రాంతంలో భూమి కంపించడంతో భయాందోళనకు గురయ్యాం. ఇంట్లో ఉన్న వంట పాత్రలు కిందపడడంతో మా పిల్లలు ఇంట్లోంచి బయటకు పరుగుతీశారు. నేను కూడా బయటకు వచ్చే సరికి పక్క ఇళ్ల వాళ్లు భూకంపం వచ్చిందని చెప్పడంతో నాకు భయమేసింది. ఇంకా కొంచం తీవ్రత ఎక్కువ ఉంటే ఏమై ఉండేదనిపించింది.

భూమి కంపించడంతో భయమేసింది



రహీం, బ్యాంకు ఉద్యోగి ఉర్సు దర్గా ప్రాంతం, వరంగల్

ఒక్కసారిగా భూమి కంపించినట్టు అనిపించడంతో పాటు ఇంట్లో ఉన్న వస్తువులు, మంచాలు.. కదిలాయి. దీంతో ముందు ఆశ్చర్యపోయాం. అనంతరం భూమి కంపిస్తుందని అర్థం చేసుకుని వెంటనే పిల్లలతో సహా ఇంట్లో నుంచి బయటకు వచ్చేశాం. అరగంట పాటు బయట ఉండి కాసేపటికి అంతా మాములుగా ఉండటంతో తిరిగి ఇంట్లోకి వెళ్లాం.

అపార్ట్‌మెంట్‌లోని వారంతా పరుగు తీశారు

గోగుల యాకయ్య, కాజీపేట



భూకంపం వల్ల భయంతో అపార్ట్‌మెంట్ వాసులంతా భయంగా బయటకు పరుగుతీశారు. ఫ్లాట్స్‌లో సామాన్లు కంపించాయి. వెలుపలకు వచ్చాక కూడా చాలా సమయం వరకు ఫ్లాట్లలోకి వెళ్ల లేదు. గంటకు పైగా వేచి చూసిన తరువాతే వెళ్లారు.

ఆలస్యం బతికించింది



భాగ్యలక్ష్మి, టైలర్, ఇందిరానగర్, హనుమకొండ

నాకు హనుమకొండ 8వ డివిజన్ ఇందిరానగర్‌లో టైలర్ షాపు ఉంది. రోజూ ఉదయాన్నే 7:20 గంటల నుంచి 7:30లోపు వచ్చి షాపు తెరుస్తా. కానీ ఇవాళ ఇంట్లో పని వల్ల కాస్త ఆలస్యమైంది. కానీ నేను షాపు వద్దకు చేరుకునే సరికి అప్పటికే షాపు ఉన్న భవనం పోర్టికో కూలింది. అదే రోజులాగే షాపు వద్దకు వచ్చి ఉంటే ప్రాణం పొయ్యేదేమో అని అనిపించింది.

చెరువులోంచి వింత శబ్దం వచ్చింది

బానోత్ వెంకన్న, కేసముద్రం మండలం రేకులతండా



నాతోపాటు మరో ఐదుగురం చెరువులో ఈతకొట్టి తిరిగి వెళుతున్నాం. చెరువు ఒడ్డున గడ్డిలోంచి పాము బుసకొట్టినట్టుగా శబ్ధం రావడంతో భయాందోళనకు గురయ్యాం. పెద్ద పాము ఉండవచ్చని రాళ్లు, కర్రలతో అదే ప్రాంతంలో గాలించాం. కానీ ఏమీ కనిపించలేదు. అయితే ఆ శబ్దం ఆగకుండా రావడంతో ఓ వీడియో తీశా. అయితే భూ కంపనాల వల్ల చెరువు అడుగుభాగం నుంచి శబ్దం వచ్చిందని తెలుసుకుని ఆశ్చర్యపోయాం.

సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలిపా



యాదగిరి, పోలీస్ కానిస్టేబుల్, వంగర, భీమదేవరపల్లి

పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నా. నాలుగు సెకన్ల పాటు భూ ప్రకంపనలు వచ్చాయి. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందించా. వారి ఆదేశాలతో గ్రామస్థులకు భూకంపం విషయమై అవగాహన కల్పించాం. భయపడాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పాం.

భయం వేసింది..

సిద్దబోయిన ఆనంద్, సమ్మక్క పూజారి



పూజ సమయంలో మేడారం అమ్మవారి గద్దెల ప్రాంగణం కంపించడం చూసి ఏం జరుగుతుందో అర్థం కాలేదు. కాసేపటికి తేరుకున్నాం. భూమి ప్రకంపనల అనంతరం భూ కంపం వచ్చిందని, అది మళ్లీ వస్తుందని భక్తులు చర్చించుకోవడం, మీడియాలో రావడంతో మరింత భయం అనిపించింది. ఈ తీవ్రత 5రోజుల వరకు ఉంటుందంటున్నారు.

మూడో జోన్‌లో తెలంగాణ.. నష్టం జరుగదు

పూరే గురునాథరావు, జిల్లా సైన్స్ కమ్యూనికేటర్, మహబూబాబాద్



భూకంపాలు.. వచ్చే ప్రాంతాలను ఐదు జోన్‌లుగా విభజిస్తారు. రిక్టర్ స్కేల్‌పై 1, 2 జోన్ల పరిధిలో వచ్చే భూకంపాలు పెద్దగా గుర్తించే అవకాశాలు ఉండవు. 3వ జోన్‌లో మాత్రం కొంత ప్రకంపనల ప్రభావం కన్పిస్తుందే తప్ప.. పెద్దగా నష్టం కలిగించదు. తెలంగాణ ప్రాంతం మూడోజోన్‌లో ఉండడంతో నష్టం కూడా జరిగే అవకాశాలు లేవు. 4, 5వ జోన్లలో భూకంపం తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఆస్తి, ప్రాణనష్టం జరుగుతుంది. ఉదాహరణకు 2001 గుజరాత్ భూకంపం 7.7 రిక్టర్ స్కేల్. 2004 ఇండోనేషియా భూకంపం (సునామీతో పాటు) 9.1 రిక్టర్ స్కేల్.. 2015 నేపాల్ భూకంపం 7.8 రిక్టర్ స్కేల్‌తో పాటు హిమాలయ పర్వతాల్లో కూడా చోటు చేసుకుంటాయి.

భవిష్యత్‌లో ఎలాంటి ప్రమాదాలకు తావులేదు..

ప్రొఫెసర్ రాగి మల్లికార్జున్‌రెడ్డి, కేయూ జియాలజీ విభాగాధిపతి



1969 నుంచి గతంలోనూ అనేక దఫాలుగా తెలంగాణ ప్రాంతంలో భూకంపాలు నమోదయ్యాయి. భూమిలోని భ్రంశాలు (పగుళ్ల) కారణంగా భూకంపాలు సంభవిస్తాయి. భద్రాచలం, కిన్నెరసాని, గోదావరి లోయ ప్రాంతాల్లో భూకంపాల భ్రంశాలు ఎక్కువగా ఉన్నాయి. 2018లో భద్రాచలం ప్రాంతంలో స్వల్పంగా భూమి కంపించింది. బుధవారం సంభవించిన భూకంపం మన దగ్గర 5.3గా నమోదవగా.. అదే సమయంలో అమెరికాలోని పలు ప్రాంతాల్లోనూ రికార్డు అయింది. భవిష్యత్‌లోనూ మన ప్రాంతానికి భూకంపం వల్ల తీవ్ర నష్టలేమీ ఉండదు. ప్రజలు భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదు. ఇటీవల ఏటూరునాగారం ప్రాంతంలో భారీవృక్షాలు నేలకూలి పోవడానికి బుధవారం సంభవించిన భూకంపాలకు ఎలాంటి సంబంధం లేదు. బొగ్గు గనుల తవ్వకాల వల్ల కూడా కాదు.

భయపడాల్సిన అవసరం లేదు..

ప్రొఫెసర్ వడ్డె రవీందర్, కేయూ రసాయన శాస్త్ర విశ్రాంతాచార్యులు, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ జాయింట్ సెక్రెటరీ



బుధవారం వచ్చిన భూకంపం గురించి భయపడాల్సిన అవసరం లేదు. తెలంగాణ ప్రాంతం దక్కన్ పీఠ భూమి కావడం వల్ల భూకంపల తీవ్రత ప్రమాదకర స్థాయిలో ఉండదు. జరిగిన భూకంపం తీవ్రత 5.3 నమోదైంది. అందుకే ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం లేదు. ప్రకంపనల తీవ్రత 5.7 మించితేనే ప్రమాదకరం. మళ్లీ భూకంపం వస్తుందనే ప్రచారంతో భయందోళనకు గురి కావద్దు. అయితే బుధవారం సంభవించిన భూకంపం విషయంలో లోతైన పరిశోధనలు జరగాలి అప్పుడే పూర్తి వివరాలు వెలుగులోకి వస్తాయి.



మహబూబాబాద్‌లో భూ ప్రకంపనలతో ఓ ఇంట్లో కిందపడిన వంట గిన్నెలు



భయందోళనలతో బయటకు వచ్చి చర్చించుకుంటున్న ప్రజలు



భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ క్రీడా మైదానంలో ఏర్పడిన రంధ్రం

భూకంపం.. భయం.. భయం

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడు సెకన్ల పాటు కంపనాలు
- మేడారం కేంద్రంగా వచ్చిందని తెలియడంతో మరింత ఆందోళన

భూపాలపల్లి / ములుగు/ మహబూబాబాద్/ జనగామ / వరంగల్ సిటీ/ హనుమకొండ సిటీ , డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : భూ కంపం.. ఏ నోట విన్నా ఇదే చర్చ. బుధవారం ఉదయం7:27నిమిషాలకు వచ్చిన ప్రకంపనలతో ఉమ్మడి వరంగల్ జిల్లా వాసులు భయంతో వణికిపోయారు. మొత్తం మూడు సెకన్ల పాటు భూమి కంపించడంతో మొదట ఏం జరిగిందో అర్థం కాక గందరగోళానికి గురయ్యారు. తొలుత ఇళ్లపై కోతులు దుంకడం, సామగ్రి పడేయడం లాంటివి చేసి ఉంటాయని భావించారు. అలాంటిదేమీ లేకపోవడం, ఈ లోపు సోషల్‌మీడియా, న్యూస్ చానళ్ల ద్వారా భూకంపం సంభవించిందని తెలుసుకుని భయపడ్డారు. ప్రకంపనల సమయంలో ఆందోళనకు గురై ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీసిన వారంతా గంటల తరబడి రోడ్లపైనే ఉండి చర్చించుకోవడం కనిపించింది. ఉదయం వేళ ప్రజలంతా తమతమ పనుల్లో నిమగ్నమైన సమయంలో ఒక్కసారిగా భారీ శబ్దాలు రావడంతో ఏమి జరుగతుందోనని అయోమయానికి గురయ్యారు.

అసాధారణ రీతిలో కుక్కల అరవడం, పక్షులు అటూఇటూ ఎగరడాన్ని ప్రత్యక్షంగా చూసిన వారు భయంతో వణికిపోయారు. కాంక్రీటు బిల్డింగులు, పెంకుటిళ్లు, రేకుల ఇళ్లు ఒక్కసారిగా కదిలాయి. రేకుల ఇళ్లలో తీవ్రత కాస్త ఎక్కువగా కనిపించింది. భూమి కంపనాలతో ఇళ్లలోని వస్తువులు కదిలాయి. కొన్ని చోట్ల వంటింట్లోని పాత్రలు కిందపడ్డాయి. పలుచోట్ల భూమి కంపించినతీరును సీసీ కెమెరాల్లో దృశ్యాల ద్వారా చూశారు. అలాంటి వీడియోలు మీడియా చానళ్లలో ప్రసారమయ్యాయి. అయితే గోదావరి పరిపాక ప్రాంతంలోని ములుగు జిల్లా మేడారం కేంద్రంగా ఈ భూకంపం సంభవించిందని, దీని తీవ్రత రిక్టర్ స్కేల్ పై 5.3 పాయింట్ల మాగ్నటూడ్‌గా నమోదైందని అధికారులు వెల్లడించడంతో తమకు సమీపంలోనే కంపనాలు ప్రారంభయ్యాయని తెలుసుకుని మరింత ఆందోళనకు గురయ్యారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని ములుగు జిల్లా మేడారం కేంద్రంగా ప్రారంభమైన ఈ ప్రకంపనలు కృష్ణానది పరివాహక ప్రాంతంలో కూడా నమోదైనట్టు నిపుణులు చెబుతున్నారు ఇంకా కూడా ఈ తరహా ప్రకంపనలు చోటు చేసుకునే అవకాశాలున్నాయని ఎన్జీఆర్ఐ నిపుణులు చెబుతుండగా.. తెలంగాణ ప్రాంతం భూకంప జోన్-2లో ఉండటం వల్ల పెద్దగా భయపడాల్సిన పనేమీ లేదని, తక్కువ తీవ్రత కలిగిన భూకంపాల వల్ల నష్టమేమీ లేదని చెబుతున్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో ఇతర చిన్న చిన్న ప్రకంపనాలు చోటు చేసుకోవడం సహజమేనంటున్నారు. ఇటీవల ఇదే అటవీ ప్రాంతంలో 500ఎకరాల్లో సుమారు లక్ష వృక్షాలు నెలకొరగడం, తాజాగా భూప్రకంపనలు చోటు చేసుకోవడంతో ఈ ప్రాంత ప్రజల్లో భయాందోళనలు గురవుతున్నారు.

మేడారం సమ్మక్క, సారలమ్మల గద్దెల వద్ద ఉన్న సీసీ కెమెరాల్లో నమోదైన కంపనాల దృశ్యాలు వైరల్ అయ్యాయి. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ క్రీడా మైదానంలో దాదాపు మీటర్ లోతు సింక్ హోల్ ఏర్పడిందని చెబుతున్నారు. అయితే ఈ రంధ్రం భూకంప తీవ్రత కారణంగా ఏర్పడిందా? లేక మరేదైనా కారణం ఉందా? అనే విషయాన్ని నిపుణులు తేల్చాల్సి ఉంది. మహబూ బాబాద్ పట్టణంతో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. జనగామ జిల్లాలోనూ 3 సెకన్ల పాటు వచ్చిన భూప్రకంపనలతో జనం భయకంపితులయ్యారు. గతంలో జనగామ జిల్లాలో ఎన్నడూ ఈ తరహా భూకంపం రాలేదని కొందరు చెబుతుండగా 30 ఏళ్లకు క్రితం ఓసారి వచ్చినట్లు విన్నామని మరికొందరు చెబుతున్నారు. వరంగల్ జిల్లాలో బుధవారం ఉదయం వచ్చిన భూప్రకంపనలకు ప్రజలు భయాందోళ చెందారు. ఇళ్ల నుంచి జనాలు రోడ్లపైకి వచ్చి చర్చించుకోవడం కనిపించింది. భూమి కంపించిన సమయంలో భవనాలు, చెట్లపై ఉన్న పక్షులు ఒక్కసారిగా ఆకాశంలోకి ఎగిరాయని, కుక్కలు అరిచాయని చెబుతున్నారు. వరంగల్‌లో తొలిసారిగా భూమి కంపించడం చూశామని స్థానికులు చెబుతున్నారు. ప్రకం పనలు హనుమకొండ జిల్లావాసులను భయభ్రాంతులకు గురిచేశాయి. ఇళ్ల నుంచి జనం బయటకు వచ్చారు. రోడ్లు, వాహ నాలపై వెళ్తున్న వారు హైరానా పడ్డారు.

అయితే కొన్ని మండలాలు, ప్రాంతాల్లో 3 సెకన్లు, మరి కొన్ని చోట్ల 5 సెకన్లు మొత్తంగా 3 నుంచి 7 సెకన్ల పాటు భూప్రకంపనలు వచ్చినట్టు చెబుతున్నారు. భూకంపనాల వల్ల కొన్ని చోట్ల గోడలకు స్వల్పంగా బీటలు వారాయి. హనుమకొండ 8వ డివిజన్ ఇందిరానగర్‌లో ఓ భవనం పోర్టికో కూలింది. దీంతో ఆ ఇంట్లో వారు భయాందోళన చెందారు.

భూగర్భ గనులు పదిలం : సింగరేణి జీఎం

భూకంపం సంభవించినా భూగర్భ గనులు పదిలంగానే ఉంటాయని సింగరేణి భూపాలపల్లి ఏరియా జీఎం ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం వచ్చిన భూకంపంతో అండర్‌గ్రౌండ్ గనుల్లో ఏమైనా సమస్యలు ఏర్పడ్డాయా అనే అంశంపై 'ఆంధ్రజ్యోతి' జీఎంను సంప్రదించగా.. భూకంపం వలన అండర్‌గ్రౌండ్‌లో ఎలాంటి కదలికలు లేవని, మిడిల్ షిఫ్ట్ ఉద్యోగులో గనిలోనే పని చేస్తున్నారని తెలిపారు. పని స్థలాలను సైఫ్టి పొంయిటాఫ్‌లో పరిశీలించాకే వర్క్‌మెన్‌లను అలోచేయాలని సంబందిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. భూకంపాలు సంబవించినప్పుడు ఇప్పటి వకరు అండర్ గ్రౌండ్‌లో ఎలాంటి ప్రమాదాలు జరిగిన దాఖలాలు లేవన్నారు. ఉద యం వచ్చిన భూకంపం గురించి ఎన్‌జీఆర్ఐ అధికారులతో మాట్లాడామని, దాని తీవ్రతను గురించి, ఎఫెక్ట్ గురించి మాట్లాడి తెలుసుకున్నామన్నారు.

కంపించిన మేడారం గద్దెలు

ఆందోళనకు గురైన భక్తులు, పూజారులు

మేడారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం దేవ స్థానం సమ్మక్క సారలమ్మ గద్దెలు బుధవారం ఉదయం వచ్చిన భూకంపానికి కదిలాయి. ఆ సమయంలో గద్దెల వద్ద పూజలు చేస్తున్న పూజారులు, మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. ఏం జరుగుతుందో తెలియక ఆశ్చర్యానికి గురయ్యారు. తక్కువ సమయంలో ఎక్కువ ప్రకంపనలు వచ్చాయని, అమ్మవార్ల దీవెనలతో ఎలాంటి ప్రమాదం జరగలేదని వారు భోవోద్వేగానికి గురయ్యారు. ఇక మేడారం మండలంలోని పలుగ్రామాల్లో ఎస్సై శ్రీకాంత్ రెడ్డి పర్యటించి భూ ప్రకంపనలకు భయపడాల్సిన అవసరం లేదని సూచించారు.

యంత్రాంగాన్ని అప్రమత్తం చేశాం

చెట్లు కూలడానికి భూకంపానికి సంబంధం లేదు : కలెక్టర్ దివాకర

మేడారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భూకంపనాల నేపథ్యంలో యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని, ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం అడవులలో కూలిన చెట్లకు బుధవారం ఉదయం వచ్చిన భూకంపానికి ఎలాంటి సంబంధం లేదని కలెక్టర్ దివాకర అన్నారు. బుధవారం ఉదయం మేడారంలో పర్యటించిన ఆయన తొలుత వనదేవతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గద్దెల ప్రాంగణంలో పూజారులతో మాట్లాడి వారి స్వీయ అనుభవాన్ని తెలుసుకున్నారు. ములుగు జిల్లాలో భూకంపం రావడం మొదటిసారి ఏమి కాదని ఇంతకు ముందు చాలా సార్లు వచ్చిందన్నారు. కానీ ఈసారి గతంలో కంటే ఎక్కువ తీవ్రత ఉందని, ప్రజలు అపోహలను నమ్మవద్దని సూచించారు. సైక్లోన్ రెయిన్‌లకు భూమిలో జరిగే మార్పులకు సంబంధం ఉండదని అన్నారు. 2001 నుంచి ఇప్పటి వరకు వరుసగా 5 సార్లు భూమి కంపించిందని 2001లో 3సార్లు, 2023 ఫిబ్రవరిలో ఒక్కసారి 3వ వంతు తీవ్రతతో వచ్చిందని అలాగే ఇప్పుడు 5.3 తీవ్రతతో వచ్చిందని అందుకే అందరికీ అర్థమైందన్నారు. 7కంటే ఎక్కువ తీవ్రత వస్తే ప్రమాదం ఉంటుందన్నారు. చెట్లు కూలిపోంది రెండు తుపానులు కలసినందుకు విధ్వంసం జరిగిందన్నారు. గతంలో కంటే ఎక్కువ భూకంప తీవ్రత ఉన్నా జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, నష్టాలు జరగలేదని తెలిపారు. ఆయన వెంట ఏపీవో రాజ్‌కుమార్, తహసీల్దార్ గిరిబాబు, అధికారులు, పూజారులు, ప్రజలున్నారు. ఇక ఉదయం రెండు సెకండ్లపాటు భూమి కంపించడంతో తాను సైతం ఆందోళనకు గురై ఇంటి నుంచి బయటకు వచ్చానని కలెక్టర్ దివాకర ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంఘటన జరిగిన వెంటనే అన్నిశాఖల అధికారులను అప్రమత్తం చేశామని, ఏమైనా ప్రాణనష్టం, ఆస్తినష్టం జరిగితే తెలియజేయాలని అధికారులకు సూచించామన్నారు. జిల్లాలో చిన్నచిన్న ఇళ్లు ఉన్నవారి వివరాలను సేకరించాలని ఆయన అధికారులను ఆదేశించారు.



పూజారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

రామప్పకు ముప్పు వాటిల్లలేదు

ఆర్కియాలజీ డిప్యూటీ సూపరింటెండెంట్ దేశాయి



ఆలయ పైకప్పును పరిశీలిస్తున్న పురావస్తుశాఖ అధికారులు

వెంకటాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో భూకంపం సంభవించడం వల్ల ప్రపంచ ప్రఖ్యాతిగాంచి యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి ఎలాంటి ముప్పు వాటిల్లలేదని ఆర్కియాలజీ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ దేశాయి వెల్లడించారు. బుధవారం ఉదయం భూకంపం సంభవించిన అనంతరం కేంద్ర పురావస్తుశాఖ అధికారులు, సాంకేతిక బృందం రామప్పను సందర్శించింది. రామప్ప రమణీయత, శిల్పాలు, దేవాలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. భూకంపం సంభవించడం వల్ల రామప్పకు ఎలాంటి హాని జరుగలేదని స్పష్టం చేశారు. ఎందుకంటే రామప్ప దేవాలయానికి తేలికైన ఇటుకలు ఉపయోగించడం వల్ల ఎర్త్‌క్వార్క్ రెసిస్టెంట్ ఆర్కిటెక్చర్‌గా మారదని, పునాది వేయడానికి ముందు వారు సాండ్‌బాక్స్ టెక్నాలజీ అనే సాంకేతికతను ఉపయోగించినట్టు వివరించారు. భూకంపాల వల్ల నష్టం జరుగకుండా ఇందుకోసం ఆకాలంలోనే మూడుమీటర్ల లోతు మట్టిని తవ్వ అందులో ఇసుక, గ్రానైట్ పౌడర్, బెల్లంపొడి నింపడం వల్ల ఏదిశ నుంచి వైబ్రేషన్ వచ్చినా నియంత్రించుకునే శక్తి వాటికి ఉందని పేర్కొన్నారు. భూకంపాలను తట్టుకోవడానికి పైకప్పు, స్తంభాలపై కొన్ని రంధ్రాలు ఉంటాయని, సాండ్‌బాక్స్ టెక్నాలజీతోపాటు ఇనుప డోవెల్‌ను, తేలియాడే ఇటుకలు భూకంపాలను తట్టుకోగల శక్తి ఉంటుంది. ఎలాంటి భూకంపాలు వచ్చినా రామప్ప దేవాలయానికి తట్టుకోగల శక్తి ఉంటుందని స్పష్టం చేశారు. ఆయనవెంట ఆర్కియాలజీ ఏఈ కృష్ణచైతన్య, కేంద్ర పురావస్తుశాఖ జిల్లా అధికారి నవీన్‌కుమార్, తదితరులున్నారు.

మేడిగడ్డ బ్యారేజీ లెవల్స్ పరిశీలన



బ్యారేజీ గేట్లు, పిల్లర్లను పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

మహదేవపూర్ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భూకంపనాల నేపథ్యంలో మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీ అధికారులు అప్రమత్తమయ్యారు. బ్యారేజీ వద్ద ఉన్న కంట్రోల్ రూం కూడా కంపించిందని, దీంతో అధికారులంతా బయటకు పరుగులు తీసినట్టు తెలిసింది. దీంతో అధికారులు హుటాహుటిన బ్యారేజీలో కుంగుబాటుకు గురైన ఏడో బ్లాక్‌ను పరిశీలించారు. బ్లాక్‌లో రోజు వారి లెవల్స్‌ను పరిశీలించాక ఎలాంటి తేడాలు లేవని తేలడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇంజనీర్లు, సిబ్బంది బ్యారేజీలోని పిల్లర్లు, వంతెన, గేట్లను తనిఖీ చేశారు. కాగా, భూకంపం సంభవించడానికి కాళేశ్వరం ప్రాజెక్టు ఓ కారణమే అంటూ ఓ శాస్త్రజ్ఞుడు చేసిన వ్యాఖ్యలతో అందరి దృష్టి మేడిగడ్డ వైపు మళ్లింది. బ్యారేజీ నిర్మాణలతో భూకంపాలు సంభవిస్తే కాళేశ్వరం ప్రాజెక్టు కంటే ముందు ఆ ప్రాంతానికి దగ్గరలో తుపాకులగూడెం బ్యారేజీ ప్రభావమే అయి ఉండొచ్చు కదా.. అని ఓ నిపుణుడు చెప్పుకొచ్చారు.

హెచ్చరించే స్థాయిని దాటుతున్న ప్రకృతి

సుతారి సతీష్, పర్యావరణవేత్త



అభివృద్ధి, ఆధునికత రూపంలో మానవుడు ప్రకృతి విధ్వంసానికి పాల్పడుతున్నాడు. తీవ్రంగా ప్రభావితమవుతున్న ప్రకృతి మనిషిని హెచ్చరించే స్థాయిని దాటి మొన్న టోర్నడో, నేడు భూకంపం రూపంలో ఆగ్రహిస్తున్నా ఎవరికీ అర్థం కావడం లేదు. మనిషి మారాలి.. లేకుంటే ప్రకృతే మారుస్తుంది..

మేడారం మిస్టరీ!

- ప్రకృతి వైపరీత్యాలకు కేంద్ర బిందువుగా అభయారణ్యం
- కొండాయిపై జంపన్నవాగు ఉప్పెనతో 8 మంది బలి
- టోర్నడో బీభత్సంతో నేలకూలిన వనం
- ఇప్పుడు భూకంపం పుట్టింది ఇక్కడే
- భక్తుల్లో వ్యక్తమవుతున్న ఆందోళన

ములుగు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క సారలమ్మల వీర చరిత్ర విశ్వవ్యాపితమైనా రూపంలేని ఆ తల్లుల మహిమ ఇప్పటికీ విఎస్టరీయే.. వనదేవతలుగా కోటానుకోట్ల భక్తుల పూజలందుకుంటూ భక్తిశిఖరంపై కొలువయ్యారీ దేవతలు. మేడారం ఊరి పేరు స్మరిస్తేనే ఆధ్యాత్మికతతో పారవశ్యాన్ని పొందే భక్తులకు గత రెండేళ్లుగా ఈ ప్రాంతం వార్తల్లో ప్రముఖంగా నిలుస్తుండటం, ప్రకృతి వైపరీత్యాలకు కేంద్రబిందువుగా మారుతుండటం ఆందోళన కలిగిస్తోంది. నిగ్గుతేల్చలేని నిగూడ రహస్యాలతో అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. బుధవారం ఉదయం తెలుగు రాష్ట్రాలను కంపింపజేసిన భూకంప కేంద్రం మేడారం-ఐలాపూర్ అడవుల్లో శాస్త్రవేత్తలు గుర్తించడంతో స్థానికులతో పాటు వనదేవతల భక్తులకు ఆందోళనకు గురిచేస్తోంది. అసలు మేడారం చుట్టూ ఏంజరుగుతోంది..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 2023 జూలై 27న ములుగు జిల్లాలో భారీ వర్షం కురిసింది. జంపన్నవాగుకు ఊహించని విధంగా వరద పోటెత్తడంతో ఉప్పెనలా మారింది. మేడారం గ్రామంపై విరుచుకుపడగా ఇళ్లన్నీ మునిగిపోయాయి. జనం పైకప్పుపైకి ఎక్కి ప్రాణాలు కాపాడుకున్నారు. తొలిసారి జంపన్నవాగు జలాలు వనదేవతల గద్దెలను ముంచెత్తాయి. ఈ విపత్తును చూసిన స్థానికులు, భక్తులు భయాందోళన వ్యక్తంచేశారు. ఇదే సమయంలో గోదావరిలో అంతర్ధానమయ్యే క్రమంలో మేడారానికి 10కిలోమీటర్ల దూరంలోని ఏటూరునాగారం మండలం కొండాయి గ్రామంపై జంపన్నవాగు జలపంజా విరిసింది. దీంతో ఎనిమిది మంది మృత్యువాతపడ్డారు. సాధారణంగా గోదావరి నది ఉగ్రరూపం దాల్చుతుండటం పరివాహక ప్రజలకు తెలిసిందే. కానీ, మేడారం భక్తులు పుణ్యపుష్కరిణిగా కీర్తించే జంపన్నవాగు జనాన్ని బలితీసుకోవడం భక్తుల్లో చర్చకు దారితీసింది. ఈఏడాది ఆగస్టు 31ఐలాపూర్ అడవుల్లో పుట్టిన రాకాసి సుడిగాలి మేడారం సమీపంనుంచి తాడ్వాయి వరకు అభయారణ్యాన్ని అతలాకుతలం చేసింది. సుమారు 500ఎకరాలలో లక్షకు పైగా భారీ వృక్షాలు నేలకూల్చింది. ఊహకందని ఈ విపత్తును చూసినవారంతా నోళ్లెళ్లబెట్టారు. తల్లులకు కోపం వచ్చిందా..? అనే చర్చా జరిగింది. పర్యావరణవేత్తలు, పలువురు శాస్త్రవేత్తలు వచ్చి పరిశీలించారు. అరేబియా మహాసముద్రం, బంగాళాఖాతంలో ఒకేసారి తుపానులు పుట్టడం, ఆకాశంలో మేఘాలు విస్ఫోటనం చెందడంతో ఏర్పడ్డ భారీ సుడిగాలి కారణంగా చెట్లు నేలకూలినట్లు ప్రాథ విక నివేదిక ఇచ్చారు. కానీ, దీనిపై ఇప్పటికీ శాస్త్రీయంగా స్పష్టమైన సమాధానం దొరకలేదు. తాజాగా 5.3తీవ్రతతో భూమి కంపించడం, భూకంప కేంద్రం మేడారానికి ఉత్తరదిశలోని ఐలాపూర్ సమీపంలో గుర్తించడం వనదేవతల భక్తులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. మేడారంతోపాటు ఐలాపూర్‌లో కూడా సమ్మక్క జాతర జరుగుతుంది. అక్కడ కూడా వనదేవతలకు గద్దెలుండగా రెండేళ్లకోసారి వేలమంది భక్తులతో ఉత్సవం చేస్తారు. ఇదిలా ఉంటే 2024మేడారం మహాజాతర జరిగిన తర్వాత ముగ్గురు వనదేవతల పూజారులు కన్నుమూశారు. వీరిలో ఇద్దరు సమ్మక్క పూజారులు కాగా ఒకరు సారలమ్మ పూజారి. తల్లులు కొలువైన ఈ పుణ్యస్థలాల చుట్టూరా వరుస ప్రకృతి విపత్తులు సంభవించడం, కొద్దిరోజుల వ్యవధిలోనే ముగ్గురు పూజారులు మరణించడంపై భక్తుల్లో రకరకాల చర్చలు జరుగుతున్నాయి. ఎవ్వరి విశ్వాసాలకు తగిన విధంగా వారు అభిప్రాయపడుతున్నారు.

తల్లులకు ఆగ్రహం కలిగిందనో.. జాతర నిర్వహించడంలో లేక మేడారంలో ఏదైనా లోపం కలిగిందనే సందేహాలను వ్యక్తపరుస్తున్నారు. ఏదేమైనా ప్రభుత్వం మేడారం చుట్టూ సంభవిస్తున్న ప్రకృతి విపత్తుల మిస్టరీని నిగ్గుతేల్చేందుకు శాస్త్రీయ అధ్యయనం చేయించి జనంలో నెలకొన్న సందేహాలను నివృత్తి చేయాలని సర్వత్రా కోరుతున్నారు.



మేడారంలో మునిగిన ఇళ్లు (ఫైల్)



ఆగస్టు 31న మేడారం-తాడ్వాయి మధ్య నేలకూలిన వృక్షాలు (ఫైల్)

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం
5 డిసెంబరు 2024

కౌన్సెలింగ్

పిల్లలకు దగ్గు మందు ఇవ్వొచ్చా?

డాక్టర్! పిల్లలకు దగ్గు వచ్చినప్పుడల్లా మెడికల్ షాపులో దొరికే దగ్గు మందు తాగిస్తూ ఉంటాం! ఇలా తాగించటం మంచిదేనా? పదే పదే దగ్గు మందు తాగించటం వల్ల పిల్లల ఆరోగ్యం దెబ్బ తింటుందా? అసలు దగ్గుకు ఎలాంటి చికిత్స ఇప్పించాలి?

- ఓ సోదరి, హైదరాబాద్.

పిల్లల దగ్గుకు కారణాన్ని కనిపెట్టి చికిత్స చేయాలి. అలాంటి చికిత్సతో దగ్గు తగ్గుతుంది. పిల్లల్లో దగ్గుకు ఎన్నో కారణాలుంటాయి. ఉబ్బసం, అలర్జీ, సాధారణ దగ్గు... ఇలా ఏ కారణం వల్లైనా దగ్గు మొదలవ్వొచ్చు. అయితే ఎలాంటి దగ్గు కనిపించినా, వెంటనే దగ్గు మందులు కొనేసి వాడేస్తూ ఉంటారు. ఇది సరి కాదు. 'దగ్గు ఎందుకొస్తోంది? అది ఎలాంటి దగ్గు?' అనే విషయాలను అర్థం చేసుకుని మూల కారణానికి చికిత్స చేయాలి. దగ్గుతో పాటు, ముక్కు నుంచి నీరు కారుతూ, పిల్లి కూతలు వినిపిస్తుంటే దాన్ని అలర్జీగా భావించి అలర్జీని తగ్గించే మందులు వాడాల్సి ఉంటుంది. వాటితోపాటు అలర్జీ కారకాలను గుర్తించి వాటికి దూరంగా ఉంచాలి. దగ్గుతో పాటు ఆయాసం ఉంటే, ఉబ్బసంగా భావించి అందుకు తగిన ఇన్‌హేలర్లు వాడాల్సి



ఉంటుంది. సాధారణ దగ్గు, జలుబు అయితే 3 నుంచి 5 రోజుల్లో తగ్గుతుంది. ఆ సమయంలో సరిపడా నీళ్లు తాగిస్తూ, ఆవిరి పడితే సరిపోతుంది. ఉబ్బసం దగ్గును నెబ్యులైజేషన్‌తో తగ్గించవచ్చు. ఒక్కో రకం దగ్గుకు ఒక్కో రకం చికిత్స ఇవ్వాల్సి ఉంటుంది. అయితే మెడికల్ షాపుల్లో దొరికే దగ్గు మందుల్లో కాంబినేషన్ డ్రగ్స్ ఉంటాయి. కొన్నిట్లో అలర్జీ నివారిణులైన యాంటీ హిస్టమిన్లు ఉంటాయి. మరికొన్నిట్లో కోడీన్, హైడ్రాక్సీ కోడీన్ మందులుంటాయి. వీటి వాడకాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ బహిష్కరించింది. సిరప్స్‌లో ఎలాంటి డ్రగ్స్ ఉంటాయో అవగాహన లేకుండా, మెడికల్ షాప్‌కి వెళ్లి ఏదో ఒక దగ్గు మందు కొని వాడేస్తూ ఉంటాం. కానీ అలా ఇష్టారాజ్యంగా వాడటం వల్ల పిల్లలకు మందులు పని చేయకుండాపోయే పరిస్థితి తలెత్తుతుంది. కాబట్టి దగ్గును అణచివేసే సిరప్స్ వాడేయకుండా, వైద్యులను సంప్రదించి, దగ్గు కారణాన్ని కనిపెట్టి, తగిన చికిత్స ఇప్పించాలి.

డాక్టర్ దినేష్ కుమార్ చిర్ల
పిడియాట్రీషియన్ అండ్ నియో నాటాలజిస్ట్,
హైదరాబాద్.



తెలుగు నేర్పాల్సింది తల్లులే

తెలుగు భాష అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న సంస్థల్లో ప్రపంచ తెలుగు సమాఖ్య ఒకటి. దీనికి గత కొన్నేళ్లుగా ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ వి.ఎల్. ఇందిరాదత్ నేతృత్వం వహిస్తున్నారు. ఒక వైపు ప్రముఖ వాణిజ్య సంస్థ 'కేసీపీ'కి సీఎండీగా బాధ్యతలు నిర్వహిస్తూ- మరో వైపు తెలుగుపై మమకారంతో - ప్రపంచ తెలుగు సమాఖ్యకు సంబంధించిన కార్యక్రమాలను ముందుండి నడిపిస్తున్నారు. ప్రస్తుత తరం వారు తెలుగు నేర్చుకోవాల్సిన అవశ్యకత గురించి, పిల్లలకు తెలుగు నేర్పటంలో తల్లుల పాత్ర గురించి ఆమె 'నవ్య'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ

"మా నాన్నగారు ముక్త్యాలరాజా (రాజా వాసిరెడ్డి రామ గోపాలకృష్ణ మహేశ్వర ప్రసాద్) గారికి తెలుగు అంటే చాలా ఇష్టం. ఆయన మాకు తెలుగు చదవటం, రాయటం నేర్పారు. ఆయన కూడా తెలుగులో రాసేవారు. చిన్నతనంలో మమ్మల్ని ఇంట్లోనే చదివించారు. మా తాతగారికి అమ్మాయిలు బయటకు వెళ్లటం ఇష్టం ఉండేది కాదు. నాకు ఏడేళ్లు ఉన్నప్పుడు- అమ్మ, నాన్నగారు- తాతయ్యతో పోట్లాడి నన్ను మద్రాసుకు తీసుకువెళ్లి స్కూల్లో వేశారు. మిగిలిన రాజకుటుంబాలలోని పిల్లల మాదిరిగానే నేను కూడా చెన్నైలో చదువుకున్నా. ఆ సమయంలో కూడా నా సెకండ్ లాంగ్వేజ్ తెలుగే! నా వివాహం అయిన తర్వాత మా కుటుంబాలలో తెలుగే మాట్లాడుకొనేవాళ్లం. ఇక ప్రపంచ తెలుగు సమాఖ్య స్థాపించిన తర్వాత తెలుగు మా జీవితాల్లో ఒక భాగంగా మారిపోయింది. ఇక్కడొక విషయం చెప్పాలి. నేను చదువుకొనే రోజుల్లో ఉపాధ్యాయులకు నిబద్ధత ఎక్కువగా ఉండేది. అప్పుడు ఉండేదంటే- ఇప్పుడు లేదని చెప్పటం నా ఉద్దేశం కాదు. కానీ మా చిన్నతనంలో ఉపాధ్యాయులకు బోధన పట్ల మక్కువ ఎక్కువగా ఉండేది. అవసరమైతే ఒక గంట అదనంగా ఉండి మరీ చదువుచెప్పేవారు. ప్రస్తుతం అలాంటి ఉపాధ్యాయులు తక్కువనే అనిపిస్తుంది.

తెలుగు ఒక వారధి...


ఈమధ్య కాలంలో ఇంగ్లీషులో మాట్లాడటం ఒక హోదా చిహ్నంగా మారిపోయింది. చిన్న గ్రామాల్లో తల్లితండ్రులు కూడా పిల్లలతో 'మమ్మీ, డాడీ' అని పిలిపించుకోవడానికే ఇష్టపడుతున్నారు. ఇలాంటి చర్యల వల్ల దైనందిక జీవనంలో తెలుగు పదాల వినియోగం రోజు రోజుకు తగ్గిపోతోంది. దీనికి కారణం- ఇటు తల్లితండ్రుల్లోను, అటు పిల్లలోను తెలుగు భాష, సంస్కృతుల పట్ల సరైన అవగాహన లేకపోవటమే! సంస్కృతి, సంప్రదాయాలకు భాషకు మధ్య అవినాభావ సంబంధం ఉంది. అవి ఒక తరం నుంచి మరొక తరానికి వారసత్వంగా రావటానికి భాష వారధిగా ఉపయోగపడుతుంది. మన మూలాలను తెలియజెబుతుంది. మన పూర్వీకుల గొప్పతనం తెలుస్తుంది. ఇవన్నీ మన భాషను నేర్చుకోవటం వల్ల కలిగే ప్రయోజనాలు. తరచి చూస్తే ఇలాంటివి ఎన్నో ఉన్నాయి. ఇలా తెలుగు భాష వల్ల వచ్చే ప్రయోజనాలు తెలిస్తే తల్లితండ్రులు, పిల్లలు అందరూ భాషను నేర్చుకుంటారనేది నా ఉద్దేశం. అందుకోసం ప్రపంచ తెలుగు సమాఖ్య తరపున గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని పరీక్షలు పెడుతున్నాం. దీనిలో పాల్గొనే వారు ఇంగ్లీషు పదాలు వాడకుండా మాట్లాడాలి. ఇలాంటి ప్రయత్నాల వల్ల మళ్లీ తెలుగు పట్ల మమకారం పెరుగుతుందనేది మా ఉద్దేశం. ఇక్కడ ఇంకో కోణం కూడా ఉంది. చాలా మందికి తెలుగు మాట్లాడటం వచ్చు. కానీ చదవటం, రాయటం రాదు. తెలుగులో ఉన్న తియ్యదనం తెలిస్తే- వీరందరూ కూడా తప్పకుండా చదవటం, రాయటం నేర్చుకుంటారు. సంస్కృతం, ఫ్రెంచ్ మాదిరిగా తల్లితండ్రులు తమ పిల్లలను తెలుగు కూడా నేర్చుకోవాలని ప్రోత్సహించాలి. నా ఉద్దేశంలో తల్లులు ఈ విషయంలో చొరవ తీసుకోవాలి. తమ పిల్లలకు తెలుగు భాషను నేర్పించాలి. "తెలుగు రాకపోయినా ఇంగ్లీషు వస్తే నడిచిపోతుంది కదా! అలాంటప్పుడు తెలుగు ఎందుకు నేర్చుకోవాలి?" అని కొందరు అడుగుతూ ఉంటారు. మన పూర్వీకులు- మనకు వారసత్వంగా గొప్ప సంస్కృతి సంప్రదాయాలు అందించారు. ఉదాహరణకు పండుగలనే తీసుకోండి. ప్రతి పండుగ వెనక ఒక కారణం ఉంటుంది. అది మన జీవనంతోను.. సంస్కృతితోను ముడిపడి ఉంటుంది. ఉదాహరణకు బొమ్మల కొలువులను తీసుకుందాం. తమిళనాడులో దసరాకు బొమ్మల కొలువులు పెడతారు. మన వాళ్లు సంక్రాంతికి పెడతారు. దీని వెనక కొన్ని కారణాలున్నాయి. ఇలాంటివన్నీ తెలుసుకోవాలంటే మూల భాష అంటే తెలుగు రావాలి కదా! అప్పుడే వారు తమ సంస్కృతి గొప్పదనాన్ని తెలుసుకోగలుగుతారు.

ప్రారంభం ఇలా...

1992లో లాంగ్ ఐలాండ్‌లో 'తానా' సభలు జరిగాయి. అప్పుడు కొందరు ముఖ్యులు మాట్లాడుకుంటున్న సమయంలో- 'విదేశాల్లోనే తెలుగు వారు భాష గురించి మాట్లాడకుంటున్నారు. వారే ఒక సంఘంగా ఏర్పడ్డారు. అలాంటప్పుడు మన దేశంలో ఒక సంస్థ ఎందుకు ఉండకూడదు?' అనే చర్చ జరిగింది. ఈ చర్చ నుంచి ఆవిర్భవించినదే- 'ప్రపంచ తెలుగు సమాఖ్య'. దీన్ని అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ప్రారంభించారు. మొదట్లో కోయంబత్తూరుకు చెందిన నాయుడుగారు అధ్యక్షులుగా ఉండేవారు. ఆ తర్వాత డీవీఎస్ రాజుగారు అధ్యక్షుడయ్యారు. ఆ తర్వాత నా భర్త దత్తుగారు పగ్గాలు చేపట్టారు. ఆయన తర్వాత నేను ఆ పదవి స్వీకరించా. అప్పటి నుంచి నేనే అధ్యక్షురాలిగా కొనసాగుతున్నా. తెలుగు భాషాభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేయటంతో పాటుగా ప్రతి రెండేళ్లకు ఒక ఉత్సవం నిర్వహిస్తాం. ఈ ఉత్సవాలలో మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కార్యక్రమాలు, యువ వాణిజ్యవేత్తల కోసం కొన్ని సెమినార్లు నిర్వహిస్తాం. వీటిలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరూ పాల్గొంటారు. ఇలా ఇప్పటిదాకా వివిధ నగరాలలో 11 ఉత్సవాలు నిర్వహించాం. 12వ ఉత్సవం వచ్చే ఏడాది జనవరి మొదటి వారంలో హైదరాబాద్‌లోని నోవాటెల్‌లో నిర్వహిస్తున్నాం. దీనిలో సుమారు రెండువేల మంది దాకా పాల్గొంటారని భావిస్తున్నాం. ప్రపంచ తెలుగు సమాఖ్య తరఫున- తెలుగు భాష వారసత్వాన్ని భవిష్యత్ తరాల వారికి అందించేలా విశాఖపట్నంలో ఒక మ్యూజియాన్ని నిర్మించాం. మాకు ఇప్పటివరకు అన్ని ప్రభుత్వాలు బాగా సహకరించాయి. భవిష్యత్తులో ఇది కొనసాగుతుందని ఆశిస్తున్నాం."



> **సంగీతం కోసం...**
> **చెన్నైలోని ప్రపంచ తెలుగు సమాఖ్య కార్యాలయంలో మేము తెలుగు నేర్పుతామని ప్రకటిస్తే- సుమారు వందమంది వరకూ వచ్చారు. వారందరూ తమిళం వాళ్లే! చాలామంది 60 ఏళ్ల పైబడినవారే! వీరిలో ఎక్కువ మందికి సంగీతం అంటే మక్కువ. కీర్తనలు తెలుగులో ఉంటాయి కాబట్టి వాటి అర్థం తెలుసుకోవటం కోసం తెలుగు నేర్చుకుంటున్నారు. త్వరలోనే మరో క్లాసు కూడా మొదలుపెడుతున్నాం.**



- సివిఎల్ఎన్ ప్రసాద్

కళ్లు పొడిబారుతున్నాయా?

కళ్లలో నీళ్లు తక్కువగా ఉత్పత్తి కావడం వల్ల అవి కంటిని తేమగా ఉంచేందుకు సరిపోక కళ్లు పొడిబారుతుంటాయి. కళ్లలో నీళ్లు త్వరగా ఆవిరైపోతున్నా కూడా ఈ సమస్య వస్తుంది. దీనివల్ల కళ్లు దురదగా ఉండడం, ఎర్రబడడం, మంట అనిపించడం, వెలుగును చూడలేకపోవడం, ఏదో పడినట్లుగా గుచ్చుతుండడం లాంటి అసౌకర్యాలు కలుగుతాయి. కొన్ని ఇంటి చిట్కాలతో వీటినుంచి ఉపశమనం పొందవచ్చు. అవి...

వేడి గుడ్డతో ఒత్తడం: మెత్తని గుడ్డ లేదా కొంచెం దూదిని తీసుకుని వేడి నీటిలో ముంచి గట్టిగా పిండండి. దీనిని గుండ్రంగా మడిచి మూసిన కంటి రెప్పల మీద ఉంచి చిన్నగా ఒత్తండి. వెంటనే కంటి రెప్పల్లో ఉన్న నూనె గ్రంథులు పూర్తిగా తెరుచుకుంటాయి. కంటిలో సన్నని నూనె పొర పరచుకుంటుంది. దీనివల్ల కంటిలో గరగర, మంట, దురద తగ్గుతాయి.

తేమగా ఉండేలా: కళ్లు పొడిబారకుండా నీళ్లతో నిండి తేమగా ఉండాలంటే ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉన్న ఆహారం తీసుకోవాలి. చేపలు, వాల్‌నట్స్, అవిసె గింజలు, చియా గింజలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల కళ్లలో నీళ్లు ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. దాహం అనిపించకపోయినా ప్రతి మూడు గంటలకు ఒకసారి గ్లాసు మంచినీళ్లు తాగాలి. కళ్లలోకి ఎక్కువగా వెలుతురు, దుమ్ము సోకకుండా జాగ్రత్త తీసుకోవాలి.

కలబందతో: కలబంద ఆకు నుంచి గుజ్జును తీసుకుని మంచినీటిలో ముంచి తీయాలి. దీనిని మూసిన కంటి రెప్పల మీద పరచాలి. ఇది కంటిలోపలికి వెళ్లకుండా జాగ్రత్త తీసుకోవాలి. పది నిముషాల తరవాత కళ్లను కడగాలి. ఇలా రోజుకు రెండుసార్లు చేస్తూ ఉంటే కలబందలోని ఔషధ గుణాల వల్ల కళ్లవాపు, దురద తగ్గుతాయి.

20-20-20 నిబంధనతో: ఎక్కువసేపు కంప్యూటర్‌ను చూస్తూ పనిచేయడం వల్ల రెప్పపాటు తగ్గి కళ్లు పొడిబారుతాయి. రెప్పపాటు వల్లనే కన్నీళ్లు వ్యాపించి కన్ను మొత్తం తేమగా ఉంటుంది. అందుకే ఈ 20-20-20 నిబంధనను పాటించాలి.



ఇందులో ప్రతి 20 నిమిషాలకోసారి 20 అడుగుల దూరంలో ఉన్నవాటిని 20 సెకండ్లపాటు చూస్తూ ఉండాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే కంప్యూటర్ స్క్రీన్ వల్ల కలిగే అలసట తగ్గి కన్ను విశ్రాంతి పొందుతుంది. పచ్చని చెట్లను, ఆకాశాన్ని, ఎగిరే పక్షులను, పారే నీటిని చూస్తున్నా కూడా కళ్లకు తేలికపాటి వ్యాయామం చేసినట్లవుతుంది.

కీరాతో: కీరాను సన్నని చక్రాలుగా కోసి కళ్లమీద ఉంచుకోవాలి. కనీసం పావుగంటసేపు కళ్లు మూసుకుని విశ్రాంతి తీసుకోవాలి. కీరాలో ఉన్న నీరు, యాంటీ ఆక్సిడెంట్లు కంటి చుట్టూ ఉన్న చర్మానికి తేమని అందించి కళ్లకు చల్లదనాన్ని కలిగిస్తాయి. కళ్లలో దురద తగ్గుతుంది. చల్లని పాలలో దూదిని ముంచి కళ్లమీద ఉంచుకున్నా కూడా కళ్లు విశ్రాంతి పొందుతాయి.

జ్వరం వస్తే ఇవి తినండి!

చలికాలంలో వాతావరణ మార్పుల వల్ల శరీరం బలహీనంగా మారుతుంది. ఇదే సమయంలో హానికారక వైరస్‌లు, బ్యాక్టీరియాలు శరీరంలోకి చేరుతుంటాయి. ఫలితంగా తరచూ జ్వరం వస్తూ ఉంటుంది. దీని నుంచి ఉపశమనం పొందాలంటే మంచి పోషకాహారం తీసుకోవాలి. జ్వర తీవ్రతను తగ్గించి శరీరానికి శక్తిని అందించే ఆహారం గురించి తెలుసుకుందాం.

అల్లం, వెల్లుల్లి, ఉసిరి, పాలకూర: పాలకూరలో ఎ, సి, ఇ విటమిన్లతోపాటు యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. పాలకూరను తరచూ తినడం వల్ల రక్తంలో తెల్ల రక్త కణాల పనితీరు మెరుగవుతుంది. తెల్ల రక్త కణాలు శరీరంలోని వ్యాధికారక క్రిములతో పోరాడి వాటిని నాశనం చేస్తాయి. ఉసిరిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల అందులోని సి విటమిన్ రోగనిరోధక శక్తిని పెంచి ఇన్‌ఫ్లమేషన్ సమస్యలను నివారిస్తుంది. అల్లం, వెల్లుల్లిలో యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు అధికంగా ఉంటాయి. చలికాలంలో తరచూ అల్లం టీ తాగడం వల్ల శ్వాసకోశ వ్యాధుల కారణంగా వచ్చే జ్వరం తగ్గుతుంది. వెల్లుల్లిలో అల్లిసిన్, సల్ఫర్ సమ్మేళనాలు ఉంటాయి. వెల్లుల్లి చారు, వెల్లుల్లి కారం లాంటివి ఆహారంలో చేర్చుకుంటే జ్వర తీవ్రత, నీరసం తగ్గుతాయి.

పసుపు, తులసి: ఈ రెంటిలో యాంటీ మైక్రోబయల్, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. ఇవి శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచి జ్వర తీవ్రతను వెంటనే తగ్గిస్తాయి. ఒక గ్లాసు వేడి పాలలో చిటికెడు పసుపు కలుపుకుని తాగితే మంచి ఫలితం కనిపిస్తుంది. ఒక గ్లాసు నీళ్లలో ఆరు తులసి ఆకులు వేసి అయిదు నిమిషాలు మరిగించాలి. ఈ వేడి నీటిని రోజుకు రెండుసార్లు తాగితే జ్వరం తగ్గుతుంది.

సిట్రస్ పండ్లు: నారింజ, ద్రాక్ష లాంటి సిట్రస్ పండ్లలో సి విటమిన్ ఎక్కువగా ఉంటుంది. వీటిని తినడం వల్ల రక్తంలో తెల్ల రక్త కణాలు ఉత్పత్తి అవుతాయి. ఫలితంగా రక్తం పరిశుభ్రమై జ్వరం వల్ల వచ్చే అలసట, ఒత్తిడి, ఆయాసం తదితర సమస్యలు తగ్గుతాయి.



కొబ్బరి నీళ్లు, జావలు: జ్వరం వచ్చినపుడు శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయి కంటే ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల శరీరంలో తేమ శాతం తగ్గుతుంది. ఈ సమయంలో కొబ్బరినీళ్లు తాగడం వల్ల శరీరానికి అవసరమైన గ్లూకోజ్, ఎలక్ట్రొలైట్లు, లవణాలు అందుతాయి. శరీరంలో నీటి శాతం పెరుగుతుంది. సగ్గుబియ్యం, రాగి పిండి, బార్లీ గింజలతో జావ కాచుకొని తాగడం మంచిది. కూరగాయల ముక్కలను నీటిలో ఉడికించి ఆ నీటిని వడకట్టి అందులో కొంచెం ఉప్పు, మిరియాల పొడి కలుపుకుని తాగితే జ్వరం నుంచి ఉపశమనం కలుగుతుంది. నాలుక మీద రుచి తెలియకపోవడం, నోరు చేదుగా అనిపించడం వంటి సమస్యలు పోతాయి.

పోషకాహారం: జ్వరం వచ్చినపుడు విటమిన్లు, ఖనిజ లవణాలు, పీచుపదార్థాలు, ప్రోటీన్లు తదితర పోషకాలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. తాజా కూరగాయలు, అన్ని రకాల పండ్లు, గింజలు, పప్పు ధాన్యాలు, బీన్స్, చిక్కుళ్లు తదితరాలను ఆహారంలో చేర్చుకుంటే జ్వరం వల్ల వచ్చే నిస్సత్తువ తగ్గుతుంది. తేనె, పుట్టగొడుగులు, నల్ల మిరియాలు, దాల్చిన చెక్క, వాము, సోంపు తదితరాలను తీసుకోవడం వల్ల శరీరం త్వరగా కోలుకుంటుంది.

విభిన్నం



ఫ్యాషన్ డిజైనర్ కావాలనుకుంది. 'నిఫ్ట్' పరీక్ష రాస్తే అందులో విఫలమైంది. రేడియో జాకీగా ఉద్యోగం మొదలుపెట్టి... హాస్యభరిత వీడియోలతో... కడుపుబ్బ నవ్విస్తూ... కంటెంట్ క్రియేటర్‌గా సరికొత్త ఎత్తులకు చేరింది. 'ఫోర్బ్స్ ఇండియా' మ్యాగజైన్ 'డిజిటల్ స్టార్స్-100' జాబితాలో చోటు దక్కించుకుంది. 'నిఫ్ట్' కల నెరవేరకపోయినా... విభిన్నమైన వస్త్రశ్రేణులను పరిచయం చేసే సంస్థకు అధిపతి అయింది. డిజిటల్ తెరపై తారగా... వ్యాపారవేత్తగా... ఇల్లాలిగా... విభిన్న పాత్రలు పోషిస్తున్న హర్షిత గుప్తా కథ ఇది.

అభిరుచే ఆలంబనగా

"కలలు కంటాం. వాటిని నిజం చేసుకొనేందుకు ప్రయత్నిస్తాం. అవి నెరవేరకపోతే! అప్పుడే జీవితం అర్థమవుతుంది. అనుకున్నవన్నీ జరగవని, ఫలితం ఏదైనా కష్టపడాలని, వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని... జీవితం ఇలా ఎన్నో పాఠాలు చెబుతుంది. ఇది నేను అనుభవపూర్వకంగా తెలుసుకున్నది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లఖనవూలో వ్యాపార కుటుంబం మాది. నాన్న నీరజ్ గుప్తా వ్యాపారస్తుడు. అమ్మ నీలమ్. ఎందుకో తెలియదు... చిన్నప్పటి నుంచీ నాకు ఫ్యాషన్ రంగంలో స్థిరపడాలనే కోరిక. అందుకే స్థానిక 'లా మార్టినీర్ గర్ల్స్ కాలేజీ'లో పన్నెండో తరగతి పూర్తయ్యాక... 'నిఫ్ట్, ఎన్‌ఐడీ, సింబియోసిస్, పెరల్' తదితర ఫ్యాషన్ సంబంధిత పరీక్షలన్నీ రాశాను. 'నిఫ్ట్'లో కోర్సు చేయాలన్నది నా కల. కానీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయాను. అది నన్ను తీవ్ర వేదనకు గురి చేసింది. ఇక ఎప్పుడూ ఫ్యాషన్ వైపు వెళ్లలేనేమో అని ఎంతో ఏడ్చాను. నా కలల ప్రపంచమే అంతమైనట్టు అనిపించింది.

బాధ నుంచి బయటికొచ్చి...

అయితే కొద్ది కాలంలోనే బాధ నుంచి బయటకు రాగలిగాను. నోయిడా 'అమిటి విశ్వవిద్యాలయం' నుంచి జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ డిగ్రీ పూర్తి చేశాను. లఖనవూ 'రెడ్ ఎఫ్‌ఎం'లో ప్రొడ్యూసర్‌గా ఉద్యోగం వచ్చింది. నెలకు జీతం 24 వేలు. అయితే అక్కడ పని వాతావరణం నాకు నచ్చలేదు. ఆరు నెలల తర్వాత రాజీనామా ఇచ్చి, 'రేడియో మిర్చీ'లో జాకీగా మరో కొత్త పాత్ర ప్రారంభించాను. దాంతోపాటు ప్రముఖ మీడియా సంస్థలకు కంటెంట్ అందిస్తూ వచ్చాను. వృత్తిలో భాగంగా కొన్ని వీడియోలు తీయాలి. ఎంత ప్రయత్నించినా మా బాస్ కోరుకున్న విధంగా వీడియో కంటెంట్ ఇవ్వలేకపోయేదాన్ని. కొన్నాళ్లకు కుదురుకున్నాను. ఇతర విభాగాలపై అవగాహన పెంచుకున్నాను. ఈ క్రమంలోనే కెమెరాతో దోస్తీ కుదిరింది. ఎలాంటి బెరుకూ లేకుండా దాని ముందు నా హావభావాలు చూపించగలిగాను. అదే నా జీవితాన్ని మలుపు తిప్పింది.

సరదా వీడియోలు...

కెమెరా ముందుకు రావడంవల్ల ఒక రకంగా నాకు జ్ఞానోదయం అయిందని చెప్పవచ్చు. అది నాలో కొత్త ఆలోచనలు రేకెత్తించింది. అందులో నుంచి పుట్టిందే ఇన్‌స్టాగ్రామ్ రీల్స్. అయితే కంటెంట్ ఏముండాలి? లక్షల్లో కంటెంట్ క్రియేటర్లు ఉండగా నా రీల్స్ ఆకట్టుకోవాలంటే ఏంచేయాలి? దీని కోసం కొంత పరిశోధన చేశాక ఒక నిర్ణయానికి వచ్చాను. ఎప్పుడూ పని ఒత్తిడిలో ఉండే నేటితరానికి నా వీడియోలు కాస్తంతైనా ఉపశమనం ఇచ్చేవి కావాలనుకున్నాను. అలాంటివే తీసి అప్‌లోడ్ చేస్తే... అద్భుతమైన స్పందన వచ్చింది. నా రీల్స్ అన్నింట్లో మంచి మిత్రులు, తండ్రీ-కూతుళ్ల మధ్య జరిగే సరదా సంభాషణలే ఉంటాయి. చూసే వారి ముఖంపై చిరునవ్వులు చిందిస్తాయి. ప్రతి రీల్‌కూ లక్షల్లో వ్యూస్, వేలల్లో లైక్స్ వస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో తెగ చక్కర్లు కొడుతున్నాయి. ప్రస్తుతం ఇన్‌స్టాలో నాకు దాదాపు పదిహేను లక్షలమంది ఫాలోవర్స్ ఉన్నారు. యూట్యూబ్‌లో కూడా ఒక చానల్ ప్రారంభించాను. అక్కడ కూడా మంచి స్పందన లభిస్తోంది.



సంప్రదాయ సోయగం...

ఇన్‌స్టా రీల్స్‌కు మంచి ఆదరణ లభిస్తుండడంతో ఉద్యోగం వదిలేశాను. రీల్స్, బ్రాండ్లకు ప్రచారం ద్వారా చేతినిండా సంపాదిస్తున్నా వెలితిగానే ఉండేది. ఫ్యాషన్ డిజైనర్‌గా ఎదగాలని, వినూత్న వస్త్ర శ్రేణులను తీసుకురావాలని. చిన్నప్పటి ఆ కలను నెరవేర్చుకొనే దిశగా అడుగులు వేశాను. మా లఖనవూలో ప్రసిద్ధి చెందిన సంప్రదాయ చికంకారీ కళను దేశమంతా పరిచయం చేయాలనుకున్నాను. ఇది పర్షియన్ ఎంబ్రాయిడరీ కళ. దీనికి ఆధునిక హంగులు అద్ది, సరికొత్త డ్రెస్‌లను తీసుకువచ్చాను. మావారి సహకారం, ప్రోద్బలంతో 'చికంకారీ హవ్యాస్' పేరుతో ఈ ఏడాది మేలో ఒక సంస్థ ప్రారంభించాను. సాధారణంగా చికంకారీ అద్దిన వస్త్రాలను శుభకార్యాలకు వేసుకొంటారు. అలాకాకుండా నిత్యజీవితంలో కార్యాలయాలు, కళాశాలలకు వెళ్లే మగువలు కూడా ధరించేలా మా వస్త్రశ్రేణులు రూపొందించాం. వీటికి మంచి ఆదరణ లభిస్తోంది. అన్నిటికీ మించి నా కల నెరవేరింది.

మధురానుభూతి...

ఇన్నేళ్ల నా ఈ ప్రయాణంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశాను. సవాళ్లు ఎదుర్కొన్నాను. కానీ ఎన్నడూ వెనకడుగు వేయలేదు. అదే ఇవాళ నన్ను ఇక్కడి వరకు తీసుకువచ్చింది. ఇంతటి విజయవంతమైన కెరీర్‌ను, సంతోషకరమైన జీవితాన్ని ఇచ్చింది. మనపై మనకు నమ్మకం ఉండాలి. అంకితభావంతో పని చేయాలి. ఫలితం అదే వస్తుందనడానికి నా విజయాలే ఉదాహరణ. 'ఫోర్బ్స్ ఇండియా' మ్యాగజైన్ 'డిజిటల్ స్టార్స్-100' జాబితాలో నాకు ఆరో స్థానం దక్కింది. నిజంగా ఇది నాకు ఎంతో గర్వకారణం. స్వశక్తితో నాకు నేను నిర్మించుకున్న కెరీర్. అందులో రాణించడం కంటే సంతృప్తి ఏముంటుంది!"




మా కుటుంబంలోకి నిన్ను ఆహ్వానిస్తున్నాం

నాగార్జున

అక్కినేని నాగచైతన్య, శోభితా ధూళిపాళ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. బుధవారం రాత్రి 8 గంటల 13 నిమిషాలకు, హిందూ సంప్రదాయ పద్ధతిలో అన్నపూర్ణ స్టూడియోస్‌లో జరిగిన ఈ వివాహ వేడుకకు ఇరువురి కుటుంబసభ్యులు, కొద్దిమంది అతిథులు హాజరయ్యారు. నూతన జంటను ఆశీర్వదిస్తూ నాగార్జున తన ఆనందాన్ని ఎక్స్ ద్వారా పంచుకున్నారు. "నాగచైతన్య, శోభితా కలసి ప్రారంభిస్తున్న ఈ కొత్త అధ్యాయం నాకెంతో ప్రత్యేకం. ఈ క్షణం నా మనసు భావోద్వేగంతో నిండిపోయింది. మీ ఇద్దరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు. శోభితా.. మా కుటుంబంలోకి నిన్ను మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నాం. మీరు ఇప్పటికే మా జీవితాల్లోకి ఎంతో సంతోషాన్ని తెచ్చారు. ఏఎన్నార్ శతజయంతి సందర్భంగా స్థాపించిన విగ్రహం సమక్షంలో మీ పెళ్లి జరగడం వల్ల ఆయన ఆశీస్సులు మీ జంటకు ఎల్లప్పుడూ ఉంటాయి. ఈ జంటను ఆశీర్వదించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు" అని పేర్కొన్నారు. ఈ వేడుకకు చిరంజీవి దంపతులు, వెంకటేశ్, అల్లుఅర్జున్, టి.సుబ్బిరామిరెడ్డి, ఎన్టీఆర్, రామ్‌చరణ్, రానా, అల్లు అరవింద్, కీరవాణి, సుహాసిని విచ్చేసి వధూవరులని ఆశీర్వదించారు.

షూటింగ్ పూర్తి



నందమూరి బాలకృష్ణ హీరోగా బాబీ కొల్లి దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'డాకూ మహారాజ్' చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తయింది. తన చిత్రాలలో కథానాయకులను సరికొత్తగా చూపించడంలో దర్శకుడు బాబీ దిట్ట. బాలకృష్ణ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న 'డాకూ మహారాజ్' చిత్రంలో కూడా బాలకృష్ణను ఇంతవరకూ చూడని కొత్త అవతారంలో బాబీ చూపిస్తున్నారు. చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తయిందనీ, ముందు ప్రకటించిన విధంగానే వచ్చే ఏడాది జనవరి 12న సినిమా విడుదల చేస్తామనీ నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య చెప్పారు.

బాలకృష్ణతో మళ్లీ సినిమా తీస్తా



'ఆది', 'చెన్నకేశవ రెడ్డి', 'కందిరీగ' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను నిర్మించిన నిర్మాత బెల్లంకొండ సురేశ్. ఇండస్ట్రీలో ఇటీవలే 25 ఏళ్లను పూర్తిచేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు.

"ఓ నిర్మాతగా ఇండస్ట్రీలో 25 ఏళ్లను పూర్తి చేసుకున్నందుకు ఆనందంగా ఉంది. ఈ 25 ఏళ్లలో 38 సినిమాలు నిర్మించాను. నిర్మాతగా ఈ ప్రయాణం అద్భుతంగా సాగింది. అగ్రహీరోల నుంచి కొత్తవారి వరకూ చేసిన ప్రతీ సినిమా గొప్ప అనుభూతిని ఇచ్చింది. 2015లో నా చివరి చిత్రం 'గంగ' విడుదలైంది. దాదాపు తొమ్మిదేళ్ల విరామం వచ్చింది. ఈ గ్యాప్‌కు కారణం సాయి శ్రీనివాస్.. గణేశ్ ఇద్దరూ వేరే ప్రొడ్యూసర్స్‌తో సినిమాలు చేయడమే. మళ్లీ వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి సినిమాలను నిర్మించడానికి సిద్ధమవుతున్నా. వాటిలో మొదటి రెండు చిత్రాలు మా ఇద్దరబ్బాయిలతో ఉంటాయి. త్వరలోనే ఆ ప్రాజెక్ట్స్ గురించి పూర్తి వివరాలు ప్రకటిస్తా. అగ్ర దర్శకులతోనే సినిమాలు చేయాలనే ఆలోచన లేదు. నేను చేయబోయే రెండు ప్రాజెక్ట్స్ కూడా కొత్త దర్శకులతోనే. అలాగే, ఓ సినిమా రీమేక్ హక్కులను కొన్నా.. అది తెలుగులో మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. సాయి శ్రీనివాస్ ప్రస్తుతం నాలుగు సినిమాలతో బిజీగా ఉన్నాడు. తను నటించిన 'భైరవం' త్వరలోనే విడుదల అవుతుంది. చిన్నబ్బాయి గణేశ్ చేతిలో రెండు ప్రాజెక్ట్స్ ఉన్నాయి. 'చెన్నకేశవ రెడ్డి' సినిమా రీ రిలీజ్‌కు ఊహించిన దాని కంటే మంచి రెస్పాన్స్ వచ్చింది. త్వరలోనే బాలయ్యతో మళ్లీ సినిమా తీస్తా. 'నా ఆటోగ్రాఫ్ స్వీట్ మెమొరీస్' రవితేజ పుట్టినరోజున రీ రిలీజ్ చేయాలనే ప్లాన్ ఉంది' అని చెప్పారు.

ఇరవై ఏళ్ల తర్వాత మళ్లీ...!




వైవిధ్యమైన చిత్రాలను రూపొందించే దర్శకుడు గుణశేఖర్ ప్రస్తుతం 'యుఫోరియా' పేరుతో ఒక యూత్‌ఫుల్ సోషల్ డ్రామాను రూపొందిస్తున్నారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న దురాగతాలను ఫోకస్ చేస్తూ గుణశేఖర్ రూపొందిస్తున్న ఈ సినిమా రెండో షెడ్యూల్ ఇటీవలె మొదలైంది. చిత్రానికి సంబంధించిన స్పెషల్ అప్‌డేట్ ఇస్తూ బుధవారం ఓ వీడియో విడుదల చేశారు. ఇందులో నటి భూమిక మేకప్ వేసుకోవడం, షూటింగ్‌లో పాల్గొనడం వంటి విజువల్స్ ఉన్నాయి. ఇరవై ఏళ్ల క్రితం మహేశ్, గుణశేఖర్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఒక్కడు' చిత్రంలో భూమిక హీరోయిన్‌గా నటించారు. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత ఆమె మళ్లీ గుణశేఖర్ దర్శకత్వంలో నటిస్తున్నారు. భూమిక కోసం ఓ పవర్‌ఫుల్ పాత్రను గుణశేఖర్ సృష్టించారు. ప్రస్తుతం ఆమె పాల్గొనే సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. రాగిణి గుణ సమర్పణలో నీలిమ గుణ 'యుఫోరియా' చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

వాస్తవ సంఘటనల ఆధారంగా..



ధర్మ, ఐశ్వర్య శర్మ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'డ్రింకర్ సాయి'. 'బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్' ట్యాగ్‌లైన్. కిరణ్ తిరుమలశెట్టి దర్శకత్వంలో బసవరాజు శ్రీనివాస్, బసవరాజు లహరిధర్, ఇస్మాయిల్ షేక్ నిర్మించారు. వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్ర రిలీజ్ డేట్‌ను మేకర్స్ ప్రకటించారు. ఈ నెల 27న చిత్రం విడుదలవుతోంది. ఇటీవలే విడుదల చేసిన టీజర్, ఫస్ట్ సింగిల్ మంచి బజ్‌ను క్రియేట్ చేస్తున్నాయి. ఈ సినిమాలో పోసాని కృష్ణమురళి, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రలు పోషించారు.

నటిగా సవాల్ విసిరిన సినిమా

బాలీవుడ్ చిత్రం 'మున్నా మైఖేల్'తో నటిగా అడుగుపెట్టి.. తెలుగులో నటించిన 'మిస్టర్ మజ్ను'.. 'ఇస్మార్ట్ శంకర్'.. 'సవ్యసాచి'.. 'హీరో' తదితర చిత్రాలతో ప్రేక్షకులకు చేరువయ్యారు నిధి అగర్వాల్. ప్రస్తుతం 'హరిహర వీరమల్లు', 'రాజా సాబ్' వంటి భారీ ప్రాజెక్ట్స్‌లో నటిస్తున్నారీ బ్యూటీ. తాజాగా, ఎక్స్ వేదికగా 'ఆస్క్ నిధి' అనే సెషన్‌లో అభిమానులతో ముచ్చటించారు ఆమె. ఈ సందర్భంగా అభిమానులు అడిగిన ప్రశ్నలకు ఆసక్తికరమైన సమాధానాలిచ్చారు. ఇందులో భాగంగా ఓ అభిమాని "మీకు తెలుగు వచ్చా" అని ప్రశ్నించారు. ఆమె బదులిస్తూ "ఎందుకు రాదండి. అయినా ఆ సందేహం మీకెందుకొచ్చింది. నేను అందరికీ నమస్కారం అని చెప్పే బ్యాచ్ కాదు" అని అన్నారు. అలాగే, తన నటిస్తున్న సినిమాల గురించి మాట్లాడుతూ "హరిహర వీరమల్లు' సినిమాలో నా పాత్ర పేరు పంచమి. ఈ సినిమా నటిగా నాకు సవాల్ విసిరింది. నటిగా ఎంతో పరిణితి చెందే అవకాశం ఈ సినిమా ఇచ్చింది. పంచమి-వీర మధ్య వచ్చే లవ్‌ట్రాక్ అందరినీ మెప్పిస్తుంది. 'రాజా సాబ్'లో నా పాత్ర మీ అందర్నీ ఆశ్చర్యపరుస్తుంది. త్వరలోనే నేను నటించే ఇంకో సినిమా అప్‌డేట్ ఇస్తా" అని చెప్పారు.



మోక్షజ్ఞతో ఆదిత్య 999

నందమూరి బాలకృష్ణ హీరోగా సీనియర్ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో 1991లో వచ్చిన సైన్స్ ఫిక్షన్ 'ఆదిత్య 369' అప్పట్లో అందరినీ అలరించింది. బాలకృష్ణ కెరీర్‌లో అత్యుత్తమ చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఇందులో శ్రీకృష్ణదేవరాయలుగా ఆయన అభినయం ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకుంది. ఈ సినిమాకు సీక్వెల్ చేయాలనే ఆలోచన బాలకృష్ణకు ఎప్పటినుంచో ఉంది. ఇప్పుడు తన తనయుడు మోక్షజ్ఞతో 'ఆదిత్య 369'కు సీక్వెల్‌గా 'ఆదిత్య 999 మాక్స్' పేరుతో తీయనున్నట్లు బాలకృష్ణ ప్రకటించారు. 'అన్‌స్టాపబుల్ సీజన్ 4'లో ఆయన ఈ విషయాన్ని వెల్లడిస్తూ.. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుగుతోందనీ, మోడరన్ సినిమాటిక్ ఎలిమెంట్స్‌తో సినిమా ఉంటుందని ఆయన తెలిపారు. డిసెంబర్ 6న ప్రసారం కానున్న ఈ ఎపిసోడ్‌లో బాలకృష్ణ 'ఆదిత్య 369' గెటప్‌లో కనిపించనున్నారు.



హిందూ-క్రిష్టియన్ సంప్రదాయాల్లో పెళ్లి

ఇప్పుడంతా పెళ్లిళ్ల సీజన్. హీరో నాగచైతన్య, హీరోయిన్ శోభితల వివాహం బుధవారం జరిగింది. అక్కినేని ఇంట్లో మరో హీరో అఖిల్ కూడా పెళ్లి చేసుకుని ఓ ఇంటివాడు కాబోతున్నాడు. అలాగే హీరోయిన్ కీర్తి సురేశ్ కూడా పెళ్లి పీటలు ఎక్కనుంది. బాయ్ ఫ్రెండ్ ఆంటోనీ తట్టిల్‌తో కీర్తి వివాహం ఈ నెల 12న గోవాలో జరుగుతుంది. వీరి పెళ్లి ఇన్విటేషన్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మరో విశేషమేమిటంటే వీరిద్దరి పెళ్లి హిందూ-క్రిస్టియన్ సంప్రదాయాల ప్రకారం జరుగుతుండడం. ఉదయం గోవాలోని ఓ ఖరీదైన రిసార్ట్‌లో ఆంటోనీ, కీర్తిల పెళ్లి హిందూ సంప్రదాయం ప్రకారం జరుగుతుంది. అదే రోజు సాయంత్రం ఓ చర్చిలో క్రిస్టియన్ సంప్రదాయం ప్రకారం మరోసారి పెళ్లి జరుగుతుంది. కుటుంబ సభ్యులు, సన్నిహిత మిత్రుల సమక్షంలో వీరి వివాహం జరగనుంది.

హిట్ కొట్టడం ఖాయం

డైరెక్టర్ మారుతి



తమిళ్‌లో కవిన్, అపర్ణ దాస్ హీరో హీరోయిన్లుగా తెరకెక్కి ఘనవిజయం సాధించిన సినిమా 'డా..డా..' దీనిని తెలుగులో 'పా..పా..'గా డబ్ చేస్తున్నారు. గణేశ్.కె బాబు దర్శకుడు. తెలుగులో నిర్మాత నీరజ కోన విడుదల చేస్తున్నారు. ఈ నెల 13న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర ట్రైలర్‌ను విడుదల చేసిన డైరెక్టర్ మారుతి మాట్లాడుతూ "ఈ సినిమా బ్లాక్‌బస్టర్ కొట్టడం ఖాయం. తెలుగు ప్రేక్షకులు ఇలాంటి సబ్జెక్ట్‌ను తప్పక ఆదరిస్తారు. చిత్రయూనిట్‌కు ఆల్ ద బెస్ట్" అని చెప్పారు. ఈ సినిమాలో కె.భాగ్యరాజ్, వీటీవి గణేశ్, ప్రదీప్ శక్తి, ఐశ్వర్య భాస్కరన్ కీలక పాత్రలు పోషించారు.



సెమీస్‌లో భారత్

● మెరిసిన వైభవ్, ఆయుష్
● 10 వికెట్లతో యూఏఈ ఓటమి

అండర్-19 ఆసియా కప్


వైభవ్ (76 నాటౌట్)

షార్జా: 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ (76 నాటౌట్) చెలరేగడంతో.. అండర్-19 ఆసియా కప్‌లో యువ భారత్ సెమీస్‌కు దూసుకెళ్లింది. గ్రూప్-ఎలో బుధవారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో భారత్ 10 వికెట్ల తేడాతో యూఏఈని చిత్తు చేసింది. తొలుత యూఏఈ 44 ఓవర్లలో 137 పరుగులకు ఆలౌటైంది. రయాన్ (35), అక్షత్ రాయ్ (26) టాప్ స్కోరర్లు. యుధాజిత్ గుహ 3 వికెట్లు పడగొట్టగా.. చేతన్ శర్మ, హార్దిక్ రాజ్ చెరో 2 వికెట్లు దక్కించుకొన్నారు. ఛేదనలో భారత్ 16.1 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 143 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ ఆయుష్ మాత్రే (67 నాటౌట్) కూడా హాఫ్ సెంచరీ చేశాడు. కాగా, శుక్రవారం జరిగే సెమీస్‌లో గ్రూప్-బి టాపర్ శ్రీలంకతో భారత్, బంగ్లాదేశ్‌తో తలపడనున్నాయి.

నాలుగు గంటలు సాగినా..

ఫలితం తేలలేదు

● ఎనిమిదో గేమూ డ్రా ● ప్రపంచ చెస్



సింగపూర్: ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ ఫైనల్లో డ్రా పరంపర కొనసాగుతోంది. బుధవారం జరిగిన ఎనిమిదో రౌండ్‌లోనూ ఫలితం తేలలేదు. దాంతో వరుసగా ఐదో గేమూ డ్రాగా ముగిసినట్టయ్యింది. ఈ రౌండ్ అనంతరం లిరెన్, గుకేష్ చెరి నాలుగేసి పాయింట్లతో సమవుజ్జీలుగా నిలిచారు. 14 రౌండ్ల తుది పోరులో మొత్తంగా ఇది ఆరో డ్రా. 32 ఏళ్ల లిరెన్ తొలి గేమ్‌లో గెలుపొందగా, 18 ఏళ్ల గుకేష్ మూడో రౌండ్‌లో విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇక 2,4,5,6,7,8 గేములు డ్రా అయ్యాయి. మరో నాలుగు రౌండ్‌లే మిగిలున్న నేపథ్యంలో రాబోయే రెండు గేములు కీలకం కానున్నాయి. ఇక..ఎనిమిదో రౌండ్ 4 గంటలపాటు హోరాహోరీగా సాగింది. తెల్ల పావులతో బరిలోకి దిగిన లిరెన్‌కు పరిస్థితి అనుకూలంగా లేకపోవడంతో 41వ ఎత్తులోనే డ్రాకు ప్రతిపాదించాడు. కానీ గుకేష్ ఆ ప్రతిపాదనకు అంగీకరించకుండా గేమును కొనసాగించాడు. అయితే గేమ్ సాగే కొద్దీ తనకూ విజయావకాశాలు లేకపోవడంతో 51వ ఎత్తువద్ద గుకేష్ డ్రా చేసేందుకు అంగీకరించాడు.

మనమ్మాయిలకు కఠిన పరీక్ష

ఆస్ట్రేలియాతో తొలి వన్డే నేడు


హర్మన్‌ప్రీత్
తహిలా మెక్‌గ్రాత్
ఉ. 9.50 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

బ్రిస్బేన్: వచ్చే ఏడాది భారత్‌లో వన్డే ప్రపంచ కప్ జరగనుంది. ఈనేపథ్యంలో నిలకడలేని బ్యాటింగ్ విభాగాన్ని పటిష్ట పరుచుకోవాలని భారత మహిళల జట్టు భావిస్తోంది. తద్వారా వన్డే వరల్డ్ కప్‌నకు సరైన బ్యాటింగ్ కూర్పును నిర్ణయించుకోవాలనుకుంటోంది. ఇందుకు బలీయమైన ఆస్ట్రేలియా జట్టుతో జరిగే మూడు వన్డేల సిరీస్‌ను వేదికగా చేసుకోనుంది. ఈక్రమంలో కంగారూలతో గురువారం జరిగే మొదటి వన్డేకు సిద్ధమైంది. న్యూజిలాండ్‌తో స్వదేశంలో జరిగిన వన్డే సిరీస్‌ను 2-1తో సొంతం చేసుకున్న ఆత్మవిశ్వాసంతో హర్మన్‌సేన ఆసీస్‌గడ్డపై అడుగుపెట్టింది. కివీస్‌పై సిరీస్ గెలుపొందినా.. బ్యాటింగ్ విభాగం మాత్రం ఆశించిన స్థాయిలో రాణించలేదు. దాంతో ఫామ్ కోల్పోయిన షఫాలీ వర్మను జట్టు నుంచి తొలగించడం ద్వారా బ్యాటింగ్ లైనప్‌లో ప్రయోగాలకు దిగుతోంది. ఇక ఆసీస్ గడ్డపై మన మహిళల రికార్డు పేలవంగా ఉంది. ఇక్కడ ఆడిన 16 వన్డేల్లో భారత్ కేవలం నాలుగు మ్యాచ్‌ల్లోనే నెగ్గింది. గత..2021 సిరీస్‌లో 1-2తో మనోళ్లు ఓడిపోయారు. మరోవైపు ఆస్ట్రేలియా జట్టు రెగ్యులర్ కెప్టెన్ అలీసా హీలీ లేకుండానే బరిలో దిగుతోంది. మోకాలి గాయంతో ఆమె బాధపడుతుండడంతో తహిలా మెక్‌గ్రాత్ జట్టుకు సారథ్యం వహిస్తోంది.



కుర్రాళ్లు కొల్లగొట్టారు

● భారత్‌దే ఆసియా కప్
● ఫైనల్లో పాక్ చిత్తు
● నాలుగు గోల్స్‌తో అరిజీత్ విజృంభణ

మస్కట్: చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను చిత్తు చేసిన డిఫెండింగ్ చాంప్ భారత్.. ఐదోసారి జూనియర్ హాకీ ఆసియాకప్‌ను సొంతం చేసుకొంది. డ్రాగ్‌ఫ్లికర్ అరిజీత్ హుండల్ 4 గోల్స్‌తో చెలరేగడంతో.. బుధవారం జరిగిన ఫైనల్లో భారత్ 5-3తో పాకిస్థాన్‌ను మట్టికరిపించింది. 2004, 2008, 2015, 2023ల్లో టైటిళ్లు నెగ్గిన భారత జట్టు ఒక్క మ్యాచ్ కూడా ఓడకుండా టైటిల్‌ను అందుకొంది. అరిజీత్ (4వ, 18వ, 47వ, 54వ నిమిషం) 4 గోల్స్ చేయగా.. దిల్‌రాజ్ సింగ్ (19వ) ఒక గోల్ సాధించాడు. పాక్ తరఫున సూఫియాన్ ఖాన్ (30వ, 39వ), హసన్ షాహిద్ (3వ) గోల్స్ చేశారు. ఆట మొదలైన మూడో నిమిషంలోనే షాహిద్ ఫీల్డ్ గోల్‌తో భారత్‌కు షాకిచ్చాడు. అయితే, నిమిషం కూడా గడవకుండానే పెనాల్టీ కార్నర్‌ను అరిజీత్ గోల్‌లోకి పంపి 1-1తో సమం చేశాడు. రెండో క్వార్టర్‌లో భారత్ మరింత దూకుడుగా ఆడుతూ పాక్‌ను పూర్తిగా ఆత్మరక్షణలోకి నెట్టింది. అరిజీత్ మరో గోల్ చేయడంతో భారత్ 2-1తో పైచేయి సాధించింది. ఆ వెంటనే దిల్‌రాజ్ సింగ్ అద్భుత నైపుణ్యంతో ఫీల్డ్ గోల్‌ను అందించాడు. అయితే, క్వార్టర్ మరో 11 సెకన్లలో ముగుస్తుందనగా సూఫియాన్ పీసీని గోల్‌గా మలచడంతో పాక్ 2-3తో పోటీలో నిలిచింది. ఇక, మూడో క్వార్టర్ ఆరంభమైన తొలి నిమిషంలోనే సూఫియాన్ మరో పెనాల్టీ కార్నర్‌ను గోల్‌లోకి పంపి 3-3తో సమం చేశాడు. కానీ, చివరి క్వార్టర్‌లో అరిజీత్ డబుల్ ధమాకాతో భారత్‌ను విజేతగా నిలిపాడు. క్రాస్‌ను అందుకొన్న అరిజీత్ లాఘవంగా గోల్‌లోకి పంపడంతో భారత్ 4-3తో మరోసారి పైచేయి సాధించింది. ఆ తర్వాత లభించిన మరో పెనాల్టీ కార్నర్‌ను కూడా అరిజీత్ గోల్‌గా మలచి భారత్‌కు టైటిల్ అందించాడు.

టైటాన్స్‌కు పరాజయం

పుణె: సులువుగా గెలిచే మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ స్వీయ తప్పిదాలతో ఓటమి పాలైంది. ప్రొ కబడ్డీలో భాగంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 33-36తో యూపీ యోధాస్ చేతిలో ఓటమి పాలైంది. గగన్ గౌడ 15 పాయింట్లు సాధించి యోధాస్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. మరో మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 39-32తో హరియాణా స్టీలర్స్‌పై గెలిచింది.

శతక్కొట్టిన సంధ్య

నాగాలాండ్‌పై హైదరాబాద్ విజయం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): బీసీసీఐ సీనియర్ మహిళల వన్డే ట్రోఫీలో నాగాలాండ్‌పై హైదరాబాద్ 145 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. బుధవారం అహ్మదాబాద్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 248 పరుగులు చేసింది. సంధ్య (107) శతకంతో కదం తొక్కగా.. అనూరాధ నాయక్ (51) అర్ధ సెంచరీ సాధించింది. మమత (33 నాటౌట్) రాణించింది. ఛేదనలో గౌహర్ సుల్తానా (4/13) ధాటికి నాగాలాండ్ జట్టు 47.1 ఓవర్లలో 104 పరుగులకే కుప్పకూలింది.

గులాబీ టెస్ట్‌కు స్పోర్టింగ్ వికెట్

సంధ్యా సమయంలో బ్యాటింగ్ కష్టమే


ప్రాక్టీస్‌లో రాహుల్, కోహ్లీ



అడిలైడ్: పింక్ బాల్ టెస్ట్‌లో భారత్‌ను దెబ్బకొట్టడానికి ఆతిథ్య జట్టు పేస్ వ్యూహాన్ని రచిస్తోంది. ఇందుకోసం వికెట్‌పై 6 మిల్లీమీటర్ల మందాన పచ్చికను ఉంచనుంది. శుక్రవారం నుంచి ఈ డే/నైట్ టెస్ట్ జరగనుంది. ఈ నేపథ్యంలో వికెట్ గురించి క్యూరేటర్ డామియన్ హో బుధవారం మీడియాకు కొన్ని వివరాలు వెల్లడించాడు. బంతి వేగంగా పాతబడకుండా ఉండేందుకు కొంతమేర గడ్డిని ఉంచుతున్నట్టు తెలిపాడు. 'బ్యాట్‌కు బంతికి మధ్య సమ పోరాటం సాగేలా పిచ్‌ను రూపొందించే ప్రయత్నం చేశాం. వికెట్‌పై గడ్డి కారణంగా ఆరంభంలో పేసర్లకు అదనపు ప్రయోజనం లభించినా.. మ్యాచ్ సాగే కొద్దీ స్పిన్‌కు అనుకూలించనుంది. సంధ్యా సమయంలో బ్యాటింగ్ చేయడం సవాలుతో కూడుకున్నది. ఇక, ఫ్లడ్‌లైట్ల కింద గులాబీ బంతి మరింతగా స్వింగ్ కావచ్చు. అయితే, క్రీజులో పాతుకుపోయిన బ్యాటర్లుండి, కొత్త బంతికి దొరక్కపోతే మాత్రం బౌలర్లకు కష్టకాలమేన'ని హో చెప్పాడు. తొలి రోజు భారీవర్షానికి అవకాశముందన్నాడు. కాగా, 2020 టూర్‌లో ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో భారత్ 36 పరుగులకే కుప్పకూలింది.

ఫ్యాన్స్‌కు నో ఎంట్రీ

భారత జట్టు ప్రాక్టీస్ సెషన్స్ వీక్షణ కోసం ఇకముందు ఫ్యాన్స్‌ను అనుమతించకూడదనే నిర్ణయం తీసుకొన్నారు. మంగళవారం టీమిండియా ఆటగాళ్లను చూడడానికి 3 వేల మందికిపైగా అభిమానులు రావడంతో గందరగోళం నెలకొంది. భారత స్టార్లను చూసి ఫ్యాన్స్ అరుపులు, కేకలతో సందడి చేశారు. రోహిత్, పంత్‌లను సిక్సులు కొట్టాలని గొడవ చేశారు. దీంతో ఆటగాళ్ల ఏకాగ్రత చెదిరి ఇబ్బందులు పడ్డారని బీసీసీఐ అధికారి తెలిపారు. ఇక, గుజరాతీలో 'హాయ్' చెప్పాలని కొందరు గిల్‌ను అడగగా..ఓ ఆటగాడిని బాడీ షేమింగ్ కూడా చేశారు. దీంతో ఫ్యాన్స్‌ను ప్రాక్టీస్ సెషన్లకు అనుమతించొద్దని నిర్ణయించారు.

బంగ్లా సంచలనం

● రెండో టెస్ట్‌లో విండీస్‌పై గెలుపు
● 1-1తో సిరీస్ సమం

కింగ్‌స్టన్ (జమైకా): కరీబియన్ దీవుల్లో బంగ్లాదేశ్ 15ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఓ టెస్ట్ మ్యాచ్‌లో విజయం సాధించింది. రెండో టెస్ట్‌లో బంగ్లా 101 పరుగుల తేడాతో వెస్టిండీస్‌ను ఓడించి, రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. బంగ్లా నిర్దేశించిన 287 పరుగుల ఛేదనలో విండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 185 పరుగులకే ఆలౌటైంది. తైజుల్ ఇస్లాం 5 వికెట్లు తీశాడు. ఆటకు నాలుగో రోజు ఓవర్‌నైట్ స్కోరు 193/5తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లా 268 రన్స్‌కు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లా 164 పరుగులు చేయగా.. విండీస్ 146 రన్స్‌కు ఆలౌటైంది. విండీస్‌లో వరుసగా 7 టెస్టులు ఓడిన బంగ్లా.. 8వ మ్యాచ్‌లో సంచలనం నమోదు చేసింది. విండీస్ గడ్డపై 2009లో రెండు టెస్టుల్లో నెగ్గిన బంగ్లాకు మళ్లీ ఆ దేశంలో ఇదే తొలి గెలుపు. ఓవరాల్‌గా ఇరుజట్ల చరిత్రలో 21 టెస్టులు జరగ్గా..విండీస్ 14, బంగ్లా 5 మ్యాచ్‌లు నెగ్గగా, 2 డ్రా అయ్యాయి.

మార్చికల్లా రూ.10 లక్షల కోట్ల నిధులు

జీడీపీ మందగమనం తాత్కాలికమే.. ఎస్‌బీఐ చైర్మన్ శ్రీనివాసులు శెట్టి



ముంబై : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) కూడా జీడీపీ వృద్ధి రేటుకు ఢోకా లేదని ఎస్‌బీఐ చైర్మన్ శ్రీనివాసులు శెట్టి అన్నారు. రెండో త్రైమాసికం (క్యూ2)లో జీడీపీ వృద్ధి రేటు రెండేళ్ల కనిష్ఠ స్థాయి 5.4 శాతానికి పడిపోవడం తాత్కాలికమన్నారు. మూడు, నాలుగు త్రైమాసికాల్లో జీడీపీ వృద్ధి రేటు పుంజుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒక్క వ్యక్తిగత రుణాలు తప్ప వ్యవసాయ, ఎస్ఎంఈ, కార్పొరేట్ రుణాలకు పెరుగుతున్న డిమాండ్‌ను ఆయన గుర్తు చేశారు. కాగా ఈ ఆర్థిక సంవత్సరం లక్ష్యంగా పెట్టుకున్న రూ.6 లక్షల కోట్ల కార్పొరేట్ రుణాలకు సరిపడా నిధులు తమ వద్ద ఉన్నట్టు తెలిపారు. బ్యాంకు లాభాలను కూడా కలుపుకుంటే వచ్చే ఏడాది మార్చి నాటికి ఎస్‌బీఐకి రూ.10 లక్షల కోట్ల నిధులు అందుబాటులో ఉంటాయన్నారు.

వ్యక్తిగత రుణాలదే హవా: ఈ ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు నాటికి ఎస్‌బీఐ వివిధ రంగాలకు రూ.33,32,533 కోట్ల రుణాలు మంజూరు చేసినట్టు శెట్టి తెలిపారు. అందులో 41.90 శాతం వ్యక్తిగత రుణాలన్నారు. కార్పొరేట్ (34.72 శాతం), ఎస్ఎంఈ (13.7 శాతం), వ్యవసాయం (9.68 శాతం) వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నట్టు చెప్పారు. మొత్తం మీద ఈ ఆర్థిక సంవత్సరం ఎస్‌బీఐ రుణాల వృద్ధి రేటు 14 నుంచి 16 శాతం మధ్య ఉంటుందని ఆశిస్తున్నట్టు తెలిపారు.

ఈసారీ నిరాశే: శుక్రవారం ప్రకటించే ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్షలో రెపో రేటు తగ్గించే అవకాశాలు లేవని శెట్టి అన్నారు. ద్రవ్యోల్బణ కట్టడే ఇప్పటికీ ఆర్‌బీఐ ప్రాధాన్యతగా కనిపిస్తోందన్నారు. రెపో రేటు తగ్గింపునకు బదులు, నిధుల లభ్యత పెంచేందుకు ఆర్‌బీఐ చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు.

నిబంధనలు మార్చాలి: ఒక బ్యాంకు ఖాతా నిద్రాణంగా ఉందా? క్రియాశీలంగా ఉందా? అనే దానికి సంబంధించిన నిబంధనలను ఆర్‌బీఐ మార్చాలని కూడా ఎస్‌బీఐ చైర్మన్ శెట్టి కోరారు. ఆర్థికేతర లావాదేవీలను కూడా ఇందుకోసం పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఆర్‌బీఐకి లేఖ రాసినట్టు తెలిపారు.

యూపీఐ లైట్ వ్యాలెట్ పరిమితి ఇక రూ.5,000



ముంబై: యూపీఐ లైట్ వ్యాలెట్ పరిమితిని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) రూ.5,000కి పెంచింది. అలాగే లావాదేవీ గరిష్ఠ పరిమితిని కూడా రూ.1,000కి పెంచింది. ప్రస్తుతం ఈ రెండింటి గరిష్ఠ పరిమితులు రూ.2,000, రూ.500గా ఉన్నాయి. ఆఫ్‌లైన్‌లో మొబైల్ ఫోన్ల ద్వారా నిర్వహించే ఈ తక్షణ చెల్లింపు విధానాన్ని వినియోగించుకునేలా మరింత ఎక్కువ మందిని ప్రోత్సహించడం లక్ష్యంగా ఆర్‌బీఐ ఈ చర్య తీసుకుంది. యూపీఐ లైట్ లావాదేవీలకు అదనపు ధ్రువీకరణ అవసరం ఉండదు. తక్కువ విలువ గల డిజిటల్ చెల్లింపులు ఆఫ్‌లైన్‌లో చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ 2022లో ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు.

ఎంపీసీ సమావేశం షురూ: దేశంలో ద్రవ్యోల్బణం ఆర్‌బీఐకి ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ఠ పరిమితి దాటిపోయిన నేపథ్యంలో ఈసారి కూడా రెపోరేటు యథాతథంగానే కొనసాగించవచ్చన్న ఊహాగానాల నడుమ గవర్నర్ శక్తికాంత దాస్ నాయకత్వంలో ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) ద్వైమాసిక సమావేశం బుధవారం ప్రారంభమైంది. దాస్ శుక్రవారం రెపో రేట్లపై ఎంపీసీ నిర్ణయాలను ప్రకటిస్తారు.

బిజినెస్

భారత విదేశీ రుణ భారం రూ.54.83 లక్షల కోట్లు


ఏడాదిలోనే రూ.2.62 లక్షల కోట్లు జంప్

ప్రపంచ బ్యాంక్ వెల్లడి

న్యూఢిల్లీ: భారత విదేశీ రుణ భారం పెరిగిపోతోంది. గత ఏడాది (2023) చివరికి ఇది 64,700 కోట్ల డాలర్లకు (సుమారు రూ.54.83 లక్షల కోట్లు) చేరింది. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 3,100 కోట్ల డాలర్లు (సుమారు రూ.2.62 లక్షల కోట్లు) ఎక్కువని ప్రపంచ బ్యాంక్ ఒక నివేదికలో తెలిపింది. ఇదే సమయంలో ఈ రుణాలపై వడ్డీ చెల్లింపుల భారమూ 1,508 కోట్ల డాలర్ల నుంచి 2,254 కోట్ల డాలర్లకు చేరింది. 2023 డిసెంబరు నాటికి భారత్‌కు ఉన్న 64,700 కోట్ల డాలర్ల విదేశీ అప్పుల్లో 49,800 కోట్ల డాలర్లు దీర్ఘకాలిక, 12,632 కోట్ల డాలర్లు స్వల్పకాలిక రుణాలని నివేదిక తెలిపింది. ఎగుమతుల పరంగా చూస్తే విదేశీ రుణాలు 80 శాతం వరకు ఉన్నాయి. గత ఏడాది భారత్ ఎగుమతుల ద్వారా సంపాదించిన ఆదాయంలో 10 శాతం ఈ రుణాల అసలు, వడ్డీల చెల్లింపులకే సరిపోయింది. గత ఏడాది భారత్ 3,342 కోట్ల డాలర్లు విదేశీ రుణాల రూపంలో, 4,694 కోట్ల డాలర్లు ఈక్విటీ పెట్టుబడుల రూపంలో ఆకర్షించినట్టు ప్రపంచ బ్యాంక్ తెలిపింది.

స్టార్టప్‌ల కోసం అబ్రియో క్యాపిటల్ నిధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత-అమెరికా తొలి దశ వెంచర్ క్యాపిటల్ సంస్థ అబ్రియో క్యాపిటల్ టెక్నాలజీ స్టార్టప్‌లకు సహాయం అందించడం కోసం 2.5 కోట్ల డాలర్ల (రూ.210 కోట్లు) నిధిని ప్రారంభించింది. ఏఐ, జెనరేటివ్ ఏఐ, ఈఆర్‌పీ సాస్, హెల్త్‌కేర్, ఫైనాన్షియల్ ఇంక్లూజన్, తయారీ, డెలివరీ విభాగాల్లో కార్యకలాపాలు సాగించే స్టార్టప్‌లలో ఈ నిధి ద్వారా అందుబాటులో ఉన్న సొమ్మును ఇన్వెస్ట్ చేస్తారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,820 ▲	71,350 ▲	99,500 ▼
ముంబై	76,392 ▲	69,975 ▲	90,025 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



5వ తేదీ			
హైదరాబాద్	620	విజయవాడ	620
వరంగల్	622	గోదావరి	620
చిత్తూరు	633	విశాఖపట్నం	610
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90	విజయవాడ	104
వరంగల్	90	గుంటూరు	99
కరీంనగర్	90	ఒంగోలు	99
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	92
కర్నూలు	90	నెల్లూరు	92
విశాఖపట్నం	100	అనంతపురం	92
గోదావరి	104		

హోండా అమేజ్ కొత్త వెర్షన్



న్యూఢిల్లీ: జపాన్‌కు చెందిన కార్ల దిగ్గజం హోండా దేశీయ మార్కెట్లో అమేజ్ కొత్త వెర్షన్‌ను మార్కెట్లో విడుదల చేసింది. మూడో తరానికి చెందిన ఈ అమేజ్ కారు ఎక్స్‌షోరూమ్ ధర రూ.7.99 లక్షల నుంచి రూ.10.89 లక్షల మధ్యన ఉంటుంది. మాన్యువల్, ఆటోమేటిక్ వెర్షన్లు రెండింటిలోనూ అందుబాటులో ఉండే ఈ కాంపాక్ట్ సెడాన్ కారు మార్కెట్లో మారుతి డిజైర్, హ్యుండయ్ ఆరాతో పోటీ పడుతుంది. 2026-27 ఆర్థిక సంవత్సరం నాటికి భారత మార్కెట్లో మూడు కొత్త మోడల్స్‌ను ప్రవేశపెట్టాలనుకుంటున్నట్టు ఈ సందర్భంగా హోండా కార్స్ ఇండియా సీఈఓ టకుయా సుమురా చెప్పారు. ఈ కొత్త మోడల్స్ హైబ్రిడ్, బ్యాటరీ ఎలక్ట్రిక్ విభాగాల్లో వస్తాయని ఆయన తెలిపారు.

మార్కెట్లో హీరో విడా వీ2 కొత్త స్కూటర్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): టూవీలర్ల తయారీలో అగ్రగామి హీరో మోటోకార్ప్ మరింత శక్తివంతమైన విద్యుత్ స్కూటర్ విడా వీ2ను మార్కెట్లోకి తెచ్చింది. ఒకసారి చార్జి చేస్తే ఇది 165 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. చూపరులను ఆకట్టుకునే డిజైన్‌తో స్టైలిష్‌గా ఇది కనబడుతుందని తెలిపింది. ఈ స్కూటర్ ధర రూ.96,000 నుంచి రూ.1.35 లక్షల మధ్యన ఉంటుంది.

2030 నాటికి ఇన్విట్స్ ఏయూఎం రూ.21 లక్షల కోట్లకు..

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విట్స్), రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్స్ ట్రస్ట్ (రీట్స్)కు రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని ఇండియన్ ఇన్విట్స్ అసోసియేషన్, భారత్ ఇన్విట్స్ అసోసియేషన్ వెల్లడించాయి. బుధవారం నాడిక్కడ ఈ సంస్థలు రీట్స్, ఇన్విట్స్‌పై రిటైల్ మదుపరులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్ సీఎఫ్ఓ ప్రీతి చద్దా, హైవే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రీట్స్ సీఎఫ్ఓ అభిషేక్ చాజర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఇన్విట్స్ నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ (ఏయూఎం) రూ.5 లక్షల కోట్లుగా ఉండగా మార్కెట్ క్యాప్ రూ.1.6 లక్షల కోట్లుగా ఉందన్నారు. భారత ప్రభుత్వం చేపడుతున్న నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పైప్‌లైన్, జాతీయ మానిటైజేషన్ ప్రణాళికతో ఇన్విట్స్‌కు మరింతగా డిమాండ్ పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీంతో 2030 నాటికల్లా ఇన్విట్స్ ఏయూఎం 21 లక్షల కోట్లకు చేరవచ్చని భావిస్తున్నట్లు తెలిపారు. కాగా రీట్స్ నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ రూ.1.5 లక్షల కోట్లుగా ఉండగా మార్కెట్ క్యాప్ రూ.95,000 కోట్లుగా ఉంది. ప్రస్తుతం వీటి చేతిలో 100 మిలియన్ చదరపు అడుగుల (ఎంఎస్ఎఫ్) ఉండగా రానున్న కొన్నేళ్లలో ఇది 400 ఎంఎస్ఎఫ్ చేరుకోనుందని తెలిపారు.

రూ.400 కోట్లతో ప్యూర్ ఈవీ కొత్త ప్లాంట్

» 30 నెలల్లో కొత్తగా 250 డీలర్‌షిప్స్
» సంస్థ వ్యవస్థాపకుడు నిశాంత్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఐఐటీ హైదరాబాద్ ఇంక్యుబేటెడ్ సంస్థ.. ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ప్యూర్ ఈవీ తన కార్యకలాపాలను మరింతగా విస్తరించేందుకు రెడీ అవుతోంది. ఇందులో భాగంగా రూ.400 కోట్ల పెట్టుబడితో కొత్త ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ వ్యవస్థాపకుడు, ఎండీ నిశాంత్ దొంగరి తెలిపారు. ప్రస్తుతం ప్యూర్ ఈవీ.. ఐఐటీ హైదరాబాద్ సమీపంలో 50 వేల యూనిట్ల సామర్థ్యంతో ప్లాంట్‌ను నిర్వహిస్తోందని, ఎలక్ట్రిక్ వాహనాలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని 40 ఎకరాల విస్తీర్ణంలో కొత్త ప్లాంట్‌ను నెలకొల్పనున్నట్లు ఆయన చెప్పారు. ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వంతో ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. సంగారెడ్డి లేదా జహీరాబాద్ నిమ్జ్‌లో ఈ ప్లాంట్‌ను నెలకొల్పే వీలుందని తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో అందుబాటులోకి రానున్న ఈ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 1.8 లక్షల యూనిట్లుగా ఉండనుందని పేర్కొన్నారు.

మూడేళ్లలో రూ.500 కోట్ల సమీకరణ

2018లో కార్యకలాపాలు ప్రారంభించిన ప్యూర్ ఈవీ ప్రస్తుతం ఈ-ప్లూటో, ఈ-ట్రాన్స్ పేరుతో రెండు స్కూటర్లు, 110 సీసీ ఎకో డ్రిఫ్ట్, 125 సీసీ ఈ-ట్రిస్ట్ పేరుతో రెండు మోటార్‌సైకిళ్లను విక్రయిస్తోందని నిశాంత్ తెలిపారు. కాగా కంపెనీ ఇప్పటికే వెంచర్ క్యాపిటలిస్ట్స్ (వీసీ), అల్ట్రా హైనెట్‌వర్త్ నుంచి రూ.220 కోట్ల నిధులను సమీకరించిందన్నారు. కాగా భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని వచ్చే మూడేళ్లలో ప్రైవేట్ ఈక్విటీ, వీసీల నుంచి రూ.500 కోట్లు సమీకరించాలని చూస్తున్నట్టు ఆయన చెప్పారు. ప్రస్తుతం ప్యూర్ ఈవీ దేశవ్యాప్తంగా 70 డీలర్‌షిప్స్‌ను నిర్వహిస్తోందని, వచ్చే 30 నెలల కాలంలో కొత్తగా 250 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కంపెనీ ఇప్పటి వరకు 75,000 యూనిట్లను విక్రయించగా వచ్చే ఏడాదిన్నర కాలంలో 2 లక్షల యూనిట్లను అమ్మాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు నిశాంత్ తెలిపారు. కంపెనీ ఇప్పటికే నేపాల్, భూటాన్ దేశాలకు ఎగుమతి చేస్తుండగా జనవరి-మార్చి త్రైమాసికంలో పశ్చిమాసియా, ఆఫ్రికా దేశాలకు ఎగుమతులను ప్రారంభించనున్నట్లు నిశాంత్ చెప్పారు.

తీవ్ర ఊగిసలాటల్లోనూ స్వల్ప లాభాలు

ముంబై: భారత స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగో రోజు పాజిటివ్‌గా ముగిశాయి. బుధవారం ట్రేడింగ్‌లో సూచీలు ఆద్యంతం తీవ్ర ఊగిసలాటలకు లోనైనప్పటికీ, చివరికి స్వల్ప లాభాలను నమోదు చేయగలిగాయి. బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగ షేర్లలో కొనుగోళ్లు, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు ఇందుకు దోహదపడ్డాయి. సెన్సెక్స్ 110.58 పాయింట్ల వృద్ధితో 80,956.33 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 10.30 పాయింట్ల పెరుగుదలతో 24,467.45 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో సగమే రాణించాయి.

ఏకరీతి నామినేషన్ నిబంధనలు: సెబీ

అశక్తులైన పెట్టుబడిదారులకు ఊరట కల్పించేందుకు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ కీలక నిర్ణయం తీసుకుంది. ఇన్వెస్టర్ తరఫున నియమిత వ్యక్తి సెక్యూరిటీ లావాదేవీలు నిర్వహించేందుకు వీలుగా సెక్యూరిటీ మార్కెట్లోని అన్ని వసతులకు వర్తించేలా ఏకరీతి నామినేషన్ ప్రమాణాలను సెబీ బుధవారం నోటిఫై చేసింది. అదనంగా, అశక్తుడైన ఇన్వెస్టర్ ఒకవేళ చనిపోతే తన సెక్యూరిటీలను బదిలీ చేయాల్సిన వ్యక్తి పేరునూ నామినేట్ చేసేందుకూ తప్పనిసరిగా వీలు కల్పించాలన్న నిబంధననూ ప్రకటించింది. మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు, డీమ్యాట్ అకౌంట్లకూ ఈ ఏకరీతి నామినేషన్ నిబంధనలు వర్తించనున్నాయి.

అర్సెడో సిస్టమ్స్‌తో సైయెంట్ డీఎల్ఎం ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మైసూర్ ప్లాంట్‌లో 500 కేడబ్ల్యూపీ సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు కోసం పునరుత్పాదక ఇంధన విభాగంలో కార్యకలాపాలు సాగిస్తున్న ఆర్సెడో సిస్టమ్స్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్టు సైయెంట్ డీఎల్ఎం ప్రకటించింది. ఈ ఒప్పందం కింద ఆర్సెడో సిస్టమ్స్ సోలార్ ప్లాంట్ డిజైనింగ్, ఇంజనీరింగ్, ఇన్‌స్టలేషన్ సేవలతో పాటు ప్లాంట్ నిర్వహణ కూడా చేపడుతుంది.

విద్యార్థులకు పురుగులన్నం పెట్టడమే విజయోత్సవమా?



» కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నవి విజయోత్సవాలు కావని, వికృత ఉత్సవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. కాంగ్రెస్ దృష్టిలో విద్యార్థులకు పురుగుల అన్నం పెట్టడమే విజయమని, వారి చావులే ఉత్సవాలని బుధవారం 'ఎక్స్' వేదికగా తీవ్రంగా మండిపడ్డారు. యువతకు ఉద్యోగాలు ఇవ్వకపోవడం, ఆడబిడ్డలను ఆగం చేయడం, రైతులకు రుణమాఫీ చేస్తామని మాట తప్పడమే కాంగ్రెస్ విజయాలుగా భావిస్తోందని ఎద్దేవా చేశారు. ఏడాది అరాచక పాలనలో ప్రజల చావులు, గోసలే ఆ పార్టీ దృష్టిలో ఉత్సవాలని ఆయన విమర్శించారు.

వర్గీకరణపై ఐక్యంగా ఉద్యమించాలి: తమ్మినేని

రిజర్వేషన్ల వర్గీకరణపై మాల, మాదిగలు ఐక్యంగా ఉద్యమించాల్సిన తరుణమిదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సూచించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, రిజర్వేషన్లను కాపాడుకుంటూ, ప్రైవేటు రంగంలో సైతం రిజర్వేషన్ల కోసం కృషి చేయాలన్నారు. రిజర్వేషన్ వర్గీకరణపై కొన్ని రోజులుగా ఎంఆర్‌పీఎస్, మాలమహానాడు కార్యకర్తలు బలప్రదర్శనలు చేసుకుంటూ, ఒకరినొకరు విమర్శించుకుంటూ ఘర్షణ వాతావరణాన్ని సృష్టిస్తున్నారని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుల వ్యవస్థ బలంగా వేళ్లూనుకున్న సమాజంలో మాల, మాదిగల పేరుతో వైషమ్యాలు పెంచుకోవడం సమంజసం కాదని, సామాజిక న్యాయం సాధించుకునేందుకు ఇది ఆటంకం అవుతుందని పేర్కొన్నారు. పరిస్థితులను అర్థం చేసుకుని ఇరు వర్గాలు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలో మరో రెండు కొత్త ఆర్టీసీ డిపోలు

» పెద్దపల్లి, ఏటూరునాగారంలో ఏర్పాటు: పొన్నం

హైదరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మరో రెండు కొత్త ఆర్టీసీ బస్ డిపోలను ఏర్పాటు చేయనున్నట్టు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. పది పదిహేనేళ్లుగా పలు కారణాలతో నష్టాల ఊబిలో కూరుకుపోయిన ఆర్టీసీ కొత్త డిపోల ఏర్పాటుపై దృష్టి పెట్టలేకపోయిందన్నారు. సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే తీసుకున్న చర్యలతో ఆ సంస్థని లాభాల బాట పట్టించినట్టు వివరించారు. దీంతో వెనుకబడిన ములుగు జిల్లా ఏటూరునాగారం, పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బస్సు డిపోలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. నూతన ఉద్యోగ నియామకాలు, కొత్త బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీలో సంస్కరణలు అమలుచేయడం వల్ల నష్టాల నుంచి లాభాల బాటకు తీసుకురాగలిగినట్టు వివరించారు. కొత్త డిపోల ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన తెలిపారు.

ఎన్‌కౌంటర్లపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

» మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి: జి.హరగోపాల్

నల్లకుంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఇటీవల జరిగిన అన్ని ఎన్‌కౌంటర్లపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని ప్రొఫెసర్ జి.హరగోపాల్ డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎన్‌కౌంటర్లు చేయిస్తోందని ఆరోపించారు. హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఎన్‌కౌంటర్ మృతుడు మధు సహచరి మీనా, పౌర హక్కుల నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శృతి, సాగర్ ఎన్‌కౌంటర్ తర్వాత ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో ఎన్‌కౌంటర్లు ఆపివేశారని అన్నారు. ఆ ఎన్‌కౌంటర్‌పై స్పందించినట్లుగానే ఇటీవల జరిగిన ములుగు ఎన్‌కౌంటర్‌పై తెలంగాణ సమాజం స్పందించాలన్నారు. తద్వారా బూటకపు ఎన్‌కౌంటర్లకు అడ్డుకట్ట పడుతుందన్నారు. డిసెంబరు 1న ములుగులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన వారికి ఆహారంలో విషం పెట్టి చిత్రహింసలకు గురిచేసి, అమానుషంగా హత్య చేశారని ఆరోపించారు. పాలకులు మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపి, శాంతియుత వాతావరణం నెలకొల్పాలని, ములుగు ఎన్‌కౌంటర్‌లో మృతుల శవాలకు ఫోరెన్సిక్ నిపుణుల చేత పరీక్షలు చేయించాలని హరగోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రైల్వే సవరణ బిల్లు కాగితాల్లోనే..: ఎంపీ మల్లు రవి

» రైల్వే సమస్యల పరిష్కారంలో కేంద్రం విఫలం: అసదుద్దీన్

» పద్మావతి ఎక్స్‌ప్రెస్‌ను భువనగిరిలో ఆపాలి: చామల

న్యూఢిల్లీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైల్వే సవరణ బిల్లు కాగితాలకే పరిమితమైందని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి ఆరోపించారు. రైల్వేలో పారదర్శకత కోసం స్వతంత్ర రెగ్యులేటరీని ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌ను కేంద్ర విస్మరించిందన్నారు. బుధవారం లోక్‌సభలో రైల్వే సవరణ బిల్లుపై ఆయన మాట్లాడారు. ఈ బిల్లు రైల్వే బోర్డు అధికారాలు, దాని పనితీరుపై తీవ్ర ప్రభావం చూపుతుందని, బిల్లులో ప్రభుత్వం చెబుతున్నదానికి, క్షేత్రస్థాయిలో పరిస్థితులకు సంబంధంలేదన్నారు. తెలంగాణకు సంబంధించి బీదర్-బోధన్ వయా నారాయణ్‌ఖేడ్-ప్రీతంపూర్ రైల్వే లైన్ మ్యాప్ చేయాలని కోరారు. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. రైల్వే సవరణ బిల్లు కేవలం కాగితాలకే పరిమితమైందని, రైల్వే సమస్యల పరిష్కారంలో కేంద్రం విఫలమైందని ఆరోపించారు. ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. పద్మావతి ఎక్స్‌ప్రెస్‌ను భువనగిరిలో, మచిలీపట్నం-బీదర్ రైలును భువనగిరి, ఆలేరు, జనగామ వద్ద ఆపాలని కోరారు.

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి: అనిల్ కుమార్ యాదవ్

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ కోరారు. బుధవారం రాజ్యసభలో ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. విశాఖఉక్కు కర్మాగారంలో 100% పెట్టుబడులు ఉపసహరించుకోవాలని 2021లో నిర్ణయించినట్టు గుర్తు చేశారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంపై అక్కడ ఆందోళనలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

రేవంత్‌రెడ్డీ.. సాగర్ నీళ్లు తీసుకురా: కవిత

హైదరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): "పేగులు మెడలో వేసుకుంటా.. నరసింహావతారం ఎత్తుతా అంటున్నావ్.. రేవంత్‌రెడ్డీ నీకు నిజంగా ధైర్యం ఉంటే.. నాగార్జునసాగర్ వద్ద కేంద్ర బలగాలను వెనక్కి పంపి మననీళ్లు మనకు తీసుకురావాలి" అని తెలంగాణజాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సవాల్ విసిరారు. బుధవారం తన నివాసంలో నిర్వహించిన తెలంగాణ జాగృతి వరంగల్, నల్లగొండ జిల్లాల నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేసీఆర్ హయాంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు తెలంగాణ చేతిలో ఉండేదని, కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంతో ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయిందన్నారు. మహాలక్ష్మి పథకంకింద ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.2500 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సీఎం, ఇంటెలిజెన్స్ ఐజీ నా ఫోన్ ట్యాప్ చేస్తున్నారు: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హైదరాబాద్/బంజారాహిల్స్ డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొద్దినెలలుగా సీఎం రేవంత్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ ఐజీ శివధర్‌రెడ్డి తన మొబైల్ ఫోన్ ట్యాప్ చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. బుధవా రం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం ప్రోద్బలంతో శివధర్‌రెడ్డి తనఫోన్ ట్యాప్ చేసి డ్రగ్స్ కేసులో ఇరికించాలని ప్రయత్నించారన్నారు. తాను కేసు పెట్టేందుకు బంజారాహిల్స్ ఏసీపీకి ఫోన్ చేస్తే రమ్మన్నారని, తనకు చెప్పిన సమయానికి ముందే ఆయన పోలీస్‌స్టేషన్ నుంచి వెళ్లిపోయారని చెప్పారు. స్టేషన్‌లో ఉన్న సీఐ తానొక ఎమ్మెల్యే అనే గౌరవం లేకుండా ప్రవర్తించారన్నారు. ఫోన్‌ట్యాపింగ్‌కు సంబంధించి సీఎం, డీజీపీ, ఇంటెలిజెన్స్ ఐజీపైనా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. కాగా, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి బుధవారం బంజారాహిల్స్ పోలీసుస్టేషన్ వద్ద హంగామా సృష్టించారు. తన ఫిర్యాదు తీసుకోవాలని స్టేషన్ నుంచి బయటకు వెళుతున్న ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర వాహనాన్ని అడ్డుకోవడమే కాకుండా దుర్భాషలాడారు. ఈ నేపథ్యంలో విధులకు ఆటంకం కలిగించారని కౌశిక్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే ఎమ్మెల్యే ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించారు.

మాఫియా మోడల్!

వైసీపీ పాలనలో లూటీయే డ్యూటీ.. భయపెట్టి, బెదిరించి ఆస్తులు కైవసం

» కాకినాడ పోర్టు, సెజ్‌లాంటివి ఎన్నో!

» విశాఖ, కాకినాడపై ప్రత్యేక దృష్టి

» వంతాడ గనుల్లో 89శాతం సొంతం

» ఏటా రూ.180 కోట్ల సంపాదన

» విశాఖ బేపార్కులో పెద్దల పాగా

(కాకినాడ/విశాఖపట్నం - ఆంధ్రజ్యోతి)

అధికారాన్ని ఉపయోగించుకుని ఇన్ని అరాచకాలు చేయొచ్చా? ప్రభుత్వంలో ఉన్నవారే 'మాఫియా' తరహాలో బెదిరింపులకు దిగవచ్చా? ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇవన్నీ జరిగాయి! ప్రధానంగా అయిదేళ్ల పాలనలో కాకినాడను కొల్లగొట్టారు. విశాఖపై 'ప్రత్యేక' దృష్టి సారించి... ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను కైవసం చేసుకున్నారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత బెదిరించి భూములు, ప్రాజెక్టులు లాక్కోవడం విశాఖపట్నం నుంచే మొదలైంది. తొలి ప్రయత్నంగా ఓ ఎన్ఆర్ఐ ఇంటికి కడపకు చెందిన కొందరు వెళ్లి తుపాకీతో బెదిరించారు. రూ.100 కోట్ల విలువైన భూమిని వివాదంలోకి లాగకుండా ఉండాలంటే రూ.10 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. దానికి నిరాకరించడంతో వైసీపీ ప్రభుత్వం ఆ భూమి స్వాధీనానికి చర్యలు తీసుకుంది. వెరసి... ఆ బెదిరింపులకు సర్కారు పెద్దల ప్రత్యక్ష సహకారముందని అప్పుడే స్పష్టమైంది.

వంతాడ వాటాలు కొట్టేశారిలా..

కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో వంతాడ గ్రామం లేటరైట్‌కు ప్రసిద్ధి. దీనిపై కన్నేసిన గత ప్రభుత్వ పెద్ద తన ప్రధాన అనుచరుడిని రంగంలోకి దించారు. ఇక్కడ కొండల్లో 200 ఎకరాల్లో ఇరవై ఏళ్లపాటు ఆంధ్రా మినరల్స్ అనే కంపెనీ తమ కుటుంబ సభ్యుల పేరిట ఆరు లీజుల వరకు దక్కించుకుంది. ఏడాదికి 20 లక్షల టన్నుల లేటరైట్ తవ్వితీస్తూ సిమెంట్ ఫ్యాక్టరీలకు, ఒడిసాలోని జిందాల్ స్టీల్ కంపెనీకి ఖనిజాన్ని విక్రయిస్తోంది. కాకినాడ పోర్టు నుంచి చైనా, హాంకాంగ్ దేశాలకు తరలించేది. ఈ కంపెనీ జగన్ ప్రభుత్వం రాక ముందు ఐదేళ్లలో వందల కోట్ల వ్యాపారం చేసింది. ఒక రకంగా చెప్పాలంటే ఇది బంగారు బాతు! దీనిపై వైసీపీ పెద్దల కన్ను పడింది. వాటిని స్వాధీనం చేసుకునేందుకు స్కెచ్ వేశారు. 2021లో లీజుదారుడిని 'చర్చల'కు పిలిచారు. అప్పటి 'పెద్ద' మంత్రి తనయుడు, మరికొందరు కలిసి... 'ఎంతోకొంత ఇస్తాం. వంతాడ గనులు మాకు వదిలేయండి' అని హుకుం జారీ చేశారు. దీనికి లీజుదారుడు అంగీకరించలేదు. అంతే... ఇక సర్కారు తన



విశాఖపట్నంలో ఉన్న రామానాయుడు స్టూడియో

ప్రతాపం చూపడం మొదలుపెట్టింది. పర్మిట్లు ఆగిపోయాయి. మైనింగ్ ఆగిపోయింది. దీంతో 'ఆంధ్రా' యజమానికి దిక్కుతోచలేదు. కేంద్ర పర్యావరణ అనుమతులతో తవ్వకాలు జరుపుతున్నందున... తేడా వస్తే ఇరుక్కుపోతానని, తనను వదిలేయాలని ప్రాధేయపడ్డారు. మరో డీల్ చెప్పాలని కోరారు. దీంతో... 'లీజు నీది. తవ్వకాలు మాత్రం మావి. లాభాల్లో 89 శాతం మాకు. 11 శాతం నీకు' అంటూ బలవంతపు డీల్ కుదిర్చారు. ఇలా పైసా పెట్టుబడి లేకుండా ఏటా రూ.180 కోట్లు పోగేసుకుంటున్నారు.

బే పార్క్ పూర్తిగా సొంతం

విశాఖ రుషికొండలో ఎకో టూరిజం ప్రాజెక్టు పేరుతో ఇండో అమెరికన్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ (బే పార్క్) రెండు దశాబ్దాల క్రితం ప్రభుత్వం నుంచి 28 ఎకరాల భూమి లీజుకు తీసుకుంది. రూ.100 కోట్లకు పైగా వెచ్చించి అంతర్జాతీయ ప్రమాణాలతో లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో వెల్‌నెస్ సెంటర్ (ఆరోగ్య కేంద్రం) ఏర్పాటు చేసింది. ఇది మెడికల్ టూరిజం ప్రాజెక్టు. ప్రకృతి సిద్ధమైన వైద్యం అందిస్తుంటారు. దానిపై వైసీపీ పెద్దల కన్ను పడింది. అంతే... డెవలపర్లను బెదిరించారు. ప్రాజెక్టు కోసం బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలు చెల్లించలేదనే కారణం చూపించి... లీజు రద్దు చేస్తామని లొంగదీసు

వైవీ సుబ్బారెడ్డి తనయుడు విక్రాంత్ రెడ్డి, విజయసాయిరెడ్డిలను రంగంలోకి దించి కాకినాడ డీప్‌వాటర్ పోర్టు, కాకినాడ సెజ్‌ను సొంతం చేసుకున్న వైనంపై అసలు వాటాదారుడు కేవీ రావు తాజాగా సీఐడీకి ఫిర్యాదు చేశారు. అదే విధంగా... ఇతర బాధితులూ భయం వీడి, ఫిర్యాదులు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎప్పుడూ గనుల లీజుదారులు, పారిశ్రామికవేత్తల జోలికి వెళ్లలేదు. వైసీపీ పెద్దలు మాత్రం ఒక పద్ధతి ప్రకారం పారిశ్రామికవేత్తలను బెదిరించి మరీ వాటాలను, కంపెనీలను కబ్జా చేశారు. గనులను సొంతం చేసేసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించారని, భూములు ఆక్రమించారని, ఫైన్లు వేస్తామని... ఇలా పలురకాలుగా వేధించి వాటాలు కొట్టేశారు.

కున్నారు. ఆ రుణాలు తామే దశల వారీగా చెల్లిస్తామంటూ ఒప్పందం చేసుకొని అసలు యజమానులను గెంటేసి... ఆ ప్రాజెక్టును హస్తగతం చేసుకున్నారు. ఈ విషయంలో ఆర్థికంగా సహకరించిన హెటిరో డ్రగ్స్ కంపెనీకి నక్కపల్లిలో 81 ఎకరాల ప్రభుత్వ భూమిని నామమాత్రపు ధరకు కటబెట్టారు.

రామానాయుడు స్టూడియో భూముల్లో వాటాకు ఒత్తిడి

భీమిలి బీచ్‌రోడ్డులో రామానాయుడు స్టూడియోకు 34.44 ఎకరాలను 2003లో అప్పటి ప్రభుత్వం కేటాయించింది. ఆ భూమిని సినిమా షూటింగ్‌లు, చిత్ర పరిశ్రమ అభివృద్ధికే వినియోగించాలి. అందులో కొంత భాగాన్ని వారు ఉపయోగించుకున్నారు. మూడొంతులు ఖాళీగా ఉంది. దానిపై వైసీపీ కీలక నేత కన్ను పడింది. ఖాళీగా ఉన్న భూమి వెనక్కి ఎందుకు తీసుకోకూడదంటూ బెదిరింపుల రాయబారం నడిపారు. అక్కడ లేఅవుట్ వేసి, అందులో సగం ప్లాట్లు తమకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందుకు అనుగుణంగా ఆ ప్రాంతాన్ని వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌లో మిక్స్‌డ్ జోన్‌గా మార్చేశారు. దాంతో సురేశ్ ప్రొడక్షన్స్ 15.18 ఎకరాల్లో 34 ప్లాట్లతో లేఅవుట్ వేసింది. అందులో సగం ప్లాట్లు బినామీల మీద రిజిస్టర్ చేయాల్సిందిగా వైసీపీ పెద్దలు ఒత్తిడి పెట్టారు. ఈలోగా విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి సుప్రీంకోర్టుకు వెళ్లారు. న్యాయస్థానం లేఔట్‌లో విక్రయాలపై 'స్టే' విధించింది.

'రాడిసన్'లో సగం వాటా వేరొకరికి అప్పగింత

విశాఖ-భీమిలి బీచ్‌రోడ్డులో 'కార్తీకవనం' పేరుతో రెండు దశాబ్దాల క్రితం ఓ ప్రైవేటు సంస్థతో బీఓటీ ప్రాజెక్టుకు వీఎంఆర్‌డీఏ ఒప్పందం చేసుకుంది. సాగర్ నగర్ దగ్గర బీచ్‌ను ఆనుకొని పది ఎకరాల స్థలాన్ని 33 ఏళ్ల లీజుకు ఇచ్చింది. అందులో అటవీ శాఖకు చెందిన భూమి కొంత ఉండడంతో నిర్మాణాలకు కేంద్ర అటవీ పర్యావరణ శాఖ అనుమతులు అవసరమయ్యాయి. ఆ తరువాత ఆ కంపెనీలో కొత్త భాగస్వాములు చేరి అనుమతులు తెచ్చుకొని నిర్మాణం పూర్తిచేశారు. అదే 'రాడిసన్ బ్లూ' హోటల్. దానిపై వైసీపీ నేతల కన్నుపడింది. అంతే ఆ హోటల్ ప్రారంభం కాకుండా ఒక పోలీస్ అధికారి తాళాలు వేశారు. అదేమని ప్రశ్నిస్తే... నిబంధనలకు విరుద్ధంగా పనులు జరుగుతున్నాయంటూ సమాధానమిచ్చారు. పెద్దలతో మాట్లాడుకోవాలని పరోక్షంగా సందేశాలు ఇచ్చారు. వారు చెప్పిన వారికి 50 శాతం వాటా ఇవ్వడానికి అంగీకరించడంతో ఆ హోటల్ ప్రారంభానికి అనుమతి ఇచ్చారు.

భారతి సిమెంట్ కోసం...

జగన్ అధికారంలో ఉండగా 2022లో ఉమ్మడి విశాఖ జిల్లా నాతవరం సరిహద్దులో లేటరైట్ గనులనూ కొల్లగొట్టేశారు. అక్కడ తవ్విన వేల మెట్రిక్ టన్నుల లేటరైట్‌ను ఆ జిల్లా మీదుగా కాకుండా సరిహద్దున ఉన్న కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం మీదుగా రహస్యంగా తరలించడానికి స్కెచ్ వేశారు. కత్తిపూడి హైవే మీదుగా మూడో కంటికి తెలియకుండా భారతి సిమెంట్‌కు సరుకు పంపడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. అయితే... నాతవరం మండలం బమిడికలొద్ది నుంచి రౌతులపూడిలో లేటరైట్ నిల్వ చేసే ప్రదేశానికి మధ్య రిజర్వు ఫారెస్ట్ ఉంది. పైగా టిప్పర్ల రాకపోకలకు రహదారి లేదు. దీంతో ఏకంగా 12 కిలోమీటర్ల మేర రిజర్వు ఫారెస్టును చీల్చి వందల చెట్లను నరికేసి అనుమతులు లేకుండా ఏకంగా రహదారి నిర్మించేశారు. అక్కడ తవ్విన లేటరైట్‌ను ఈ మార్గం ద్వారా తెచ్చి భారతి సిమెంట్ పేరుతో ఉన్న లారీల్లో దర్జాగా తరలించేశారు.

850 ఎకరాల మెట్టంతా మింగేశారు..

కాకినాడపై పడి సెజ్, పోర్టులు, లేటరైట్, బియ్యాన్ని మింగేసిన వైసీపీ పెద్దలు... పెద్దాపురం రామేశం మెట్టలో 850 ఎకరాల్లో విస్తరించిన కొండలను సైతం పిండేసి గుల్లచేసేశారు. అయిదేళ్లపాటు నిరంతరాయంగా గ్రావెల్ తవ్వకాలు జరిపి రూ.850కోట్లకుపైగా లూటీ చేసేశారు. అక్కడ అక్రమ తవ్వకాలతో వందల మీటర్ల ఎత్తున్న కొండలన్నీ కరిగిపోవడమే కాదు... మరో వంద అడుగుల లోతుకు గోతులు పడ్డాయి.

కాకినాడ పోర్టు కేసులో కేవీ రావు వాంగ్మూలం!

అమరావతి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఒక ప్రభుత్వమే మాఫియా అవతారం ఎత్తితే ఎలా ఉంటుందో గత వైసీపీ పాలనలో జరిగిన నేరాలు, ఘోరాలు, బెదిరింపు వ్యవహారాలు చాటుతున్నాయి. కాకినాడ పోర్టు వ్యవహారం ఇందుకు పరాకాష్ఠ అని సీఐడీ భావిస్తోంది. దీంతో కాకినాడ కేసులో సీఐడీ అధికారులు దూకుడు పెంచేశారు. రూ. మూడు వేల కోట్ల ఆస్తిని కొల్లగొట్టిన ఈ వ్యవహారంలో బుధవారం బాధితుడు కేవీ రావు వాంగ్మూలాన్ని నమోదుచేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు వై.విక్రాంత్ రెడ్డి నేరుగా తాడేపల్లి ప్యాలెస్‌కు కేవీ రావును తీసుకెళ్లి బెదిరించినట్లు ఆరోపణలు నమోదయ్యాయి. ఈ మొత్తం ఎపిసోడ్ ఎలా జరిగింది.....ఆ సమయంలో తాడేపల్లి ప్యాలెస్‌లో ఎవరున్నారు...బాధితుడితోపాటు ఇంకెవరైనా సాక్షులు ఉన్నారా.....హైదరాబాద్‌లో విక్రాంత్ రెడ్డి ఇంటికెళ్లినప్పుడు కేవీ రావుతోపాటు ఎవరైనా వెళ్లారా.... తదితర అంశాలపై సమీక్షించిన సీఐడీ అధికారులు....కేవీ రావు వాంగ్మూలం రికార్డు చేసినట్లు తెలిసింది.

ఎప్పుడూ చూడలేదు!


గన్ పాయింట్లో వేల కోట్ల ఆస్తులు కొట్టేయడమా

» రాజకీయ అధికారాన్ని అడ్డుపెట్టుకుని దుర్మార్గంగా రాయించుకోవడం ఘోరం: చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'గన్ చూపించి రూ.వేల కోట్ల విలువైన ఆస్తులు రాయించుకోవడం, కొట్టివేయడం దేశ చరిత్రలోనే లేదు. రాజకీయ అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఇంత దుర్మార్గంగా ఆస్తులు రాయించుకున్న ఘటన నేనైతే ఎప్పుడూ వినలేదు.. చూడలేదు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. బుధవారమిక్కడి టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా ప్రతినిధులతో కొద్దిసేపు ముచ్చటించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, ఆయన బృందం కలిసి కాకినాడ పోర్టు, కాకినాడ సెజ్ ప్రమోటర్లను బెదిరించి మెజారిటీ వాటాలను రాయించుకోవడంపై పోలీసులకు అందిన ఫిర్యాదు ఈ సందర్భంగా ప్రస్తావనకు వచ్చింది. 'ఈ దుర్మార్గానికి బలైన బాధితులకు న్యాయం చేయడం మా బాధ్యత. ఇటీవల తెచ్చిన భూ ఆక్రమణల నిరోధక చట్టం పరిధిలోకి ఇది వస్తుందా రాదా అన్నది చూడాలి. ముంబైలో మాఫియా ముఠాలు రాయించుకున్న ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి మహారాష్ట్ర ప్రభుత్వం గతంలో ఒక చట్టం తెచ్చిందని అంటున్నారు. దాని వివరాలు కూడా తెలుసుకుంటాం' అని తెలిపారు. భూ సమస్యలపై రాష్ట్రంలో పెద్దఎత్తున వస్తున్న వినతులు, ఫిర్యాదుల్లో ప్రతి ఒక్క దానికీ సంపూర్ణ పరిష్కారం చూపించాలని ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. అధికారుల్లో కూడా కొన్ని తప్పులు కనిపిస్తున్నాయని.. వచ్చిన ఫిర్యాదును మరో అధికారి వద్దకు తోసివేసి పరిష్కారమైనట్లు రాసేస్తున్నారని ఆక్షేపించారు. ఇది సరికాదని.. ఆ ఫిర్యాదుకు పూర్తి పరిష్కారం లభిస్తేనే బాధితులకు సంతృప్తి లభిస్తుందన్నారు. రెవెన్యూ సమస్యలు ఏ మేరకు ఉన్నాయో తెలుసుకోవడానికి ఈ నెలలోనే రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు.

అది హోం డిపార్ట్‌మెంట్ పని..!

ఇంటి నిర్మాణం కోసం రాజధానిలో చంద్రబాబు కుటుంబం ఇటీవల స్థలం కొనుగోలు చేసిన విషయాన్ని విలేకరులు ప్రస్తావించినప్పుడు ఆయన నవ్వేశారు. 'ఇంటి నిర్మాణం వ్యవహారం నాకు సంబంధించింది కాదు. అంతా ఇంట్లో హోం డిపార్ట్‌మెంట్ చూసుకుంటుంది. నాకు దాని గురించి ఏమీ తెలియదు. రాజధాని నిర్మాణం ఒక్కటే నా పని. నేను అదే చూసుకుంటున్నాను' అని వ్యాఖ్యానించారు.



> అవినీతి, వసూళ్లు, గూండాయిజం వంటివి గతంలో విన్నాం కానీ ఏకంగా వేల కోట్ల రూపాయల ఆస్తులను పారిశ్రామికవేత్తల నుంచి జబర్దస్తుగా లాక్కుని తమ పేరు మీద రాయించుకోవడం ఘోరమైన చర్య. ఈ రాష్ట్రంలోనే కాదు.. దేశంలోనే ఇలాంటివి జరుగలేదు.
> - ముఖ్యమంత్రి చంద్రబాబు

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక రేపటి నుంచి..

(మొదటిపేజీ తరువాయి)

అందించేందుకు వీలుగా ప్రతి గ్రామం, వార్డుల వారీగా 'ఇందిరమ్మ ఇళ్ల కమిటీ'లను ఏర్పాటు చేశామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా ఒక్కో ఇంటికీ రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని నాలుగు దశల్లో ఇస్తామని, మహిళ పేరు మీద ఇంటిని మంజూరు చేస్తామని పేర్కొన్నారు. పథకం కింద నిర్మించే ఇళ్లు కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో వంటగది, టాయిలెట్ సౌకర్యం కలిగి ఉంటాయన్నారు. గత ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణానికి కాంట్రాక్ట్ వ్యవస్థ ఉండేదని, ఇప్పుడు ఆ వ్యవస్థను రద్దు చేసి లబ్ధిదారులే ఇళ్లను నిర్మించుకునేలా అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. లబ్ధిదారులు తమ సౌలభ్యాన్ని బట్టి 400 చదరపు అడుగులకు తగ్గకుండా ఎంత విస్తీర్ణంలోనైనా ఇంటిని నిర్మించుకోవచ్చన్నారు. కాగా, మోడల్ హౌస్ కింద నమూనాగా ఒక ఇంటిని ప్రతి మండల కేంద్రంలో ఏర్పాటుచేస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం మొదటి విడతలో భాగంగా ఈ ఏడాది నియోజకవర్గానికి 3500-4000 ఇళ్ల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 5లక్షల ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ఇందులో మొదటి విడతలో సొంత స్థలం ఉన్నవారికి, రెండో దశలో స్థలం లేనివారికి ప్రభుత్వమే స్థలమిచ్చి, ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు. పథకంలో వికలాంగులు, ఒంటరి మహిళలు, అనాథలు, వితంతువులు, ట్రాన్స్‌జెండర్లు, సఫాయి, కర్మచారులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ పథకం అమలు నేపథ్యంలో గృహ నిర్మాణ సంస్థను బలోపేతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతోపాటు వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఉన్న గృహ నిర్మాణ శాఖ ఉద్యోగుల్లో 296 మందిని తిరిగి శాఖకు తీసుకువచ్చామన్నారు. గత ప్రభుత్వం గృహ నిర్మాణ శాఖను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. కాగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి వైయస్సార్ హయాంలో 2006-2007లో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిందని గుర్తుచేశారు. అప్పుడు తెలంగాణ ప్రాంతంలో 2006-07నుంచి 2014 వరకు 23,85,188 ఇళ్లను మంజూరు చేయగా, వాటిలో 19.32 లక్షల ఇళ్లు పూర్తయ్యాయని, మరో 4,53,187 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని వెల్లడించారు. ఇల్లులేని పేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు.

యాప్‌ను ఆవిష్కరించనున్న రేవంత్..

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారుల గుర్తింపు కోసం రూపొందించిన మొబైల్ యాప్‌ను సీఎం రేవంత్‌రెడ్డి గురువారం ఆవిష్కరించనున్నారు. ఉదయం 10.30 గంటలకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి సచివాలయంలో యాప్‌ను ఆవిష్కరించి, అందుబాటులోకి తీసుకురానున్నారు. యాప్‌లో ఇంటి పథకం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ప్రస్తుతం నివసిస్తున్న ఇంటి స్వరూపం, కుటుంబ సభ్యుల వివరాలు, ఇంటి నిర్మాణానికి సంబంధించిన భూమి సహా పలు వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది.

గూగుల్ మరో అడుగు

(మొదటిపేజీ తరువాయి)



గూగుల్ ప్రధాన సమాచార అధికారి రాయల్ హన్సెన్‌తో సీఎం రేవంత్‌రెడ్డి

ఐటీ ఇంజనీరింగ్ సర్వీసెస్‌కు హైదరాబాద్ కేంద్రంగా ఉందని.. అంతర్జాతీయంగా పేరొందిన టెక్ దిగ్గజాలైన గూగుల్, మైక్రోసాఫ్ట్, ఆపిల్, అమెజాన్, ఫేస్ బుక్ ఇక్కడ ఉన్నాయని కొనియాడారు. సేఫ్టీ సెంటర్ ఏర్పాటు ద్వారా సైబర్ భద్రత సమస్యలను వేగంగా పరిష్కరించే వీలుంటుందని హన్సెన్ పేర్కొన్నారు. ఆసియా పసిఫిక్ జోన్లో ఇప్పటి వరకు టోక్యోలో మాత్రమే గూగుల్ ఇంజనీరింగ్ సేఫ్టీ సెంటర్ ఉంది. హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తే.. అది ఆసియా పసిఫిక్ జోన్లో రెండోది, ప్రపంచంలో ఐదోది అవుతుంది. మనదేశంలో సేఫ్టీ సెంటర్ ఏర్పాటు గురించి గూగుల్ సంస్థ ఈ ఏడాది అక్టోబరు 3న జరిగిన 'గూగుల్ ఫర్ ఇండియా 2024' కాన్క్లేవ్‌లోనే వెల్లడించింది. అప్పటి నుంచీ దీని కోసం వివిధ రాష్ట్రాలు పోటీ పడ్డాయి. సీఎం రేవంత్ అమెరికా పర్యటనలో గూగుల్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన తర్వాత.. ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపడంతో ఈ సెంటర్ హైదరాబాద్‌కు వచ్చిందని అధికారులు తెలిపారు. కాగా.. దేశంలోనే తొలి 'గూగుల్ పవర్డ్ ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్'ను కూడా ఇక్కడ ఏర్పాటు చేసే అవకాశం ఉందని ప్రభుత్వం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.

ఏమిటీ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్?

ఇటీవలికాలంలో సైబర్ దాడులు పెద్ద సమస్యగా మారింది. సామాన్యులపైనే కాదు.. పెద్దపెద్ద కంపెనీలపైనా సైబర్ నేరగాళ్లు విరుచుకుపడుతున్నారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఏటా రూ.వేల కోట్ల నష్టం వాటిల్లుతోంది. ఈ క్రమంలోనే సైబర్ భద్రత లక్ష్యంగా.. గూగుల్ సంస్థ మ్యూనిక్, డబ్లిన్, మలగ, టోక్యో నగరాల్లో గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్లను ఏర్పాటు చేసింది. సేఫ్టీ సెంటర్ అంటే.. ప్రత్యేకమైన అంతర్జాతీయ సైబర్ సెక్యూరిటీ హబ్. ఇది అధునాతన, ఆన్‌లైన్ భద్రతా ఉత్పత్తులను అభివృద్ధి చేయడంలో కీలకపాత్ర పోషిస్తుంది. అత్యాధునిక పరిశోధన, కృత్రిమ మేధ ఆధారిత భద్రత, సైబర్ సెక్యూరిటీ నిపుణులు, పరిశోధకులకు ఈ కేంద్రం సహకార వేదికగా ఉపయోగపడుతుంది. సైబర్ సెక్యూరిటీ సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా పనిచేస్తుంది. ఇన్నాళ్లుగా టోక్యోలో ఉన్న సేఫ్టీ సెంటరే.. భారత్ సహా పలు ఆసియా దేశాలకు సేవలందిస్తూ వస్తోంది. పెరుగుతున్న సైబర్ సవాళ్ల నేపథ్యంలో భారత్‌లో ప్రత్యేక కేంద్రం ఏర్పాటుచేయాలని గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ నిర్ణయించారు. గూగుల్ నిర్ణయంతో సైబర్ సెక్యూరిటీ రంగానికి సంబంధించిన అనేక కంపెనీలు ఇక్కడ తమ కార్యకలాపాలను ప్రారంభించడానికి ఆసక్తి చూపుతాయని.. ఫలితంగా వేలసంఖ్యలో కొత్త ఉద్యోగాలు వస్తాయని సైబర్ నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

9 నుంచి అసెంబ్లీ శీతాకాల సమావేశాలు

హైదరాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఈనెల 9వ తేదీ నుంచి అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి గవర్నర్ నుంచి ఆమోదం లభించింది. దాంతో శాసనసభ కార్యదర్శి నర్సింహాచార్యులు బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. అసెంబ్లీతో పాటే శాసన మండలి సమావేశాలు కూడా సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 9న ఉదయం 10.30 గంటలకు ఉభయ సభ లు ప్రారంభమవుతాయి. ఈ సమావేశాల్లో రెండు కొత్త బిల్లులను ప్రవేశపెట్టనున్నారు. పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు, రికార్డ్స్ ఆఫ్ రైట్స్(ఆర్ఓఆర్) బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. గతంలో ఇద్దరు వరకు సంతానం ఉన్న వారికి మాత్రమే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉండేది. అయితే ప్రభుత్వం దీనిని సవరించి ముగ్గురి సంతానం ఉన్నా పోటీ చేసే అవకాశం కల్పించబోతోంది. దీనికి సంబంధించినదే పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు. అలాగే ప్రస్తుత రెవెన్యూ చట్టంలో మార్పులు చేసి, కొత్త రెవెన్యూ చట్టా న్ని తీసుకొచ్చేందుకు ఆర్ఓఆర్ బిల్లును సభలో ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకోనుంది. అలాగే ఇది వరకు ఉన్న గ్రామ సహాయకులు(వీఏవో), గ్రామ రెవెన్యూ అధికారుల(వీఆర్వో) తరహాలో ప్రభుత్వం ఒక కొత్త పోస్టు ను సృష్టించి, నియామకాలు చేయనుంది. సర్వీసులో ఉన్న కొంత మందిని, ప్రత్యక్ష ఎంపిక ద్వారా మరికొంత మందిని ఈ పోస్టుల్లో నియమించే అవకాశాలున్నాయి. ఇలాంటి అంశాలన్నీ ఆర్ఓఆర్ బిల్లులో ఉన్నాయి. ఈ కొత్త బిల్లులు కాకుండా మరో ఐదు ఆర్డినెన్స్‌లను సభలో ప్రవేశపెట్టి ఆమోదించనుంది.

రైతు భరోసాపై చర్చ

ఈ సమావేశాల్లో రైతు భరోసా పథకంపై కీలక చర్చ జరగనుంది. దీని విధివిధానాలపై ఇప్పటికే ప్రభు త్వం ఒక ముసాయిదాను తయారు చేసింది. రైతు భరోసా సహాయాన్ని ఎన్ని ఎకరాలకు పరిమితం చే యాలి, ఎలాంటి భూములకు ఇవ్వాలి, కౌలు రైతుల సంగతి ఏమిటి? వంటి అంశాలపై చర్చిస్తారు.



ట్రాన్స్‌జెండర్ అభ్యర్థులతో మాట్లాడుతున్న సిటీ సీపీ సీవీ ఆనంద్

ట్రాఫిక్ అసిస్టెంట్స్‌గా ట్రాన్స్‌జెండర్లు

- పైలట్ ప్రాజెక్టుగా మొదటి బ్యాచ్
- గోషామహల్ పోలీస్ గ్రౌండ్‌లో ఎంపిక ప్రక్రియ
- 44 మంది ఎంపిక.. నేటి నుంచి శిక్షణ

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు గట్టెక్కడానికి, సిబ్బందిని కొరతను అధిగమించడానికి, ట్రాఫిక్ నియంత్రణ విధుల్లోకి ట్రాన్స్‌జెండర్లను నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ట్రాన్స్‌జెండర్ల నియామకాలను ఉన్నతాధికారులు వేగవంతం చేశారు. మహిళా శిశు సంరక్షణ విభాగం కార్యదర్శి అనితా రామచంద్రన్, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రవి గుప్తా, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ విధుల్లోకి తీసుకునే విషయంపై కసరత్తు చేసి పైలట్ ప్రాజెక్టుగా మొదటి బ్యాచ్‌ను ఎంపిక చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు గోషామహల్ పోలీస్ గ్రౌండ్‌లో ట్రాన్స్‌జెండర్స్ ట్రాఫిక్ అసిస్టెంట్ ఎంపికకు అవసరమైన ఈవెంట్స్‌ను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిటీ సీపీ సీవీ ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. మొత్తం 58 మంది ట్రాన్స్‌జెండర్స్ ఈవెంట్స్‌కు హాజరుకాగా 44 మంది ఉద్యోగానికి అర్హత సాధించినట్లు అధికారులు వెల్లడించారు. గురువారం వారికి యూనిఫామ్స్ అందజేసి ట్రాఫిక్ శిక్షణ ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. శిక్షణ ముగిసిన అనంతరం వారిని విధుల్లోకి తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం ట్రాఫిక్ విభాగంలో హోంగార్డులు నిర్వర్తిస్తున్న తరహాలోనే ట్రాన్స్‌జెండర్స్ ట్రాఫిక్ అసిస్టెంట్స్‌కు విధులు అప్పగించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

చిన్న కాళేశ్వరానికి కేంద్రం సాయం

హైదరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మరో నీటిపారుదల ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం సాయం అందనుంది. జయశంకర్-భూపాలపల్లి జిల్లాలో చిన్నకాళేశ్వరం(ముక్తేశ్వర్) ఎత్తిపోతల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలకు కేంద్రం పచ్చజెండా ఊపింది. ప్రధాన మంత్రి కృషి సించాయీ యోజన(పీఎంకేఎస్‌వై - గతంలో ఏఐబీపీ) కింద రూ.233 కోట్లను మంజూరు చేయనుంది. ఈ ప్రాజెక్టు సవివర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)కు సాంకేతిక సలహా కమిటీ(టీఏసీ) సహా.. కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ)లోని డైరెక్టరేట్లన్నీ ఈ డీపీఆర్‌ను ఆమోదించాయి. పీఎంకేఎస్‌వైలో భాగంగా ప్రాజెక్టుకు అయ్యే వ్యయంలో ఆదివాసీ ప్రాంతాల్లో కేంద్రం 90% నిధులను అందజేస్తుంది. మిగతా 10శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. మిగతా ప్రాంతాల్లో ఈ వాటా 60-40శాతంగా ఉంటుంది. అయితే.. చిన్న కాళేశ్వరం పూర్తిగా ఆదివాసీ ప్రాంతంలో ఉండడం.. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.537 కోట్లు కావడంతో.. 90% నిధులను కేంద్రం నుంచి రాబట్టాల్సి ఉంటుంది. కాగా.. మొడికుంట వాగు ప్రాజెక్టుకు ఇప్పటికే రూ.463 కోట్లను అందజేసేందుకు కేంద్రం వెల్లడించగా.. చనాకా-కొరాటకు రూ.172 కోట్లు రానున్నాయి. ఈ మూడు ప్రాజెక్టులకు మొత్తంగా రూ.868 కోట్లు వచ్చే అవకాశాలున్నాయి.

7, 8, 9 తేదీల్లో ప్రజాపాలన విజయోత్సవాల ముగింపు: సీఎస్

హైదరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7, 8, 9 తేదీల్లో ప్రజాపాలన విజయోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు సీఎస్ శాంతికుమారి తెలిపారు. ముగింపు వేడుకల నిర్వహణపై ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ నెల 7న వందేమాతరం శ్రీనివాస్ బృందం, 8న రాహుల్ సిప్లిగంజ్, 9న థమన్‌లతో సాంస్కృతిక కార్యక్రమాలుంటాయని వివరించారు. ఈ నెల 9న సచివాలయంలోని తెలంగాణ తల్లి విగ్రహాన్ని సీఎం ఆవిష్కరిస్తారని తెలిపారు.

తెలంగాణలో 32,946 కోట్లతో 20 రైల్వే ప్రాజెక్టులు: కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రూ.32,946 కోట్లతో 20 రైల్వే ప్రాజెక్టుల పనులు చేపడుతున్నట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. బుధవారం బీజేపీ ఎంపీ నగేశ్ అడిగిన ఒక ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానం ఇచ్చారు. తెలంగాణలో ఏడు కొత్త రైల్వే లైన్లు, 13 డబ్లింగ్ ప్రాజెక్టుల పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ 20 రైల్వే ప్రాజెక్టుల ద్వారా మొత్తం 2,298 కి.మీ రైల్వే ట్రాక్ నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చి నాటికి రూ.9,958 కోట్లతో 474 కి.మీ రైల్వే ట్రాక్ పనులను పూర్తి చేసినట్లు కేంద్ర మంత్రి అశ్వినీవైష్ణవ్ వెల్లడించారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద కొర్రమీనుల పెంపకం

- ప్రాజెక్టు కోసం 30 ఎకరాల కేటాయింపు

మంచిర్యాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద కొర్రమీను(బొమ్మెలు) చేపల పెంపకం ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. కేంద్రం సహకారంతో రూ.15 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టబోయే ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం 30 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. కొర్రమీను సంరక్షణ కేంద్రం ఏర్పాటు పనులను త్వరలోనే చేపట్టనున్నట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును జాతీయ మంచి నీటి చేపల పెంపకం సంస్థ(సీఐఎస్‌ఏ) సాంకేతిక సహకారంతో నిర్వహించనుంది. కొర్రమీనును ప్రభుత్వం 2016లో రాష్ట్ర చేపగా గుర్తించింది. దీంట్లో పోషకాలు మెండుగా ఉంటాయి. ఈ రకం చేపల జాతిని కాపాడటంతో పాటు, వాటిని ప్రజలకు ఎక్కువ సంఖ్యలో అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపట్టింది.

జేఎల్ పోస్టులకు ఎంపిక జాబితా విడుదల

హైదరాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ బోర్డు పరిధిలో జూనియర్ లెక్చరర్ల(జేఎల్) పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను పబ్లిక్ సర్వీసు కమిషన్ అధికారులు విడుదల చేశారు. బాటనీ, బాటనీ ఉర్దూ మీడియం, హిందీ, తెలుగు, జువాలజీ, జువాలజీ ఉర్దూ మీడియం జేఎల్ పోస్టులకు ఎంపికైన వారివివరాలను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరోవైపు రాష్ట్రంలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ పోస్టులను భర్తీచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జేఎల్‌లకు పదోన్నతులను కల్పించడం ద్వారా వాటిని భర్తీ చేయనున్నారు. ఈ మేరకు జేఎల్‌ల సీనియారిటీ జాబితాను సిద్ధం చేయాలని అధికారులకు ఇంటర్ బోర్డు కార్యదర్శి సూచించారు.

ఇద్దరు వాణిజ్య పన్నుల అదనపు కమిషనర్లపై వేటు

- ఐజీఎస్‌టీ అక్రమాల నేపథ్యంలో చర్యలు

హైదరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలోని ఇద్దరు అదనపు కమిషనర్లపై ప్రభుత్వం వేటు వేసింది. వారిని వాణిజ్య పన్నుల శాఖ నుంచి తప్పించి గ్రామీణాభివృద్ధి శాఖకు అటాచ్ చేసింది. పరిపాలన కారణాలతో మరో నలుగురు జాయింట్ కమిషనర్లు, ఒక డిప్యూటీ కమిషనర్‌ను బదిలీ చేసింది. ఈ మేరకు వాణిజ్య పన్నులు, ఎక్సైజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. ప్రస్తుతం కమిషనరేట్‌లో అదనపు కమిషనర్ (లీగల్)గా ఉన్న కాశీ విశ్వేశ్వరరావు, మరో అదనపు కమిషనర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) సాయికిశోర్‌ను గ్రామీణాభివృద్ధి శాఖకు పంపించింది. ఇది వరకు ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ (ఐజీఎస్‌టీ)లో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. అధికారుల లాలూచీ కారణంగా డీలర్లు దాదాపు రూ.1000 కోట్లకు పైగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)ను క్లెయిమ్ చేశారు. అప్పటి ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సోమేశ్ కుమార్ హయాంలో ఈ మోసాలు జరిగినట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ కేసులో కాశీ విశ్వేశ్వరరావుపై ఆరోపణలు వచ్చాయి. ఈ మోసాలపై వచ్చిన ఫిర్యాదులను సాయి కిశోర్ సరిగా పట్టించుకోలేదని అధికారులు గుర్తించారు. దీంతో ఈ ఇద్దరు అధికారులను వాణిజ్య పన్నుల శాఖ నుంచి తప్పించారు.

పదేళ్లలో మీరు చేయనిది.. పది నెలల్లోనే..

(మొదటిపేజీ తరువాయి)

నియామక పత్రాలను అందజేశారు. స్కిల్ యూనివర్సిటీ కోసం ఏజెన్సీలతో ఒప్పందం చేసుకుని, డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజ్ తెలంగాణ, సీఎం కప్‌ను ఆవిష్కరించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో కేసీఆర్ అన్ని వర్గాలనూ నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. తాము పది నెలల్లోనే రుణమాఫీ, ఉద్యోగాలు, రైతులకు బోనస్, మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే వంటగ్యాస్, సన్న ధాన్యానికి రూ. 500 బోనస్ ఇచ్చామని వివరించారు. ఇవన్నీ కేసీఆర్ చేసి ఉంటే తాము అధికారంలోకి వచ్చే వాళ్లమా? అని ప్రశ్నించారు. "ఒక్క రోజులోనే అద్భుతాలు సృష్టిస్తామా? అప్పుడే అంత ఆత్రుత ఎందుకు? కేసీఆర్ పదేళ్లలో మహిళలను అవమానపరిచారు. వాళ్లు ఎలా ఉన్నారని కూడా అడగలేదు. మేం రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం. వచ్చే ఎన్నికల్లో మీ కోటి ఓట్లు మాకు పడితే మళ్లీ గెలుపు ఖాయం. బీఆర్ఎస్ మళ్లీ లేవదు" అని సీఎం రేవంత్ అన్నారు.

చిన్నారెడ్డితో తెలంగాణ ఉద్యమం

"కరీంనగర్ అంటే 2004లో సోనియాగాంధీ ఇచ్చిన మాట గుర్తుకు వస్తుంది. తెలంగాణ ప్రజల ఆకాంక్ష, 60 ఏళ్ల పోరాటం, ఉద్యమకారుల ప్రాణత్యాగాలను సోనియా గుర్తుంచుకుని తెలంగాణ ఇచ్చారు. 2001లోనే చిన్నారెడ్డి ఎన్ని అవాంతరాలు వచ్చినా కూడా తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లారు. ఆ ఉద్యమం కొద్ది కొద్దిగా పెరిగి ఉగ్రరూపం దాల్చింది. సింగరేణి ఉద్యోగాల కోసం మొదలైన పోరాటం తెలంగాణ ఉద్యమానికి దారి తీసింది. సాయుధ పోరాటం చేస్తే రాజ్యమే పోయి రాష్ట్రం వచ్చింది. 1969లో ఉద్యోగులతో పోరాటం మొదలయింది" అని సీఎం అన్నారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న



ఉద్యోగులకు నియామక పత్రాలు అందజేస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు పొన్నం, ఉత్తమ్, పొన్నం పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

తెలంగాణకు పదేళ్లు పాలించిన కేసీఆర్ ఏమీ చేయలేదని ఆరోపించారు. రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, కేసీఆర్ మాత్రం ఎకరం పొలంలో కోటి రూపాయల ఆదాయం పొందే రహస్యం మాత్రం రైతులకు చెప్పలేదని ఎద్దేవా చేశారు. రైతాంగానికి ఎస్సారెస్పీ నీళ్లు ఇవ్వకపోతే పోరాటం చేసిన ప్రస్తుత పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావును గత పాలకులు కరీంనగర్ జైల్లో బంధించారని గుర్తు చేశారు.

ఇద్దరిని ఊరిమీదకు వదిలాడు..

తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలకు సాగునీరు సరఫరా చేసేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని సీఎం రేవంత్ తెలిపారు. గత ప్రభుత్వం లక్షా 2 వేల కోట్లు ఖర్చు పెట్టి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తే కూలిపోయిందన్నారు. "కేసీఆర్ ఇంట్లో పడుకొని ఇద్దరిని ఊరి మీదకు వదిలితే, వాళ్లు అచ్చోసిన ఆంబోతుల్లా మాట్లాడుతున్నారు. రాళ్లు విసిరి.. చెట్లలో దాక్కుంటున్నారు. మేం ఏమి చేశామో, మీరేమి చేశారో చర్చించుకుందాం అసెంబ్లీ రమ్మంటే ఎందుకు రావడం లేదు? కాళేశ్వరం నుంచి చుక్క నీరు పారనప్పటికీ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు చరిత్రలో ఎప్పుడూ లేనంతగా, ఏ రాష్ట్రం ఉత్పత్తి చేయనంతగా 66 లక్షల ఎకరాల్లో 1.53 కోట్ల మెట్రిక్ టన్నుల వడ్లు పండించి రికార్డు సృష్టించాం" అని రేవంత్ తెలిపారు. గతంలో ఐకేపీ కేంద్రాలు తెరవమంటే ప్రభుత్వం వ్యాపార సంస్థ కాదని, వరి వేస్తే ఉరి వేసుకోవాలని అని కర్కశంగా చెప్పింది కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. సన్న ధాన్యం పండిస్తే రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఐదు రోజుల్లో ఇచ్చామన్నారు. కేసీఆర్ రైతుబంధు ఎగ్గొడితే తాము రూ.7,625 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే వరకు విశ్రమించబోమని తెలిపారు. సోలార్ ప్లాంట్లు, ఆర్టీసీలో బస్సులను పెట్టిస్తామన్నారు.

ఇంజనీరింగ్, లా కాలేజీ మంజూరు..

శాతవాహన విశ్వవిద్యాలయానికి ఇంజనీరింగ్, లా కళాశాల మంజూరు చేస్తామని సీఎం రేవంత్ హామీ ఇచ్చారు. మంథని ప్రాంతానికి కోకాకోలా ఫ్యాక్టరీ తీసుకువస్తామన్నారు. గత ప్రభుత్వం సమస్యలపై ఇందిరా చౌక్ వద్ద ధర్నాలు చేయకుండా తాళం వేస్తే తాము తెరిపించామన్నారు. కొంత మంది నిరుద్యోగులు అశోక్‌నగర్, రాంనగర్ చౌరస్తాలో ధర్నా చేస్తే గాంధీభవన్‌కు పిలిపించి మాట్లాడామన్నారు. దొరలు, పెత్తందారులకు మాత్రమే ప్రవేశం ఉండే ప్రగతి భవన్‌ను జ్యోతిబా పూలే ప్రజాభవన్‌గా పేరు మార్చి ప్రజల నుంచి రెండు రోజులు విజ్ఞప్తులు స్వీకరించి పరిష్కరిస్తున్నామని తెలిపారు. కవిత ఉద్యోగం ఊడితే వెంటనే ఎమ్మెల్సీ, వినోద్‌కు మరో ఉద్యోగం ఇచ్చారని, ఇందుకోసమేనా తెలంగాణ తెచ్చుకున్నది? ఒక్క కుటుంబం కోసమేనా? అనే విషయంపై ప్రజలు ఆలోచన చేయాలన్నారు. "వాళ్ల బాధ, శాపనార్థాలు ఎందుకో అర్థం కావడం లేదు. మాకు ప్రజలు ఐదేళ్లు అధికారం ఇచ్చారు. 80 వేల పుస్తకాలు చదివిన కేసీఆర్‌కు తెలియదా? ఒక్కరోజే అన్నీ చేయాలంటే అవుతాయా? మేమేమీ అల్లాటప్పాగా అధికారంలోకి రాలేదు. ప్రజల ఆశీర్వాదంతో వచ్చాం. మీరు ఉన్నప్పుడు మేం ఇట్లాగే చేశామా? జానారెడ్డి, భట్టి విక్రమార్క మీ ప్రభుత్వానికి సలహాలు ఇవ్వలేదా?" అని ప్రశ్నించారు. గతంలో వరంగల్, రామగుండం, ఆదిలాబాద్, కొత్తగూడెంలో విమానాశ్రయాలు తేలేదని, నేడు ప్రజా ప్రభుత్వం వాటి ఏర్పాటుకు కృషి చేస్తుందని తెలిపారు. 95% కులగణన పూర్తి చేసుకున్నామని, కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్, సంతోష్‌రావు, వినోద్‌రావు ఎందుకు కుల గణనలో పాల్గొనడం లేదని ప్రశ్నించారు. బీసీల ఓట్లను దండుకున్నారని, మీకు బీసీలంటే వ్యతిరేకమా లేక ద్రోహులా? అని బీసీ సంఘాలు ప్రశ్నించాలన్నారు.

కొలువుల కలలు.. నిజమైన క్షణం

"మొన్న కొలువులే ఆలంబనగా.. కొలిమిలా మండిన ఉద్యమం. నిన్న కొలువులే ఆకాంక్షగా జంగ్ సైరనై మోగిన నా రణం. నేడు కొలువుల కలలు.. నిజమైన క్షణం. ప్రజాపాలనలో యువ వికాస వసంతం. ఏడాదిలో 55వేల ఉద్యోగాల నియామకం. నిత్య నోటిఫికేషన్ల తోరణం. ఏడాది ప్రజాపాలనలో తగ్గుతున్న నిరుద్యోగం. ఈ సంతోషాన్ని ఆ ఆనందాన్ని నా యువ మిత్రులతో పంచుకునేందుకు వస్తున్నా పెద్దపల్లికి"

- ఎక్స్‌లో సీఎం రేవంత్

పదేళ్ల పాలనలో అంతా మోసమే!


ప్రజలందరినీ వంచించిన గత సర్కారు.. ఏడాదిలోనే మేం 55 వేల ఉద్యోగాలిచ్చాం!

ప్రజల ప్రేమాభిమానాలే మాకు ఆక్సిజన్.. పెద్దపల్లి సభలో ఉపముఖ్యమంత్రి భట్టి

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలు మోసపోయారని ఉపముఖ్యమంత్రి భట్టి చెప్పారు. నీళ్లు, నియామకాల కోసం కొట్లాడి సాధించిన తెలంగాణలో ప్రజలు పదేళ్ల పాటు వంచనకు గురయ్యారన్నారు. అన్ని వర్గాల వారి బాధలు తీర్చేందుకు ప్రజాప్రభుత్వం కృషి చేస్తోందని భట్టి తెలిపారు. బుధవారం పెద్దపల్లిలో నిర్వహించిన 'యువ వికాసం' సభకు హాజరైన భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రజలు చూపించే ప్రేమాభిమానాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆక్సిజన్ లాంటివన్నారు. తమ ప్రభుత్వం కేవలం ఏడాదిలోనే 55 వేల మంది నిరుద్యోగులకు నియామక పత్రాలు అందించిందని చెప్పారు. టీజీపీఎస్సీ ద్వారా ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. యువత సాంకేతికంగా బలంగా ఉండాలనే ఆలోచనతో స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. సింగరేణి కార్మికులకు గతంలో ఎన్నడూ లేని విధంగా రూ. కోటి ప్రమాద బీమా అందజేయనున్నట్లు తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో రూ.వెయ్యి కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకున్నట్లు చెప్పారు. ప్రజా ప్రభుత్వంపై సామాజిక మాధ్యమాల్లో వచ్చే దుష్ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. తాము పనులపైనే దృష్టి సారించాం తప్ప ప్రచారాలపై కాదన్నారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేసింది తెలంగాణ ప్రభుత్వమేనని చెప్పారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని వివరించారు. రామగుండంలో కొత్త విద్యుత్కేంద్రానికి త్వరలో భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైన్లు, కమ్యూనిటీ హాళ్లను నిర్మించామని, పెద్దపల్లి జిల్లా కేంద్రానికి బస్సు డిపో కలను నెరవేర్చామని చెప్పారు. రాష్ట్రానికి వేల కోట్ల కొత్త పెట్టుబడులతో ప్రైవేట్ రంగంలో లక్షల మంది యువతకు ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. రామగుండంలో కొత్త ఎయిర్ పోర్టు ఏర్పాటు కోసం కేంద్రంతో చర్చిస్తున్నామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి చుక్క నీరు ఉపయోగించకుండా లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేశారని.. 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిందని చెప్పారు. 6న సీఎం, మంత్రివర్గ సహచరుల సమక్షంలో ఇందిరమ్మ ఇళ్ల యాప్‌ను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు.



పెద్దపల్లి సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి



సంధ్య థియేటర్ వద్ద స్పృహతప్పిన బాలుడికి సీపీఆర్ చేస్తున్న పోలీసులు

'పుష్ప 2' ప్రీమియర్ షో.. తొక్కిసలాట.. మహిళ మృతి

- ఒక బాలుడి పరిస్థితి విషమం
- సంధ్య థియేటర్ వద్దకు వచ్చిన హీరో అల్లు అర్జున్
- చూసేందుకు ఎగబడ్డ అభిమానులు
- లాఠీచార్జ్.. తోపులాటతో విషాదం!

చిక్కడపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హీరో అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2' సినిమా ప్రీమియర్ షో సందర్భంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో దిల్‌సుఖ్ నగర్‌కు చెందిన రేవతి అనే మహిళ (39) మృతి చెందింది. ఆమె కుమారుడు తొమ్మిదేళ్ల శ్రీతేజ్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. రాత్రి 9.30 గంటల ప్రీమియర్ షో చూసేందుకు రేవతి, ఆమె భర్త భాస్కర్, ఇద్దరు పిల్లలు శ్రీతేజ్, సన్విక (7) దిల్‌సుఖ్ నగర్ నుంచి సంధ్య థియేటర్‌కు వచ్చారు. అదే సమయంలో.. హీరో అల్లు అర్జున్ సంధ్య థియటర్ వద్దకు వచ్చారు. అప్పటికే అక్కడ పెద్ద సంఖ్యలో ఉన్న అభిమానులు ఆయన్ను చూసేందుకు ఎగబడ్డారు. అల్లు అర్జున్ థియేటర్‌లోకి వెళ్లాక.. అభిమానులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేశారు. అప్పుడు జరిగిన తోపులాటలో రేవతి, ఆమె కుమారుడు, మరో వ్యక్తి కిందపడి స్పృహ కోల్పోయారు. పోలీసులు వారికి ప్రథమ చికిత్స చేసి.. ఆంధ్ర మహిళా సభ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి తీసుకొచ్చేసరికే రేవతి మరణించినట్టు వైద్యులు తెలిపారు. ఆమె మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఆమె కుమారుణ్ని మరింత మెరుగైన చికిత్స నిమిత్తం వేరే ఆస్పత్రికి తరలించారు. కాగా.. స్పృహతప్పిన బాలుడు శ్రీతేజ్‌కు పోలీసులు సీపీఆర్ చేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఘటనతో ఆర్టీసీ క్రాస్ రోడ్ పరిసరాల్లో ట్రాఫిక్ స్తంభించిపోయింది.

అసెంబ్లీ మెసెంజర్లకు బైక్‌లు

హైదరాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): శాసనసభ, మండలి మెసెంజర్లకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ నూతన ద్విచక్ర వాహనాలను అందజేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సమాచారాన్ని అందజేయడమే కాకుండా అసెంబ్లీకి, ప్రభుత్వ ఉన్నతాధికారులకు మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలను అందించడంలోనూ ఈ మెసెంజర్లు సేవలను అందిస్తారు.

రోశయ్య లాంటి సహచరుడుంటే.. సీఎంగా ఎవరైనా రాణించవచ్చు

అందుకే సీఎంగా ఎవరున్నా నెం.2 ఆయనే.. హైదరాబాద్‌లో రోశయ్య విగ్రహం పెడతాం

- ఆర్యవైశ్యులే రాష్ట్ర బ్రాండ్ అంబాసిడర్లు
- రాజకీయాల్లో సముచిత స్థానం కల్పిస్తాం
- ప్రభుత్వంలోనూ భాగస్వాములను చేస్తాం
- రోశయ్య వర్ధంతి సభలో సీఎం రేవంత్

హైదరాబాద్ సిటీ/గచ్చిబౌలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొణిజేటి రోశయ్యలాంటి సహచరుడు మంత్రివర్గంలో ఉంటే.. ముఖ్యమంత్రిగా ఎవరైనా రాణించవచ్చునని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆరుగురు ముఖ్యమంత్రులు ప్రశాంతంగా ప్రభుత్వాన్ని నడపగలిగారంటే వారందరికీ కుడిభుజంగా రోశయ్య ఉండడం వల్లే సాధ్యమైందన్నారు. అందుకే సీఎంగా ఎవరున్నా, నెంబరు-2 స్థానం రోశయ్యదేనని, ఒకటో స్థానంలో ఉన్నవారిని జరిపి కూర్చోవాలని ఆయన ఎన్నడూ తాపత్రయపడలేదని పేర్కొన్నారు. బుధవారం హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరిగిన ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య మూడో వర్ధంతి కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరై ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ.. "రోశయ్య యాభై ఏళ్లకుపైగా ప్రజాజీవితంలో రాణించారు. తమిళనాడు రాజకీయాలు వివాదాస్పదమైన సందర్భంలో గవర్నర్‌గా తన అనుభవాన్ని ప్రదర్శించి, చాకచక్యంగా వ్యవహరించారు. రోశయ్య నుంచి చతురత, సమయస్ఫూర్తి, అధికార పార్టీని ఇరుకున పెట్టే వ్యూహాత్మకతలను ఇప్పటి ప్రజాప్రతినిధులు నేర్చుకోవాలి" అని అన్నారు. రోశయ్య ఏనాడూ తనకు పదవి కావాలని అధిష్ఠానాన్ని కోరలేదని, ఆయనలోని నిబద్ధత క్రమశిక్షణ కలిగిన విలక్షణమైన వ్యక్తిత్వమే అన్ని హోదాలను ఇంటికి తెచ్చిపెట్టిందని తెలిపారు. రాజకీయాల్లో ఉన్న వారంతా వీటిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

అలాంటివారు లేకపోవడం లోటు..

ఈరోజు తెలంగాణ శాసనసభలో వ్యూహాత్మకంగా సమస్యలను పరిష్కరించగలిగిన రోశయ్య లాంటి పెద్ద మనుషులు లేకపోవడం తీరని లోటు అని సీఎం రేవంత్ అన్నారు. 'ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రశ్నించాలి. పాలకపక్షంలో ఉన్నప్పుడు సమస్యను పరిష్కరించాలి. ఆ విషయంలో భేషజాలకు పోనక్కర్లేదు' అంటూ ఆనాడు రోశయ్య చెప్పిన మాటలు స్ఫూర్తిదాయకమని చెప్పారు. ఆ స్ఫూర్తి ప్రస్తుతం చట్టసభల్లో కొరవడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నించేవాళ్లకు అసలు అవకాశం ఇవ్వద్దన్నట్టుగానే చట్టసభల్లో పరిస్థితులు తయారయ్యాయని, దీని నుంచి బయట పడాలని అన్నారు. హైదరాబాద్‌లో రోశయ్య విగ్రహం నెలకొల్పాలన్న తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత గుప్తా విన్నపం పట్ల సీఎం స్పందిస్తూ 'రోశయ్య నిఖార్సైన హైదరాబాదీ' అని వ్యాఖ్యానించారు. "రోశయ్య యాభై ఏళ్ల కిందటే ఇక్కడ స్థిరపడ్డారు. రెండు ప్రాంతాలు తనకు సమానమని ఒక సందర్భంలో చెప్పారు. వార్డు సభ్యుడి నుంచి లోక్‌సభ సభ్యుడి వరకు, మంత్రి నుంచి ముఖ్యమంత్రి వరకు ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయుడు. అలాంటి మహనీయుడి విగ్రహం లేకపోవడం పెద్ద లోటు. నగరంలో తగిన ప్రాంతాన్ని గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదిస్తే.. ఆర్ అండ్‌బీ శాఖ ద్వారా ఏడాదిలోగా నగరంలో రోశయ్య విగ్రహాన్ని ప్రతిష్ఠించుకుందాం" అని రేవంత్ అన్నారు.

అభివృద్ధి ఆర్యవైశ్యుల చేతుల్లోనే..

తెలంగాణ ఆర్థిక ఎదుగుదల ఆర్యవైశ్యుల చేతుల్లో ఉందని సీఎం రేవంత్ అన్నారు. రాష్ట్రం అభివృద్ధి పథంవైపు నడవాలన్నా, ఆర్థికంగా బలపడాలన్నా ఆర్యవైశ్య సోదరులంతా ఒక గంట అదనంగా పనిచేయాలని కోరారు. "ఆర్య వైశ్యులే తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్లు. మీ వ్యాపారాలకు ఎలాంటి అనుమతులు కావాలన్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూసే బాధ్యత నాది. రాజకీయాల్లోనూ ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించడానికి కృషి చేస్తా. ప్రభుత్వంలోనూ భాగస్వాములను చేసేందుకు ప్రయత్నిస్తా" అని రేవంత్ అన్నారు. కాగా, ముఖ్యమంత్రి చేతులమీదుగా కొణిజేటి రోశయ్య చైతన్య స్ఫూర్తి అవార్డులను వాసవి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు పెండేకంటి రామ్మోహన్‌రావు, వాసవి వసతిగృహాల ట్రస్ట్ చైర్మన్ గంజి రాజమౌళి గుప్తా, వ్యాపారవేత్త మానేపల్లి రామారావుకు ప్రదానం చేశారు.

రోశయ్య నుంచి నేటి తరం నేర్చుకోవాలి..

ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క మాట్లాడుతూ.. వ్యక్తిగతమైన దూషణకు పోకుండా అత్యంత హుందాతనంతో విమర్శలకు బదులిచ్చే విధానం రోశయ్య నుంచి నేటి రాజకీయనాయకులు నేర్చుకోవాలని అభిప్రాయపడ్డారు. వాసవి సేవా సంఘం ప్రతినిధులు డిప్యూటీ సీఎం చేతులమీదుగా విజయశంకర దేశిక ట్రస్ట్, దేవనార్ ఫౌండేషన్, అమ్మానాన్న ఆనంద ఆశ్రమం సంస్థలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున చెక్కును అందజేశారు. కాగా, రోశయ్యతో తనకున్న అనుబంధాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్, ఎమ్మెల్సీ దయానంద్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, శ్రీరాం తాతయ్య, మాజీ ఎమ్మెల్యేలు అంబికా కృష్ణ, గిరిధర్ రావు, మాజీ మంత్రులు శిద్దా రాఘవరావు, ఎల్లంపల్లి శ్రీనివాసరావు, రోశయ్య కుమారులు శివసుబ్బారావు, శ్రీమన్నారాయణ మూర్తి, అల్లుడు పైడా కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో జరిగిన మాజీ సీఎం రోశయ్య 3వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు



బొటానికల్ గార్డెన్‌లో 'ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాలు'లో ముఖ్యమంత్రి రేవంత్, మంత్రి కొండా సురేఖ తదితరులు

ఎకో టూరిజం పార్కు ప్రారంభం..

నగరవాసులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో కోట్ల విజయ భాస్కరరెడ్డి బొటానికల్ గార్డెన్‌లో పలు అభివృద్ధి పనులను సీఎం రేవంత్ ప్రారంభించారు. సరికొత్త హంగులతో ఏర్పాటు చేసిన ఎకో టూరిజం పార్కు, వృక్ష క్షేత్రం, వర్చువల్, వైల్డ్‌లైఫ్, మోడల్ సఫారీలను సీఎం ప్రారంభించారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సీఎం రేవంత్ హాజరై కొత్తగూడెం, పాల్వంచ, సత్తుపల్లి డివిజనల్ మేనేజర్ ఆఫీస్ కాంప్లెక్స్‌లను వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం ఫారెస్టు ఎకో టూరిజం అభివృద్ధి కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. గార్డెన్‌లో 75 వనాలతో రూపుదిద్దుకున్న వృక్ష పరిచయ క్షేత్రాన్ని, వైల్డ్‌లైఫ్ సఫారీలను ప్రారంభించారు. అటవీ అభివృద్ధి సంస్థ బ్యాటరీ వాహనాలను ప్రారంభించి, ఆ వాహనంలో గార్డెన్‌లో పర్యటించారు.

ఓఆర్ఆర్ వంతెనపై నుంచి పడ్డ లారీ
డ్రైవర్ సజీవ దహనం


సందీప్(ఫైల్)

మేడ్చల్ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చెత్త తరలిస్తున్న జీహెచ్ఎంసీ లారీ ఒకటి ఓ ఆర్ ఆర్ వంతెనపై నుంచి కింద పడడంతో లారీతో పాటు డ్రైవర్ సజీవ దహనమయ్యా డు. ఈ ఘటన మేడ్చల్ దగ్గర్లోని గౌడవెల్లి సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కీసర మండలం రాంపల్లికి చెందిన సందీప్(27) మంగళవారంరాత్రి 1 గంట ప్రాంతంలో మియాపూర్, చందానగర్ నుంచి లారీలో చెత్త నింపుకొని ఓఆర్ఆర్ మీదుగా జవహర్ నగర్ చెత్త డంపింగ్ యార్డుకు బయలుదేరాడు. గౌడవెల్లి గ్రామ సమీపంలోని ఓఆర్ఆర్ వంతెన వద్ద లారీ అదుపు తప్పి కింద పడి మంటలు చెలరేగాయి. దీంతో లారీతో పాటు డ్రైవర్ సందీప్ కాలిపోయారు. జీడిమెట్ల అగ్నిమాపక దళం మంటలను ఆర్పేసింది. అనంతరం డ్రైవర్ మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియ రాలేదు.

ఆర్టీఏ చెక్‌పోస్టులపై ఏసీబీ దాడులు

- రూ.1.78 లక్షల నగదు స్వాధీనం

హైదరాబాద్, దామరచర్ల, జైనథ్, మానవపాడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖ చెక్‌పోస్టులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దాడులు నిర్వహించింది. రాష్ట్ర సరిహద్దుల్లోని మూడు వేర్వేరు చెక్‌పోస్టులపై ఏసీబీ ప్రత్యేక బృందాలు బుధవారం ఉదయం ఏకకాలంలో దాడులు నిర్వహించాయి. ఆదిలాబాద్ జిల్లాలోని భోరజ్, నల్లగొండలోని విష్ణుపురం, గద్వాల్ జిల్లాలోని అలంపూర్ చెక్‌పోస్టులపై ఏసీబీ ప్రత్యేక బృందాలు దాడులు నిర్వహించాయి. ఈ మూడు చెక్ పోస్టుల్లో నిర్వహించిన సోదాల్లో లెక్కల్లో లేని రూ.1.78 లక్షల నగదు ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ఆర్టీఏ చెక్‌పోస్టుల్లో పెద్ద ఎత్తున అక్రమాల్ని గుర్తించిన ఏసీబీ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలకు అనుమతించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాగా, చెక్‌పోస్టులు లేదా ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నెంబరు 1064కు సమాచారం అందించాలని అధికారులు సూచించారు.

19 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు జనరల్ కోచ్‌లు

- సికింద్రాబాద్-విశాఖపట్నం మార్గంలో 16 ప్రత్యేక రైళ్లు
- పండుగల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు: దక్షిణ మధ్య రైల్వే

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా 19 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనంగా 66 జనరల్ కోచ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ప్రస్తుతం ఉన్న రెండు కోచ్‌లు కాకుండా రైళ్లకు మరో రెండు అదనపు జనరల్ క్లాస్ కోచ్‌లు అందుబాటులోకి వస్తాయని అధికారులు పేర్కొన్నారు. ప్రధానంగా సికింద్రాబాద్, హైదరాబాద్, లింగంపల్లి, కాచిగూడ, గుంటూరు, నిజాముద్దీన్, తిరుపతి, కాకినాడ, మచిలీపట్నం, యశ్వంతపూర్, నాందేడ్, మధురై తదితర మార్గాలకు వెళ్లి వచ్చే రైళ్లకు అదనపు జనరల్ కోచ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. త్వరలో మరో 21 రైళ్లకు 80 అదనపు కోచ్‌లను జత చేయనున్నట్లు వెల్లడించారు. కాగా, సికింద్రాబాద్ నుంచి బ్రహ్మపూర్, విశాఖపట్నం మార్గాల్లో 16 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. క్రిస్మస్ పండుగ నేపథ్యంలో డిసెంబరు 6 నుంచి 30 వరకు ఈ రైళ్లు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయని తెలిపింది.

ఎన్నారైకు బెదిరింపులు.. మహిళకు వేధింపులు

- సూర్యాపేట జిల్లా మఠంపల్లి ఎస్సైపై సస్పెన్షన్ వేటు

మఠంపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తన సమస్యను పరిష్కరించాలని ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఓ మహిళను లైంగికంగా వేధిస్తున్నట్లు, ఓ ఎన్నారై వద్ద కారు తీసుకుని తిరిగి ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్న సూర్యాపేట జిల్లా మఠంపల్లి ఎస్సై రామాంజనేయులు సస్పెన్షన్‌కు గురయ్యారు. వ్యక్తిగత సమస్యపై ఫిర్యాదు చేసేందుకు నాలుగు నెలల క్రితం పోలీసుస్టేషన్‌కు వచ్చిన తనను ఎస్సై రామాంజనేయులు లైంగికంగా వేధింపులకు గురి చేయడంతో పాటు డబ్బులు కూడా తీసుకున్నారని ఓ మహిళ ఇటీవల సూర్యాపేట జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఆ గ్రామానికి చెందిన పెద్ద మనుషులతో మాట్లాడి ఆ వివాదాన్ని ఎస్సై పరిష్కరించుకున్నారు. అంతేకాకుండా మరో ముగ్గురు మహిళలతో ఎస్సై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. అలాగే మట్టపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అమెరికాలో స్థిరపడ్డారు. ఆ ఎన్నారై కారు మట్టపల్లిలోని ఆయన ఇంట్లో ఉందని తెలుసుకున్న ఎస్సై రామాంజనేయులు ఆయన సొంత అవసరాల కోసం కారు వారం రోజుల పాటు కావాలని ఫోన్‌లో సంప్రదించి తీసుకున్నారు. రెండు నెలలవుతున్నా కారు తిరిగి ఇవ్వకపోగా పలు రకాలుగా ఎస్సై రామాంజనేయులు ఎన్నారైను బెదిరిస్తుండడంతో బాధితుడు మెయిల్ ద్వారా డీజీపీతో పాటు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. పలు అవినీతి ఆరోపణలతో పాటు ఎస్సై రామాంజనేయులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో క్షేత్రస్థాయిలో విచారణ చేయించి ఎస్సై రామాంజనేయులును సస్పెండ్ చేసినట్లు సీఐ తెలిపారు.

పట్నం నరేందర్‌రెడ్డికి హైకోర్టులో చుక్కెదురు

హైదరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): లగచర్ల దాడి ఘటనలో ఏ-1గా ఉన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి హైకోర్టులో ఊరట లభించలేదు. లగచర్ల దాడి నేపథ్యంలో బొమ్రాస్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో నరేందర్‌రెడ్డికి కొడంగల్ కోర్టు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఆయన చర్లపల్లి జైల్లో విచారణ ఖైదీగా ఉంటున్నారు. కాగా దిగువ కోర్టు ఇచ్చిన రిమాండ్ ఆదేశాలు చట్టవిరుద్ధమని.. సదరు ఆదేశాలను కొట్టేయాలని పేర్కొంటూ నరేందర్‌రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు బుధవారం కొట్టేసింది. అయితే నరేందర్‌రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై మెరిట్ ఆధారంగా విచారణ చేపట్టాలని దిగువ కోర్టుకు ఆదేశాలు జారీ చేసింది.

ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు దక్కని ఊరట

ఎస్సీ, ఎస్టీ చట్టం ఓ పనికిమాలిన చట్టం అంటూ అసభ్యకరంగా వ్యాఖ్యలు చేసిన కేసులో బీజేపీ ఎంపీ అర్వింద్‌కు హైకోర్టులో ఊరట లభించలేదు. ఎస్సీ, ఎస్టీ చట్టంపై అర్వింద్ చేసిన వ్యాఖ్యలపై మాదన్నపేట్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనితో పాటు సికింద్రాబాద్ సెషన్స్ కోర్టులో విచారణలో ఉన్న ప్రొసీడింగ్స్‌ను కొట్టేయాలని ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు బుధవారం కొట్టేసింది.

హైదరాబాద్‌లో ఈడీ సోదాలు

యూఏఈ కేంద్రంగా జరిగిన సైబర్ నేరాల కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ ప్రత్యేక బృందాలు హైదరాబాద్‌లో సోదాలు నిర్వహించాయి. యూఏఈకి చెందిన పీవైవైపీఎల్ అనే సంస్థ క్యూఆర్ కోడ్, ఫిషింగ్, పార్ట్ టైం ఉద్యోగాలు తదితర మోసాలతో భారత్‌లో సైబర్ నేరాలకు పాల్పడింది. దీంతో మనీలాండరింగ్ కోణంలో కేసు నమోదు చేసిన ఈడీ అధికారులు విచారణ జరుపుతున్నారు. దర్యాప్తులో భాగంగా ఈ కేసుతో సంబంధం ఉన్న చార్టెడ్ అకౌంటెంట్ల(సీఏ) లక్ష్యంగా సోదాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా హైదరాబాద్‌తోపాటు ఢిల్లీ, గురుగ్రామ్, జోద్‌పూర్, పూణె, కోల్‌కతా తదితర ప్రాంతాల్లో ఈడీ బృందాలు వరుసగా మూడు రోజులపాటు సోదాలు చేపట్టాయి. ఈ సోదాల్లో రూ. 47 లక్షల నగదు, కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

వణికించిన భూకంపం

(మొదటి పేజీ తరువాయి)

భూమిలో 40 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు తెలంగాణ విపత్తు నిర్వహణ విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ తెలిపారు. భూకంప తీవ్రత 5.3గా నమోదైనట్లు వివరించారు. ఎక్కువ లోతులో భూకంపం రావడం వల్ల.. ఆస్తి, ప్రాణ నష్టం సంభవించలేదు. అయితే.. భూకంప ప్రభావం 225 కిలోమీటర్ల వరకు కనిపించింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మొదలు.. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, జగ్గయ్యపేట, నందిగామ, ఏలూరు, విశాఖపట్నం వరకు భూప్రకంపనలు నమోదయ్యాయి. మూడు దశాబ్దాల(1969లో 5.7 తీవ్రత) తర్వాత తెలుగు రాష్ట్రాల్లో ఇదే పెద్ద భూకంపమని, వారం రోజుల వరకు భూకంప తదనంతర ప్రకంపనల ముప్పు పొంచి ఉండవచ్చని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. అయితే.. తెలంగాణ రాష్ట్రం జోన్-3, 2ల్లో ఉన్నందున పెద్దగా ప్రమాదం ఉండదని చెబుతున్నారు.

సీసీ కెమెరాల్లో దృశ్యాలు..

భూకంప ప్రభావం గోదావరి పరీవాహక ప్రాంతాలపై ఎక్కువగా కనిపించింది. ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ, వరంగల్, హనుమకొండ, ఉమ్మడి నల్లగొండ, కరీంనగర్‌తోపాటు.. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలపై కనిపించింది. ములుగులో.. ముఖ్యంగా మేడారం పరిసరాల్లో భూకంపానికి ముందు కుక్కలు అసాధారణంగా అరిచాయని, పక్షులు అరుస్తూ కల్లోలంగా తిరిగాయని స్థానికులు తెలిపారు. మేడారం సమ్మక్క, సారలమ్మల గద్దెల వద్ద ఉన్న సీసీ కెమెరాల్లో భూమి కంపించిన దృశ్యాలు స్పష్టంగా నమోదయ్యాయి. కొంతసేపు అసలేంజరుగుతుందో అర్థంకాలేదని.. ఒక్కసారిగా భూమి కంపించడంతో భయమేసిందని సమ్మక్క పూజారి సిద్దబోయిన ఆనంద్, సారలమ్మ పూజారి కాక కిరణ్ తెలిపారు. కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం, అశ్వారావుపేట వంటి ప్రాంతాల్లోనూ భూమి కంపించిన దృశ్యాలు సీసీ టీవీల్లో రికార్డయ్యాయి. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ క్రీడా మైదానంలో దాదాపు మీటర్ లోతు గొయ్యి ఏర్పడిందని, ఇళ్లలోని పాత్రలు కిందపడ్డాయని, కొన్ని ఇళ్లకు బీటలు వచ్చాయని స్థానికులు పేర్కొన్నారు. హనుమకొండ 8వ డివిజన్ ఇందిరానగర్‌లో ఓ భవనం రెయిలింగ్ కూలింది. వారసత్వ సంపదగా యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి ఎలాంటి ముప్పు వాటిల్లలేదని ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ దేశాయ్ వివరించారు. భూకంపం తర్వాత పైకప్పుపై తనిఖీలు చేశామన్నారు. కాకతీయుల కాలంలో నిర్మించిన సమయంలో సాండ్‌బాక్స్ టెక్నాలజీలో పునాదులను నిర్మించినా.. పకడ్బందీగా ఉండేలా అదనపు ఏర్పాట్లు చేశామన్నారు.

భూకంపానికి కారణాలేమిటి?

మేడారం-ఐలాపూర్ అడవుల్లో భూకంపం రావడానికి కారణాలేమిటనే కోణంపై జియాలజిస్టులు దృష్టిసారించారు. కొన్ని రోజుల క్రితం ఈ ప్రాంతంలో టోర్నడోల్లాంటి ఈదురుగాలులకు 500 ఎకరాల్లోని లక్షకు పైగా చెట్లు నేలకొరిగిన విషయం తెలిసిందే.! భూకంపానికి ఇది సంకేతమా? అనే అనుమానాలు వ్యక్తమైనా.. ఆ ఘటనతో ఎలాంటి సంబంధం లేదని జియాలజిస్టులు తెలిపారు. మేడారం-ఐలాపూర్ అడవులు గోదావరి పరీవాహకంలో ఉండడమే భూకంపానికి కారణమని అంచనా వేస్తున్నారు.


ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లిలో కూలిన ఓ రేకుల ఇంటి ప్రహరీ

నేను కూడా భయంతో బయటకొచ్చా

ఉదయం భూమి కంపించగానే నేను కూడా భయంతో భయటకు వచ్చాను. ఆందోళనకు గురయ్యాను. వెంటనే జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశా. ఆస్తి, ప్రాణనష్టం జరిగితే.. వెంటనే సమాచారం అందించాలని సూచించా.

- ములుగు కలెక్టర్ దివాకర

గోదావరి పరీవాహకాల్లో ముప్పు!
డేంజర్ జోన్‌లోనే భద్రాద్రి

తెలంగాణలో కేవలం గోదావరి పరీవాహకాల నుంచి భూకంపాలు వచ్చే ముప్పు ఉందని ఉస్మానియా విశ్వవిద్యాలయ భూభౌతిక శాస్త్ర విభాగం విశ్రాంత ప్రొఫెసర్ జి.రాందాసు తెలిపారు. 1872, నవంబరు 22న సిరోంచాలో 5.0 తీవ్రతతో.. 1969లో భద్రాచలంలో 5.7 తీవ్రతతో భూకంపాలు నమోదైన విషయాన్ని గుర్తుచేశారు. "ఈ ప్రాంతాల్లో వచ్చిన భూకంపాలు భద్రాద్రికి తూర్పు దిశలో కేంద్రాలుండేవి. ఈసారి మాత్రం పశ్చిమ దిశలో భూకంప కేంద్రం ఉంది. సాంకేతికంగా చూస్తే.. ఇది ఒకింత ఆశ్చర్యానికి గురిచేస్తుంది.! గోదావరి భూగర్భంలో రెండు ఫలకాలు ఉంటాయి. ఒకటి ఆదిలాబాద్ జిల్లా కడెం ప్రాజెక్టు కింద ఉంటే.. రెండోది కిన్నెరసాని ప్రాజెక్టు కింద ఉంటుంది. ఈ రెండూ భద్రాద్రి వద్ద కలుస్తాయని భావిస్తుంటారు. బస్తర్ ఫలకం ముందుకు-వెనక్కి కదులుతుండడం వల్ల శక్తి విడుదలవుతుంది. ఆ సమయంలో ఎటువైపు ఖాళీ ఏర్పడితే.. ఆ ప్రాంతంలో భూకంపం సంభవిస్తుంది. కాళేశ్వరం ప్రాజెక్టులో మానవ తప్పిదాలతోపాటు.. ప్రకృతి ప్రకోపం కూడా భూకంపాలకు కారణంగా చెప్పవచ్చు. కడెంలోనూ పిల్లర్ కుంగే అవకాశాలున్నాయి. అప్పట్లో భూగర్భ సర్వే చేయలేదని ప్రభుత్వమే పేర్కొంది. దీనిపై ఇంకా పరిశోధనలు జరగాల్సి ఉంది" అని ఆయన వివరించారు. ఎన్‌జీఆర్ఐ విశ్రాంత శాస్త్రవేత్త నగేశ్ కూడా గోదావరి పరీవాహకాల్లో భూకంపాలకు ఆస్కారముందని పేర్కొన్నారు. భద్రాద్రి డేంజర్ జోన్‌లోనే ఉందని వెల్లడించారు. గడిచిన 56 ఏళ్లలో భద్రాచలం ప్రాంతంలో చిన్నాచితకా కలిపి 199 భూకంపాలు వచ్చాయని సమాచారం ఉందన్నారు. 1969 ఏప్రిల్ 13న పర్ణశాల భూకంపం(5.5 తీవ్రత) ఇప్పటి వరకు పెద్దది కాగా.. చివరిసారి 2018 ఆగస్టు 15న 3.8 తీవ్రతతో నమోదైందని గుర్తుచేశారు.


వాజేడు మండలం పేరూరు పీడబ్ల్యూసీ భవనంలో పగుళ్లు

మేడారంలో అనూహ్య పరిణామాలు

- మేడారం-ఐలాపూర్ అడవులు ఇటీవలి కాలంలో విపత్తులు, అనూహ్య పరిణామాలతో వార్తలకెక్కుతున్నాయి. దీంతో ఈ ప్రాంతంపై వాతావరణ శాఖ అధికారులు, జియాలజిస్టులు దృష్టి సారిస్తున్నారు.
- 2024 ఆగస్టు 31న సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7 గంటల సమయంలో తాడ్వాయి-మేడారం అడవుల్లో పెద్దఎత్తున సుడి 323 హెక్టార్లలో లక్ష దాకా మహావృక్షాలు నేలకొరిగాయి.
- 2023 జూలై 27న తెలంగాణ చరిత్రలోనే తొలిసారిగా ములుగు జిల్లా లక్ష్మీదేవిపేటలో రికార్డు స్థాయిలో 64.98సెం.మీ వర్షపాతం నమోదైంది.
- 2019 జూలై 9, 10 తేదీల్లో ఏటూరునాగారం అభయారణ్యం పరిధిలోని ఏటూరునాగారం, వాజేడు, వెంకటాపురం ప్రాంతాల్లో మేఘాలు ఇళ్లను తాకాయి.
- 2018 జనవరి 23న మేడారంలోని కోట్లమంది భక్తులకు ఇలవేల్పుగా భావించే సమ్మక్క తల్లి కొలువై ఉండే చిలుకల గుట్టపై తెల్లని పొగ రూపంలో భీకర వేగంతో సుడిగాలులు తిరిగాయి. పరిసరాల్లో పెద్దఎత్తున దుమ్మురేగింది.

హైదరాబాద్ సేఫ్ జోన్

భూకంపాల తీవ్రత తెలుగు రాష్ట్రాల్లో తక్కువగా ఉంటుందని ఎన్‌జీఆర్ఐ శాస్త్రవేత్త ఎం.శేఖర్ తెలిపారు. ఈ ప్రాంతాలు సెస్మిక్ జోన్-2, 3లో ఉండడమే ఇందుకు కారణమని వివరించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ జోన్-2లో ఉందని, పెద్దగా ప్రమాదం ఉండదని ఎన్‌జీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్‌కుమార్ తెలిపారు. భూకంపాలకు ఆకాశ హర్మ్యాలకు సంబంధం లేదని వివరించారు. జపాన్‌లో ఇంతకు వి౦చి హైరైజ్ భవనాలు ఉంటాయని, అయినా.. భూకంపాలను తట్టుకుని, సురక్షితంగా ఉన్నాయని పేర్కొన్నారు. జపాన్ మాదిరిగా ప్రమాణాలతో భవనాలను నిర్మిస్తే.. రిక్టర్ స్కేల్‌పై 8 తీవ్రతతో భూకంపం వచ్చినా.. ఇబ్బంది ఉండదని చెప్పారు. 54 ఏళ్లలో తెలుగు రాష్ట్రాల్లో 12 భూకంపాలు మాత్రమే కాస్త పెద్దవిగా నమోదయ్యాయని ఆయన గుర్తుచేశారు. 5.0 నుంచి 5.9 మధ్య వీటి తీవ్రత ఉందని గుర్తుచేశారు. 1983లో మేడ్చల్‌లో 4.9, 1976లో గండిపేటలో 3.5 తీవ్రతతో భూకంపం వచ్చిందని, చివరిసారి 2001లో బోరబండలో 3లోపు తీవ్రతతో భూమి కంపించినట్లు శేఖర్ వివరించారు. బోరబండ భూకంపం.. వర్షపునీరు ఇంకడం వల్ల వచ్చి ఉంటుందని, భూగర్భంలోని పైపొరల్లో భూకంప కేంద్రం ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందని ఎన్‌జీఆర్ఐ విశ్రాంత శాస్త్రవేత్త శ్రీనగేశ్ గుర్తుచేశారు. భవన నిర్మాణ అనుమతులను భూకంప జోన్లకు అనుగుణంగా ఇస్తే.. భవిష్యత్‌లో ఇబ్బందులు ఉండబోవని అభిప్రాయపడ్డారు. అయితే.. ప్రకృతిని కాపాడినంతకాలమే హైదరాబాద్ సేఫ్‌జోన్‌లో ఉంటుందని, గుట్టలను ధ్వంసం చేసినా.. చెరువులను ఆక్రమించినా.. భూగర్భ జలాలను ఇష్టారాజ్యంగా తోడేసినా.. పరిస్థితులు మారుతాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.


మేడిగడ్డ బ్యారేజీ గేట్లు, పిల్లర్లను పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

ప్రాజెక్టుల వద్ద పనిచేయని భూప్రకంపనల సమాచార వ్యవస్థలు

పునాదుల్లో ఏం జరుగుతుందో తెలియని అనిశ్చితి

హైదరాబాద్/మహదేవపూర్ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల వద్ద ఏర్పాటు చేసిన భూప్రకంపనల సమాచార వ్యవస్థలు పనిచేయట్లేదని అధికారులు గుర్తించారు. దీంతో అత్యవసర సమయాల్లో ప్రాజెక్టుల పునాదుల్లో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వాస్తవానికి ప్రతి ప్రాజెక్టు నిర్మాణ సమయంలో పునాదుల్లో పైజో మీటర్లు, కట్ట మధ్యలో ఎర్త్ ప్రెషర్ సెల్స్‌ను ఏర్పాటు చేస్తారు. పైజో మీటర్‌తో పునాదిలో ఏమైనా ఇబ్బందులు చోటుచేసుకుంటే సమాచారం వస్తుంది. అదే ఎర్త్‌ప్రెషర్ సెల్ ద్వారా ఒత్తిడి పెరిగితే ఆ సమాచారం వస్తుంది. అయితే ఏ ప్రాజెక్టులోనూ ఆ పరికరాలు పనిచేయడంలేదని, వాటినుంచి సమాచారం రావడం లేదని తేలింది. భూకంపాలు చోటుచేసుకుంటే ప్రాజెక్టుల కట్టలో ఏమైనా మార్పులు చోటుచేసుకుంటే.. ఆ మార్పులకు అనుగుణంగా కొత్తగా డిజైన్/డ్రాయింగ్‌లు చేసే క్రమంలో అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడం.. కట్ట ఏమైనా ప్రమాదంలో పడే అవకాశముంటే సరిచేయడం వంటి చర్యలు తీసుకుంటారు. ఆ వివరాలేవీ బయటికి రాకపోవడంతో ముందస్తు నష్టనివారణ చర్యలు తీసుకోవడానికి అవకాశమే లేకుండాపోయిందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

మేడిగడ్డ అధికారుల్లో ఆందోళన..

భూప్రకంపనల నేపథ్యంలో మేడిగడ్డ బ్యారేజీ అధికారులు ఆందోళనకు గురయ్యారు. ఉదయం 7.26 గంటల నుంచి 7.30 గంటల సమయంలో బ్యారేజీ వద్ద ఉన్న కంట్రోల్ రూం కంపించినట్లు.. దీంతో బయటకు పరుగులు తీసినట్లు అధికారులు తెలిపారు. హుటాహుటిన బ్యారేజీలో కుంగుబాటుకు గురైన ఏడో బ్లాక్‌ను పరిశీలించామని వెల్లడించారు. అందులో రోజువారీ లెవల్స్‌లో ఎలాంటి తేడాలు లేవని తేలడంతో ప్రమాదం లేదని గుర్తించామన్నారు.

మోకాళ్లపై పడుకొని తలను రక్షించుకోవాలి

- ఎత్తైన భవనాలకు దూరంగా వెళ్లాలి
- భూకంపం నుంచి రక్షణకు నిపుణుల సూచనలు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో స్వల్ప స్థాయి భూకంపాలు తరచూ సంభవిస్తూనే ఉన్నాయి. అదృష్టవశాత్తు ఈ భూకంపాల వల్ల ప్రాణ, ఆస్తి నష్టాలు పెద్దగా జరగలేదు. అయితే, భూకంపాలు సంభవించినప్పుడు ప్రాణాపాయం నుంచి తప్పించుకునేందుకు ఏం చేయాలి ? అనే అంశంపై నిపుణులు కొన్ని సూచనలు చేశారు.

- భూకంపాన్ని గమనిస్తే వెంటనే మోకాళ్లు, మోచేతులపై కిందకు ఒరిగి రెండు చేతులను తలకు రక్షణగా పెట్టుకోవాలి.
- ఒకవేళ కింద కూర్చొని ఉంటే చేతులను మెడపై ఉంచి ముందుకు ఒరిగి పడుకోవాలి
- భూకంపం వల్ల పైకప్పులు కూలే ముప్పు ఉంది. శిథిలాల నుంచి కాపాడుకునేందుకు డైనింగ్ టేబుల్ లేదా పెద్ద ఫర్నిచర్ కింద పడుకోవాలి
- గ్యాస్ సిలిండర్లు, వంటగదితోపాటు అగ్నిప్రమాదం జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండాలి.
- కిటికీలు, భారీ ఫర్నిచర్‌కు దూరంగా ఉండాలి
- అపార్ట్‌మెంట్ వాసులు ఫ్లాట్ల నుంచి బయటకు వెళ్లడానికి మెట్ల మార్గాన్నే వాడాలి.
- భారీ భవనాలకు దూరంగా బహిరంగ ప్రదేశాలు, ఆటస్థలాలు వద్దకు చేరుకోవాలి.
- ప్రయాణాల్లో ఉంటే వాహనాలను పక్కకు ఆపి భూకంప తీవ్రత తగ్గే దాకా వేచి ఉండాలి.
- భూకంప తీవ్రత తగ్గిన వెంటనే మనం ఉంటున్న ఇళ్లు, భవనాల గోడలకు పగుళ్లు ఏమైనా వచ్చాయా ? అనేది పరిశీలించాలి.
- ఒకవేళ పగుళ్లను గుర్తిస్తే వెంటనే నిపుణులను సంప్రదించి తగిన చర్యలు చేపట్టాలి.

తెలంగాణలో సంభవించిన పలు భూకంపాలు, వాటి ప్రభావం

సమయం	తీవ్రత	భూకంప కేంద్రం	ప్రభావం
1969 ఏప్రిల్ 13	5.7	భద్రాచలం	గోదావరినది పరీవాహక ప్రాంతాల్లో
1983 జూన్ 30	5.0	హైదరాబాద్ సమీపంలో	భవనాలపై స్వల్ప ప్రభావం
1984 మార్చి 25	4.9	ఖమ్మం సమీపంలో	పలు జిల్లాల్లో ఆస్తినష్టం
1993 సెప్టెంబర్ 30	6.2	మహారాష్ట్ర సరిహద్దు	కొద్దిమేర ఆస్తినష్టం
1997 అక్టోబరు 22	4.5	నల్లగొండ సమీపంలో	ఎలాంటి ఆస్తినష్టం లేదు
1999 నవంబరు 17	4.2	వరంగల్ సమీపంలో	ఎలాంటి ఆస్తి నష్టం లేదు
2000 జూలై 23	4.6	ఆదిలాబాద్ సమీపంలో	భూకంప ప్రాంతంలో స్వల్ప ప్రభావం
2010 జనవరి 14	4.1	హైదరాబాద్ సమీపంలో	భవనాలపై అతిస్వల్ప ప్రభావం
2020 ఏప్రిల్ 24	4.8	రామగుండం	భూకంప ప్రాంతాల్లో కొద్దిపాటి ప్రభావం
2024 డిసెంబరు 4	5.3	ములుగు	పలు జిల్లాల్లో స్వల్ప ప్రభావం

చంచల్‌గూడ బాస్ ఎవరో?

- శివకుమార్ వదలరు.. దశరథం పట్టువదలరు!
- మూడేళ్లుగా జైలు సూపరింటెండెంట్‌గా శివకుమార్

హైదరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చంచల్‌గూడ కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ పోస్టుకున్న క్రేజ్ అంతా ఇంతా కాదు! రాష్ట్ర జైళ్ల శాఖలో డీజీ తర్వాత ఆ స్థాయిలో క్రేజ్ ఉన్న పోస్టుల్లో ఇదొకటి! చంచల్‌గూడ జైలుకు వీఐపీ జైలు అనే పేరు కూడా ఉంది. సాధారణ జేబుదొంగ నుంచి వీఐపీ, వీవీఐపీ ఖైదీల వరకు ఈ జైలుకు వస్తుంటారు. కొద్ది రోజులుగా ఈ జైలు సూపరింటెండెంట్ పోస్టు విషయం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ఒక్క పోస్టు విషయం ఏకంగా ప్రభుత్వం దృష్టి సారించే వరకు వెళ్లిందంటే తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. చంచల్‌గూడ జైల్లో అసలేం జరుగుతుందనే విషయం నిగ్గుతేల్చేందుకు నిఘా విభాగం రంగంలోకి దిగినట్లు విశ్వసనీయ సమాచారం. రాష్ట్రంలో ఐదు కేంద్ర కారాగారాలు ఉండగా వరంగల్ జైలు ప్రస్తుతం మనుగడలో లేదు. ఇక మిగిలింది నాలుగు. చంచల్‌గూడ, చర్లపల్లి, నిజామాబాద్, సంగారెడ్డి. ఈ కేంద్ర కారాగారాల్లో చంచల్‌గూడ ఎప్పుడూ హాట్ టాపిక్‌గా నిలుస్తుంది. కొంతకాలంగా జైలు సూపరింటెండెంట్ పోస్టు విషయంలో తీవ్ర పోటీ నెలకొంది. ప్రస్తుత సూపరింటెండెంట్ శివకుమార్ 2021లో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సూపరింటెండెంట్ హోదాలో అధికారులు రెండేళ్ల వరకు కొనసాగుతారు. కానీ, శివకుమార్ మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నారు. ఇలా జరగడం జైలు చరిత్రలో ఇదే తొలిసారి. తాజాగా సూపరింటెండెంట్ పోస్ట్ దక్కించుకునేందుకు దశరథం అనే మరో అధికారి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. శివకుమార్ తనకున్న రాజకీయ పరిచయాలు ఉపయోగించుకుని పోస్టులో కొనసాగుతున్నారని జైళ్ల శాఖలో జోరుగా ప్రచారం జరుగుతోంది. లెక్కప్రకారం దశరథం ఇప్పటికే చంచల్‌గూడలో బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. కానీ, గతంలో ఆయనపై ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో ఉన్నతాధికారులు ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించేందుకు ఆసక్తి చూపడం లేదనే ప్రచారం ఉంది.

నకిలీ బెయిల్ విషయంలోనూ పంచాయితీ

సంచలనం సృష్టించిన నకిలీ బెయిల్ పత్రాలతో ఖైదీ విడుదల వ్యవహారం కూడా జైళ్ల శాఖలో వివాదానికి దారితీసింది. ఖైదీ విడుదలపై జైలు అధికారులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని అధికారులు ఐజీకి కాకుండా నేరుగా డీజీ దృష్టికి తీసుకెళ్లారు. తీవ్రంగా పరిగణించిన డీజీ సౌమ్యామిశ్రా తగు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించడం చర్చనీయాంశంగా మారింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.